
# చరిత్ర రచనపై

## బాలగోపాల్



# చరిత్ర రచనపై

బాలగోపాల్

హైదరాబాద్ బుక్ ట్రస్టు

| | | |
|---|---|---|
| ధర | : | రూ. 130/- |
| తొలి ముద్రణ | : | జూలై 2015 |
| కవర్ డిజైన్ | : | అనంత్ |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006.<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,<br>హైదరాబాద్ – 28<br>ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# విషయసూచిక



| | | |
|---|---|---|
| | మా మాట | iv |
| 1. | ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి | 1 |
| 2. | భారత కార్మిక ఉద్యమ చరిత్ర (1830-1947) | 19 |
| 3. | బాండుంగ్ వెలుగు నీడలలో.. | 51 |
| 4. | గత, ఆగత చరిత్రగతి నిర్మాణం | 61 |
| 5. | సహేతుకమయిన ప్రశ్నలు - అశాస్త్రీయమయిన దృక్పథం | 85 |
| 6. | చారిత్రక దృక్పథం | 111 |
| 7. | తెలుగువారి రాజకీయార్థిక జీవితం | 123 |
| 8. | ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర | 167 |
| 9. | చరిత్ర పాఠాలపై కాషాయం నీడ | 179 |
| 10. | దేశ స్వాతంత్ర్య ఉద్యమం-ముస్లింలు | 205 |

# మా మాట

బాలగోపాల్ రాసిన 'ప్రాచీన భారతదేశ చరిత్ర : డి.డి. కోశాంబి పరిచయం' తెలుగు పాఠకులకు సుపరిచితమే. 1986 నుండి ఎన్నో పునర్ముద్రణలు పొందింది ఆ పుస్తకం. దానికి ముందు, తర్వాత చరిత్రపై బాలగోపాల్ రాసిన పది వ్యాసాలను కలిపి ఇప్పుడు మరో పుస్తకం తీసుకొస్తున్నాం. ఇందులో సగం వ్యాసాలు వివిధ పుస్తకాలపై సమీక్షలుగా రాసినవి. రెండు నేరుగా బుక్‌లెట్స్ రూపంలో వచ్చినవి. ఒకటి హిస్టరీ కాంగ్రెస్‌లో ఆధునిక ఆంధ్రదేశ చరిత్రపై ఇచ్చిన అధ్యక్షోపన్యాసం. పాతికేళ్ళలో (1981–2007) అక్కడక్కడా వచ్చిన ఈ వ్యాసాలు 'చరిత్ర' కంటే చరిత్ర రచనా పద్ధతిని ఎక్కువగా చర్చించినందువల్ల ('భారత కార్మిక ఉద్యమ చరిత్ర' వ్యాసం మినహా) ఈ పుస్తకానికి దాన్నే శీర్షికగా పెట్టాం.

ఈ వ్యాసాలలో కనీసం రెండు మూడు శతాబ్దాలకు చెందిన అనేక పేర్లు, సంఘటనల ప్రస్తావన ఉన్నందువల్ల పాఠకుల సౌలభ్యం కోసం ఫుట్‌నోట్లు ఇచ్చాం. ఎంత ప్రయత్నించినా కొందరి గురించి, కొన్నిటి గురించి పూర్తి సమాచారం దొరకలేదు. ఎవరైనా ఇవ్వగలిగితే తర్వాతి ముద్రణలో చేరుస్తాం. ఈ విషయంలో ఇంకేమైనా లోటుపాట్లు ఉంటే కూడా మా దృష్టికి తీసుకురండి సవరించుకుంటాం. మన్నం బ్రహ్మయ్య, వేమన వసంతలక్ష్మి చేసిన ఈ పనిలో స్వాతి వడ్లమూడి, చిట్టిబాబు పడవల, జిలుకర శ్రీనివాస్, మోతుకూరు నరహరి సహకారం కూడా ఉంది. వారందరికీ కృతజ్ఞతలు.

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**




**ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర 1&2**

ఇంగ్లీషు మూలం : A Study of the History and Culture of the Andhras (Vol.I 1975 & Vol.II 1983)

రచయిత : కంభంపాటి సత్యనారాయణ

తెలుగు సంక్షిప్తానువాదం: మహీధర రామమోహనరావు

హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ (జూలై 1981 & మార్చి1982)

**కంభంపాటి సత్యనారాయణ (1909–1983) :** కమ్యూనిస్టు నాయకులు. అనేక కమ్యూనిస్టు పత్రికల్లో సంపాదకవర్గ సభ్యులుగా పనిచేశారు. 'ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర', మరికొన్ని ఇతర పుస్తకాలు కూడా రాశారు.

**మహీధర రామమోహనరావు (1909–2000) :** నవలా రచయిత. కమ్యూనిస్టు నాయకులు. బహుభాషావేత్త. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. పలు సిద్ధాంత గ్రంథాలను అనువాదం చేశారు.

ఒక విమర్శకుడు కులవ్యవస్థను పట్టించుకోనందుకు సత్యనారాయణ గారిని తప్పుపట్టడం జరిగింది. ఆ విమర్శ రెండవ భాగానికి మరింత బాగా వర్తిస్తుంది. ఎందుకంటే ఈ కాలం(ఫ్యూడలిజం బలపడ్డ కాలం)లో కులవ్యవస్థ బాగా ముదిరి ఉత్పత్తి సంబంధాలలో భాగంగా తయారయింది. నిజానికి స్వయం సంపూర్ణ గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తిలో కులవ్యవస్థే ఉత్పత్తి సంబంధాల పాత్ర నిర్వహించింది. వ్యావసాయిక ఉత్పత్తి సంబంధాలలో కూడా దాని పాత్ర తక్కువేం కాదు. భారతదేశ ఫ్యూడలిజంలో కులం ఒక ఉత్పత్తి సంబంధం అనడానికి చాలామంది మార్క్సిస్టులు సాహసించడం లేదు గాని అది కాదనలేని వాస్తవం.

# ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి

## ఒకటి, రెండు భాగాలపై సమీక్ష

**మన దేశ** చరిత్రకు సంబంధించిన శాస్త్రీయమయిన సైద్ధాంతిక పరిశోధన గత 25 సంవత్సరాలుగా మాత్రమే జరుగుతోందని చెప్పవచ్చు. అంతకు ముందు విషయ సేకరణ విస్తృతంగా జరిగింది, ఎంతోమంది ఎంతో శ్రమించారు, కాని వ్యాఖ్యానంలో మాత్రం శాస్త్రీయత స్థానాన అసందర్భమయిన 'దేశభక్తి', అసహ్యకరమయిన మతోన్మాదం, అశాస్త్రీయమయిన జడాత్మక పిడివాదం (మార్క్సిజం లేబుల్ అంటించుకున్నది) రాజ్యం చేశాయి. గత 25 సంవత్సరాలలోనే – డి.డి. కోశాంబి[1]తో ప్రారంభమయి ఇర్ఫాన్ హబీబ్[2] వరకు – సైద్ధాంతిక వ్యాఖ్యానానికి బలమయిన శాస్త్రీయ భూమిక ఏర్పడింది. ఈ పుస్తకం ఆ ఒరవడి లోనిదే. రచయిత సత్యనారాయణగారి మీద కోశాంబి ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. అయితే కోశాంబి చూపిన మార్గాన పురోగమించారా అంటే అనుమానమే. చాలావరకు కోశాంబిని అనుసరించారు కాని ఒకటి రెండు చోట్ల (ఉదాహరణకు 'ప్రాచ్యసమాజం' అనే భావనకు సంబంధించి) కోశాంబి కంటే రెండడుగులు వెనక్కివేశారు.

మన దేశంలో వచ్చిన మొదటి సామాజిక విప్లవం ఆర్యులు తెచ్చినది. మన దేశానికి వచ్చినప్పుడు వాళ్లు పశుపోషకులే అయినా ఆహార సేకరణ, పోడు వ్యవసాయాల స్థానాన స్థిరవ్యవసాయాన్నీ, ఇనుపనాగలినీ; అలాగే అడవి ప్రాంతాలను వ్యవసాయ యోగ్యంగా చదును చేయడం కోసం ఇతర ఇనుప పనిముట్లనూ ప్రవేశపెట్టి స్థిర వ్యవసాయం మీద ఆధారపడ్డ వ్యావసాయిక వర్గసమాజానికి వాళ్ళే పునాది వేశారు. ఇది ఉత్తరాన ప్రారంభమయి క్రమంగా దక్షిణానికీ, తూర్పుకూ విస్తరించింది. ఆంధ్ర ప్రాంతంలో ఈ వ్యావసాయిక వర్గ సమాజపు మొట్టమొదటి స్పష్టమయిన రాజకీయ రూపం శాతవాహన సామ్రాజ్యం.[3]

స్థిర వ్యవసాయంతో ఉత్పాదకత పెరుగుతుంది. కాబట్టి అదనపు ఉత్పత్తితో పాటు వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తి కూడా సాధ్యమవుతుంది. అంటే

సృజన, మొదటి భాగం నవంబర్ 1981, రెండవ భాగం సెప్టెంబర్ 1982

శ్రమవిభజన, వస్తు మార్పిడీ ముందుకు వస్తాయి. ఈ చారిత్రక సన్నివేశంలో మనకు ప్రపంచంలోని అన్ని దేశాల చరిత్రలోను ఒక వింత కనబడుతుంది – అపారమయిన అమ్మకపు సరుకుల ఉత్పత్తి, మారకం. రోమ్ నుండి భరుకచ్ఛం[4] వరకు, మచిలీపట్నం నుండి చైనా వరకు పట్టువస్త్రాలు, ఆభరణాలు, సుగంధ ద్రవ్యాలు, చందనం ఇత్యాది విలాసవస్తువులే కాక నూలు బట్టలు, నెయ్యి, నూనె వగైరాలన్నీ ఎగుమతి అయ్యేవి, దిగుమతి అయ్యేవి (పేజీ 75). ఇది వర్గసమాజపు శైశవడాంబికం. పుట్టగానే పెట్టుబడిదారీ సమాజమనుకుంటుంది కాబోలు – ఎడాపెడా సరుకులను ఉత్పత్తి చేస్తుంది, మారకం చేస్తుంది, సముద్రయానానికి సంబంధించి తనకున్న మిడిమిడి జ్ఞానంతోనే 'సప్త సముద్రాల'నూ కాకపోయినా అందుబాటులో ఉన్న సముద్రాలనన్నింటినీ చుట్టివస్తుంది.

కాని ఈ డాంబికం చాలాకాలం నిలవదు. త్వరలోనే తానింకా వ్యావసాయిక సమాజమేననీ, తనకు పునాది వ్యవసాయమేననీ, ఆ వ్యవసాయరంగాన్ని బలంగా దిద్దుకోవడం, వ్యవసాయదారుల అవసరాలకు ప్రాధాన్యతనివ్వడం అవసరమనీ గుర్తిస్తుంది. వ్యవసాయేతర ఉత్పత్తి కూడా వ్యవసాయానికి అనుబంధంగా సాగాలని – అంటే కావలసింది స్వర్ణకారులూ, ఆభరణకారులూ కాదు; కమ్మరీ, కుమ్మరీ, వడ్రంగీననీ గుర్తిస్తుంది. దానితో అన్ని దేశాలలోను స్వయంపోషక గ్రామాలు ఏర్పడినా, ఏర్పడకపోయినా వ్యవసాయాన్ని పునాదిగానే కాక కేంద్రంగా కూడా గల ఆర్థిక వ్యవస్థ రూపొందుతుంది. ఏదో ఒక తరహా ఫ్యూడలిజానికి దారితీస్తుంది. పైపై పరిశీలకులకు ఇది తిరోగమనంగా కనిపించవచ్చు. 'చీకటియుగం ఆరంభమయిం'దనిపించవచ్చు. ఒకప్పుడు స్వేచ్ఛగా దేశదేశాలు తిరిగిన మనిషి గ్రామానికి బందీ అయిపోయాడనిపించవచ్చు. ఆ చరిత్ర దశలో "ఆంధ్రుడు ఊబిలో దిగబడ్డాడనే చెప్పాలి.... పురోహితవర్గం పెద్దరికంతో ఉన్న సమాజం అతని జీవితాన్ని స్వయంసంపూర్ణ గ్రామంలో మూసిపెట్టివుంచిం"దనిపించింది సత్యనారాయణ గారికి కూడా (పేజీ 138). కాని ఇది అవశ్యమయిన పరిణామం, పురోహితుల కుట్ర కాదు. పెట్టుబడిదారీ సమాజం రాకముందు విస్తృతమయిన వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తి, మారకం సాధ్యం కావాలంటే వ్యవసాయదారుడి అవసరాలను పూర్తిగా విస్మరించి అతన్ని అత్యధికంగా పీడించాలి. యూరప్‌లో లాగ అతను అన్ని దేశాలలోను బానిస కానవసరం లేదు. కాని బానిస కానంత మాత్రాన ఈ సుగంధద్రవ్యాల ఎగుమతిచాటున ఉన్న అమానుషత్వం తక్కువది

కాదు. వ్యవసాయం ప్రధానమయిన సమాజంలో వ్యవసాయేతర ఉత్పత్తికి కూడా వ్యవసాయరంగాన్నే కేంద్రంగా మలచడం ఫ్యూడలిజం యొక్క మౌలికమయిన అభ్యుదయకత్వం. తరువాతి కాలంలో అదే విపరీతమయిన మతమౌఢ్యానికి దారి తీసిందన్నది వేరే విషయం.

మరయితే ఈ శాతవాహనకాలం నాటి ఆర్థికవ్యవస్థ ఎట్లాంటిది? సత్యనారాయణ గారి అభిప్రాయంలో అది బానిసవ్యవస్థ కాదు, ఫ్యూడల్ వ్యవస్థా కాదు, 'ఫ్యూడల్ పూర్వదశ' (పేజీ 99). ఉత్పత్తిదారులయిన శూద్రులు ఒక వర్ణంగా దోచుకోబడ్డారే గాని బానిసలుగా కాదు. అలాగే విస్తృతమయిన అమ్మకపు సరుకుల ఉత్పత్తి ఉండడం చేత అది ఫ్యూడల్ వ్యవస్థా కాదు. ఉత్తరభారత చరిత్రలో శాతవాహనుల కాలాన్ని పోలిన మౌర్యుల కాలానికి[5] సంబంధించి కోశాంబి మార్గదర్శకత్వాన్ని అనుసరించే చరిత్రకారులకు కూడా దాదాపుగా ఈ అభిప్రాయమే ఉన్నట్లుంది.

ఈ 'ఫ్యూడల్ పూర్వదశ' అనంతరం, అమ్మకపు సరుకుల ఉత్పత్తి తగ్గి (తలసరిగా) వ్యవసాయేతర ఉత్పత్తికి కూడా గ్రామమే కేంద్రమయింది. పైన వివరించినట్లు ఈ పరిణామం ఆవశ్యకమయినది, మౌలికంగా అభ్యుదయ కరమయినది. అయితే ఈ గ్రామీణ స్వయంపోషకత్వం ఎప్పుడూ సాపేక్షికమే. కోశాంబి అన్నట్లు, ఉప్పు, ఇనుము లాంటి అత్యవసర వస్తువులు అన్ని గ్రామాలలోను దొరకవు కాబట్టి అటువంటి సరుకుల మారకం ఎప్పుడూ వుంటుంది. అంతే కాకుండ రాజులకూ, రాజవంశీకులకూ, సామంతులకూ, దర్బారీ జనానికీ కావలసిన విలాసవస్తువుల ఉత్పత్తి పట్టణాలలో సాగుతూనే వస్తుంది. ఇన్ని మినహాయింపులు ఉన్నప్పటికీ గ్రామీణ స్వయంపోషకత్వం వాస్తవికమయిన భావనే. రాజకీయంగా ఈ కాలం ఇక్ష్వాకుల[6] నుండి పల్లవుల[7] వరకు విస్తరించింది (క్రీ.శ. 3వ శతాబ్దం వరకు). దీనిని సత్యనారాయణగారు 'ప్రాచ్య సమాజం పరిధిలో ఫ్యూడలిజానికి పునాదులు పడ్డ దశ' అన్నారు (పీఠిక పేజీ 8). ఈ 'దశ'కు సంబంధించి సత్యనారాయణగారు ఇచ్చిన వర్ణనను బట్టి చూస్తే ఇది దాదాపుగా కోశాంబి Feudalism from above అని వర్ణించిన క్రీస్తుశకం మొదటి శతాబ్దాల ఉత్తరభారత సమాజాన్ని పోలివుంది. ఉత్పత్తిదారులయిన రైతుల శ్రమను శిస్తురూపంలో సామంత ప్రభువులు, వారిపైనున్న రాజులు, మహారాజులు చేజిక్కించుకున్న దశ ఇది.[†] దీనిని తెలుగులో 'సామంత స్వామ్యం' అనవచ్చు.

ఈ దశలోనే తరువాతి దశకు బీజాలు పడ్డాయి. గ్రామీణ ప్రాంతాలలో భూమిపై స్వంతహక్కు, ఇతర ఫ్యూడల్ సౌకర్యాలు ఉన్న భూస్వాములు తలెత్తడం మొదలయింది. బ్రాహ్మణులకు అగ్రహారాలు దానం చేయడంతో ఇది ప్రారంభమయి, సైన్యాధిపతులకు జాగీర్లివ్వడంతోను, గ్రామాధికార్లకు జీతాల బదులు భూములు ఇవ్వడంతోను విస్తరించింది. రాష్ట్రకూట[8], చోళ[9], చాళుక్యుల[10] కాలంలో (ఏడవ శతాబ్దం తరువాతి కాలంలో) ఈ మార్పు వేగం పుంజుకుని కోశాంబి చెప్పిన Feudalism from below అనే దశకు దారితీసింది. దీన్ని తెలుగులో 'గ్రామీణ భూస్వామ్యం' అనవచ్చు. సత్యనారాయణగారు 'ప్రాచ్యసమాజం పరిధిలో ఫ్యూడలిజం ఆవిర్భావము, అభివృద్ధిని తెలియజేసే దశ' అన్నారు.

ఈ రెండు దశలకు సంబంధించి రచయిత కోశాంబితో నిర్హేతుకంగా విభేదించినట్లుంది. కోశాంబి చేసిన నామకరణం అంత సంతృప్తికరంగా లేనిమాట వాస్తవమే. ముఖ్యంగా Feudalism from above అనే భావన ఉత్పత్తి సంబంధాలను స్పష్టంగా నిర్వచించదు. కాని 'ప్రాచ్య సమాజం' అనే భావన ఇంకా అసంతృప్తికరం – ప్రాచ్యదేశాలలో (అంటే ఆసియా, ఆఫ్రికా దేశాలలో) ఫ్యూడలిజం బదులు ఒక ప్రత్యేకమయిన ఉత్పత్తి విధానం ఉండేదని మార్క్సు భావించాడు. దానిని 'ప్రాచ్య ఉత్పత్తి విధానం' (Asiatic mode of production) అన్నాడు. దీని ముఖ్య లక్షణాలు : (i) భూమి మీద ఎవ్వరికీ స్వంతహక్కు లేకపోవడం (ii) వ్యవసాయానికి అవసరమయిన నీటి పారుదల వసతులను (చెరువులు, కాలువలు) కేంద్రప్రభుత్వం నిర్వహించడం (iii) తత్పర్యవసానంగా ఏర్పడే కేంద్రీకృత రాజ్యాంగం, లేక 'ప్రాచ్య నిరంకుశత్వం' (iv) గ్రామీణ స్వయం పోషకత్వం. వీటిలో మొదటి మూడు పరిశోధనలకు నిలవవు. చాలా ప్రాచీనకాలం నుండి కూడా రాజులు సన్నిహితులకు, బ్రాహ్మణులకు, బౌద్ధవిహారాలకు ఇనాంలు ఇవ్వడం జరిగింది. దక్షిణాన శాతవాహనుల కాలంలోనే ఇనాంలు ఇచ్చిన ఆధారాలున్నాయి. ఈ ఇనాందార్లకూ జాగీర్దార్లకే కాకుండ మధ్యయుగాలనాటికి రైతులకు కూడా చాలా సందర్భాలలో భూమిమీద స్వంతహక్కుండేదని ఇర్ఫాన్ హబీబ్ చూపించాడు. నీటిపారుదల వసతుల నిర్వహణ కూడా ఎన్నడూ కేంద్రీకృతంగా ఉండలేదు. గ్రామ సమితులు, సామంతులు వాటిని నిర్వహించేవారు. ఇక ప్రాచ్య నిరంకుశత్వం మాటకొస్తే, 'అప్రాచ్య' నిరంకుశత్వం కూడా దానికెన్నడూ తీసిపోలేదు. అసలు

ఈ సూత్రీకరణలకు దేనికీ మార్క్స్, ఎంగెల్స్‌లకు అందుబాటులో ఉన్న రచనలలో కూడా ఆధారం లేదని సయీద్‌నక్వీ[11] వివరంగా వాదించాడు. ఇంక 'ప్రాచ్య సమాజం'లో మిగిలిందేమిటి? గ్రామీణ స్వయంపోషకత్వం మాత్రమే. అందుకే కాబోలు సత్యనారాయణగారు దీనిని మాత్రమే ప్రాచ్య సమాజం నిర్వచనంగా అంగీకరించారు. అయితే గ్రామీణ స్వయంపోషకత్వం శ్రమవిభజన తాలూకు ఒక రూపం అవుతుందే గాని ఉత్పత్తి సంబంధం కాజాలదు. కాబట్టి ఒక ఉత్పత్తి విధానానికి నిర్వచనంగా దానిని తీసుకోవడం తప్పు - పైగా మార్క్స్ కూడా ప్రాచ్య ఉత్పత్తి విధానం అనే మాటను స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ అనే అర్థంలో వాడాడనడం తప్పు (పీఠిక 3వ పేజీ). మార్క్స్ భావనలో పైన చెప్పిన నాలుగు అంశాలూ వున్నాయి. వాటన్నిటిలోకీ మార్క్స్ నీటిపారుదల వసతుల కేంద్రీకృత నిర్వహణకు, భూమిపై స్వంత ఆస్తి లేకపోవడానికీ కీలకస్థానం ఇచ్చినట్లు అనిపిస్తుంది.

పుస్తకంలో మరొక ముఖ్యమయిన లోపం వుంది. ఆంధ్ర ప్రాంతానికి సంబంధించిన ప్రత్యేకమయిన చారిత్రక సంఘటనలను వివరించడానికి రచయిత చేయదగ్గ ప్రయత్నం చేయలేదు. బౌద్ధంలో మహాయాన పంథా రావడం, తరువాత బౌద్ధం క్షీణించిపోవడం, దాని స్థానంలో వైదికమతం విస్తరించడం, అటుతరువాత వైదికమతం పరిధిలోనే శైవ వైష్ణవ ఉద్యమాలు రావడం - శాతవాహనుల తరువాతి ఆంధ్రచరిత్రలో ముఖ్యఘట్టాలు. వీటిల్లో బౌద్ధం స్థానాన వైదికమతం ప్రబలమయిన ఘట్టాన్ని మాత్రం కొంతవరకు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తికీ, వాణిజ్యానికీ అవరోధమయిన పశుపోషక సమాజపు వైదిక కర్మకాండను వ్యతిరేకించిన బౌద్ధమతం - ఆ తర్వాత వాణిజ్యానికీ వాణిజ్య విస్తరణకూ మరీ సన్నిహితమయి పోయిన కారణాన - స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ ఆవిర్భావం జరిగాక తన సామాజిక పాత్రను కోల్పోయింది. అయితే బౌద్ధమతం ఈ కొత్త పరిస్థితులకు అనుగుణంగా తన రూపాన్ని ఎందుకు మార్చుకోలేకపోయింది? చైనా నుండి శ్రీలంక వరకు భూస్వామ్య సమాజాల భావజాలమయిన బౌద్ధం మన దేశంలో మాత్రం ఆ పాత్ర నిర్వహించడంలో హిందూమతం ముందు ఎందుకు ఓడిపోవలసి వచ్చింది? ఈ ప్రశ్నలకు మన దేశ భూస్వామ్య సమాజవ్యాప్తిలో వైదికమతానికి పునాది అయిన వర్ణవ్యవస్థకు గల కీలకమయిన పాత్రను గురించి కోశాంబి వివిధ సందర్భాలలో చెప్పిన విషయాలలో సమాధానం లభించవచ్చు. అటువంటి

సమాధానం సంపాదించడానికి ఆంధ్ర చరిత్ర చాలా అనుకూలమయిన సందర్భం. ఎందుచేతనంటే ఒకప్పుడు ఇక్కడ బౌద్ధం చాలా వ్యాప్తిని కలిగివుండి, తరువాతి కాలంలో సంపూర్ణంగా పెకిలించివేయబడింది. కాని అటువంటి ప్రయత్నం సత్యనారాయణగారు చేయలేదు. అలాగే మహాయానం పుట్టుకకు, శైవ వైష్ణవ ఉద్యమాల పుట్టుకకు గల మౌలికమయిన కారణాలను సంతృప్తికరంగా వివరించే ప్రయత్నమూ చేయలేదు. ముఖ్యంగా ఈ చివరి ఘట్టానికి సంబంధించి "భక్తి ఉద్యమం పురోహితవర్గం వారి ఆశల్నీ, ఆశయాల్నీ కాక ప్రజాసామాన్యం యొక్క అభిమానాల్నీ, ఆశయాల్నీ వ్యక్తం చేస్తుంది" అని రచయిత చేసిన వ్యాఖ్యానం (పేజీ 167) బొత్తిగా ఫ్యూడల్ పండితుల వ్యాఖ్యలాగా ఉంది ('జ్ఞానమార్గం మేధావులకూ, భక్తిమార్గం ప్రజాసామాన్యానికీ' అన్నదే గదా ఫ్యూడల్ పండితుల మతం).

నిజానికి ఇది ఆంధ్రుల చరిత్ర కాదు. మన దేశంలోని అన్ని ప్రాంతాల చరిత్రకూ (స్థూలంగా) సామాన్యమయిన పరిణామక్రమానికి ఆంధ్రప్రాంతాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ఇచ్చిన వివరణ. కోశాంబి, ఆర్.ఎస్. శర్మ[12]ల రచనలతో పరిచయం ఉన్న వారికి ఇందులో స్థానిక వివరాలు మినహాయించి కొత్త విషయాలేవీ కన్పించవు. అయితే విపులంగా రాసిన కారణాన ఇది అంత మేరకు ఉపయోగకరమయిన పుస్తకమే. ఈ పుస్తకం తెలుగువాడికి తన చరిత్రకు – ఏటుకూరి బలరామమూర్తిగారు[13] ఎవ్వరి పరిశోధనలనూ పట్టించుకోకుండ అర్థరహితంగానూ, అపరిష్కృతంగానూ పునర్ముద్రిస్తూన్న 1953 నాటి 'ఆంధ్రుల సంక్షిప్త చరిత్రే' ప్రామాణికం కాదని చూపించి, గత 25 సంవత్సరాలుగా జరుగుతున్న పరిశోధనతో పరిచయం ఏర్పరిస్తే సంతోషమే.

## రెండవ భాగం

**మొ**దటి భాగాన్ని సమీక్షిస్తూ, ఇది వాస్తవానికి ఆంధ్రప్రాంతం చరిత్ర కాదనీ, మన దేశంలో అన్ని ప్రాంతాల చరిత్రకూ సామాన్యమయిన పరిణామక్రమానికి ఆంధ్ర ప్రాంతాన్ని ఒక ఉదాహరణగా తీసుకుని ఇచ్చిన వివరణ అనీ అన్నాను. మార్క్సిస్టు దృక్పథం నుండి చూస్తే ఈ రెండవ భాగం అసలు చరిత్రే కాదు. మార్క్సిస్టు చరిత్రకారుడు చరిత్ర చెప్పకూడదు, వ్యాఖ్యానించాలి.

ఏం జరిగిందో కాదు, ఎందుకు జరిగిందో చెప్పాలి. చెప్పేది రాజుల చరిత్ర కావచ్చు, భట్రాజుల చరిత్ర కావచ్చు - ఆర్థికరంగాన్ని (ముఖ్యంగా దోపిడీ సంబంధాల్ని) ప్రాతిపదికగా తీసుకుని వివరించాలి. అంతేగాని సీదాసాదా బూర్జువా చరిత్ర రాసి విరివిగా 'ఫ్యూడల్' అన్న మాటను ప్రయోగించినంత మాత్రాన అది మార్క్సిజం అనిపించుకోదు. అట్ట వెనకాల ప్రకాశకులు, తొలిపలుకులో రచయితా చెప్పుకోకపోతే ఆయన 'ఒక స్పష్టమయిన, నిర్దిష్టమయిన' సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని ఈ పుస్తకం రాశారని ఏ పాఠకుడికీ అనిపించదు. భూమిలో వ్యక్తిస్తత్వం ఉందా లేదా అన్న పట్టింపు ఒకటే మొదటిభాగం నుండి రెండవభాగానికి వచ్చాక రచయిత మిగుల్చుకున్న మార్క్సిజం. అడపాదడపా వ్యక్తపరచిన రాచరికవ్యతిరేకత కూడా బూర్జువాలక్షణమే గాని ప్రత్యేకించి మార్క్సిస్టు గుణం కాదు.

వ్యవసాయాన్ని రాజులు అభివృద్ధి చేస్తారు; మతసామరస్యాన్ని రాజులూ సుల్తానులూ సాధిస్తారు; విజయనగర రాజులు పోర్చుగీసు వర్తకులతో సత్సంబంధాలు నెలకొల్పడం 'పచ్చెపు దొంగల్ని తమతో సమానుల్నిగా గౌరవించడం' వంటి అభిప్రాయాలున్నాయి రచయితకి. పంటలో పదింట తొమ్మిది వంతుల వరకు పన్నుగా దోచుకున్న విజయనగర పాలకవర్గం కన్నా పోర్చుగీసు వర్తకులు పెద్ద దొంగలా? విజయనగర రాజులతో కలహించిన కొండవీటి వేమారెడ్డి[14]ని గురించి రచయిత వ్యాఖ్య - 'బహమనీ సుల్తానుల[15] నుండి దేశాన్ని స్వతంత్రం చేయడానికై ఇతరులను కలుపుకోవాలనిగాని, విజయనగర హిందూ రాజుల[16]తో చెలిమి చేసుకోవాలనిగాని వేమారెడ్డి ఎప్పుడూ ఆలోచించలేదు'. తెలుగువాళ్ళు (లేకపోతే హిందువులు) పరిపాలిస్తే దేశం స్వతంత్రమూ, సుల్తానులు పరిపాలిస్తే అస్వతంత్రమూ అనుకోవడం శాస్త్రీయమా? 1950లలో 'విశాలాంధ్ర' వేడిలో ఏటుకూరి బలరామమూర్తిగారు తాత్కాలికంగా మార్క్సిజాన్ని పక్కకుపెట్టి తెలుగు జాతిభక్తిని సిద్ధాంతంగా 'ఆంధ్రుల చరిత్ర' రాసిన మాట వాస్తవమే. కాని ఆ వేడి చల్లారి బూడిద అయిన 30 సంవత్సరాల తర్వాత కూడా కాకతీయులను[17], విజయనగర రాజులను, కొండవీటి రెడ్లను 'తెలుగుజాతి' నాయకులుగా పరిగణించి, ఆ నాయకత్వాన్ని వారు సమర్థవంతంగా నిర్వహించనందుకూ, వాళ్లకు కలలో కూడా తోచని ఆశయాల్ని వాళ్లు సాధించనందుకూ వాళ్లను దుయ్యబట్టడం న్యాయమా?

'చరిత్ర అంటే రాజుల చరిత్ర కాదు' అని మొట్టమొదట అన్నది మార్క్సిస్టులు కాదు బూర్జువాలే. అని, వాళ్ళు చేసిందేమిటంటే చరిత్ర నుండి వ్యాఖ్యానాన్ని బహిష్కరించి రాజవంశాల చరిత్ర స్థానంలో కొంచెం రాజవంశాల చరిత్ర, కొంచెం ఆర్థికరంగ చరిత్ర, వాటితోపాటు పాలనావ్యవస్థ గురించి, సాహిత్యం గురించి, కళల గురించి కొంచెం కొంచెం చెప్పారు. సమాజంలో ఉన్న హెచ్చుతగ్గుల్ని, పాలక పాలితులు అన్న తేడాలను చూడకుండ 'సృష్టిలో మానవులంతా సమానులే' (all men are created equal) అని ప్రకటించడమే ప్రజాస్వామ్యం అనుకున్నట్టు, సమాజంలో అన్ని రంగాలనూ సమాంతరంగా నిలబెట్టి, అన్నిటి చరిత్రనూ సమాంతరంగా, పరస్పర సంబంధాలు లేకుండా చెప్పడమే శాస్త్రీయత (objectivity) అనుకుంటుంది బూర్జువా దృక్పథం. ఆ పద్ధతినే తు.చ. తప్పకుండ పాటించారు కంభంపాటి సత్యనారాయణగారు. కావాలంటే చివరి అయిదు ప్రకరణాల శీర్షికలు చూడండి: కుతుబ్‌షాహీ[18] రాజవంశం, కుతుబ్‌షాహీల పాలనావ్యవస్థ, కుతుబ్‌షాహీల ఆర్థిక నిర్మాణం, కుతుబ్‌షాహీ యుగ మతము-సమాజస్థితి, కుతుబ్‌షాహీ యుగ సాహిత్యం - కళలు. వీటిలో ఏది ప్రధానం, ఏది అప్రధానం? ఏది నిర్ణాయకం, ఏది నిర్ణయించబడేది? పైగా ఈ వరసలోనే ఎందుకు చెప్పాలి? రాజవంశం తన పాలనావ్యవస్థనూ, ఆర్థిక నిర్మాణాన్నీ ఎంచుకుంటుందనీ, అటుతర్వాత మతము, సమాజస్థితి, సాహిత్యం, కళలు రూపం తీసుకుంటాయనీ దీని అర్థం కాదా? ఉత్పత్తిశక్తులేవీ, ఉత్పత్తి సంబంధాలేవీ, వైరుధ్యాలేవీ, వర్గపోరాటమేదీ, 'స్పష్టమయిన, నిర్దిష్టమయిన' సిద్ధాంతమేదీ?

వ్యాఖ్యానించుకోలేకున్నా కనీసం ఉత్పత్తిరంగం చరిత్ర చెప్పుకుందాం. భారతదేశ ఫ్యూడలిజంలో కనీసం మూడు దశలున్నాయి. మొదటి దశ క్రీ.శ. తొలి శతాబ్దాలలో మొదలయినట్లుంది (అంతకుపూర్వం ఎటువంటి వ్యవస్థ ఉండేదో చెప్పడం కష్టం. 'బానిసవ్యవస్థ'[19] ఉండేదని తీర్మానించాలంటే చరిత్రను అమర్యాదగా బలాత్కరించాల్సి ఉంటుంది). ఈ దశలో గ్రామీణప్రాంతాలలో వర్గవిభజన అంతగా లేదు. వర్ణవ్యవస్థ బలపడింది గాని కులవ్యవస్థ ఇంకా ఏర్పడలేదు (కనీసం ముదరలేదు). భూమి సాధారణంగా గ్రామసభల ఆధీనంలో

ఉండి రైతులకు దున్నుకునేందుకు పంచబడేది. గ్రామీణ స్వయంసంపూర్ణత అప్పుడప్పుడే ఏర్పడుతోంది. రైతులనుండి అదనపు ఉత్పత్తిని శిస్తురూపంలో సామంతులు, చిల్లరరాజులు, చక్రవర్తులు ఒక సోపానంగా వసూలు చేసుకుని స్వంతం చేసుకోవడమో, లేదా గ్రామభూములను ఆక్రమించుకొని రైతులతో వెట్టి, కౌలు చేయించుకోవడమో జరిగేది. రెండవది పన్ను గుత్తదార్లు. ఒక ప్రాంతం నుండి పన్ను వసూలుచేసి ప్రభుత్వానికిచ్చే హక్కును గుత్తకు తీసుకున్నవాళ్ళు వీళ్ళు. వీళ్ళకే ఆ భూమిపై యాజమాన్యం కూడా ఇచ్చి ఈ పద్ధతిని మరింత పటిష్టం చేసింది తరువాతి కాలంలో బ్రిటిష్ జమీందారీ వ్యవస్థ.[20]

ఈ మార్పులు చాలావరకు ముస్లింలు వచ్చిన తరువాత ఏర్పడ్డవన్నది కేవలం కాకతాళీయమే. ఫ్యూడలిజం ముదిరేకొద్దీ ఆదిమ సమాజపు అవశేషమయిన గ్రామ సభలు నశించడం, పలురకాల భూస్వాములు పుట్టుకురావడం అనివార్యం. అయితే ముస్లింలు మన దేశానికి తీసుకువచ్చిన మార్పు కూడా ఒకటుంది.

అరబ్బులది వ్యాపార నాగరికత. ఎడారిమయమయిన వారి దేశంలో వ్యావసాయిక సమాజం పుట్టే అవకాశం లేదు. పశ్చిమాన కొని తూర్పున అమ్ముతూ, తూర్పున కొని పశ్చిమాన అమ్ముతూ, ఈ దళారీ వ్యాపారంలో తమ జీవనాన్ని సంపాదించుకున్న సంచార తెగలు ఆనాటి అరబ్బులు. ఇస్లాం వాళ్ళ మతం. ఈ మారక వ్యాపారానికి అనుబంధంగా పట్టణప్రాంతాలలో వృత్తిపనుల పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. గృహనిర్మాణంలో, బట్టలనేతలో, పట్టుపురుగుల పెంపకంలో వారు కొంత సాంకేతిక అభివృద్ధిని సాధించారు. కొంత తరువాతి కాలంలో చైనా నుండి నేర్చుకున్నారు. అరబ్బులు, ఇతర ముస్లింలు (ముఖ్యంగా పర్షియన్లు) మన దేశానికి రావడంతో ఈ వృత్తిపరిశ్రమల నాగరికత మనకు దిగుమతి అయి, అప్పటికే ఇక్కడ కొంత అభివృద్ధి చెంది వుండిన పారిశ్రామిక వ్యాపార రంగం మరింత బలపడి, స్వయంసమృద్ధ గ్రామీణ వ్యవస్థకు ఒక పారిశ్రామిక కవచం తొడగబడింది. ముస్లింల రాకకు ఉన్న ఈ సామాజిక ప్రభావం కారణంగానే మన దేశంలో దిగువ కులాల నుండి ముస్లింమతం పుచ్చుకున్న వాళ్ళలో వృత్తిపనివారే ఎక్కువ, రైతులు తక్కువ, అందులోనూ వస్త్రపరిశ్రమకు సంబంధించిన కులాలవాళ్ళే ఎక్కువ. ఈ ప్రభావానికి సంబంధించిన వివరాలను,

దానివల్ల మన దేశ ఫ్యూడల్ వ్యవస్థలో వచ్చిన మార్పులను అన్వేషిస్తూ గత పది సంవత్సరాలుగా అలీగఢ్ విశ్వవిద్యాలయ చరిత్రశాఖవారు (ఇర్ఫాన్ హబీబ్, ఇక్తిదార్ అలంఖాన్[21] తదితరులు) చాలా పరిశోధనలు జరిపారు. ఈ పవిత్ర భారతదేశానికి వస్త్ర పరిశ్రమలో సాంకేతిక అభివృద్ధిని ముస్లింలు తెచ్చారని అభిప్రాయపడ్డ పాపానికి బ్రాహ్మణ చరిత్రకారుల చేత తిట్లు కూడా తిన్నారు. ఆ పరిశోధనలేవీ సత్యనారాయణగారి దృష్టికి వచ్చినట్లు లేవు.

అయితే ఆ దశలో వచ్చిన వ్యాపార, పారిశ్రామిక విస్తరణ గురించి మాత్రం వివరంగానే చెప్పారు. విజయనగర రాజ్యంలో వృత్తిపనివాళ్ళ నుండి, వర్తకుల నుండి వసూలయిన పన్ను మొత్తం పన్నులో సగం ఉండేదని అంచనావేశారు. దీని గురించి నాకొక అనుమానం వుంది. నిలవ ఉండే పంటలు పండించే భూమి మీద పన్ను వస్తు రూపంలో వసూలు చేసేవారు కాబట్టి అది రొక్కపుపన్నులో చేరదు. అటువంటప్పుడు రొక్కపుపన్నులో వృత్తి పనివారు, వర్తకులూ ఇచ్చుకున్నది సహజంగానే ఎక్కువ ఉంటుంది కదా! పారిశ్రామిక వాణిజ్య విస్తరణతో సంబంధం లేకుండా ప్రతీ గ్రామంలోను సంతలు జరిగేవని 'ఆముక్త మాల్యద'[22] అంటున్నదనీ, దాన్ని బట్టి కూడా వ్యాపారం విస్తరించినట్టూ, స్వయంసంపూర్ణ గ్రామ వ్యవస్థ బలహీనపడ్డట్టూ తెలుస్తుందని రచయిత అన్నారు (పేజీ 168). ఇది వాస్తవమే అయితే చాలా ఆసక్తికరమయిన విషయం. అంతకుముందు సంతలు జరిగేవి కావా? సంతలలో అమ్మకం జరిగేవి స్వయం పోషక గ్రామాలలో ఖర్చుకాగా మిగిలిన సరుకులు కావా? సంతలలో అమ్మకం కోసమే ప్రధానంగా ఉత్పత్తి చేయడం – కొంతమేరకయినా సరే – విజయనగర కాలంలో మొదలయిందా? రాజవంశాల అర్థరహితమయిన చరిత్ర గురించి అంతంత సమాచారం సేకరించడానికి వెచ్చించిన శ్రమలో సగం ఇలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఉపయోగించి ఉంటే బాగుండేది.

ఈ కాలంలో వృత్తిపనివాళ్ళ శ్రేణులూ (craft guilds), వర్తక శ్రేణులూ (traders' guilds) బలపడ్డాయి. వృత్తిపనివాళ్ళ శ్రేణులు వర్తక శ్రేణులకు లోబడి ఉండేవని రచయిత అభిప్రాయం (పేజీ 170). ఈ వర్తక శ్రేణులు పట్టణ ప్రాంతాలలో పన్ను వసూలును గుత్తకు తీసుకోవడం కూడా జరిగేది. అంటే గ్రామాలలోని జమీందార్ల వంటి రెవెన్యూ గుత్తదార్లకు వీళ్ళు పట్టణ రూపమన్న

మాట. రాజ్యం నలుమూలలకూ ఆహారధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు రవాణా కావడమే కాకుండా విదేశీ వ్యాపారం కూడా బాగా జరిగేది కాబట్టి ఈ రెవెన్యూ గుత్తదార్లకు కావలసినంత గిరాకీ. నిజానికి – వ్యాపారం ఉన్నా లేకున్నా – ఫ్యూడల్ ప్రభుత్వాలకు పన్ను వసూలును మించిన వ్యాపకం మరొకటి లేదు. పారిశ్రామిక ఉత్పత్తి, మారకం ఎక్కువగా వుండవు కాబట్టి ఇవాళ్టిలాగ excise మీద, sales tax మీద ప్రభుత్వాలు నడవవు. పాలకవర్గాల వినోదాలూ విలాసాలూ సాగవు. రకరకాల పన్నులు – మనకు అమానుషంగాను, హాస్యాస్పదంగాను కనిపించేవి – సేకరించాలి. విజయనగర రాజులు ఏటా తమ క్షత్రియ ధర్మ నిర్వహణార్థం నడిపే యుద్ధాలకోసం పదివేల గుర్రాలు దిగుమతి చేసుకునేవారట. ప్రజలను ఎంతగా, ఎన్నెన్ని రకాలుగా దోచుకుంటే ఈ విలాసాలు సాధ్యం? అందుకే పెళ్ళికి పన్ను, పిల్లలు పుడితే పన్ను, గుళ్ళో మొక్కుకుంటే పన్ను, గుండు గీక్కుంటే పన్ను, ప్రభుత్వానికి అర్జీ పెట్టుకుంటే పన్ను, అన్నిటికీ పన్నే. రవాణా సౌకర్యాలు, ప్రసారసౌకర్యాలు అపరిణతంగా ఉన్న ఆ రోజుల్లో పాలకవర్గాలకు జీవ ధాతువయిన ఈ పన్నుల సేకరణ కూడా పెద్ద సమస్యే. ఇంగ్లండు, జర్మనీ వంటి చిన్న దేశాలలో ఏమోగాని, మనబోటి విశాలమయిన దేశాలలో ఆ సమస్య చాలా జటిలమయినది. ఈ కారణంగానే యూరప్ భూస్వామ్యంలోని సైనిక జాగీర్దార్ల కంటే మన దేశ భూస్వామ్య సమాజంలో రెవెన్యూ గుత్తదార్లకు ప్రాధాన్యత ఎక్కువ.

దాదాపు సంపూర్ణంగా అభివృద్ధి చెందిన ఫ్యూడలిజం, సాంకేతికంగా కొంత అభివృద్ధి చెందిన వృత్తి పరిశ్రమలూ, దానితోటి వ్యాపార విస్తరణ – ఇవీ విజయనగరానికీ, గజపతులకూ[23], బహమనీలకూ పునాది. పునాదిలో ఈపాటి అభ్యుదయం ఉండడం వల్లే కాబోలు ఆ కాలంలో అనువాద సాహిత్యం కాకుండా స్వతంత్ర సాహిత్యం వచ్చింది. అది ఫ్యూడల్ సాహిత్యమే కాని పూర్తిగా దిగజారిన సాహిత్యం కాదు. ఆపాటి అభ్యుదయాన్ని కూడా కోల్పోయిన తరువాతే ప్రబంధ సాహిత్యం బూతుసాహిత్యమో, అంతఃపుర సాహిత్యమో అయింది.

వీళ్ల తరువాత వచ్చిన గోల్కొండ కుతుబ్‌షాహీల పాలనలో పైన పేర్కొన్న వృత్తిపరిశ్రమల విస్తరణా, వ్యాపారవిస్తరణా కొనసాగాయి. ముఖ్యంగా డచ్[24],

బ్రిటిష్[25] ఈస్ట్ ఇండియా కంపెనీలు ఏర్పడ్డ తరువాత యూరప్‌కు వస్త్రాల ఎగుమతి విరివిగా సాగింది. ఈ విదేశీ వ్యాపారంలో భారతదేశానిదే పైచేయి. వాణిజ్య సమతూకం (balance of trade) భారతదేశానికే అనుకూలంగా ఉండడం చేత విదేశాల నుండి బంగారం దిగుమతి అయ్యేది. తమ దేశాల నుండి బంగారమంతా ఇండియాకు వెళ్ళిపోతోందనీ, కాబట్టి ఇండియాతో వ్యాపార సంబంధాలు తెంచుకోవాలనీ ఫ్రాన్సువంటి పాశ్చాత్యదేశాల మేధావులు తమ ప్రభుత్వాలకు సలహా ఇచ్చినట్లు క్లాడ్ అల్వారిస్[26] అంటాడు. ఈ వ్యాపారంలో భాగంగానే మచిలీపట్నం, నర్సాపురం రేవులుగాను, నౌకా నిర్మాణ కేంద్రాలుగాను ప్రసిద్ధి చెందాయి.

'ఇవన్నీ చూస్తే, కుతుబ్‌షాహీల కాలంలో గ్రామ స్వయంపూర్ణత్వం శిథిలమవుతూ అమ్మకానికై సరుకుల తయారీ పెద్దఎత్తున ప్రారంభమయిందని... అర్థమవుతుంది' అని రచయిత అభిప్రాయం (పేజీ 228). గ్రామీణ స్వయం సంపూర్ణతను దేశీయ వ్యాపారమే తప్ప విదేశీ వ్యాపారం దెబ్బతీయలేదు కాబట్టి ఇందులో కొంత అతిశయోక్తి ఉంది గాని, ఈ పారిశ్రామిక, వ్యాపార విస్తరణవల్ల శూద్ర కులాలకు – ముఖ్యంగా వస్త్ర ఉత్పత్తిదార్లకు – సమాజంలో స్థానం పెరిగింది. ఆర్థికంగా కొంత బలపడడంతో వాళ్లు వర్ణవ్యవస్థలో తమకున్న అథోస్థానాన్ని నిరసించారు. సాహిత్యంలో ఆ నిరసనను వ్యక్తపరచినవాడు వేమన.[27]

అటు తరువాత బ్రిటిష్‌వాళ్ళకు భారతదేశం వలసగా మారడం, వాళ్ళు తమ రెవెన్యూ అవసరాల కోసం భూమి సంబంధాలలో కొన్ని మార్పులు తీసుకురావడం, ఇదంతా తరువాతి కాలం కథ. ఆ కథను పుస్తకం మూడవ భాగంలో చెప్తారు కాబోలు సత్యనారాయణగారు. ఫ్యూడల్ కాలంలాగా కాకుండా వలసకాలాన్ని గురించి విస్తృతమయిన పరిశోధనలు జరిగాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని మూడవభాగాన్నయినా శాస్త్రీయంగా రాస్తే తెలుగువాళ్లకు ఎనలేని సేవ చేసిన వారవుతారు.

చివరిగా రెండు మాటలు చెప్పాలి. వ్యాఖ్యానించే ప్రయత్నం లేకపోవడం ఒక లోపమయితే, భారతదేశ ఫ్యూడలిజానికి ప్రత్యేకమయిన లక్షణాలను పట్టించుకోక పోవడం పుస్తకంలో మరొక లోపం. మొదటి భాగాన్ని సమీక్షించిన

ఒక విమర్శకుడు కులవ్యవస్థను పట్టించుకోనందుకు సత్యనారాయణగారిని తప్పుపట్టడం జరిగింది. ఆ విమర్శ రెండవ భాగానికి మరింత బాగా వర్తిస్తుంది. ఎందుకంటే ఈ కాలంలో కులవ్యవస్థ బాగా ముదిరి ఉత్పత్తి సంబంధాలలో భాగంగా తయారయింది. నిజానికి స్వయంసంపూర్ణ గ్రామాలలో వ్యవసాయేతర ఉత్పత్తిలో కులవ్యవస్థే ఉత్పత్తి సంబంధాల పాత్ర నిర్వహించింది. వ్యావసాయిక ఉత్పత్తి సంబంధాలలో కూడా దాని పాత్ర తక్కువేం కాదు. భారతదేశ ఫ్యూడలిజంలో కులం ఒక ఉత్పత్తి సంబంధం అనడానికి చాలామంది మార్క్సిస్టులు సాహసించడం లేదు గాని అది కాదనలేని వాస్తవం.

భక్తి ఉద్యమాల గురించి కూడా చాలా గందరగోళం ఉంది. ఆ చిక్కు విడదీయడం అంత సులభం కాదు గాని, రెండు విషయాలు చెప్పకతప్పదు. భక్తి ఉద్యమాలను కేవలం ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా సామాన్య ప్రజల నిరసనను వ్యక్తపరచిన ఉద్యమాలుగా అర్థం చేసుకోవడం తప్పు. ఆ అంశం వాటిలో లేకపోలేదు గాని అదే వాటి ప్రధాన స్వభావం కాదు. భూస్వామ్య సమాజానికి భక్తి చాలా ముఖ్యం. పెట్టుబడిదారీ దోపిడీకి ఆర్థిక ప్రగతిని సాధించగలదనే లౌకిక సమర్థన వుంది. అది సాధించగల ప్రగతి పాక్షికం, సంక్షోభమయం అన్నది వేరే విషయం. ఆ విషయాలు లోతుగా వెళ్తేగాని అర్థం కావు. కాని భూస్వామ్య దోపిడీకి ఆపాటి లౌకిక సమర్థన కూడా సాధ్యం కాదు. దోచుకోబడే శ్రామికుడు దోచుకునే వాడి పట్ల 'నీ బాంచెన్' అనే గుడ్డి భక్తిని ప్రదర్శించకపోతే భూస్వామ్య దోపిడీ నడవదు. అందుకే, దేనినీ ప్రశ్నించని భక్తితత్వం భూస్వామ్య సమాజానికి అనువయిన భావజాలం. అయితే మన దేశంలో ఫ్యూడలిజం ఒక్కనాడు ఏర్పడక దశలుదశలుగా, అంచెలంచెలుగా ఏర్పడింది కాబట్టి ఈ భక్తితత్వం కూడా ఒక్కనాడు మొలవకుండ 10వ శతాబ్దం నుండి 14, 15 శతాబ్దాల వరకు భక్తి ఉద్యమాల పరంపర రూపంలో సమాజాన్ని ఆవరించింది. ముదురుతున్న ఫ్యూడలిజానికి సమాంతరంగా ముదురుతున్న భక్తిభావంగానే వాటిని అర్థం చేసుకోవాలి. అంతేగాని 'ఫ్యూడలిజం' అన్నది మార్పులేని వ్యవస్థగాను, అందులో వచ్చే ఉద్యమాలన్నీ ఫ్యూడల్ పీడన నుండి ప్రజలకు ఉపశమనం ఇచ్చేవిగాను అర్థం చేసుకోవడం చాలా మొరటు వ్యాఖ్యానం. అదే వాస్తవమయితే కాకతీయులు

శైవాన్నీ, విజయనగర ప్రభువులు వైష్ణవాన్నీ, కళింగ గజపతులు చైతన్యుడి తత్వాన్నీ ఎందుకు ఆదరించారో, భక్తి సిద్ధాంతాలకు వ్యతిరేకమయిన జైనమతాన్ని కాకతీయులెందుకు సాయుధంగా నాశనం చేశారో అర్థం కాదు.


మరయితే ఆనాటి భక్తి ఉద్యమాలలో కొన్ని 'ప్రజాస్వామిక' లక్షణాలు లేవా అంటే ఉన్నాయి. దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, ఫ్యూడలిజం ముదరడం అంటే చిల్లర భూస్వాములు ఏర్పడడం. ఇట్లా ఏర్పడ్డ చిల్లర భూస్వాములలో బ్రాహ్మణ మతం చేత శూద్రులుగా పరిగణించబడ్డవారు (నేటి రెడ్లు, వెలమలు మొదలయినవారు) ఉండడం చేత, ఈ ఉద్యమాలకు వర్ణవ్యవస్థ పట్ల వ్యతిరేకత ఉండడం సహజం. రెండవది, సమాజంలో వచ్చే ఏ నూతన మార్పయినా తన కర్తవ్యాన్ని మించిన ఆదర్శాలను చరిత్రలోకి తెస్తుంది. బుద్ధుడి నుండి ఫ్రెంచి బూర్జువా విప్లవ తాత్వికుల వరకు తమ పరిధిలో లేని సర్వమానవ సమానత గురించి, సౌభ్రాతృత్వాన్ని గురించి నిజాయితీతో మాట్లాడినవారే.


అనువాదం సరళంగానే వుంది, కొన్ని మినహాయింపులతో. 'పరిశ్రమలతో, వర్తకంతో' అనే బదులు 'పరిశ్రమలూ, వర్తకమూతో' అనక తప్పదా? నవలా రచనలో చేయితిరిగిన మహీధర రామమోహనరావుగారి సంక్షిప్తీకరణ గురించి ఆంగ్ల మూలం చూస్తేగాని చెప్పలేం.

1. డి.డి. కోశాంబి (1907–1966) గణిత శాస్త్రవేత్త. గణాంక శాస్త్రవేత్త, చరిత్రకారుడు. గణిత శాస్త్రవేత్తగా ఎంత ప్రసిద్ధుడో చరిత్రకారుడిగానూ అంతే ప్రసిద్ధుడు. భారతీయ చరిత్ర రచనలో మార్క్సిస్టు పరిశీలనా పద్ధతికి ఆద్యుడు. 'ప్రాచీన భారతదేశ చరిత్ర : డి.డి. కోశాంబి పరిచయం' పేరుతో బాలగోపాల్ ఒక పుస్తకం కూడా రాశారు (హెచ్.బి.టి. ప్రచురణ).
2. ఇర్ఫాన్ హబీబ్ (1931– ) : మార్క్సిస్టు చరిత్రకారుడు. ప్రాచీన, మధ్యయుగాల భారతదేశంపై, ముఖ్యంగా మొఘల్ పరిపాలన, సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులు, వలసవాద ప్రభావం మొదలైన అంశాలపై అనేక పుస్తకాలు రాశారు.
3. శాతవాహన సామ్రాజ్యం : 450 ఏళ్ళపాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటక ప్రాంతాలను పరిపాలించిన సామ్రాజ్యం. మొదట మౌర్య సామ్రాజ్యానికి సామంతులుగా ఉన్న శాతవాహనులు క్రీ.పూ. 230లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. కోటిలింగాల, పూనా, పైతాన్‌లను రాజధానులుగా ఏర్పాటు చేసుకుని క్రీ.శ. 220 వరకు పరిపాలించారు.

4. భరుకచ్ఛం : నేటి భరూచ్ (గుజరాత్). క్రీ.పూ. 6వ శతాబ్దం నుంచి రేవు పట్టణం.
5. మౌర్యుల కాలం : క్రీ.పూ. 322 నుండి క్రీ.పూ. 185 వరకు 137 ఏళ్ళపాటు భారతదేశాన్ని పరిపాలించిన రాజులు మౌర్యులు. పాటలీపుత్రం రాజధానిగా చంద్రగుప్త మౌర్యుడు నెలకొల్పిన మౌర్య సామ్రాజ్యం ఆనాడు ప్రపంచంలో ఉన్న సామ్రాజ్యాలలోకెల్లా పెద్దది.
6. ఇక్ష్వాకులు : క్రీ.శ. రెండవ శతాబ్దం ఉత్తరార్థంలో విజయపురి (నాగార్జునకొండ) రాజధానిగా కృష్ణా - గుంటూరు ప్రాంతాలను పరిపాలించిన రాజులు. పురాణాల్లోని ఇక్ష్వాకులకు వారసులు అని కొందరు అనుకుంటారు కాని కాదు.
7. పల్లవులు : క్రీ.శ. నాలుగో శతాబ్దం నుంచి తొమ్మిదో శతాబ్దం వరకు 600 ఏళ్ళపాటు కాంచీపురం రాజధానిగా తెలుగు తమిళ ప్రాంతాలను పరిపాలించిన రాజులు.
8. రాష్ట్రకూటులు : క్రీ.శ. 755 నుండి 975 వరకు దక్కన్‌ను పరిపాలించిన రాజులు.
9. చోళులు : తెలుగు చోళులు క్రీ.శ. 7–13 శతాబ్దాల మధ్య కృష్ణా తీర ప్రాంతంలో పరిపాలించారు. వీరి మూలాలు కడప ప్రాంతంలో ఉన్నాయంటారు.
10. చాళుక్యులు : వీళ్ళు మూడుపాయలుగా క్రీ.శ. 6–12 శతాబ్దాల మధ్య దక్షిణ, మధ్య భారత ప్రాంతాలను పరిపాలించారు. ఒకరు బాదామి చాళుక్యులు, రెండోవారు తూర్పు చాళుక్యులు, మూడోవారు పశ్చిమ చాళుక్యులు. వేంగి (ఆంధ్రప్రదేశ్) రాజధానిగా పరిపాలించిన వారు తూర్పు చాళుక్యులు.
11. సయీద్ నక్వీ : గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటిక్స్ & ఎకనమిక్స్ (పూణె)లో అధ్యాపకుడుగా పనిచేశారు. ఇక్కడ ప్రస్తావించిన వ్యాసం కె.ఎం. కురియన్ సంపాదకత్వంలో వెలువడ్డ 'ఇండియా, స్టేట్ & సొసైటీ : ఎ మార్క్సియన్ అప్రోచ్' (1975) అనే పుస్తకంలో ఉంది. ఓరియంట్ లాంగ్‌మాన్ ప్రచురణ.
12. ఆర్.ఎస్. శర్మ (1919–2011) : చరిత్రకారుడు. పాట్నా, ఢిల్లీ, టొరంటో యూనివర్సిటీలలో అధ్యాపకులుగా పనిచేశారు. ప్రాచీన, మధ్యయుగాల భారతదేశ చరిత్రపై అనేక రచనలు చేశారు.
13. ఏటుకూరి బలరామమూర్తి (1918–1996) : 'ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర'తో సహా చరిత్ర, తత్వశాస్త్రాలపై అనేక రచనలు చేశారు. పలు మార్క్సిస్టు సిద్ధాంత గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. విశాలాంధ్ర దినపత్రికలో 20 ఏళ్ళు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌లో 24 ఏళ్ళు సంపాదకత్వ బాధ్యతలు వహించారు.
14. కొండవీటి వేమారెడ్డి (1395–1414) : కొండవీటి రెడ్డి రాజులలో ఒకరు. అసలు పేరు కాటయ వేమారెడ్డి. ఒక సందర్భంలో విజయనగర రాజులతో కలహించినప్పటికీ బహమనీ సుల్తానులకు, రేచర్ల వెలమలకు వ్యతిరేకంగా వారిద్దరూ ఒకటవడమే కాదు పెళ్ళి సంబంధం ద్వారా కూడా తమ బంధాన్ని పటిష్టం చేసుకున్నారు.
15. బహమనీ సుల్తానులు (1347–1518) : ఢిల్లీ చక్రవర్తి మహమ్మద్ బిన్ తుగ్లక్ నుండి స్వాతంత్ర్యం ప్రకటించుకుని దక్కన్‌ను ఏలిన సుల్తానులు. నేటి గుల్బర్గా, బీదర్‌లు వారి రాజధానులు.
16. విజయనగర రాజులు (1336–1646) : హంపి (కర్ణాటక) రాజధానిగా పరిపాలించిన రాజులు. వీరిలో శ్రీకృష్ణదేవరాయలు ఎక్కువ ప్రసిద్ధుడు.

17. కాకతీయులు (1083–1323) : ఓరుగల్లు రాజధానిగా తెలుగు నేలను పరిపాలించిన రాజులు. నేటి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎక్కువ భాగం వీరి ఏలుబడిలో ఉండేది. వీరిలో ప్రతాప రుద్రుడు, ఆయన కుమార్తె రాణి రుద్రమదేవి ప్రసిద్ధులు.
18. కుతుబ్‌షాహీలు (1518–1687) : గోల్కొండ రాజధానిగా దక్కన్‌ను పరిపాలించిన రాజులు. బహమనీ రాజ్యంలోని ఓరుగల్లు ప్రాంతానికి గవర్నరుగా పనిచేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న కులీకుతుబ్‌షా ఈ వంశస్థుల పాలనకు ఆద్యుడు.
19. బానిస వ్యవస్థ : భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు ఎస్.ఎ. డాంగే తన 'ఫ్రం ప్రిమిటివ్ కమ్యూనిజం టు స్లేవరీ' పుస్తకంలో భారతదేశంలో బానిస వ్యవస్థ ఉండేదని రాశారు. దాన్ని ఆక్షేపిస్తూ రాసిన వ్యాఖ్య.
20. జమీందారీ వ్యవస్థ : బ్రిటిష్ ఇండియాలో శిస్తు వసూళ్ళకు ఉన్న మూడు వ్యవస్థలలో జమీందారీ వ్యవస్థ ఒకటి. 1793లో కార్న్‌వాలిస్ దీన్ని ప్రవేశపెట్టాడు.
21. ఇక్తిదార్ ఆలంఖాన్ : చరిత్రకారుడు. 'అక్బర్ అండ్ హిస్ ఏజ్', 'గన్‌పౌడర్ అండ్ ఫైర్ ఆర్మ్స్; వార్‌ఫేర్ ఇన్ మిడీవల్ ఇండియా', 'హిస్టారికల్ డిక్షనరీ ఆఫ్ మిడీవల్ ఇండియా' తదితర పుస్తకాలు రాశారు.
22. ఆముక్త మాల్యద : విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు రచించిన ప్రసిద్ధ తెలుగు ప్రబంధం.
23. గజపతులు (1434–1541) : ప్రధానంగా కళింగ (ఒడిషా) ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు. ఆంధ్ర, మధ్యప్రదేశ్, బీహార్, బెంగాల్‌లకు చెందిన కొన్ని ప్రాంతాలు కూడా వీరి పాలనలో ఉండేవి.
24. డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ : నెదర్లాండ్స్ ప్రభుత్వ అనుమతితో 1602లో ఏర్పాటైన కంపెనీ. నెదర్లాండ్స్ వ్యాపారస్తులు ఈస్ట్ ఇండియా దేశాలతో జరిపే వాణిజ్య కార్యకలాపాలపై దీనిదే గుత్తాధిపత్యం. 1605 నుంచి 1825 వరకు భారత దేశంలో వీరి కార్యకలాపాలు సాగాయి.
25. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ : అన్ని ఈస్ట్ ఇండియా కంపెనీల్లోకి మొదటిది. 1600లో ఏర్పడి క్రమక్రమంగా భారతదేశంపై అన్ని రకాల ఆధిపత్యం నెలకొల్పుకుంది. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు తర్వాత దీని కార్యకలాపాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. 1874లో పూర్తిగా రద్దుచేశారు.
26. క్లాడ్ ఆల్వారిస్ (1948 – ) : గోవా నివాసి. ప్రముఖ పర్యావరణవాది. 'హోమో ఫేబర్ : టెక్నాలజీ అండ్ కల్చర్ ఇన్ ఇండియా', 'చైనా అండ్ ది వెస్ట్ ఫ్రం 1500 టు ద ప్రెజెంట్ డే...' వంటి పుస్తకాలు రాశారు.
27. వేమన : 17, 18 శతాబ్దాలకు చెందిన కవి. కడప, కర్నూలు ప్రాంతాలలో నివసించాడు. 'విశ్వదాభిరామ వినురవేమ' మకుటంతో వేలాది పద్యాలు రాశాడు.




**సుకోమల్‌సేన్** 'Working Class of India : History of Emergence and Movement 1830-1970' పుస్తకం ఆధారంగా బాలగోపాల్ రాసిన వ్యాసం ఇది. అయితే బాలగోపాల్ స్వాతంత్ర్యం వచ్చేంతవరకు జరిగిన పరిణామాల వరకే రాసినందువల్ల తన పుస్తకానికి 'భారత కార్మిక ఉద్యమ చరిత్ర 1830–1947' అని పేరు పెట్టారు. తొలి ప్రచురణ (1977) తర్వాత సుకోమల్‌సేన్ కొత్త సమాచారాన్ని జోడించి మరో రెండు ఎడిషన్లు తీసుకువచ్చారు. 2013లో వచ్చిన కొత్త ఎడిషన్‌లో 2010 వరకు జరిగిన పరిణామాలను చేర్చారు. దీని తెలుగు అనువాదాన్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ ఈ ఏడాదే (2015) ప్రచురించింది.

**సుకోమల్‌సేన్ (1934– )** : కార్మికోద్యమ నాయకులు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమాఖ్యకు దాదాపు 30 ఏళ్ళు కార్యదర్శిగా ఉన్నారు. మార్క్సిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు. 1982–94 మధ్య రాజ్యసభ సభ్యులు. 'May Day and Eight Hours Struggle in India : A Political History', ఇంకా అనేక పుస్తకాలు రాశారు.

మన దేశ పరిశ్రమలలో కార్మికులకు
ఇచ్చే వేతనాలకు ప్రమాణం
పారిశ్రామిక రంగంలోని ఉత్పాదకత
కాదు, రైతాంగానికి లభించే దినసరి
ఆదాయం. అదే పాశ్చాత్య
దేశాలలోనయితే పారిశ్రామిక
వేతనం పారిశ్రామిక ఉత్పాదకతను
బట్టి ఉండి, వ్యావసాయిక వేతనాలకు
ప్రమాణాన్ని నెలకొల్పింది. రచయిత
మాటల్లో చెప్పాలంటే 'వేతనాల
నిర్ణయంలోని ఈ తలక్రిందులు
వ్యవహారం భారతదేశం వంటి వలస
దేశాల కార్మికుల జీవన
పరిస్థితులలోని వైపరీత్యాలలో ఒకటి.'

# భారత కార్మిక ఉద్యమ చరిత్ర

## (1830-1947)

## I

### పూర్వరంగం

**కార్మికులు** అంటే పెట్టుబడిదారీ దోపిడీకి గురయ్యే శ్రామికులు. పాశ్చాత్య దేశాలలోలాగ మన దేశంలో పెట్టుబడిదారీ దోపిడీ సహజంగా పుట్టలేదు. అంటే భూస్వామ్య వ్యవస్థను నాశనం చేసి ముందుకు రావడం జరగలేదు. తద్భిన్నంగా, ఇక్కడికి పెట్టుబడిదారీ దోపిడీ ఇంగ్లండు నుండి దిగుమతి అయింది.

భారతదేశం బ్రిటన్‌కు వలసగా మారిన క్రమంలో రెండు దశలున్నాయి. మొదటి దశలో, అప్పటికింకా పారిశ్రామిక విప్లవాన్ని సాధించని బ్రిటన్‌కు ఆ విప్లవాన్ని సాధించడానికి అవసరమయిన పెట్టుబడిని సమకూర్చి పెట్టడం భారతదేశపు చారిత్రక కర్తవ్యమయింది. దీనికి సాధనం ఈస్ట్ ఇండియా కంపెనీ. 1757 నుండి 1812 వరకు భారతదేశపు వాణిజ్యం మీద గుత్తాధిపత్యం వహించిన 'కంపెనీ' ఆ గుత్తాధిపత్యం వల్ల వచ్చిన లాభాలే కాకుండా రాజుల నుండి, సంస్థానాధీశుల నుండి వ్యాపార పన్నులు విధించే హక్కును చేజిక్కించుకునీ, వడ్డీ వ్యాపారం చేసీ ఆ లాభాలను కూడా బ్రిటన్‌కు తరలించింది. 'కంపెనీ' లెక్కల ప్రకారమే ఈ రకంగా తరలించిన మొత్తం 10,00,00,000 పౌండ్లు.

1812 నాటికి బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం మొదలయింది. దానితోపాటే మార్కెట్ల వేటా మొదలయింది. అప్పటివరకు 'కంపెనీ'కి భారతదేశంతోటి వాణిజ్యం మీద ఉన్న గుత్తాధిపత్యం అప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదార్లకు ఆటంకంగా తయారయింది. ఫలితంగా 1812 నుంచే ఆ గుత్తాధిపత్యం పోయి విశృంఖల వాణిజ్యం (free trade) అమలులోకి వచ్చింది. పారిశ్రామిక విప్లవంలో మొట్టమొదట సాంకేతిక అభివృద్ధి వచ్చింది. వస్త్ర ఉత్పత్తిలోనే. దాంతో త్వరలోనే బ్రిటన్ ప్రపంచ వస్త్ర ఉత్పత్తిలో 60 శాతం తానే చేయడం మొదలుపెట్టింది. ఉత్పత్తి అయిన

---

వరంగల్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 1 మే 1982

వస్త్రాల ఎగుమతికి భారతదేశం మార్కెట్‌గా మారింది. అప్పటివరకు ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా పట్టు, మస్లిన్ మొదలయిన వస్త్రాలను భారతదేశం నుండి దిగుమతి చేసుకుంటున్న బ్రిటన్, 1826 నాటికి 4.2 కోట్ల గజాల నూలు బట్టను భారతదేశానికి ఎగుమతి చేసింది. ఆనాటికే బ్రిటన్ నుండి జరిగిన మొత్తం ఎగుమతిలో 8వ వంతు భారతదేశానికి చేరటం మొదలయింది.

ఈ వ్యాపారానికి రైల్వేలు అవసరం. భారతదేశం నలుమూలలా బ్రిటిష్ వస్త్రాలు, ఇతర సరుకులు అమ్మాలంటే రైల్వే లైన్లు వేయాలి, రైళ్ళు నడిపించాలి. దానికోసం బొగ్గు గనులు తెరవాల్సి వచ్చింది. బెంగాల్ బొగ్గు కంపెనీ[1] 1843లో స్థాపించబడింది. దాని యాజమాన్యంలో 1895లో ఝురియా[2]లో విశాలమయిన బొగ్గు గనులు ప్రారంభించబడ్డాయి.

ఎగుమతి అయ్యే వ్యాపార సరుకులకు మారుగా బ్రిటన్ పారిశ్రామిక ముడిసరుకులను దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టింది. వీటిలో ముఖ్య మయినవి జనపనార, తేయాకు. మొదటి జనపనార మిల్లు[3] 1854లో కలకత్తా దగ్గర రిష్రాలో స్థాపించబడింది. మొదటి తేయాకు తోట[4] – అస్సాం తేయాకు కంపెనీ యజమాన్యంలో – 1839లో నెలకొల్పబడింది. వీటితోబాటే బట్టల మిల్లులు కూడా (బ్రిటిష్ పెట్టుబడిదార్ల యాజమాన్యంలోను, దావర్[5] వంటి కొందరు పార్సీల యాజమాన్యంలోను) స్థాపించబడ్డాయి. 1818లో కలకత్తా దగ్గర ప్రారంభమయి, 1880 నాటికి మొత్తం 58 బట్టల మిల్లులు వెలిశాయి.

ఈ బొగ్గు గనులలో, తేయాకు తోటలలో, రైల్వేలలో, జనపనార వస్త్ర పరిశ్రమలలో పుట్టింది భారత కార్మికవర్గం. అయితే దాని పుట్టుకలోనే కొన్ని అవలక్షణాలున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థను నాశనంచేసే క్రమంలో ఆ భూస్వామ్య సమాజపు వృత్తిపనివారి (artisans) వర్గాన్ని కూడా నాశనం చేస్తుంది. కమ్మరీ, వడ్రంగీ, మేదరీ తమ జీవనాన్ని కోల్పోతారు. వాళ్ళ స్థానంలో ఫ్యాక్టరీలు వస్తాయి. అయితే పాశ్చాత్య దేశాలలో తమ జీవనాన్ని కోల్పోయిన వృత్తిపనివాళ్ళు తమ స్థానాన్ని ఆక్రమించుకున్న ఫ్యాక్టరీలలోనే కార్మికులుగా స్థిరపడ్డారు. అంటే అక్కడి కార్మికవర్గానికి మొదటి నుండి కూడా పారిశ్రామిక ఉత్పత్తిదారుల లక్షణాలున్నాయి. దీనివల్ల వాళ్ళకు కార్మికవర్గ చైతన్యం త్వరలోనే అలవడింది.

మన దేశంలో ఇట్లా జరగలేదు. పెట్టుబడిదారీ సంబంధాలు వలస సంబంధాల రూపంలో ప్రవేశించాయి. బ్రిటిష్ ప్రభుత్వం ఒక పక్క బ్రిటిష్ వస్త్రాలను విరివిగా మన దేశానికి ఎగుమతిచేస్తూ, ఇక్కడి నుండి సాంప్రదాయికంగా ఎగుమతయ్యే వస్తువులమీద మాత్రం విపరీతమయిన పన్ను విధించిన కారణాన ఇక్కడి వృత్తిపనివాళ్ళు క్రమంగా తమ జీవనాన్ని కోల్పోయారు. కోల్పోవడమే కాదు, వాళ్ళ స్థానాన ఫ్యాక్టరీలు ఏర్పడడం చాలా మందకొడిగా సాగిన కారణాన, వాళ్ళంతా గ్రామాలకు తిరిగి వెళ్ళి అక్కడి పీడిత రైతాంగంలో భాగమయ్యారు. గనులలోను, తేయాకు తోటలలోను, జనపనార మిల్లులలోను పనిచేసే కార్మికులు పీడిత రైతాంగం నుండే వెళ్ళినా (అందులో కొత్తగా భాగమైన) వృత్తిపనివాళ్ళ వర్గం నుండి వెళ్ళినవారు కారు. దీనివల్ల భారతదేశ కార్మికవర్గపు చైతన్యం చాలా వెనుకబడి పోయిందని, ఆ వర్గానికి పారిశ్రామిక పూర్వరంగం లేకపోవడం వలన, భూమి మీదే ఎక్కువ మమకారం ఉండడం వలన, ఎప్పటికయినా రెండెకరాల భూమి సంపాదించుకుని గ్రామానికి తిరిగిపోదామన్న దృక్పథమే వారిలో బలంగా ఉండడం వలన వారు కార్మిక వర్గంగా సంఘటితం కావడం కష్టమయిందని గుర్తించిన వారిలో ఎం.ఎన్. రాయ్[6] ఒకడు. ఈ గ్రామీణ పూర్వరంగం కార్మికోద్యమంలో సంస్కరణ వాదానికి మార్గం సుగమం చేస్తుందని కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్[7] తన ఆరవ సమావేశంలో (1928లో) సిద్ధాంతీకరించింది.

ఈ లోపాన్ని పెట్టుబడిదార్లు తమ లాభాల కోసం సహజంగానే వాడుకున్నారు. కార్మికులు సంఘటితం కాలేకపోవడం, దోచుకునేవాడిని 'దొర'గా పరిగణించి వర్గకసికి బదులు ప్రభుభక్తిని ప్రదర్శించే భూస్వామ్య సమాజతత్వం- వాళ్ళకు చాలా అనుకూలమయినాయి. ఫలితంగా కార్మికుల జీవన పరిస్థితులు, పని పరిస్థితులు ఎంత అన్యాయంగా తయారయ్యాయంటే, గ్రామీణ ప్రాంతాలలో జమీందారీ దోపిడీ ఎంత దారిద్ర్యాన్ని సృష్టించినా గ్రామాలను వదలి గనులలోకి, తేయాకు తోటలలోకి, జనపనార మిల్లులలోకి వెళ్ళడానికి పేద రైతాంగం వెనకాడింది. దానివల్ల, దారిద్ర్యం తాండవమాడే ఈ దేశంలో పారిశ్రామిక కార్మికులకు కొరత ఏర్పడే వికృత పరిస్థితి ఉద్భవించింది. మొదటి ప్రపంచ యుద్ధం వరకు కూడా ఈ కొరత కొనసాగింది. బీహార్ నుండి, తూర్పు బెంగాల్

నుండి దారిద్ర్యంవల్ల వలస వెళ్ళినవాళ్ళు – పారిశ్రామిక కేంద్రంగా రూపొందుతున్న కలకత్తాలో కార్మికుల కొరత ఉన్నప్పటికీ కలకత్తా నగరాని కంటే పశ్చిమ బెంగాల్ గ్రామీణ ప్రాంతాలకే ఎక్కువగా వెళ్ళారు. 1901 సంవత్సరానికి సంబంధించి ఒక రచయిత[8] వేసిన అంచనా ప్రకారం ముజఫర్‌పూర్ జిల్లా నుండి వలస వెళ్ళిన 67,000 మందిలో కేవలం 20,000 మంది మాత్రమే కలకత్తా నగరానికి వెళ్ళారు.

'ఈ విపరీత పరిస్థితి గురించి ప్రభుత్వం విచారణ జరపాలి' అని పెట్టుబడి దార్ల సంఘాలు (Chambers of Commerce) ఘోష పెట్టాయిగాని, ఆ పెట్టుబడి దార్ల విపరీతపు దోపిడీయే దీనికి అసలు కారణం. ప్రభుత్వమే నియమించిన ఫ్యాక్టరీ కార్మికుల కమిషన్ రిపోర్టు ప్రకారం పనికాలం సాధారణంగా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉండేది. ఫ్యాక్టరీకి గాని కరెంటు ఉంటే (ఆ రోజులలో కరెంటు చాలా కొత్త విషయం అని గుర్తుంచుకోవాలి) సూర్యాస్తమయం తర్వాత కూడా పనిచేయాలి. బొంబాయిలో కరెంటుగల 85 మిల్లులలోకి 60 మిల్లులలో పనికాలం 13 నుండి 15 గంటలు. అహమ్మదాబాద్‌లో 14 గంటలు, బ్రోచ్‌లోను, ఢిల్లీలోను $13\frac{1}{2}$ నుండి $14\frac{1}{2}$ గంటలు, ఆగ్రాలోనయితే 15 గంటల పైబడి కూడా ఉండేది. బట్టల మిల్లుల పరిస్థితి ఇట్లాగుంటే, కలకత్తాలోని జనపనార మిల్లులలో పని కాలం 16 గంటలు ఉండేది. అంటే, వైద్యుల సలహా పాటించి ఆనాడు కార్మికులు 8 గంటలు నిద్రపోయే వారనుకుంటే, వారు మెలకువగా ఉన్న కాలమంతా పనిచేయాలన్నమాట.

కొంత 'భారీ' పరిమాణం గల పరిశ్రమలలోని పరిస్థితి ఇది. చిన్న చిన్న ఫ్యాక్టరీలలోని పరిస్థితి అయితే – రచయిత భాషలో – నరకప్రాయం. రైసు మిల్లులలోను, పిండి మిల్లులలోను, ముద్రణాలయాలలోను 20 నుండి 22 గంటలు పనిచేసిన సందర్భాలు కూడా లేకపోలేదని ఏ కమ్యూనిస్టులో కాదు, ప్రభుత్వపు కమిషనే అధికారికంగా చెప్పింది. అంతేకాదు, వాడియా[9] అనే ఒక మిల్లు యజమాని తన ఫ్యాక్టరీలో ఇంజను పొద్దున 4 గంటలకు పని ప్రారంభిస్తుందని, రాత్రి తొమ్మిది గంటల వరకు నడుస్తుందని, ఈ సమయమంతా కూడా ఆ కార్మికులే పనిచేస్తారని చెప్పాడు. అమానుషత్వానికి పరాకాష్ఠగా, "పని ఎక్కువగా

ఉండే నెలలలో – అంటే మార్చి, ఏప్రిల్ నెలలలో – ఫ్యాక్టరీ రాత్రింబగళ్ళు పనిచేస్తుంది. సాయంత్రం ఒక్క అరగంట మాత్రమే విరామం ఉంటుంది. కార్మికులు ఇట్లా రాత్రింబగళ్ళు కేవలం అరగంట విశ్రాంతితో 8 రోజులపాటు పనిచేస్తారు. 8 రోజుల తరువాత ఇక వాళ్ళు పనిచేయలేరు కాబట్టి వాళ్ళను తొలగించి, మరొక 8 రోజులపాటు వేరొక కార్మిక బృందాన్ని నియమిస్తాను...ఇది నా ఒక్కడి అలవాటు కాదు, అందరూ అవలంబించే పద్ధతే...ఈ విపరీతమయిన పనికాలం వల్ల కార్మికులు చనిపోవడం కూడా అసాధారణం కాదు" అని చెప్పాడు.

1908 నాటి ఫ్యాక్టరీ కార్మిక కమిషన్ రిపోర్టు ప్రకారం – దేశంలోని అన్ని ఫ్యాక్టరీలలోని కార్మికులలో 30 నుండి 40 శాతం వరకు 5 నుండి 7 సంవత్సరాల వయసున్న పసిపిల్లలే. బెంగాలులోని ఒక జనపనార మిల్లును గురించి చెపుతూ ఆ రిపోర్టు – అక్కడి కార్మికులు మిల్లుకు మూడు నాలుగు మైళ్ళ దూరంలో ఉంటారని, పొద్దున 3 గంటలప్పుడు ఫ్యాక్టరీ సైరన్‌మోత విని 7 సంవత్సరాలలోపు పిల్లల్ని తీసుకుని, స్త్రీలు పాలుతాగే పిల్లలను ఎత్తుకుని చలి అనక, చీకటనక, మూడు మైళ్ళు నడిచివెళ్ళి ఫ్యాక్టరీలో రోజంతా పనిచేసి రాత్రయిన తరువాత మళ్ళీ అంత దూరమూ నడిచి తిరిగి వెళతాని పేర్కొంది. మొట్టమొదటి కార్మిక నాయకులలో ఒకరయిన చమన్‌లాల్[10] అన్నట్టు, బానిసత్వం చూడాలంటే ఏ అబిసీనియాకో లైబీరియాకో పోనక్కరలేదు, అది ఆనాటి భారతదేశం గర్భంలోనే వుంది.

పని పరిస్థితులు ఇట్లా వుంటే, వేతనాల గురించి రచయిత ఒక మంచి పాయింట్ చెప్పాడు. మన దేశ పరిశ్రమలలో కార్మికులకు ఇచ్చే వేతనాలకు ప్రమాణం పారిశ్రామిక రంగంలోని ఉత్పాదకత కాదు, రైతాంగానికి లభించే దినసరి ఆదాయం. అదే పాశ్చాత్య దేశాలలోనయితే పారిశ్రామిక వేతనం పారిశ్రామిక ఉత్పాదకతను బట్టి ఉండి, వ్యావసాయిక వేతనాలకు ప్రమాణాన్ని నెలకొల్పింది. రచయిత మాటల్లో చెప్పాలంటే 'వేతనాల నిర్ణయంలోని ఈ తలక్రిందులు వ్యవహారం భారతదేశం వంటి వలస దేశాల కార్మికుల జీవన పరిస్థితులలోని వైపరీత్యాలలో ఒకటి.'

ఎంతోకొంత ఆధునికమయిన పరిశ్రమలలోని కార్మికుల పరిస్థితే ఇట్లా గుంటే, తేయాకు తోటలలోని శ్రామికుల పరిస్థితి, కాంట్రాక్టర్ల చేతికి చిక్కి దూర

దేశాలకు తరలించబడ్డ శ్రామికుల పరిస్థితి మరింత దుర్భరం. 18వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి చైనా నుండి ఎగుమతి అయ్యే తేయాకు మీద గుత్తాధిపత్యం ఉండేది. 1833లో ఆ గుత్తాధిపత్యం కోల్పోవడంతో భారతదేశంలో తేయాకు పండించి బ్రిటన్‌కు ఎగుమతి చేయడం మొదలుపెట్టారు. 1869 నాటికి తేయాకు పరిశ్రమ బలంగా వేళ్లూనుకుంది. తేయాకు తోటలు ఎక్కువగా అస్సాంలో ఉండడం చేత – అస్సాంలో జనసాంద్రత తక్కువ కావడం, భూమిలేని నిరుపేదలు ఎక్కువగా లేకపోవడం వల్ల – కాంట్రాక్టర్లు తేయాకు తోటలకు శ్రామికులను దారిద్ర్యానికి నిలయమయిన బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాల నుండి తరలించుకు వెళ్ళేవారు. మొత్తం కుటుంబాలకు కుటుంబాలే మూడు సంవత్సరాల కాంట్రాక్టు మీద ఎంతో దూరప్రాంతాల నుండి అస్సాం తోటలకు వెళ్ళేవారు. నెలజీతం మనిషికి 2 నుండి 5 రూపాయల వరకు ఉండేది. కాంట్రాక్టు పూర్తికాకుండా పారిపోవడం చట్టరీత్యా నేరం కావడం చేత, అట్లా పారిపోవడానికి ప్రయత్నించిన వాళ్ళను అక్కడికక్కడే శిక్షించే హక్కు యజమాన్లకు ఉండడం చేత కార్మికులు దాదాపుగా బానిసలుగా బతికారని చెప్పవచ్చు. తోటల యజమాన్లు (ఎక్కువగా బ్రిటిష్‌వాళ్ళు) పెళ్ళికాని కూలీల కంటె పెళ్ళయిన వాళ్ళను నియమించడం లాభదాయకమని భావించడం చేత, కాంట్రాక్టర్లు తమ చేతికి చిక్కిన నిర్భాగ్యులను భార్యాభర్తలుగా జీవించమని బలవంత పెట్టేవారట.

బానిస జీవితాన్ని సహించలేక పారిపోయేవాళ్ళను అరికట్టడం కోసం తోటల చుట్టూ కంచెలు, అన్ని మూలలా చౌకీదార్లు, పారిపోయిన కూలీని పట్టి ఇచ్చిన వారికి 5 రూపాయలు పారితోషికం వంటి ఏర్పాట్లు చేయబడ్డాయి. పారిపోయే యత్నం చేసి పట్టుబడ్డ వాళ్ళను చెట్టుకు కట్టి కొట్టేవారు.

చట్టం ఎప్పుడూ పాలక వర్గాల అవసరాల్ని సంరక్షించడానికే చేయబడినా వలసలలో ఈ స్వభావం మరింత స్పష్టంగా కనబడుతుంది. పాశ్చాత్య దేశాలలో మొట్టమొదటి పారిశ్రామిక చట్టాలు కార్మికోద్యమాల ఫలితంగా పుట్టి కార్మికులకు ఎంతో కొంత రక్షణనిచ్చాయి. భారతదేశంలో మాత్రం తద్విరుద్ధంగా మొదటి ఫ్యాక్టరీ చట్టం పరిశ్రమ యజమాన్లయిన బ్రిటిష్ పెట్టుబడిదార్లకు శాశ్వతమయిన శ్రామిక బలగాన్ని సమకూర్చడం కోసం చేయబడింది. The Assam Plantation

Labour Immigration Act, Madras Planters Labour Act మొదలయినవి తేయాకు తోటల కూలీలకు రక్షణ కల్పించకపోగా, వాళ్ళు కాంట్రాక్టు పూర్తి కాకుండా పారిపోతే అది నేరమని, శిక్షార్హమని తీర్మానించాయి. 1860 లో అమల్లోకి వచ్చిన Employers and Workers (Disputes) Act యజమానులకు కార్మికులను నిర్బంధించే హక్కు, జుర్మానాలు విధించే హక్కు కూడా ఇచ్చింది.

## II

### తొలి పోరాటాలు

అమానుషమయిన ఈ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు తిరగబడక ముందే కొందరు సహృదయులయిన వ్యక్తులు తమ తమ పరిమితులలో నిరసన తెలిపారు. సోరాబ్జీ షాపుర్జీ బెంగాలీ[11] అనే అతను చిన్నపిల్లలను పనిలోకి తీసుకోవడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించమని బ్రిటిష్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఒక బిల్లును కూడా తయారుచేసి అందజేశాడు. అయినా ఫలం దక్కలేదు.

వ్యక్తుల కంటే ఎక్కువగా సోం ప్రకాశ్[12], బొంబాయి గెజెట్[13], ఢాకా ప్రకాశ్[14], అమృతబజార్ పత్రిక[15] వంటి పత్రికలు కార్మికుల దుర్భరమైన జీవన పరిస్థితులను ప్రజల దృష్టికి తెచ్చాయి. ముఖ్యంగా అస్సాం తేయాకు తోటలలోని కూలీల పరిస్థితుల గురించి, మన దేశం నుండి మారిషస్, బ్రిటిష్ గయానా, ట్రినిడాడ్ వంటి ఇతర బ్రిటిష్ వలసలలోని చెరకు తోటలలో పనిచేయడానికి దాదాపు బానిసలుగా కాంట్రాక్టర్ల చేత తోలుకుపోబడ్డ కూలీల దయనీయమయిన పరిస్థితి గురించి ఈ పత్రికలు ఆందోళన జరిపాయి.

అయితే ఈ సహృదయుల ఆందోళన సాధించలేని సంస్కరణలను బ్రిటన్‌లోని పెట్టుబడిదార్లకు, భారతదేశంలోని పెట్టుబడిదార్లకు (వీళ్ళలో భారతీయులూ ఉన్నారు, ఇంగ్లీష్ వాళ్ళూ ఉన్నారు) ఉన్న వైరుధ్యం సాధించింది. విపరీతమయిన దోపిడీ చేసే అవకాశం గల భారతదేశపు పెట్టుబడిదార్లతో పోటీ పడడం కష్టమయిపోయిన బ్రిటన్‌లోని పెట్టుబడిదార్లకు హఠాత్తుగా మానవత్వం జ్ఞాపకం వచ్చింది. ఈ 'అమానుషమయిన పద్ధతులను' నిలపవలసిందిగా వారు బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరగా, బ్రిటిష్ ప్రభుత్వం 1881లో మొదటి ఫ్యాక్టరీ చట్టాన్ని ప్రవేశపెట్టి, తద్వారా 7 సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లలను పనిలోకి తీసుకో

గూడదని, 7 నుండి 12 సంవత్సరాల మధ్య వయస్సుగల వాళ్ళచేత రోజుకు 9 గంటల కంటె ఎక్కువ పనిచేయించగూడదని ఇత్యాది నిబంధనలు పెట్టింది. అయితే ఈ చట్టాన్ని 100 మంది కంటే ఎక్కువ కార్మికులు గల ఫ్యాక్టరీలకు మాత్రమే వర్తింపచేయడం చేత అది దాదాపుగా నిష్ఫలమయింది. అందుకే 1908 సంవత్సరంలో నియమించబడ్డ ఫ్యాక్టరీ కార్మిక కమిషన్‌కు చిన్న పిల్లల నియామకం దేశవ్యాప్తంగా కనిపించింది.

తేయాకు తోటల కూలీలకు ఈ మాత్రం కూడా దక్కలేదు. కలకత్తా నుండి ప్రచురితమయ్యే పత్రికల గొడవ పడలేక ప్రభుత్వం చివరికి 1921లో ఒక కమిషన్‌ను తేయాకు తోటల కూలీల పరిస్థితులను విచారించడానికి నియమించింది. అయితే ఆ కమిషన్‌లోని 8 మంది సభ్యులలో ఇద్దరు ప్రభుత్వాధికారులు, ఐదుగురు తేయాకు తోటల యజమానులు. ఆ కమిషన్ ఒక్క కూలీతో కూడా మాట్లాడకుండా తన పని ముగించిందంటే ఆశ్చర్యపడనక్కర లేదు.

చివరికి జంతువుల కంటే హీనమయిన ఈ జీవితాన్ని భరించలేక 1921లో 8 వేల మంది తేయాకు తోటల కూలీలు అస్సాం వదిలిపెట్టి ఉత్తరప్రదేశ్ నుండి మద్రాస్ వరకు సుదూర ప్రాంతాలలో ఉన్న తమ ఇళ్ళకు బయలుదేరారు. అయితే, దోచుకోవడానికి శ్రామికులు లేకపోతే దోపిడీ జరగదని, పెట్టుబడి బలపడదని గుర్తించిన ప్రభుత్వం వాళ్ళను పోనీయదల్చుకోలేదు. దగ్గరలోని కరీంగంజ్ రైల్వే స్టేషన్ అధికార్లకు ఆ కూలీలకు టికెట్లు అమ్మకూడదని ఆదేశం ఇచ్చింది. కలకత్తా నగర మేయర్ కల్పించుకుని వాళ్ళకు టిక్కెట్లు ఇప్పించగా, తరువాతి స్టేషన్ (చాంద్‌పూర్) దగ్గర వాళ్ళను అక్రమంగా నిర్బంధించారు. స్టేషన్ ప్లాట్‌ఫారం మీద నిద్రపోతున్న మూడువేల మందిని గూర్ఖా సైనికులు తుపాకులతో పొడిచి, కొందరినయితే చంపి నదిలోకి పారేశారు.[16]

ఇది 1921 నాటి సంగతి. అంతకు చాలాకాలం ముందే, అంటే 19వ శతాబ్దపు రెండవ భాగంలోనే అక్కడక్కడా చిన్నాచితకా సమ్మెలు చేయడం మొదలు పెట్టారు కార్మికులు. వాళ్ళకు యూనియన్లు లేవుగాని, పైన చెప్పిన సహృదయుల వంటి వాళ్ళు నెలకొల్పిన కార్మిక సంక్షేమ సంఘాలు వాళ్ళ తరఫున వకాల్తా పుచ్చుకుని, ఆ సహృదయుల వర్గ స్వభావానికి అనుగుణంగా, చాలా నమ్రతతో

ఆర్జీలు పెట్టుకున్నాయి. ఈ రకంగా ఏర్పడ్డ 'సంఘాల'లో చెప్పుకోదగ్గవి బ్రహ్మ సమాజం వారు నెలకొల్పిన Working Men's Mission[17], శశిపాద బెనర్జీ నెలకొల్పిన Baranagar Institute[18], లోఖండే అధ్యక్షుడిగా బొంబాయిలో ఏర్పడ్డ Bombay Mill-hands Association.[19] వీటిలో ఈ చివరి సంస్థకే కొద్దోగొప్పో కార్మిక సంఘం స్వభావం ఉండేది. మిగిలినవి కేవలం కార్మికులకు విద్య నేర్పడం కోసమో, సంఘ సంస్కరణ కార్యక్రమాలు నడపడం కోసమో ఏర్పడ్డాయి.

భారతదేశ కార్మికుల మొట్టమొదటి సమ్మె[20]గా చెప్పదగ్గది 1862 ఏప్రిల్ – మే నెలలలో జరిగింది. అప్పుడప్పుడే కొత్తగా ఏర్పడ్డ రైల్వేలలో పని చేసే కార్మికులు హౌరా స్టేషన్ దగ్గర 8 గంటల పనిదినం కోసం సమ్మె చేశారు. తొలి రోజులలో జరిగిన సమ్మెలన్నీ కూడా వేతనానికీ, పనికాలానికీ సంబంధించినవే. 1880 తరవాత సమ్మెలు వేగం పుంజుకున్నాయి. 1882 నుండి 1890 మధ్య బొంబాయి కలెక్టరు అన్నట్లు ఈ సమ్మెలేవీ కూడా రెండు మూడు రోజులకంటే ఎక్కువ కాలం నడవలేదు. అంతే కాకుండా ఇవి సంఘటిత పోరాటాలు కావు. కేవలం ఒక్క మిల్లుకో లేక ఒక మిల్లులోని ఒక డిపార్టుమెంటుకో పరిమిత మయినవి. అంటే, సమస్య ఎవరిదో వారు మాత్రమే సమ్మె చేశారు తప్ప కార్మిక చైతన్యంతో అందరూ కలిసి పోరాటం చేయలేదు. వీటన్నింటిలోకీ చెప్పుకోదగ్గ సమ్మె బడ్జి బడ్జి[21]లోని జనపనార మిల్లులో జరిగింది. ఆరు వారాలపాటు సాగిన ఈ సమ్మె వల్ల కంపెనీకి 80,000 రూపాయలు నష్టం వచ్చిందని కంపెనీ డైరెక్టరు వాపోయాడు. సమ్మెకు కారణం సూపర్‌వైజర్ల దౌర్జన్యం. ఈ సూపర్‌వైజర్లు ఆధునిక ఫ్యాక్టరీలలోలాగ కేవలం కంపెనీ ఉద్యోగులు మాత్రమే కాక, కూలీలను సేకరించి తెచ్చే కాంట్రాక్టర్లు కూడా కావడంచేత (వీళ్ళను సర్దార్‌లనీ, మేస్త్రీలనీ అంటారు), పనికాలం, వేతనాలతోబాటు, వీళ్ళ పీడన కూడా తొలినాటి సమ్మెలకు, పోరాటాలకు ఒక ముఖ్యమయిన కారణం.

ఈ శతాబ్ద ఆరంభం నుంచి కార్మికోద్యమంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఒక పక్క కార్మికులలో వర్గ చైతన్యం కొంత పెరిగింది, సంఘటితంగా పోరాటాలు నడిపే అలవాటు పెరిగింది. వేరొకపక్క, 1905 నాటి బెంగాల్ విభజన నుండి పుట్టిన స్వదేశీ ఉద్యమం కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని సురేంద్రనాథ్

బెనర్జీ[22] వంటి మితవాదుల చేతుల నుండి బాలగంగాధర తిలక్[23], లాలా లజపతిరాయ్[24] వంటి (అధికార చరిత్రకారుల దృష్టికి 'అతివాదులు'గా కనబడే) నాయకుల చేతులలోనికి నెట్టడం వల్ల జాతీయ ఉద్యమానికి, కార్మికోద్యమానికి కొంత సంబంధం ఏర్పడింది. 1905లో కలకత్తాలోని ప్రభుత్వ ముద్రణాలయం కార్మికులు సెలవు రోజులలో పనిచేసినందుకు బత్తా ఇవ్వాలని డిమాండుచేస్తూ నెల రోజులపాటు సమ్మె చేసినప్పుడు స్థానిక స్వదేశీ ఉద్యమ నాయకులు ఆ సమ్మెను బాహాటంగా సమర్థించారు. ఈ సమ్మె ఫలితంగా ఏర్పడ్డదే మొట్టమొదటి భారతదేశ కార్మిక సంఘాలలో ఒకటయిన బెంగాల్ ప్రెస్ వర్కర్స్ యూనియన్.[25] దాదాపుగా అదే సమయంలో ఏర్పడ్డ మరొక యూనియన్ తూర్పు ఇండియా రైల్వే కార్మికుల సంఘం[26] (1906). అన్ని నిజమయిన కార్మిక సంఘాలలాగే ఈ సంఘం కూడా పోరాటం నుండే ఏర్పడింది. వేతనం పెంచాలని, పని పరిస్థితులు మెరుగుపరచాలని, తెల్లవాళ్ళు-నల్లవాళ్ళు అనే జాతి విభేదం తొలగించాలని హౌరా, అసన్‌సోల్, బర్ద్వాన్ స్టేషన్ల కార్మికులు చేసిన సమ్మె ఈ సంఘం ఏర్పాటుకు దారితీసింది. ఆనాటి స్వదేశీ ఉద్యమ నాయకులయిన చిత్తరంజన్ దాస్[27], బిపిన్ చంద్రపాల్[28] సమ్మెకారుల సభలలో ప్రసంగించారు. ఆ తరువాత బట్టల మిల్లులలోను, జనపనార మిల్లులలోను, బొగ్గు గనులలోను జరిగిన సమ్మెలను కూడా ఈ జాతీయ నాయకులు బలపరిచారు, కొన్ని సందర్భాలలో క్రియాశీలకంగా వాటికి తోడ్పడ్డారు కూడా.

అయితే ఈ 'జాతీయ నాయకులు' వాస్తవానికి - అప్పుడప్పుడే బలపడుతున్న భారతీయ పెట్టుబడిదార్ల ప్రతినిధులేనన్న విషయం వాళ్ళ ఆచరణలో బయటపడింది. వాళ్ళు సమ్మెలను బలపరిచింది బ్రిటిష్ యాజమాన్యం గల సంస్థలలో మాత్రమే. భారతీయ బూర్జువా వర్గం యాజమాన్యంలోని సంస్థలలో కార్మికులు సమ్మె చేసినప్పుడు మాత్రం సమర్థించడానికి గాని, సహకరించడానికి గాని వీళ్ళు ముందుకు రాలేదు. అంతేకాకుండా ఈ బూర్జువా వర్గానికి ఆనాటి నుండి ఈనాటి వరకూ భూస్వామ్య వ్యవస్థతో ఉన్న సాంకర్య సంబంధాన్ని నిరూపిస్తూ బాలగంగాధర తిలక్ హిందూమతంలోని కులవ్యవస్థ వృత్తి విభజన మీద ఆధారపడ్డది కాబట్టి అది కార్మిక సంఘాల ఏర్పాటుకు పనికొస్తుందని అన్నాడు.

బొంబాయిలోను, మదరాసులోను కూడా ఈ కాలంలో చాలా సమ్మెలు జరిగాయి. 1905లో మన దేశానికి కరెంటు రావడంతో పరిశ్రమల యజమానులు పనికాలం పెంచి చీకటిపడ్డ తరువాత కూడా పనిచేయించడం మొదలుపెట్టారు. దీనికి నిరసనగా చాలా సమ్మెలు జరిగాయి.

1908లో తిలక్‌ను 'దేశద్రోహ' నేరానికి విచారించినప్పుడు భారత కార్మిక వర్గపు మొదటి రాజకీయ సమ్మె జరిగింది. ఆ బూటకపు విచారణకు నిరసనగా 20,000 మంది నూలుమిల్లుల కార్మికులు తాము సమ్మెచేయడమే కాక, బొంబాయి నగర పారిశ్రామిక ప్రాంతాలన్నీ తిరిగి ఇతర కార్మికులచేత కూడా సమ్మె చేయించారు. తరువాతి రోజు ఓడరేవు కార్మికులు, ఇతర చిన్న చిన్న సంస్థల కార్మికులు కూడా వారితో చేరడంతో సమ్మెకారుల సంఖ్య 65,000కు పెరిగింది. జూలై 22న తిలక్‌పైన విచారణ ముగిసి శిక్షవేశారు. ఆ రోజున బొంబాయి నగర కార్మికులు, చిన్న చిన్న వ్యాపారస్తులు సంపూర్ణంగా సమ్మె నిర్వహించారు. ఆ తరువాతి రోజు నుండి పోలీసు లాఠీలను, తుపాకీలను ఎదుర్కొని పోరాడారు. మొత్తం బొంబాయి నగర ప్రజానీకంలో కేవలం పారిశ్రామిక పెట్టుబడిదార్లు మాత్రమే ఈ మహత్తరమయిన సమ్మెకు సహకరించలేదు. తిలక్‌పై విధించిన ఆరు సంవత్సరాల శిక్షను నిరసిస్తూ ఆరు రోజులపాటు సార్వత్రిక సమ్మె జరపాలని నిర్ణయించుకున్న బొంబాయి నగర కార్మికులు తమ నిర్ణయాన్ని నిలబెట్టుకున్నారు గాని ఆ క్రమంలో 200 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ మహత్తరమయిన సామ్రాజ్యవాద వ్యతిరేక చర్యను బూర్జువా చరిత్రకారులు గుర్తించదల్చుకోలేదు గాని, లెనిన్ ఆనాడే గుర్తించి "ఇక బ్రిటిష్ రాజ్యానికి పతనం తప్పదు" అన్నాడు.

## III

## సంఘటిత పోరాటాలు

1914 నాటికి భారత కార్మికవర్గం తన బాల్యాన్ని విడిచిపెట్టిందని చెప్ప వచ్చు. ఆనాటికి దేశంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా బలపడింది. 1900 నాటికి ఉన్న కంపెనీలు 1360, ఆ కంపెనీల పెట్టుబడి 36 కోట్లు కాగా, 1914 నాటికి కంపెనీల సంఖ్య 2553 కు, వాటి పెట్టుబడి 72 కోట్లకు

పెరిగింది. 1914లో ప్రారంభమయిన మొదటి ప్రపంచయుద్ధం ఈ పరిణామాన్ని మరింత త్వరిత పరిచింది. యుద్ధకాలంలో సహజంగా పెరిగే డిమాండును ఆధారం చేసుకుని, యుద్ధం చివరికి అంటే 1919 నాటికి దేశంలోని కంపెనీల సంఖ్య 2789 కి, వాటి పెట్టుబడి 106 కోట్లకు పెరిగాయి. దీనితోపాటు పారిశ్రామిక కార్మికుల సంఖ్య కూడా పెరిగింది. 1919 నాటికి వారి సంఖ్య 13.6 లక్షలు. అందులో 66 శాతం రైల్వే, వస్త్ర, జనపనార పరిశ్రమలలో ఉన్నారు. వీళ్ళు కాకుండా బొగ్గుగనులలో మరొక 2 లక్షల మంది ఉన్నారంటే, మొదటి ప్రపంచ యుద్ధం చివరకు కూడా 1850లలో ఏ పరిశ్రమలయితే ముఖ్యంగా ఉండేవో అవే ముఖ్యంగా ఉంటూ వచ్చాయని తెలుస్తుంది. వలస పాలనలో సహజంగా జరిగే ఆర్థిక వక్రీకరణకిది ఒక సంకేతం.

ఒక పక్క కార్మికుల సంఖ్య పెరుగుతూండగా వేరొకపక్క బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధ ప్రయోజనాల దృష్ట్యా పెట్టుబడిదార్ల మీద ఏ నిర్బంధాలూ పెట్టకుండా అపరిమితంగా దోపిడీ చేసుకోనివ్వడం వల్ల, యుద్ధకాలపు ధరల పెరుగుదల వల్ల కార్మిక ఉద్యమం ఒక కొత్తమలుపు తిరిగి ముందెన్నడూ లేనంత సంఘటిత రూపాన్ని తీసుకుంది. ఆ సమయంలో పెట్టుబడిదార్ల లాభాలు విపరీతంగా పెరిగాయి. వస్త్ర పరిశ్రమలో 260 శాతం వరకు, జనపనార మిల్లులలో 200 శాతం వరకు లాభాలు వచ్చాయి. కార్మికుల వేతనాలను ధరల పెరుగుదల తినేస్తోందని బ్రిటిష్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ సహితం ఒప్పుకోక తప్పలేదు. ఉదాహరణకు మదరాసులో ధరలు 1914 నుండి 1919 నాటికి 75 శాతం పెరగగా, వస్త్ర పరిశ్రమ కార్మికుల వేతనాలు 42 శాతం మాత్రమే పెరిగాయి. కలకత్తాలో 1914 నుండి 1920 నాటికి ధరల పెరుగుదల 100 శాతమయితే జనపనార కార్మికుల వేతనాలు పెరిగింది 40 శాతం మాత్రమే.

ఈ పరిస్థితులు అపూర్వమయిన సంఘటిత పోరాటాలకు దారితీశాయి. మదరాసులో ఒక్క 1920లోనే 62 సమ్మెలు జరిగాయి. బెంగాల్‌లోనయితే ఆ సంవత్సరం చివరి ఆరు నెలలలో 110 సమ్మెలు జరిగాయి. ఎప్పటిలాగే రైల్వే కార్మికులు వస్త్ర పరిశ్రమ కార్మికులతోను, జనపనార మిల్లుల కార్మికులతోను సమంగా పోరాటాలు చేశారు. రచయిత మాటలలో "సమ్మె పారిశ్రామిక జీవితంలో

భాగమయిపోయింది.” అన్నిటికంటే చెప్పుకోదగ్గ సమ్మె బొంబాయిలో 2 లక్షల మంది కార్మికులు 1929 జనవరి 2 నుండి ఫిబ్రవరి 3 వరకు నెలరోజుల పాటు నడిపిన సమ్మె.

ఈ పోరాటాల నుండి కార్మిక సంఘాలు పుట్టాయి. మదరాసులో బి.పి. వాడియా నాయకత్వాన మదరాసు కార్మిక సంఘం (Madras Labour Union)[29] ఏర్పాటయింది. గతంలో కార్మికుల పక్షం వహించిన ఉదార హృదయుల్లాగే వాడియా కూడా సంస్కరణవాది. పోరాటాల కంటే నివేదికల మీద ఎక్కువ నమ్మకం గలవాడు. యుద్ధకాలంలో సమ్మెలు చేయగూడదని, అది 'మన' సైనికులకు ఇబ్బంది కలిగిస్తుందని, 'మన' రాజుకు ద్రోహమని భావించిన సామ్రాజ్యవాదపు నమ్మినబంటు.

అయితే ప్రభావరీత్యా వాడియా కంటే ముఖ్యమయిన వ్యక్తి గాంధీ. ఈయన 1918లో అహమ్మదాబాద్‌లో అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం[30] (Ahmedabad Textile Labour Association) అనే సంస్థను స్థాపించాడు. గాంధీ దృక్పథంలో– పెట్టుబడిదారుడు, కార్మికుడు తల్లీ బిడ్డలవంటివారు. వాళ్ళ మధ్య ఏ తేడాలు వచ్చినా సంప్రదింపులను ఆశ్రయించాలేగాని సమ్మెలను కాదు. చివరికి ఈ 'తల్లీ–బిడ్డల' సంబంధం ఎంతవరకు పోయిందంటే అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం కార్య నిర్వాహక పదవులకు పోటీచేసే హక్కు కంపెనీ యజమాన్లకు ఇవ్వడమే కాకుండా, మునిసిపల్ ఎన్నికలలో ఒక కంపెనీ యజమానిని కార్మికుల అభ్యర్థిగా ఎన్నుకున్నారు కూడా! రచయిత మాటల్లో చెప్పాలంటే – “ఈ ప్రశస్తమయిన నమూనాను దేశవ్యాప్తంగా నెలకొల్పాలని గాంధీ ఆశించాడు!” అహమ్మదాబాద్ కార్మికులు ఈ తిరోగామి దృక్పథం ప్రభావం నుండి చాలాకాలం పాటు కోలుకోలేదు.

అయితే గాంధీకి ఇష్టమున్నా లేకపోయినా కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఏర్పడి పోరాటాలు సాగించాయి. 1920 నాటికి దేశంలో 120 యూనియన్‌లున్నాయని, వాటి సభ్యత్వ సంఖ్య 2.5 లక్షలనీ అంచనా. అదే సంవత్సరం అఖిల భారత కార్మిక సంఘాల సభ (ఎ.ఐ.టి.యు.సి.)[31] ఏర్పడింది. దీని నాయకత్వం బూర్జువా జాతీయ నాయకుల చేతిలోనే కాదు, సాక్షాత్తు పెట్టుబడిదార్ల చేతిలోనే

ఉందని చెప్పవచ్చు. ప్రారంభ సమావేశంలో వేదికను నిజంగానే అలంక రించినవారు – రచయిత మాటలలో "కొందరు కోటీశ్వరులు, కొందరు కాంగ్రెస్ నాయకులు, మరికొందరు కార్మిక ఉద్యమంతో ఏ సంబంధం లేనివారు". లాల్‌జీ నారాయణ్‌జీ[32], లల్లూభాయి శ్యామల్‌దాస్[33], లల్లూభాయి జవేరీ[34] మొదలయిన ఫక్తు గుజరాతీసేఠ్ నామధేయాలు గల వాళ్ళంతా సమావేశానికి పెద్దలుగా హాజరయ్యారు. మియా మహమ్మద్ హాజీ జాన్ మహమ్మద్ ఛోటానీ[35] అనే ఒక సింధీ బడా కలప వ్యాపారి ఎ.ఐ.టి.యు.సి.కి 500 రూపాయల విరాళం ఇచ్చాడట కూడా.

అయినా గాంధీ మాత్రం ఆ సమావేశానికి హాజరు కావడానికి గాని, తన చేతిలో వున్న అహమ్మదాబాద్ వస్త్ర కార్మికుల సంఘాన్ని ఎ.ఐ.టి.యు.సి.లో విలీనం చేయడానికి గాని సమ్మతించలేదు. చాలా ముందుచూపు గల గాంధీకి కార్మికులు బూర్జువా నాయకత్వంలో సహితం సంఘటితం కావడం ఇష్టంలేదు. బూర్జువా ప్రభావం, సంస్కరణవాదం ఎంత బలంగా ఉన్నా, సంస్థ నాయకులయిన లజపతిరాయ్, బాప్టిస్టా[36], చమన్‌లాల్‌లు అస్పష్టంగానయినా సరే కార్మికవర్గ దృక్పథాన్ని, పెట్టుబడిదారీ వ్యతిరేకతను, పోరాట పక్షపాతాన్ని వెలిబుచ్చకపోలేదు. అయితే అది తన 'తల్లీ–బిడ్డల' సిద్ధాంతానికి వ్యతిరేకం కావడంతో అటువంటి సంస్థతో సంపర్కం పెట్టుకోవడం ఆ 'మహాత్ముడికి' ఇష్టం లేకపోయింది.

1921లో జరిగిన రెండవ ఎ.ఐ.టి.యు.సి. సమావేశం నాటికి సేఠ్‌జీల ప్రభావం కొంత తగ్గి గాంధీవాదుల ప్రాపకం సంస్థమీద పెరిగింది. ఆహ్వాన కమిటీకి ఒక బొగ్గుగని యజమాని అధ్యక్షత వహించినమాట వాస్తవమేగాని, సభలో ఎక్కువగా కనపడ్డవి గాంధీ టోపీలు, ఖద్దరు లాల్చీలే. అప్పటికి కాంగ్రెస్ పార్టీ 'స్వరాజ్యం' తన ఆశయంగా ప్రకటించుకున్నది కాబట్టి, ఎ.ఐ.టి.యు.సి. కూడా ఆ ఆశయాన్ని అంగీకరించింది. దాన్ని వివరిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన చమన్‌లాల్, "స్వరాజ్యం కార్లలో తిరిగేవాళ్ళకు, గవర్నర్ బంగళాల్లో విందులకు హాజరయ్యేవాళ్ళకు కాదు, తమ శ్రమతో ధనికులకు సంపదను సృష్టించే లక్షలాది మనుష్యులకు" అన్నాడు. అయినా గాంధీ మాత్రం హాజరూ కాలేదు, సందేశమూ పంపలేదు.

1930లలో పెట్టుబడిదారీ దేశాలలో సంభవించిన ఆర్థిక మాంద్యపు ఛాయలు వలసదేశాల మీద అంతకుముందే పడ్డాయి. భారతదేశంలో ఆర్థిక మాంద్యం 1922లోనే మొదలయింది. ఆ సంవత్సరం నుండి పారిశ్రామిక కార్మికుల సంఖ్య చాలా నెమ్మదిగా పెరగడం గాని, లేదా క్షీణించడం గాని జరిగింది. 1922 నుండి 1927 వరకు దేశ జనాభాలో పెరుగుదల 2 కోట్లు కాగా, అతి ముఖ్య పారిశ్రామిక రంగాలయిన వస్త్ర పరిశ్రమ, జనపనార పరిశ్రమ, బొగ్గు గనులలో మొత్తం కార్మికుల సంఖ్యలో పెరుగుదల 7 వేలు మాత్రమే. దీనివల్ల పెరిగిన నిరుద్యోగం ఒక పక్కనుండగా, సంక్షోభ కాలంలో మార్కెట్ కోసం బ్రిటిష్ పెట్టుబడిదార్లు, భారతీయ పెట్టుబడిదార్లు, అప్పుడప్పుడే ఎదుగుతున్న జపానీ పెట్టుబడిదార్లు పరస్పరం ఓడించుకోలేక కార్మికుల మీద పడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ మద్దతుగల బ్రిటిష్ పెట్టుబడిదార్లతో పోటీపడలేని భారతీయ పెట్టుబడిదారులు కార్మికులపై దోపిడీని అమితంగా పెంచారు.

ఇవన్నీ కలిసి మళ్ళీ తీవ్రమయిన పోరాటాలకు దారితీశాయి. 1921–30ల మధ్య కాలంలో సంవత్సరానికి సగటున 185 సమ్మెలు జరిగాయి. ఈ సమ్మెలలో సంవత్సరానికి సగటున 3, 4 లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. జంషెడ్‌పూర్ కార్మికులు కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా సమ్మెచేస్తే, సూరత్ కార్మికులు బోనస్ కోసం సమ్మె చేశారు. చివరికి అహమ్మదాబాద్ కార్మికులు కూడా గాంధీ సిద్ధాంతాలను పక్కకు పెట్టి 53 మిల్లులకు చెందిన 43,000 మంది రెండునెలల పాటు సమ్మె చేశారు. కారణం - వాళ్ళ జీతాలలో 20 శాతం కోతపెట్టాలనే యజమానుల నిర్ణయం. బొంబాయిలో యజమానులు బోనస్ నిలిపివేయగా 1.6 లక్షలమంది రెండు నెలలపాటు సమ్మెచేశారు. ఈ సమ్మెలకు విదేశాలకు చెందిన కార్మిక సంఘాల నుండి, ముఖ్యంగా రష్యా నుండి ఆర్థిక సహాయం లభించింది. అన్ని సమ్మెలలోను కార్మికులు తమ యూనియన్ల ద్వారా సమ్మె నడపడం, కాంగ్రెస్ నాయకులు, ఎ.ఐ.టి.యు.సి. నాయకులు సంప్రదింపుల కోసం ప్రయత్నించడం మొదటినుండి కనబడుతుంది.

1926–29 మధ్య కాలంలో సమ్మెలు, పోరాటాలు మరీ తీవ్రరూపం దాల్చాయి. సామ్రాజ్యవాదం తన దేశంలోని కార్మికుల పట్ల మర్యాదగానే ఉంటూ వలస దేశాలలోని కార్మికులను మాత్రం విపరీతంగా దోచుకున్నదనడానికి

నిదర్శనం 1926 భారత కార్మిక సంఘాల చట్టం. బ్రిటన్‌లో కార్మికుల మీద లేని ఎన్నో ఆంక్షలు ఈ చట్టం ద్వారా భారతదేశ కార్మికులమీద పెట్టబడ్డాయి. కార్మిక సంఘాల చర్యలపై రకరకాల నిబంధనలతోపాటు, అవి తమ నిధులను రాజకీయ ప్రయోజనాలకు వాడకూడదనే ఆంక్షలు విధించబడ్డాయి. దీని ఉద్దేశ్యం కార్మికులను జాతీయోద్యమం నుండి దూరంగా ఉంచడమే. ఈ చట్టంతోపాటు, ఒక రైల్వే కమిటీ 75,000 మంది కార్మికులను పని నుండి తొలగించమని సలహా ఇవ్వడంతో దేశవ్యాప్తంగా అన్ని పరిశ్రమలలోను పోరాటాలు కట్టలు తెంచుకుని వచ్చాయి. ఒక్క 1928 సంవత్సరంలోనే 35 లక్షల పనిదినాలు నష్టమయ్యాయని అంచనా. ఈ సమ్మెలలో చెప్పుకోదగ్గవి ఖరగ్‌పూర్‌లో రైల్వే కార్మికులు చేసిన సమ్మె[37], దాని ననుసరించి దేశవ్యాప్తంగా రైల్వేలలో జరిగిన సమ్మెలు. ఎప్పటిలాగే ఖరగ్‌పూర్ సమ్మె కూడా నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగానే సాగింది. కార్మికుల తెగింపును సహించలేని ఖరగ్‌పూర్ కార్మిక సంఘం అధ్యక్షుడు వి.వి. గిరి[38] బహిరంగసభలోనే వాళ్ళ పోరాట పద్ధతులను ఎదిరించాడు. అయినా కార్మికులు పోరాటం ఆపకపోయేసరికి తన నాయకత్వాన్ని సంరక్షించుకోవడం కోసం దిగిరాక తప్పలేదు.

ఈ కాలంలోనే – అంటే 1928, 1929 లలోనే – బొంబాయిలోని వస్త్ర పరిశ్రమ కార్మికులు రెండుసార్లు సార్వత్రిక సమ్మెలు నిర్వహించారు. కార్మికుల తొలగింపు (retrenchment)కు వ్యతిరేకంగా జరిగిన మొదటి సమ్మె ఫలితంగా కమ్యూనిస్టు నాయకత్వంలో గిర్నీకాంగార్ యూనియన్[39] అనే పోరాటశీలంగల వస్త్రపరిశ్రమ కార్మికుల సంఘం పుట్టింది. ఆరునెలల పాటు నడచిన ఈ సమ్మెలో కార్మికులు 250 లక్షల రూపాయల వేతనాన్ని కోల్పోయారు. 1929లో జరిగిన రెండవ సార్వత్రిక సమ్మె యజమానుల కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా జరిగింది. 32 మిల్లులకు చెందిన లక్షమంది కార్మికులు నెలరోజులపాటు నడిపిన ఈ సమ్మెలో 80 లక్షల పనిదినాల నష్టం జరిగింది. సమ్మె నాయకులైన రణదివె[40], దేశ్‌పాండేలను[41] అరెస్టు చేసినప్పుడు కార్మికులు నిరసన ప్రదర్శన జరపగా వాళ్ళమీద కాల్పులు కూడా జరిగాయి. బెంగాలులో జనపనార కార్మికులు కూడా పనికాలం పొడిగింపుకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె నిర్వహించారు.

# IV

## చీలికలు, పునస్సంఘటన

గాంధీకి మొదటినుండి కూడా ఎ.ఐ.టి.యు.సి. వంటి కేంద్ర కార్మిక సంస్థలంటే ఇష్టంలేదు. అయినా తాను అన్ని విషయాలలలోను అవలంబించిన ఎత్తుగడనే ఈ విషయంలోనూ అవలంబించాడు. ఎ.ఐ.టి.యు.సి.కి తాను దూరంగా వుంటూ తన అనుచరులను మాత్రం సంస్థలో పాల్గొననిచ్చాడు, నాయకత్వం కూడా నిర్వహించనిచ్చాడు. ఆనాటి బూర్జువా రాజకీయ నాయకులు 'సోషలిస్టు' ముసుగును తగిలించుకోవడం ఇంకా అలవర్చుకోలేదు కాబట్టి దీని ఫలితంగా సంస్థకు కేవలం బూర్జువా దృక్పథమే కాదు, ఫక్తు బూర్జువా మార్గ దర్శకత్వం కూడా లభించింది. ఉదాహరణకు, ఢిల్లీలో 1927లో జరిగిన ఏడవ ఎ.ఐ.టి.యు.సి. సభకు హాజరయిన పెద్దలలో సాక్షాత్తూ జి.డి. బిర్లా[42] ఒకడు.

అయితే ఎ.ఐ.టి.యు.సి.లో కమ్యూనిస్టులు, సోషలిస్టులు చాలామంది ఉండబట్టి ఈ పరిస్థితి సంక్షోభానికి దారి తీసింది. సంస్థకు వర్గపోరాట దృక్పథ ముండాలా, సంస్కరణవాద దృక్పథముండాలా అన్నది అసలు వివాదమయితే, చీలికకు దారితీసిన సమీప (తక్షణ) వివాదం అంతర్జాతీయ అనుబంధానికి (affiliation) సంబంధించినది. కాంగ్రెస్‌లోని బూర్జువా నాయకులు ప్రపంచ సంస్కరణవాద కార్మిక సంఘాల కేంద్రమయిన అంతర్జాతీయ కార్మిక సంఘాల సమాఖ్యతో (International Federation of Trade Unions)[43] సంబంధాలు పెట్టుకోవాలని చూస్తే, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లోని సోషలిస్టు భావాలు గలవాళ్ళు మాస్కోకు చెందిన Red International Labour Union[44] (లేక Profintern) తో అనుబంధం కావాలని కోరారు. దేశ స్వాతంత్ర్యానికి సంబంధించి కూడా బూర్జువా నాయకులు 1929 దాకా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తమ లక్ష్యంగా ప్రకటించకపోగా, వామపక్ష శక్తులు మాత్రం స్పష్టమయిన సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథాన్ని ప్రదర్శించాయి. వీళ్ళ ప్రభావం కార్మికులమీదా, ఎ.ఐ.టి.యు.సి.లోనూ పెరిగి పోతుండటం చూసి శివరావు[45] వంటి సంస్కరణవాద కార్మిక నాయకులు "సమ్మె మంత్రం పఠించే వ్యక్తులను సంస్థ నుండి ఏరేయాల్సిన అవసరము"ందని బాహాటంగా అన్నారు. బ్రిటిష్ పాలకులు కూడా భయపడి సమ్మెను దాదాపుగా

చట్ట విరుద్ధం చేసి, వివాద పరిష్కారానికి నిర్బంధ చర్చలను ప్రవేశపెట్టి, రాజకీయ లక్ష్యాలతో గాని, కార్మిక ప్రయోజనాలకోసం గాని దేనికైనా సరే సార్వత్రిక సమ్మెలు చేయడాన్ని నిషేధించే Trade Disputes Act, 1928 ని ప్రవేశపెట్టారు. అక్కడితో ఆగకుండా కొంతమంది ఎ.ఐ.టి.యు.సి.లోని కమ్యూనిస్టులను, ఆనాటి వామపక్ష శక్తుల సంఘటన అయిన కార్మిక కర్షక పార్టీ (Workers and Peasants Party)[46] నాయకులను మీరట్ కుట్రకేసు[47]లో ఇరికించారు.

ఈ నేపథ్యంలో 1929లో జరిగిన నాగపూర్ సభలో ఎ.ఐ.టి.యు.సి.లో మొదటి చీలిక జరిగింది. వి.వి. గిరి, శివరావు, ఎన్.ఎం. జోషి[48], చమన్‌లాల్ మొదలయిన వాళ్ళు ఎ.ఐ.టి.యు.సి. నుండి విడిపోయి Indian Trade Union Federation[49] ఏర్పరచారు. తెగేదాక లాగే ధైర్యం వామపక్ష శక్తులకు ఇచ్చింది బొంబాయి వస్త్ర పరిశ్రమ కార్మికుల గిర్నీకాంగార్ యూనియన్. ఈ సంఘం 1928-29 నాటి సమ్మెవల్ల బలపడి కమ్యూనిస్టులకు బొంబాయి నగర కార్మికులలో చాలా పరపతిని సంపాదించి పెట్టింది.

ఆసక్తికరమైన విషయమేమంటే ఈ చీలిక సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ వామపక్షంలో ఉండడమే కాక, వి.వి. గిరి వంటి వ్యక్తుల ఆరోపణకు తానే వామపక్షం తరఫున వకాల్తా పుచ్చుకొని సమాధానం కూడా చెప్పాడు. ఆయన మాటల్లో "మేము వర్గపోరాటం నేర్పుతున్నామని, వర్గాలమధ్య అంతరాన్ని పెంచుతున్నామని మాపై ఆరోపణ. కాని అంతరాన్ని సృష్టించింది పెట్టుబడిదారీ విధానం, మేము కాదు. మామీద ఆరోపణలు చేయడం గుడ్డితనం, మూర్ఖత్వం. వర్గ విభేదాలను, అసంతృప్తిని సృష్టించేది కమ్యూనిస్టులా లేక తమ పద్ధతుల ద్వారా అత్యధిక భాగం మానవాళిని వేతన బానిసలుగా మార్చుకున్న పెట్టుబడి దారులూ, సామ్రాజ్యవాదులూనా? వర్గ పోరాటాన్ని సృష్టించింది మేము కాదు, పెట్టుబడిదారీ విధానం. పెట్టుబడిదారీ విధానం ఉన్నంత కాలం అది ఉంటుంది. సుఖంగా ఉన్న వాళ్ళకు శాంతి వాక్యాలు పలకడం సులభమేగాని అటువంటి సదాశయాలు మా మీదున్న పీడనను తొలగించవు. మమ్మల్ని దోచుకుని పైకి ఎగబాకి ఇప్పుడు అక్కడి నుండి మీరు ఉపన్యాసాలు దంచుతున్నారు. వర్గపోరాటం గతంలో ఉంది. ఇవ్వాళా ఉంది. మూల కారణాల్ని తొలగిస్తేనే శాంతి లభిస్తుంది."

(స్వేచ్ఛానువాదం). ఈ మాటలలో చాలా గందరగోళం ఉంది గాని వాటిలోని వేడి మాత్రం గమనార్హం. తర్వాతి కాలంలో నెహ్రూ ఎంత చల్లబడ్డాడో ఆలోచిస్తే ఆశ్చర్యం కలగకమానదు. తొలినాటి వేడి తెచ్చి పెట్టుకున్నదేమోనన్న అనుమానం కూడా రాకమానదు.

ఈ చీలిక జరిగింది ఎ.ఐ.టి.యు.సి. పదవ సమావేశంలో. 11వ సమావేశం 1931లో కలకత్తాలో జరిగింది. అప్పుడు రెండవసారి చీలిక జరిగి నెహ్రూ, సుభాస్ చంద్రబోస్ వంటి కాంగ్రెస్‌వాదులు వెళ్ళిపోగా, కమ్యూనిస్టులు మాత్రం All India Red Trade Union Congress (AIRTUC)[50] ని ఏర్పరిచారు. దీని నాయకులు ఎస్.వి. దేశ్‌పాండే, ఎస్.జి. సర్దేశాయి[51], తదితరులు.

అయితే ఇదే సమయంలో, అంటే 1929 తరువాత పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం వచ్చి కార్మికులను తీవ్రమయిన దోపిడీకి గురిచేసింది. అటువంటి సమయంలో కార్మిక సంఘాలు అనైక్యంగా ఉండడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం వల్ల భారతదేశంలో ఫ్యాక్టరీల మూసివేత, కార్మికుల తొలగింపు, జీతాలలో కోతలు మొదలయినాయి. సంక్షోభంలో బ్రిటిష్ పాలకులు సహజంగానే తమ బ్రిటిష్ పెట్టుబడిదార్ల అవసరాలను సంరక్షించడం మొదలుపెట్టారు. Imperial Preference పేరిట ఇనుము, ఉక్కు, వస్త్ర పరిశ్రమలలో బ్రిటిష్ పెట్టుబడిదార్ల పట్ల పక్షపాతం చూపించడం మొదలుపెట్టారు. దీనితో భారతీయ పెట్టుబడిదార్లు గత్యంతరం లేక కార్మికులపై దోపిడీని, పని నుండి తొలగింపును ఎక్కువ చేశారు. 1934 సంవత్సరంలో బొంబాయిలోని బట్టల మిల్లులలో 50 శాతం మూతపడి 61,000 మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. 1921 నుండి మొదలుపెట్టిన వేతనాలకోతల ఫలితంగా మరొక 42 మిల్లులలో వేతనాలు 1926తో పోలిస్తే 1934లో 20 శాతం తక్కువ ఉన్నాయి. బొంబాయి మిల్లు యజమాన్లను ఆదర్శంగా తీసుకుని అహమ్మదాబాద్‌లో 20 శాతం, షోలాపూర్‌లో 12½ శాతం, మదరాసులో 15 శాతం, నాగపూర్‌లో 20 శాతం, అకోలాలో 25 శాతం తగ్గించారు.

బెంగాలులోని జనపనార మిల్లులలోనూ ఇదే పరిస్థితి. 1929–34 మధ్య 83,000 మంది నిరుద్యోగులయ్యారు. ఆ తరువాత రెండు షిఫ్టుల స్థానంలో ఒకే

షిఫ్టు ప్రవేశపెట్టి మరొక 25 శాతం కార్మికులను పనినుండి తొలగించారు. జీతాలు కూడా కోశారు. స్పిన్నర్‌ల నెలసరి వేతనం రూ. 7 నుండి 6కు, వీవర్ల వేతనం రూ. 12 నుండి 9కి పడిపోయాయి. రైల్వేలలోనయితే 1931 నుండి 1932 లోపల (ఒక్క సంవత్సరంలో) 50,000 మందిని పని నుండి తొలగించారు. అలాగే ఇనుము, ఉక్కు కర్మాగారాలలోను, మునిసిపాలిటీలలోను, తపాలా శాఖలోను, ఓడరేవులలోను జీతాలు కోతపెట్టడం, పని నుండి తొలగించడం నిత్యకృత్యాలయినాయి.

ఈ పరిస్థితిలో కార్మికులు తమ మనుగడ కోసం పోరాటాలు చేయక తప్పలేదు. అప్పటికి కేంద్ర కార్మిక సంస్థలు ఒకటి కాక మూడు అయినప్పటికీ, సమ్మె పోరాటాలు మాత్రం ఉధృతంగా సాగాయి. 1931 నుండి 1936 వరకు సంవత్సరానికి సగటున 150 సమ్మెలు జరిగాయి. 1931, 32, 33 సంవత్సరాలలో 20 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. 1934లోనయితే 47 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. పరిస్థితి ఎంత తీవ్రమయిందంటే గాంధీకి ప్రీతిపాత్రమయిన అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం కూడా ఆయనగారి 'తల్లీ - బిడ్డల' సిద్ధాంతానికి వ్యతిరేకంగా 25 శాతం వేతనం తగ్గింపుకు వ్యతిరేకంగా సమ్మె చేయడానికి సిద్ధపడ్డది. గాంధీ భయపడి తన మిత్రులయిన గుజరాతీ పెట్టుబడి దార్లను సంరక్షించడం కోసం చర్చలకు దిగి, 6 శాతం మాత్రం జీతం తగ్గించేటట్టు, కొంతమంది కార్మికులను పని నుండి తొలగించేటట్టు ఒప్పందం చేసుకున్నాడు. పైగా అన్యాయమయిన ఈ ఒప్పందాన్ని కార్మికులు సంతోషంగా స్వీకరిస్తారని తన ఆశ అనీ, కార్మికుల అవసరాలు పెట్టుబడిదార్ల అవసరాలు ముడిపడి ఉన్నట్లు వాళ్ళు గుర్తించాలనీ ఉచిత 'విద్యాబోధన' కూడా చేశాడు.

అయితే కార్మిక సంఘాల అనైక్యత కార్మికుల పోరాటాన్ని దెబ్బతీసింది. ఈ విషయం బొంబాయి కార్మికుల సమ్మెలో స్పష్టంగా బయటపడింది. గిర్నీ కాంగార్ యూనియన్ రెండుగా చీలి, ఒక పక్క కమ్యూనిస్టులు సమ్మె కోసం ఏర్పాట్లు, ప్రచారం చేస్తూండగా, వేరొక పక్క సంస్కరణవాద నాయకులు చర్చల తోను, సంప్రదింపులతోను పోరాటాన్ని ఆపాలని ప్రయత్నం చేయడంతో కార్మికులు తీవ్రంగా దెబ్బతిన్నారు.

ఇది గుర్తించాక కార్మిక నాయకులంతా ఐక్యత కోసం కృషిచేశారు. 1935 నాటికి AIRTUC మళ్ళీ AITUC లో చేరింది. అయితే వి.వి. గిరి, శివరావుల నాయకత్వంలోని ITUF మాత్రం AITUC లో కలవక, రాయిస్టులతోను ఇతరులతోను కలిసి NTUF (National Trade Union Federation) అనే మరొక సంస్థను ఏర్పరచింది. 1936లో AITUC, NUTF ల కార్యక్రమాలను సమన్వయ పరచడానికి ఒక Joint Labour Board ఏర్పడింది. అప్పటికి NTUF తో ఉన్న సంఘాల సంఖ్య 60, సభ్యత్వం 1,47,516; AITUC తో ఉన్నది 71 సంఘాలు, సభ్యత్వం 93,750.

## V

### అధికార మార్పిడి

1947లో భారతదేశంలో జరిగింది అధికారి మార్పిడే అనుకుంటే అది 1935 లోనే ప్రారంభమయింది. ఆనాటికి క్రమంగా తమ చేతుల్లోకి అధికారం రావడం మొదలయిందని గుర్తించిన బూర్జువా వర్గానికి ఇక కార్మికవర్గంతో అవసరం తీరిపోయింది. అవసరం తీరిపోవడమే కాదు, అంతవరకు అధికారం చేజిక్కడానికి ఒక సాధనంగా వున్న కార్మికవర్గం ఇప్పుడు ప్రధాన శత్రువయింది. అందుకే NTUF లోని 'కార్మిక నాయకులు'గాని, పునస్సంఘటితమయిన AITUC లోని నెహ్రూ వంటి నాయకులు గాని కార్మికోద్యమ ఐక్యత పట్ల అంత ఆసక్తి చూపలేదు. కార్మిక ఉద్యమాలపట్ల నయితే అసలే చూపలేదు.

1935 నాటి భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. ఆ చట్టాన్ని ఫైజ్‌పూర్ సమావేశం (1936)లో 'నిర్ద్వంద్వం'గా నిరాకరించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో మాత్రం పాల్గొంది. ఫైజ్‌పూర్ సమావేశానికి అధ్యక్షత వహించిన నెహ్రూ ఎన్నికలలో పాల్గొనడం సామ్రాజ్య వాదంతో సహకరించడానికి కాదు, 1935 చట్టాన్ని వ్యతిరేకించడానికేనన్నాడు. కాబట్టి గెలిచినా కూడా మంత్రి వర్గాలు ఏర్పరచడం, పరిపాలన కొనసాగించడం కూడదన్నాడు. అయితే ఎన్నికలలో గెలిచిన తరువాత మాత్రం కాంగ్రెస్ పార్టీ నెహ్రూ అభీష్టానికి వ్యతిరేకంగా పరిపాలనకు ఒడిగట్టింది. అదే సమయంలో,

రాబోయే రెండవ ప్రపంచ యుద్ధానికి సన్నద్ధమయ్యే క్రమంలో ప్రపంచ పెట్టుబడి దారీ విధానం మళ్ళీ బలం పుంజుకుంది. దానితో కార్మికులు కూడా, 1930ల మొదటి భాగంలో కోల్పోయిన దానిని తిరిగి పొందటానికి ప్రపంచ వ్యాప్తంగా సమ్మెలు ప్రారంభించారు. అందులో భాగంగా భారత కార్మిక వర్గం కూడా పోరాటాలు చేపట్టింది. 1937లో 379 సమ్మెలు జరిగాయి, 89 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1938లో 399 సమ్మెలు జరిగాయి, 90 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1939లో 406 సమ్మెలు జరిగాయి, 50 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. వాటన్నింటిలో చెప్పుకోదగ్గది బెంగాల్ జనపనార మిల్లు కార్మికుల సార్వత్రిక సమ్మె. 1937 ఫిబ్రవరి నుండి మే వరకు జరిగిన ఈ 74 రోజుల సమ్మెలో 2.25 లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. అయితే ఎప్పటిలాగే వస్త్ర పరిశ్రమకు, జనపనార పరిశ్రమకు, రైల్వేలకు పరిమితమై పోకుండా ఈసారి సమ్మెలు అగ్గిపెట్టెలు, బీడీలు, తదితర చిన్న పరిశ్రమలకు, రిక్షా, జట్కా కార్మికులకు కూడా వ్యాపించాయి.

అప్పుడప్పుడే కొన్ని రాష్ట్రాలలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్, ముస్లింలీగ్ పార్టీలు తమకు ఇక కార్మికులతో అవసరం లేదని చూపిస్తూ ఈ సమ్మెలను, పోరాటాలను బ్రిటిష్ వాళ్ళతో సమంగా అణచివేశాయి. కాన్పూర్‌లో 46,000 మంది కార్మికులు సమ్మెకు ఉద్యుక్తం కాగా, ఒక పక్క కాంగ్రెస్ కార్మిక నాయకుడు హరిహరనాథశాస్త్రి[52] వాళ్ళకు సమ్మె చేయవద్దని సలహా ఇస్తే, వేరొక పక్క ముఖ్యమంత్రి గోవింద వల్లభపంత్[53] సెక్షన్ 144 ప్రకటించి మీటింగులను, సమ్మె లను నిషేధించాడు.

అంతేకాదు. బ్రిటిష్ వారి అడుగుజాడల్లో నడుస్తూ బొంబాయి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 1939లో ఒక పారిశ్రామిక వివాదాల చట్టాన్ని (Bombay Industrial Disputes Act, 1939) రూపొందించింది. ఈ చట్టం దాదాపుగా సమ్మెలను అసాధ్యం చేసి, చర్చలనే ఏకైక చట్టబద్ధమయిన పరిష్కార మార్గంగా చేసింది. అహమ్మదాబాద్‌లో గాంధీ ఏ పద్ధతులనైతే 1919లో ప్రవేశపెట్టాడో ఆ తిరోగామి పద్ధతులనే ఈ బిల్లు చట్టబద్ధం చేసింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు నిరసన ప్రదర్శనలు జరిపినప్పుడు పోలీసు కాల్పులలో ఇద్దరు చనిపోయారు.

ఒక పక్క ఇది జరుగుతుండగా వేరొకపక్క 1940లో ఎన్.టి.యు.ఎఫ్. మళ్ళీ ఎ.ఐ.టి.యు.సి.లో కలవడంతో కార్మిక సంఘాల ఐక్యత పునరుద్ధరించ బడింది. ఈ ఐక్యత తాత్కాలికమే అయినా, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సమ్మెల నిషేధం వల్ల, 'అత్యవసర' రంగాలలో పని గంటల పొడిగింపు వల్ల, ధరల పెరుగుదల వల్ల కార్మికులకు కలిగిన కష్టాలకు వ్యతిరేకంగా పోరాడటానికి అది పనికి వచ్చింది. ఈ క్రమంలో ఎ.ఐ.టి.యు.సి. ఒక సంస్థగా కూడా పెరిగి యుద్ధం ముగిసేనాటికి ఏడు లక్షల సభ్యత్వ సంఖ్యకు చేరుకుంది.

అయితే 1947 దగ్గర పడేకొద్దీ కాంగ్రెస్ పార్టీకి కార్మికులపట్ల అసహనం పెరిగింది. 1946లో బొంబాయి నగరంలోని నౌకా సిబ్బంది తమ చిరకాల కోర్కెల పరిష్కారం కోసం ఉద్యమించినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం తీవ్రమయిన చర్యలు తీసుకుంటానని బెదిరించింది. నౌకా సిబ్బంది నగర ప్రజానీకానికి తమతో సహకరించి బంద్ నిర్వహించమని పిలుపునివ్వగా కాంగ్రెస్ పార్టీ తరఫున వల్లభాయి పటేల్[54] సహకరించలేదు. పార్టీ అధ్యక్షుడు ఆజాద్[55] అయితే "ఇది సమ్మెలకు, బంద్‌లకు సమయం కాదు" అన్నాడు. అంటే అర్థం, బూర్జువావర్గం అధికారంలోకి రాబోతున్న తరుణంలో కార్మికులు సమ్మెలుచేస్తే సహించమని. అయినా నగర ప్రజలు, ముఖ్యంగా శ్రామిక జనం బంద్ నిర్వహించి, పోలీసుల కాల్పుల నెదుర్కొని 250 మంది ప్రాణాలర్పించారు.

ఈ విద్రోహానికి పరాకాష్ఠగా 1947 మే నెలలో కాంగ్రెస్ పార్టీ పెద్దలంతా కలిసి ఎ.ఐ.టి.యు.సి. నుండి కాంగ్రెస్ వాదులంతా బయటకు వచ్చేయాలని, మరొక సంస్థను ఏర్పరచాలని నిర్ణయించుకున్నారు. ఇట్లా ఏర్పడిందే Indian National Trade Union Congress (INTUC). ఈ సారి నెహ్రూ వర్గాల గురించి, వర్గపోరాటపు అనివార్యత గురించి ఉపన్యాసాలు ఇవ్వలేదు కాని ఐ.ఎన్.టి.యు.సి.ని ఏర్పరచిన సమావేశంలో స్వయంగా పాల్గొన్నాడు. నెహ్రూలాగా అభ్యుదయ పోజులు కొట్టడం తెలీని ఫక్తు రియాక్షనరీ వల్లభాయి పటేల్, "ఈ పని ఎన్నడో చేసి ఉండాల్సింది" అన్నాడు. దీంతో భారత బూర్జువా వర్గం తన చేతికి అధికారం వచ్చిందని, ఇక కార్మిక వర్గంతో శత్రుత్వమే తప్ప స్వల్పకాలిక మిత్రత్వం కూడా లేదని ప్రపంచానికి చాటి చెప్పింది.

1. బెంగాల్ బొగ్గు కంపెనీ : బ్రిటిష్ ఇండియాలో ఏర్పడ్డ తొలి జాయింట్ స్టాక్ బొగ్గు కంపెనీ ఇది. అంతకుముందు నుంచి రాణిగంజ్ బొగ్గు క్షేత్రాల్లో బొగ్గు తవ్వితీస్తున్న కార్ & టాగోర్ కంపెనీ, కొత్తగా వచ్చిన గిల్మోర్ హాంబ్రే కంపెనీతో కలిసి 1843లో బెంగాల్ బొగ్గు కంపెనీగా ఏర్పడింది. వందేళ్ళకు పైగా బొగ్గు తవ్వకాలు ప్రధానంగా ఈ కంపెనీ ఆధ్వర్యంలోనే జరిగాయి.
2. ఝరియా : నేటి జార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్ జిల్లాలో ఉంది ఈ బొగ్గు క్షేత్రం. దామోదర్ నదీలోయలో 110 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో ఉన్న ఈ క్షేత్రం ప్రధానంగా బిటుమినస్ బొగ్గును ఉత్పత్తి చేస్తుంది.
3. మొదటి జనపనార మిల్లు : శ్రీలంకకు చెందిన కాఫీ తోటల యజమాని జార్జ్ ఆక్‌లాండ్ హుగ్లీ నది ఒడ్డున నెలకొల్పిన మిల్లు. అప్పటి దాని ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 8 టన్నులు. ఈ మిల్లు పేరు వెల్లింగ్టన్ జూట్ మిల్స్.
4. మొదటి తేయాకు తోట : ఇంగ్లీషువాళ్ళు 1823లో మొదటిసారిగా అస్సాంలో తేయాకు మొక్కలు ఉండడాన్ని గమనించారు. అనేక పరిశీలనలు, అధ్యయనాల తర్వాత రూ. 5 లక్షల పెట్టుబడితో ఇంగ్లండ్‌లో అస్సాం తేయాకు కంపెనీని నెలకొల్పారు. ఇప్పటికీ పని చేస్తున్న ఈ కంపెనీ ప్రధాన కార్యాలయం అస్సాంలోని నజీరాలో ఉంది.
5. దావర్ (1814–1873) : పూర్తి పేరు కొవాస్జీ నానాభాయి దావర్. ఇంగ్లీషు వాళ్ళతో కలిసి వ్యాపారాలు చేస్తూ 1854లో సొంతంగా 'ద బాంబే స్పిన్నింగ్ మిల్' నెలకొల్పారు. ఇదే తొలి భారతీయ కాటన్ మిల్లు. ఈ మిల్లులో పలువురు బ్రిటిష్ ఇంజనీర్లకు ఉద్యోగాలిచ్చారు. ఆయన స్ఫూర్తితోనే వాడియా, టాటా వంటివారు కాటన్ మిల్లులు పెట్టి బొంబాయిని జవుళి పరిశ్రమ కేంద్రంగా మార్చారు.
6. ఎం.ఎన్. రాయ్ (1887–1954) : అసలు పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య అయితే మానబేంద్రనాథ్ రాయ్‌గా మార్చుకున్నారు. ఇండియా, మెక్సికో దేశాల కమ్యూనిస్టు పార్టీల వ్యవస్థాపకులు. 1940 తర్వాత రాడికల్ డెమొక్రటిక్ పార్టీలో క్రియాశీలంగా ఉన్నారు. రాడికల్ హ్యూమనిజం సిద్ధాంతకర్త.
7. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ : అంతర్జాతీయంగా బూర్జువా శక్తుల్ని ఓడించడమే కాక, రాజ్యాన్ని (State) పూర్తిగా రద్దు చేయాలని, ఈ లోపల ప్రపంచమంతా సోవియట్ రిపబ్లికన్‌లను నెలకొల్పాలని దీని లక్ష్యం. 1919–35 మధ్య ఏడు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సమావేశాలు జరిగాయి. స్టాలిన్ 1943లో దీన్ని రద్దుచేశారు.
8. ఒక రచయిత : ఇతని పేరు సనత్ కుమార్ బోస్. ఆయన రాసిన లేబర్ కండిషన్స్ (1850–1914) అనే వ్యాసంలో ఈ విషయాలున్నాయి.
9. వాడియా : ఆర్.ఎఫ్. వాడియా అని తప్ప ఇతర వివరాలేమీ తెలియలేదు. 1885 బాంబే ఫ్యాక్టరీ లేబర్ కమిషన్ ముందు ఆయన ఇచ్చిన ఈ సాక్ష్యం అనేక పరిశోధనలలో ఉటంకించబడింది.
10. చమన్‌లాల్ (1892–1973) : పారిస్, ఆక్స్‌ఫర్డ్‌లలో చదువుకున్న విద్యావంతుడు. ఎ.ఐ.టి.యు.సి. వ్యవస్థాపక కార్యదర్శి. 18 ఏళ్ళు శాసనసభ్యునిగా, 1945–48

మధ్య రాజ్యాంగ పరిషత్ సభ్యునిగా, ఆ తర్వాత రాయబారిగా, రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు. 'కూలీ – ద స్టోరీ ఆఫ్ లేబర్ అండ్ కాపిటల్ ఇన్ ఇండియా' పేరుతో ఒక పుస్తకం (రెండు భాగాలు) రాశారు.

11. సోరాబ్జీ షాపుర్జీ బెంగాలీ (1831–1893) : స్త్రీల హక్కుల కోసం, కార్మిక సంక్షేమం కోసం కృషి చేశారు. నిజానికి (ఇందులో ప్రస్తావించినట్టుగా) చిన్న పిల్లలను పనిలోకి తీసుకోవడాన్ని ఆయన వ్యతిరేకించలేదు. వారి పనిగంటలను క్రమబద్ధీకరించమని మాత్రమే కోరుతూ 1878లో ఒక బిల్లు తయారుచేసి బొంబాయి ప్రభుత్వానికి సమర్పించారు. తొలి క్రికెట్ చరిత్రకారుడు కూడా.

12. సోంప్రకాశ్ : ఈశ్వర చంద్ర విద్యాసాగర్ 1858లో కలకత్తాలో ప్రారంభించిన వార పత్రిక ఇది. దీని సంపాదకుడు, ప్రచురణకర్త ద్వారకానాథ్ విద్యాభూషణ్. ఇందులో నీలి మందు తోటల యజమానులను, భూస్వాములను తీవ్రంగా విమర్శించే వార్తలు, వ్యాసాలు వచ్చేవి. 1878లో లార్డ్ లిట్టన్ తీసుకొచ్చిన 'వర్నాక్యులర్ ప్రెస్ యాక్ట్'కు నిరసనగా పత్రికను మూసేసారు. అయితే ఆ చట్టాన్ని ఉపసంహరించుకున్న తర్వాత 1888లో విద్యాభూషణ్ దాన్ని తిరిగి ప్రారంభించారు.

13. బొంబాయి గెజెట్ : బొంబాయి నుంచి వచ్చిన తొలి ఆంగ్ల దినపత్రికలలో ఒకటి. 1789లో బొంబాయి హెరాల్డ్‌గా వచ్చి 1791లో బొంబాయి గెజెట్‌గా పేరు మార్చుకుని వందేళ్ళకు పైగా నడిచింది.

14. ఢాకా ప్రకాశ్ : ఢాకా నుండి వచ్చిన తొలి బెంగాలీ దినపత్రిక. 1861లో మొదలయినప్పుడు బ్రహ్మ సమాజ పత్రికగా ఉన్నా యాజమాన్యం మారాక 1862 నుంచి తేయాకు తోటల కూలీల గురించి విస్తృతంగా రాసేది.

15. అమృత బజార్ పత్రిక : దీన్ని శిశిర్‌కుమార్ ఘోష్ 1868లో వారపత్రికగా ప్రారంభించారు. రైతులు, రైతు కూలీల సమస్యల గురించి ఎక్కువగా రాసేది. లిట్టన్ విధించిన ఆంక్షల నుండి తప్పించుకునేందుకు ఇంగ్లీషు పత్రికగా మారింది. 1891లో దినపత్రికగా మారి 1990 దాకా కొనసాగింది.

16. కరీంగంజ్ సంఘటన : అస్సాంలోని ఒక జిల్లా కేంద్రం కరీంగంజ్. తేయాకు తోటల కూలీలకు రైలు టిక్కెట్లు ఇప్పించిన కలకత్తా నగర మేయరు పేరు ఎం. సేన్‌గుప్తా. ఆ తర్వాత కూడా బ్రిటిష్‌వాళ్ళు ఆ కూలీలను అనేక ఇక్కట్లపాలు చేశారు. వారిలో చాలామంది ఆకలితో, కలరాతో చనిపోయారు. గూర్ఖా సైనికులు అమానుషంగా ప్రవర్తించిన ఘటన 1921 మే 20 అర్ధరాత్రి సమయంలో చాంద్‌పూర్ రైల్వేస్టేషన్‌లో జరిగింది.

17. బ్రహ్మసమాజం & వర్కింగ్‌మెన్స్ మిషన్ : రాజా రామ్మోహన్‌రాయ్ 1828లో ఏర్పాటు చేసిన 'బ్రహ్మ సభ'నే 1843లో దేవేంద్రనాథ్ ఠాగూర్ బ్రహ్మ సమాజంగా మార్చారు. దేవుడొక్కడేనని, ఆయన నిరాకారుడని వారి సిద్ధాంతం. దీన్ని కార్మికులకు , ఇతర బడుగు వర్గాలవారికి బోధించడానికి, చదువు నేర్పడానికి 1878లో కలకత్తాలో ప్రత్యేకంగా 'వర్కింగ్ మెన్స్ మిషన్' అని ఒకటి పెట్టారు.

18. శశిపాద బెనర్జీ (1840–1924), బారానగర్ సంస్థ : శశిపాద బెనర్జీ కూడా బ్రహ్మ సమాజం సభ్యుడే. స్త్రీల, కార్మికుల హక్కుల కోసం రకరకాల సంస్థలను నెలకొల్పారు. వాటిలో బాలికా పాఠశాలలు, వితంతు శరణాలయాలు, వర్కింగ్స్‌మెన్స్ క్లబ్, శ్రమజీవి సమితి మొదలైనవెన్నో ఉన్నాయి. బారానగర్ సంస్థ కూడా అలాంటిదే. పారిశ్రామిక కార్మికులకు ప్రాథమిక విద్య నేర్పడానికి 1880లో కలకత్తాకు దగ్గర్లోని బారానగర్‌లో ఏర్పాటుచేసిన సంస్థ అది.
19. లోఖండే (1848–1897), మిల్ హాండ్స్ అసోసియేషన్ : లోఖండే భారత కార్మికోద్యమానికి పితామహుడి వంటివాడు. బొంబాయి జవుళి మిల్లులో స్టోర్ కీపర్‌గా పనిచేసిన అనుభవంతో కార్మికుల పని పరిస్థితులను మెరుగుపరచడానికి ఎంతగానో కృషిచేశారు. ఫూలే ప్రసంగాలతో ప్రభావితుడై 1890లో బాంబే మిల్ హాండ్స్ అసోసియేషన్ నెలకొల్పి దాని అధ్యక్షుడుగా పనిచేశారు. 'దీనబంధు' పత్రికకు 17 ఏళ్ళ పాటు ఎడిటర్‌గా ఉన్నారు. 1897లో ప్లేగ్ వ్యాధి సోకి మరణించారు.
20. 1862 సమ్మె : ఎనిమిది గంటల పనిదినం కోసం చికాగో కార్మికులు చేసిన సమ్మె (1886) కంటే 24 సంవత్సరాల ముందుగానే బొంబాయిలో రైల్వే కార్మికులు అవే డిమాండ్లతో చేసిన సమ్మె ఇది. అప్పటికి భారతదేశానికి రైళ్ళు వచ్చి 8, 9 ఏళ్ళే అయిందని (1853) గుర్తు పెట్టుకుంటే ఈ సమ్మె ఎంత చరిత్రాత్మకమైనదో అర్థమవుతుంది.
21. బడ్జి బడ్జి సమ్మె : కలకత్తాకు దగ్గర్లోని చిన్నపట్టణం బడ్జి బడ్జి. ఇక్కడి జనపనార మిల్లులో 1895 జూన్ 25 నాడు సమ్మె మొదలైంది. సూపర్‌వైజర్లను తీసేయడానికి యజమానులు ఒప్పుకోకపోవడంతో దాదాపు 7000 మంది కార్మికులు యజమానుల బంగళాపై రాళ్ళు రువ్వి అద్దాలు పగలగొట్టారు. కాల్పులు, అరెస్టులు కూడా జరిగాయి.
22. సురేంద్రనాథ్ బెనర్జీ (1848–1925) : రెండుసార్లు కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్నారు. అయితే గాంధీ ప్రారంభించిన శాసనోల్లంఘన వంటి ఆందోళనా పద్ధతులకు వ్యతిరేకి.
23. బాలగంగాధర తిలక్ (1856–1920) : స్వాతంత్ర్య పోరాట నాయకుడు. కులమతాల విషయంలో సనాతన భావాలున్నప్పటికీ స్వాతంత్ర్య పోరాటం, కార్మికోద్యమం విషయాలలో ఆ నాటికి 'రాడికల్' భావాలుగల నాయకుడు. ఎఐటియుసి స్థాపనకు రంగం సిద్ధంచేసిన ఘనత తిలక్‌దే.
24. లాలా లజపతిరాయ్ (1865–1928) : స్వాతంత్ర్య పోరాట నాయకుడు. ఎఐటియుసి తొలి అధ్యక్షుడు. పంజాబ్ కేసరి అని పేరు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నప్పుడు పోలీసులు కొట్టిన దెబ్బలకు చనిపోయారు.
25. బెంగాల్ ప్రెస్ వర్కర్స్ యూనియన్ : ఇది 1905 అక్టోబర్ 21న ఏర్పడింది. కలకత్తాలోని ప్రభుత్వ ముద్రణాలయంలో ఆ సంవత్సరం సెప్టెంబర్ 27న మొదలైన సమ్మెలో వారం తర్వాత బెంగాల్ సెక్రటేరియట్ ప్రెస్ ఉద్యోగులు కూడా చేరారు. నెలరోజులు సాగిన ఈ సమ్మె సందర్భంగా ఇరు సంస్థల ఉద్యోగులూ కలిసి కొత్తగా ఈ పేరుతో యూనియన్ ఏర్పరచుకుని తమ డిమాండ్లను సాధించుకున్నారు.

26. తూర్పు ఇండియా రైల్వే కార్మికుల సంఘం : ఈ సంఘం ఏర్పాటు వెనక కూడా సుదీర్ఘకాలం సాగిన ఒక సమ్మె ఉంది. తూర్పు ఇండియా రైల్వేకు చెందిన బెంగాల్ విభాగంలో జరిగిన ఆ సమ్మెలో భారతీయ కార్మికులందరూ పాల్గొన్నారు. జాతీయోద్యమంతో సంబంధం కలిగిన మొదటి సమ్మె ఇదేననే అభిప్రాయం ఉంది. సమ్మె కారణంగా చాలామంది ఉద్యోగాలు కోల్పోయినా ఈ సంఘం ఏర్పడడమనే మంచి మాత్రం జరిగింది.
27. చిత్తరంజన్ దాస్ (1870–1925) : మొదట్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్నా 1924లో స్వరాజ్ పార్టీ నెలకొల్పారు. ఎ.ఐ.టి.యు.సి. మహాసభలకు వరసగా రెండుసార్లు అధ్యక్షత వహించారు. సి.ఆర్. దాస్ పేరుతో ఎక్కువ ప్రసిద్ధులు.
28. బిపిన్ చంద్రపాల్ (1858–1932) : లాల్, బాల్, పాల్ త్రయంలో మూడోవారు. పూర్ణ స్వరాజ్, స్వదేశీ ఉద్యమం, జాతీయ విద్య మొదలైన కార్యక్రమాలు చేపట్టడం వెనక ఈయన హస్తమే ఎక్కువ ఉందంటారు.
29. బి.పి. వాడియా (1881–1958) మరియు మద్రాసు లేబర్ యూనియన్ : ప్రస్తుత 'బాంబే డైయింగ్' యజమానుల కుటుంబానికి చెందినవారు. కార్మిక నాయకులు. 1918లో మద్రాసు లేబర్ యూనియన్‌ను నెలకొల్పారు. క్రమబద్ధమైన సభ్యత్వం కలిగిన మొదటి భారత ట్రేడ్ యూనియన్‌గా దీనికి గుర్తింపు ఉంది. ఐఎల్ఓ తొలి సమావేశానికి వాడియా భారత కార్మిక ప్రతినిధిగా హాజరయ్యారు.
30. అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం : మజ్దూర్ మహాజన్ సంఘ్ పేరుతో భారతదేశంలో ఏర్పడ్డ తొలి వస్త్ర కార్మిక సంఘం ఇది. గాంధీ స్ఫూర్తితో అనసూయా సారాభాయి దీన్ని 1920లో నెలకొల్పారు. విక్రం సారాభాయి ఈమె మేనల్లుడే. లండన్‌లో చదివి ఇండియా తిరిగొచ్చాక జవుళి మిల్లుల్లో ఏకధాటిగా 36 గంటలు పనిచేస్తున్న మహిళా కార్మికుల దుస్థితికి చలించిపోయి ఆమె 1914లో వారిచేత సమ్మె చేయించారు. 1918లో జరిగిన సమ్మెకు కూడా సహాయ సహకారాలు అందించారు. ఈ సమ్మె సమయంలో గాంధీ వారి కోసం నిరాహారదీక్ష కూడా చేశారు. ఆ తర్వాత రెండేళ్ళకు మజ్దూర్ మహాజన్ సంఘ్‌ను ఏర్పరచారు. పారిశ్రామిక సంబంధాల విషయంలో తన ఆలోచనలకు దీన్నొక ప్రయోగశాలగా భావిస్తున్నానని, ఒక ఆదర్శ కార్మిక సంఘంగా తీర్చిదిద్దాలనుకుంటున్నానని గాంధీ ఒక సందర్భంలో అన్నారు.
31. ఎ.ఐ.టి.యు.సి. (1920) : తొలి భారత కార్మిక సంఘాల సమాఖ్య. దీన్ని ఎన్.ఎం. జోషి, లాలాలజపతిరాయ్ తదితరులు బొంబాయిలో నెలకొల్పారు. 1945 తర్వాత సిపిఐ అనుబంధ కార్మిక సంస్థగా మారింది. ఇప్పటికీ దేశంలోని ఐదు ప్రధాన కార్మిక సంఘాల సమాఖ్యల్లో ఇదొకటి.
32. లాల్‌జీ నారాయణ్‌జీ : ఈయన గురించి ఎక్కువ వివరాలు తెలియలేదు కాని 1873లో బొంబాయిలో లా చదివారని తెలుస్తోంది. బొంబాయి శాసనమండలిలో సభ్యులు. ఆయన పేరుతో జలగావ్‌లో ఒక హైస్కూలు ఉంది.

33. లల్లూభాయి శ్యామల్‌దాస్ (1863–1936) : భావ్‌నగర్ సంస్థానానికి దివాన్‌గా పని చేశారు. బొంబాయి జీవిత బీమా సంస్థ, బ్యాంక్ ఆఫ్ ఇండియా తదితర సంస్థలకు వ్యవస్థాపక డైరెక్టర్. మరో 30 కంపెనీలకు కూడా డైరెక్టర్. 1910–12 మధ్య బొంబాయి శాసనమండలి సభ్యుడు.
34. లల్లూభాయి జవేరీ :పూర్తిపేరు లల్లూభాయి దీప్‌చంద్ జవేరీ. శాకాహారాన్ని ప్రచారం చేయడానికి 1910లో బొంబాయి హ్యూమానిటేరియన్ లీగ్‌ను నెలకొల్పారని తప్ప ఇతర వివరాలు తెలియడం లేదు.
35. మహమ్మద్ చోటానీ (1873–1932) : కలప వ్యాపారస్తుడు. ప్రభుత్వ కాంట్రాక్టరు. కాంగ్రెస్ పార్టీ సభ్యుడు. ఖిలాఫత్ ఉద్యమ నాయకుడు కూడా.
36. బాప్టిస్టా (1864–1930) : పూర్తి పేరు జోసెఫ్ బాప్టిస్టా. లండన్‌లో లా చదివి వచ్చాక బొంబాయి హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. సావర్కార్‌కు న్యాయవాది. తిలక్ అనుయాయుడు. 'స్వరాజ్యం నా జన్మహక్కు' అన్న నినాదం రూపకర్త ఈయనే. బొంబాయి మేయర్‌గా కూడా పనిచేశారు. కార్మికోద్యమాలతో చాలా దగ్గర సంబంధం ఉంది. 1921 నాటికి బొంబాయిలో ఉన్న చాలా కార్మిక సంఘాలకు అధ్యక్షుడిగా పనిచేశారు.
37. ఖరగ్‌పూర్ రైల్వే సమ్మె : బెంగాల్ – నాగపూర్ రైల్వే లైనులో ఖరగ్‌పూర్ పెద్ద రైల్వే జంక్షన్. అక్కడ ఒక రైల్వే వర్క్‌షాపు కూడా ఉంది. ఈ లైను బ్రిటిష్ యాజమాన్యంలో ఉన్నప్పుడు 1926లో వేలాది కార్మికులను తీసెయ్యాలనే నిర్ణయం తీసుకున్నారు. దీనికి నిరసనగా కార్మికులు 1927 ఫిబ్రవరి 11 నుంచి నెలరోజులపాటు సమ్మె చేశారు. అయినా సమ్మె విజయవంతం కాలేదు.
38. వి.వి గిరి (1894–1980) : పూర్తిపేరు వరాహగిరి వెంకటగిరి. రైల్వే కార్మిక సమాఖ్యనే కాదు ITUF (Indian Trade Union Federation), AITUC లకు కూడా అధ్యక్షుడుగా ఉన్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే, ఎం.పి, కార్మికమంత్రి, గవర్నరు వంటి అనేక పదవులు నిర్వహించారు. 1969–74 మధ్య భారత రాష్ట్రపతిగా ఉన్నారు.
39. గిర్నీకామ్‌గార్ యూనియన్ : గిర్నీకామ్‌గార్ మహామండల్ నుంచి చీలి ఏర్పడ్డ సంఘం. 324 మందితో ప్రారంభమైన దీని సభ్యత్వం సంవత్సరం తిరిగేలోపు 65 వేలకు చేరింది.
40. బి.టి. రణదివె (1904–1990) : అవిభక్త భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా (1948–50), పార్టీ చీలాక సిపిఎం ముఖ్య నాయకుడిగా, CITU వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు.
41. ఎస్.వి. దేశపాండే : గిర్నీకామ్‌గార్ సంఘం నాయకులని తప్ప ఇతర వివరాలు తెలియలేదు.
42. జి.డి. బిర్లా (1894–1983) : పూర్తి పేరు ఘనశ్యామ్‌దాస్ బిర్లా. పారిశ్రామికవేత్త. 1927 నాటికే ఆయనకు కలకత్తాలో, గ్వాలియర్‌లో జవుళి మిల్లులు ఉండేవి. 1940లలో కార్లు, తేయాకు, సిమెంట్, రసాయనాలు, రేయాన్, స్టీల్ ట్యూబ్‌ల రంగాలలో కూడా పరిశ్రమలు నెలకొల్పారు. 1916 నుంచి కూడా గాంధీకి సన్నిహితుడు.

43. IFTU (International Federation of Trade Unions) : 1919–45 మధ్య పనిచేసిన సంస్థ. యూరప్ నగరాలలో దీని ప్రధాన కార్యాలయం ఉండేది. 1945లో IFTU రద్దయి దాని స్థానంలో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (WFTU) వచ్చింది.
44. రెడ్ ఇంటర్నేషనల్ లేబర్ యూనియన్ : IFTU ను ఎదుర్కోవడానికి 1921లో ఏర్పాటయిన సంస్థ. 1937లో రద్దయింది.
45. బి. శివరావు (1891–1975) : పూర్తి పేరు బెనెగల్ శివరావు. జర్నలిస్టు, రాజకీయ వేత్త, ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు. స్వాతంత్ర్యానంతరం ఎం.పి.గా ఉన్నారు. 'రాజ్యాంగ రచన' మీద ఆరు సంపుటాల గ్రంథం, మరెన్నో పుస్తకాలు రాశారు.
46. వర్కర్స్ & పెజెంట్స్ పార్టీ : ఈ పార్టీ 1925లో మొదట బెంగాల్‌లో పుట్టి 1927లో బొంబాయిలోను, 1928లో పంజాబ్‌లోను, యునైటెడ్ ప్రావిన్సెస్‌లోను ఎక్కడికక్కడ వేరు వేరు శాఖలుగా ఏర్పడింది. 1928లో అన్ని శాఖలూ ఒకటై అఖిల భారత కార్మిక కర్షక పార్టీగా అవతరించింది.
47. మీరట్ కుట్రకేసు : కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ బ్రాంచిని ఇండియాలో పెట్టడానికి ప్రయత్నించడాన్ని కుట్రగా భావించి బ్రిటిష్ ప్రభుత్వం ముగ్గురు ఇంగ్లీషు వాళ్ళతో సహా పలువుర్ని 1929 మార్చిలో అరెస్టుచేసి కేసుపెట్టింది. వివాదాస్పదమైన ఈ కేసులో 27 మందికి దేశ బహిష్కార శిక్ష విధిస్తూ మీరట్ సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. తర్వాత అప్పీలులో శిక్షాకాలాన్ని తగ్గించారు. శిక్షపడినవారిలో డాంగే, షౌకత్ ఉస్మాని, ముజఫర్ అహమ్మద్‌లు ముఖ్యులు.
48. ఎన్.ఎం. జోషి (1879–1955) : పూర్తి పేరు నారాయణ్ మల్హార్ జోషి. కార్మికోద్యమ నాయకుడు. ఎఐటియుసి వ్యవస్థాపక సభ్యుడు. 1925–29 మధ్య, మళ్ళీ 1940–48 మధ్య ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి. తర్వాత విడిపోయి వేరే సంస్థ పెట్టుకున్నా అది మళ్ళీ ఎఐటియుసిలోనే కలిసింది.
49. ITUF (Indian Trade Union Federation) : రాయల్ లేబర్ కమిషన్‌కు సహకరించాలా వద్దా అనే విషయంలో ఏర్పడ్డ విభేదాల వల్లే వి.వి. గిరి తదితరులు ఎఐటియుసి నుంచి బయటికొచ్చి ITUF ను ఏర్పరచారు. కమిషన్‌కి సహకరించాలని వీరి అభిప్రాయం. పదేళ్ళ తర్వాత 1939లో మళ్ళీ ఎఐటియుసిలో విలీనమైంది ఈ సంస్థ.
50. AIRTUC (All India Red Trade Union Congress) : ఎఐటియుసి గుర్తింపును కోల్పోయిన 12 కార్మిక సంఘాలు కలిసి ఏర్పరచుకున్న సంస్థ ఇది. అయితే నాలుగేళ్ళలోపే 1935లో మళ్ళీ ఎఐటియుసిలో విలీనమైంది.
51. ఎస్.జి. సర్దేశాయి (1907–1996) : మహారాష్ట్రకు చెందిన స్వాతంత్ర్య పోరాట నాయకుడు, కార్మిక నాయకుడే కాక బహుగ్రంథ రచయిత.
52. హరిహరనాథ శాస్త్రి (1904–1953) : కాన్పూర్ మజ్దూర్ సభకు, ఎఐటియుసికి నాయకుడిగా ఉండేవారు. తర్వాత ఉత్తరప్రదేశ్ ఐఎన్‌టియుసికి తొలి అధ్యక్షుడుగా ఉన్నారు.

53. గోవింద వల్లభపంత్ (1887–1961) : కాంగ్రెస్ నాయకుడు. స్వాతంత్ర్య పోరాట నాయకుడు. స్వాతంత్ర్యానికి పూర్వం, తర్వాత కూడా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. జమీందారీ వ్యవస్థను రద్దుచేయడంతోపాటు భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. హిందీని అధికార భాషగా చేయడంలో కూడా ఆయన పాత్ర చాలా ఉంది. 1955లో ఆయనకు భారతరత్న ఇచ్చారు. 1955–61 మధ్య కేంద్ర హోంమంత్రిగా కూడా పనిచేశారు.
54. వల్లభాయ్ పటేల్ (1875–1950) : స్వతంత్ర భారతదేశానికి తొలి హోంమంత్రి. 500 సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో ఆయనదే ప్రధాన పాత్ర.
55. ఆజాద్ (1888–1958) : పూర్తి పేరు అబుల్ కలామ్ ఆజాద్. మౌలానా ఆజాద్ అనేవారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర విద్యామంత్రిగా పనిచేశారు. ఐఐటి, యుజిసి వంటి సంస్థల ఏర్పాటు ఆయన కాలంలోనే జరిగింది. మరణానంతరం 1992లో భారతరత్న ఇచ్చారు.




**చైనా – భారత మైత్రి సంక్షిప్త చరిత్ర**

ఇంగ్లీషు మూలం : A Short History of Sino-Indian Friendship (1958)

రచయిత : చిన్–కే–మూ

తెలుగు అనువాదం : సహవాసి

భారత–చైనా మిత్రమండలి, ఆంధ్రప్రదేశ్ వారి ప్రచురణ (1982)

**చిన్–కే–మూ (1912–2000) :** చైనీస్ కవి, పండితుడు. బీజింగ్ యూనివర్సిటీలో ప్రాచ్య సాహిత్యం, భాషల శాఖలో ప్రొఫెసర్. 1941–46 మధ్య ఇండియా వచ్చి ప్రాచీన భారతీయ సాహిత్యం, బౌద్ధం, తత్వశాస్త్రం అధ్యయనం చేశారు. సంస్కృతం, పాలి, హిందీ, ఉర్దూ భాషలు నేర్చుకుని అనేక గ్రంథాలను చైనీస్ భాషలోకి అనువాదం చేశారు.

**సహవాసి (1933–2007) :** అసలు పేరు జె. ఉమామహేశ్వరరావు. అనువాదకులు. జర్నలిస్టు. రచయిత. ఆయన అనువాదం చేసిన వాటిలో 'ఏడు తరాలు', 'ఆధునిక భారత చరిత్ర', 'తరతరాల భారత చరిత్ర' వంటి అనేక పుస్తకాలున్నాయి.

'జ్ఞానతృష్ణ' చేత ప్రేరణ చెందిన బౌద్ధ భిక్షువులే కాదు, లాభార్జన కోసం వ్యాపారస్తులు కూడా చాలామంది ఉభయ దేశాల మధ్య ప్రయాణం చేశారు. భారత-చైనా దేశాల సంబంధాలలో అది కూడా ఒక భాగమే. అందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. ఇతర దేశాల వారికి లాభార్జన దృష్టి ఉండిందని, కేవలం భారత చైనా దేశాల పూర్వీకులకే అకళంక జ్ఞానతృష్ణ ఉండిందని, వాళ్ళ గుణగణాలు ఉన్నతమయినవని నమ్మడం చాలా అశాస్త్రీయం. అట్లా నమ్మాలని పంచశీలలో సహితం రాసుకోలేదు. కాగా ఈ వ్యాపారస్తులు, బౌద్ధ భిక్షువులూ మోసుకుపోయినవన్నీ మంచివి కావు. అలాగే మంచివన్నీ 'జ్ఞానతృష్ణ' మాత్రమే ఉన్న భిక్షువులు మోసుకుపోయినవీ కావు. సాంకేతిక పరిజ్ఞానం, గణితం, వైద్యం, ఖగోళశాస్త్రం - ఇవి మనం ఇచ్చి పుచ్చుకున్న వాటిలో మంచి అంశాలు. వీటివల్ల రెండుదేశాల సంస్కృతులూ సంపన్నమయినాయి. వాటిలో వ్యాపారస్తులు మోసుకుపోయినవీ ఉన్నాయి. బౌద్ధ భిక్షువులు మోసుకుపోయినవీ ఉన్నాయి.

# బాండుంగ్ వెలుగు నీడలలో....

## 'చైనా - భారత మైత్రి సంక్షిప్త చరిత్ర'పై సమీక్ష

**చరిత్రలు** పలురకాలు. సామ్రాజ్యవాద చరిత్ర, జాతీయవాద చరిత్ర, మతోన్మాద చరిత్ర, వగైరా – ఎన్ని కావాలంటే అన్ని రకాలు. సామ్రాజ్యవాదులకు వలసలను నిరాటంకంగాను, నిరాక్షేపణీయంగాను పరిపాలించడానికి ఒక చారిత్రక వ్యాఖ్యానం అవసరమయింది. పరిపాలనా దక్షత తెల్లవాడి సొమ్ము. కాబట్టి ప్రపంచపాలన కేవలం వాడి హక్కే కాదు, దైవదత్తమయిన బాధ్యత. ఈ సిద్ధాంతాన్ని నిరూపించడానికి వలస దేశాల చరిత్రను సామ్రాజ్యవాదపు కళ్ళతో పరిశీలించి రాశారు. ఈ ప్రాచ్యదేశాల వాళ్ళకు తత్వచింతన సమృద్ధిగా ఉంది గాని, రాజ్యం నడపమంటే తన్నుకు చావడమో లేక సన్యసించడమో తప్ప వేరే చేతకాదు అని నిరూపించదల్చుకున్నారు. అందుకే వాళ్ళ కళ్ళకు మన చరిత్ర నిండా కలహాలూ, కుహకాలూ, కాషాయాంబరాలూ తప్ప వేరే కనబడలేదు. దీనికి సమాధానంగా జాతీయవాద చరిత్ర పుట్టి చరిత్రలో పూడుకుపోయిన రాజ్యాలనూ రాజవంశాలనూ వెలికి తీసి, చూశారా మాకూ పరిపాలనా దక్షత ఉందని ఎదురు వాదన చేసింది. గుప్త రాజుల స్వర్ణయుగం[1], అక్బర్ పాదుషా నేర్పరితనం[2] చరిత్రకెక్కాయి, అవే చరిత్ర అయ్యాయి. చివరికి వేరే సందర్భంలోనయితే నీతిహీనుడిగా గుర్తించబడి ఉండే కౌటిల్యుడు[3] కూడా భారతజాతికి తత్వచింతనే కాదు, అతి క్షుద్రమయిన రాజనీతి కూడా చేతనవునని నిరూపించి జాతి హీరో అయ్యాడు! ఇట్లా ఎన్నో రకాల చరిత్రలు వర్ణించవచ్చు.

మరయితే భారత–చైనా మిత్ర మండలి వారు అనువదించి ప్రచురించిన ఈ చైనా పుస్తకం ఏ రకం చరిత్ర అంటే బాండుంగ్ చరిత్ర, లేక పంచశీల చరిత్ర అనొచ్చు. 1955 లో బాండుంగ్[4]లో ఒక సమావేశం జరిగింది. అప్పుడప్పుడే సామ్రాజ్యవాదుల నుండి ఏదో ఒక మేరకు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంటూన్న వివిధ ఆఫ్రికా, ఆసియా దేశాల అధినేతలంతా అక్కడ సమావేశమయ్యారు.

---

అరుణతార, ఏప్రిల్ – మే 1983

మునిసిపల్ పార్కులో ప్రేమికులలాగా జన్మాంతం తోడునీడగా ఉంటామని ప్రకటించుకున్నారు. ప్రపంచ రాజకీయ రంగంపైకి ముగ్గురు తాజా హీరోలు వచ్చారు – నెహ్రూ, నాజర్[5], సుకర్నో[6]. రాజాతనంలోగాని, హీరోయిజంలోగాని ముగ్గురూ ముగ్గురే. వీళ్ళవెనక నిలబడి వీళ్ళ వేడి వేడి రాడికల్ ప్రవచనాలకు కొంత స్థిరమయిన పునాదిని కల్పించాలని చౌ ఎన్ లై[7] ప్రయత్నించాడు.

అది 1955లో. అంతకు ఒక సంవత్సరం పూర్వం చౌ ఎన్ లై భారత దేశానికి వచ్చాడు. ఢిల్లీ నగరం హిందీ–చీనీ భాయిభాయి నినాదాలతో మారు మోగింది. భారత, చైనా దేశాలు స్నేహ ఒప్పందాన్ని రాసుకున్నాయి. పంచశీల అని పిలవబడే అయిదు సూత్రాల ప్రాతిపదికగా రెండు దేశాలూ స్నేహ సహకారాలతో సహజీవనం చేయాలని ప్రమాణం చేసుకున్నాయి. అవి

1. ఒండొరుల సర్వసత్తాక ప్రతిపత్తిని గౌరవించాలి.
2. ఒకరిపై ఒకరు దాడి జరపకూడదు.
3. ఒకరి అంతర్గత వ్యవహారాలలో ఒకరు జోక్యం చేసుకోకూడదు.
4. పరస్పర లాభోపేతంగాను, సమానంగాను వ్యవహరించాలి.
5. శాంతియుత సహజీవనం కొనసాగించాలి. ఇదే 'పంచశీల'.

అది 1954 లో. ఈ పుస్తకం రాసింది 1958లో. అంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని మాజీ వలసదేశాల ప్రభుత్వాలనూ ఐక్యంగా నిలబెట్టాలనే రాజనీతిని చైనా ప్రభుత్వం అనుసరిస్తున్న రోజులలో, ఆ రాజనీతిలో భాగంగా రాసిన పుస్తకం ఇది. ఆ రాజనీతి ఆనాడుగాని, ఈనాడుగాని తప్పు కాదు. అన్ని రకాల సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా 'మూడవ ప్రపంచ' దేశాలను ఐక్యంగా నిలబెట్టే కృషి చాలా అవసరం. దానికోసం ఆయా ప్రభుత్వాలతో చైనా సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని ప్రయత్నించడం భావ్యమే. అది ప్రభుత్వాల మధ్య మైత్రే. 'ప్రజల మధ్య మైత్రి' అని బుకాయించాల్సిన అవసరం లేదు. ప్రజల మధ్య మైత్రి ఈ ప్రభుత్వాలు పోతేగాని సాధ్యం కాదు. అయితే ఈ మైత్రి చరిత్ర రచనను రాజనీతికి లోబరిస్తేనే కష్టం. (అప్పుడు) ఒక్కసారిగా భారతదేశం, చైనా అఖండమయిన 'జాతు'లయిపోతాయి. భారత పాలక వర్గాలకు అభిమాన పాత్రమయిన విషయాలు విమర్శకు అతీతమయిపోతాయి. భారతదేశం నుండి చైనాకుగాని, చైనా నుండి భారతదేశానికి గాని వ్యాపారానికో, బౌద్ధమత

ప్రచారానికో, ఉబుసుపోకో ప్రయాణించిన వారంతా ఆయా దేశాల ప్రజల ప్రతినిధులవుతారు, వాళ్ళ ప్రయాణం అనాది అయిన భారత–చైనా మైత్రికి సంకేతం అవుతుంది. వాళ్ళ రాకపోకల వల్ల ప్రసారమయిన సంస్కృతి ఎటువంటి దయినప్పటికీ పూజనీయమవుతుంది. "చైనా వచ్చిన భారతీయ బౌద్ధమత ప్రచారకులు మన నాగరికతను సుసంపన్నం చేశారు... ఉభయ దేశాల మధ్య సాగిన భావాల బట్వాడాను ఒక్కసారి గతంలోకిపోయి చూసినప్పుడు, భారతదేశము నుంచి బహు ప్రయాసలు పడి చైనా వచ్చిన ఈ భారతీయ మిత్రుల్ని, శతాబ్దాల తరబడి వాళ్ళు శ్రమించి చేసిన బోధల్ని, అనువాదాల్ని జ్ఞాపకము తెచ్చుకొని తీరాలి, మన ఉభయదేశాల ప్రజల మధ్య అల్లుకున్న ఈ ప్రగాఢ మైత్రి ప్రపంచ చరిత్రలో అసాదృశ్యం" (పేజీ 76).

మరికొన్ని ఉదాహరణలు ఇస్తాను. బౌద్ధమత ప్రచారం కోసం ఉభయదేశాల మధ్య జరిగిన ప్రయాణాల గురించి చెప్తూ "3వ శతాబ్దం నుండి 12వ శతాబ్దందాకా సాగిన ఈ వెయ్యి సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎడతెగకుండ పారే ఏరులాగా యాత్రిక బృందాలు చైనానుండి భారతదేశానికి కష్టసాధ్యమయిన దీర్ఘ, నిష్ఠుర ప్రయాణానికి తెగించాయి. వాళ్ళ లక్ష్యం లాభాలు లాగుదామని కాదు. కీర్తి గడిద్దామని కాదు. దురాక్రమణ యుద్ధం అంతకన్నా కాదు. జ్ఞానతృష్ణ, బౌద్ధమత వ్యాప్తి వాళ్ళకు ప్రేరణలు. ఇటువంటి ఉదాహరణ యావత్ ప్రపంచ చరిత్రలో మరెక్కడా కనిపించదు. ఈ అసాధారణ చారిత్రక పరిస్థితులు భారత–చైనా ప్రజల మధ్య స్నేహ సంబంధానికీ, మన పూర్వుల ఉన్నత గుణగణాలకు విశిష్ట సాక్ష్యం" (పేజీ 41). ఈ ఉభయ జాతీయవాదం (mutual nationalism) మన ఇరువురి పూర్వీకులలో ఉన్నత గుణగణాలను గుర్తించడంతో ఆగిపోలేదు. ముందుమాటగా భారత–చైనా మిత్రమండలి ఆంధ్ర రాష్ట్ర శాఖవారు రాసిన దానిలో "పూర్వం భారతదేశానికి పశ్చిమ దేశాలతో సంబంధం యుద్ధాల ద్వారా ఏర్పడగా చైనాతో భారతదేశానికి సంబంధం పరస్పర సహకార ప్రాతిపదికగా ఏర్పడింది" అన్నారు. ఇది చాలా అన్యాయమయిన వక్రీకరణ. చైనాతో భారతదేశానికుండిన మత ప్రచార, వ్యాపార సంబంధాలను 'పరస్పరం'గా గుర్తించేటట్లయితే ఆ సంబంధమే మనకు పశ్చిమదేశాలతో కూడా ఉండింది. నాదిర్‌షా[8], గజనీమహమ్మదు[9]ల దండయాత్రల కంటె ఈ సంబంధమే ఎంతో బలమయినది.

నిజానికి 'జ్ఞానతృష్ణ' చేత ప్రేరణ చెందిన బౌద్ధ భిక్షువులే కాదు, లాభార్జన కోసం వ్యాపారస్తులు కూడా చాలామంది ఉభయ దేశాల మధ్య ప్రయాణం చేశారు. భారత–చైనా దేశాల సంబంధాలలో అది కూడా ఒక భాగమే. అందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. ఇతర దేశాల వారికి లాభార్జన దృష్టి ఉండిందని, కేవలం భారత చైనా దేశాల పూర్వీకులకే అకళంక జ్ఞానతృష్ణ ఉండిందని, వాళ్ళ గుణగణాలు ఉన్నతమయినవని నమ్మడం చాలా అశాస్త్రీయం. అట్లా నమ్మాలని పంచశీలలో సహితం రాసుకోలేదు. కాగా ఈ వ్యాపారస్తులు, బౌద్ధ భిక్షువులూ మోసుకు పోయినవన్నీ మంచివి కావు. అలాగే మంచివన్నీ 'జ్ఞానతృష్ణ' మాత్రమే ఉన్న భిక్షువులు మోసుకుపోయినవీ కావు. సాంకేతిక పరిజ్ఞానం, గణితం, వైద్యం, ఖగోళశాస్త్రం – ఇవి మనం ఇచ్చి పుచ్చుకున్న వాటిలో మంచి అంశాలు. వీటివల్ల రెండుదేశాల సంస్కృతులూ సంపన్నమయినాయి. వాటిలో వ్యాపారస్తులు మోసుకుపోయినవీ ఉన్నాయి. బౌద్ధ భిక్షువులు మోసుకుపోయినవీ ఉన్నాయి. భిక్షువులు మాత్రమే తీసుకుపోయినవి సంస్కృతభాష, సాహిత్యం, తత్వశాస్త్రం, బౌద్ధ మత పుక్కిటి పురాణాలు, వగైరా. సాహిత్యం మాట కాదుగానీ, తత్వశాస్త్రం, బౌద్ధమతం ఆనాటికి (క్రీ.శ. 3వ శతాబ్దం తరువాత కాలం) బాగా దిగజారి ఉన్నాయి. దురదృష్టవశాత్తు, భారత పాలక వర్గాలను దృష్టిలో ఉంచుకొని కాబోలు, ఈ రెండవ కోవకు చెందిన సరుకులనే భారతదేశం నుండి చైనా పొందిన గొప్ప ప్రయోజనంగా చెప్పారు. కొన్ని ఉదాహరణలిస్తాను. ఫాహియాన్[10] భారతదేశానికి వచ్చింది బౌద్ధమతాల నిర్మాణానికీ (organization), వ్యవహారాలకూ సంబంధించిన నియమావళిని తెలుసుకుపోవడానికి. దానివల్ల చైనా ప్రజలకు ఒరిగిందేమిటో మనకు తెలీదు. కాని ఈ బాండుంగ్ చరిత్ర మాత్రం ఫాహియాన్ సాహసాన్ని ప్రశంసిస్తూ, "ఫాహియాన్ ఇటువంటి సుదీర్ఘ, సంక్లిష్ట ప్రయాణానికి సిద్ధపడింది తనకోసం కాదు, తన దేశస్తుల ప్రయోజనం కోసం" అంటుంది (పేజీ 45). హుయాన్‌సాంగ్[11] క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతదేశానికి వచ్చాడు. ఇక్కడ వేరే బౌద్ధ శాఖకు చెందిన ప్రజ్ఞాదేవుడనే[12] భిక్షువుతో ఏదో వాదనకు దిగుతాడు. ఆ వాదనలో పరుషంగా మాట్లాడినందుకు ప్రజ్ఞాదేవుడు క్షమాపణ వేడుకుంటూ ఉత్తరం పంపితే దానికి సమాధానంగా హుయాన్‌సాంగ్, ఇందులో క్షమాపణ

కోరుకోవలసిందేమీ లేదని అంటాడు. క్రీ.శ. 7వ శతాబ్దం నాటికి భారతదేశంలో బౌద్ధానికి పట్టిన గతి ఏమిటో తెలిసిన వాళ్ళు ఆ పండితుల చర్చ ఎంత నిరర్థకమయి వుంటుందో ఊహించుకోగలరు. కాని ఈ పంచశీల చరిత్రకు మాత్రం అట్లా అనిపించలేదు. "ఆనాటి పండితులు వినయ సంపన్నులు, సహృదయులు, మానవజాతి ప్రగతిని మాత్రమే కాంక్షించిన వాళ్ళు. వ్యక్తిగత కక్షలు, సంకుచిత పక్షపాతాలూ బొత్తిగా ఎరుగని వాళ్ళు. ఈ విషయాల్లో వాళ్ళని మనం గొప్ప ఆదర్శంగా స్వీకరించాలి" అంటుందది (పేజీ 54). అదే సందర్భంలో, "హుయాన్‌సాంగ్ చైనా గురించి చెప్పిన విశేషాల యెడల హర్ష చక్రవర్తి[13] మహా ఆసక్తి కనబరిచాడు. వారిద్దరూ మంచి స్నేహితులయ్యారు. భారత-చైనా దేశాల ప్రజల మధ్య ఆనాడు విలసిల్లుతున్న స్నేహానికిది అభివ్యక్తి" అంటుంది. హర్ష చక్రవర్తికీ ప్రజలకూ తేడా చూడలేని ఈ విచక్షణా శూన్యమయిన మైత్రీభావ అతిశయం అవసరమా? అది ప్రదర్శించకపోతే ఇవ్వాళ భారత-చైనా మైత్రి అసాధ్యమా ?

విచిత్రమేమిటంటే, భారత చైనా దేశాలు నిజంగానే చాలా ఉపయోగకర మయిన విషయాలు ఇచ్చిపుచ్చుకున్నాయి. ప్రాచీనకాలంలో విజ్ఞానశాస్త్రం (ముఖ్యంగా ఖగోళశాస్త్రం, గణితం, వైద్యం)లో రెండు దేశాలూ ఎంతో కొంత అభివృద్ధిని సాధించాయి. సాంకేతికరంగంలో నాడే కాదు, పెట్టుబడిదారీ విప్లవం పాశ్చాత్య దేశాలలో వచ్చేదాకా ప్రపంచంలో బహుశా చైనాదే పైచేయి. ఈ విద్యనూ విజ్ఞానాన్నీ భారత, చైనా దేశాలు పంచుకున్నాయి. వచ్చే పోయే యాత్రికులు (లాభార్జన లక్ష్యంగా గల వ్యాపారస్తులు, 'జ్ఞానతృష్ణ'తో ప్రయాణం చేసిన భిక్షువులు) అందుకు ఉపయోగపడ్డారు. ప్రాచీన భారత-చైనా సంబంధాలలో ఇది ధనాంశ. మిగిలినదంతా చాలావరకు ఋణాంశే. బౌద్ధం చైనాలో స్థిరపడేనాటికి తాత్విక రంగంలో వేదాంతానికి ఏ మాత్రం తీసిపోని మహాయానంగాను, నిత్యజీవితంలో బుద్ధభగవానుని ఆరాధనగాను, మూఢనమ్మకాల మూటగాను మారిపోయింది. ధనాంశను మొదటి 15 పేజీలలో కొంత వివరించి, ఋణాంశనే మిగిలిన పేజీలలో గొప్పగా కీర్తించారు.

భారతదేశంలోనూ, చైనాలోనూ కూడా నాగరికత చాలా ప్రాచీనమైనది. రెండూ కూడా ఋతుపవన వాతావరణంలో జీవించే దేశాలే. వ్యవసాయానికయినా, నౌకాయానానికయినా ఒక క్రమం ప్రకారం వీచే ఋతుపవనాలే ఆధారం. దానికి సంవత్సర పంచాంగం (అంటే శకునాల పుస్తకం అని అర్థం కాదు, కేలండర్ అని.) తయారు చేసుకోవడం అవసరం. అది లేకపోతే వ్యవసాయం పనులు ఎప్పుడు ప్రారంభించాలో తెలీదు, సముద్రంలో ఓడలు ఎప్పుడు బయలుదేర వచ్చునో తెలియదు. దీనికోసం గ్రహాల, నక్షత్రాల పరిశీలన మొదలయింది. ఈ కారణంగా రెండు దేశాలలోనూ అతి ప్రాచీనకాలంలో అభివృద్ధి చెందిన విజ్ఞాన శాస్త్రాలు – ఖగోళశాస్త్రం, దానికి అనుబంధంగా గణితం. ఈ విజ్ఞానాన్ని పరస్పరం పంచుకున్నాయి. వాళ్ళు తీసుకెళ్ళిన శాస్త్ర గ్రంథాలలోనే కాదు, బౌద్ధమత గ్రంథాలలో కూడా ఖగోళశాస్త్రాల గురించి చాలా విషయాలు ఉండేవట. క్రీ.శ. 7–8 శతాబ్దాల కాలంలో టాంగ్ రాజవంశం పరిపాలిస్తున్న రోజులలో కేలండరు తయారుచేసే రంగంలో చాలామంది భారతీయ పండితులు పనిచేసే వారట. చాంద్రమాసాన్ని కృష్ణ పక్షం, శుక్ల పక్షం అని విభజించే అలవాటు కూడా చైనీయులకు మన నుండే అబ్బింది (పేజీ 11). వైద్యం మాటకొస్తే, సుమారు 100 భారతీయ వైద్య గ్రంథాలు అనువాదమయ్యాయట. అవిగాక, బౌద్ధ భిక్షువులు చాలామంది మంచి వైద్యులు కూడా అయిన కారణాన, వాళ్ళు చైనాకు పోవడం ద్వారా కూడా ఇక్కడి వైద్య విజ్ఞానం అక్కడికి వెళ్ళుంటుంది. బౌద్ధమత గ్రంథాలలో కూడా వైద్య సంబంధమయిన సమాచారం విస్తృతంగా ఉందట (పేజీ 13).


ఇదంతా చైనా భారతదేశం నుండి నేర్చుకున్నది. భారతదేశం కూడా చైనా నుండి ఈ రంగాలలో ఎంతో నేర్చుకొని ఉండాలి. అదనంగా, సాంకేతిక రంగంలో చైనా నుండి చాలా స్వీకరించాం. పట్టు నుండి పింగాణి వరకు చాలా సరుకుల వాడకం చైనా నుండి నేర్చుకున్నవే. ఈ పుస్తకం రాసిన కాలానికి తెలీదుగాని భారతదేశానికి రాట్నం, కాగితం, సారాకాచే బట్టీలు, ఇటుకలు, బావి గిలకలకు ఉపయోగించే గేర్‌వంటి పరికరం, సైనిక సంబంధమయిన సాంకేతిక విజ్ఞానం సుల్తాన్ల కాలంలో దిగుమతి అయ్యాయనీ, వాటిలో కొన్ని చైనానుండి పర్షియా ద్వారా ఇండియాకు వచ్చి ఉండవచ్చుననీ ఇటీవల ఇర్ఫాన్ హబీబ్ అన్నాడు.

సాంకేతిక, వైజ్ఞానిక రంగంలోని ఈ ఇచ్చిపుచ్చుకోలు నిజంగా ప్రాచీన కాలంలో భారత–చైనా మైత్రికి సంకేతం. ఇవ్వాళ్టి మైత్రికి ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి కంటె వేరే ప్రేరణ కావాలనుకుంటే ఈ ప్రాచీన సంబంధాన్ని మిగుల్చుకుంటే చాలు. విచక్షణా శూన్యంగా అభ్యుదయం అయినదేది, కానిదేది అన్న భావన చూడకుండ నాగార్జునుడి[14] శూన్యవాదం చైనా భాషలోకి అనువాద మయినా, హర్షుడు హుయాన్‌సాంగ్‌తో స్నేహపూర్వకంగా ప్రవర్తించినా అవన్నీ కూడా భారత–చైనా ప్రజల మైత్రికి నిదర్శనాలేనని తీర్మానించడం శుష్క తాపత్రయం. చరిత్ర రచనకు రాజకీయం ఎప్పుడూ ఉంటుంది. కాని ఆ రాజకీయం దీర్ఘకాలిక మానవాభ్యుదయం కోసమైతేనే ఆ చరిత్ర రచన శాస్త్రీయం అవుతుంది. తాత్కాలిక బాండుంగ్ రాజనీతికి భారత–చైనా సంబంధాల చరిత్రను లోబరచి భారత పాలక వర్గాలను మెప్పించడానికి హిందీ–చీనీ భాయిభాయి నినాదాన్ని పల్లవిగా పెట్టి చరిత్ర రాయడం అనవసరం. దాన్ని ఉన్నదున్నట్లుగా తెలుగులోకి అనువదించి 'దేశభక్తి' పేరిట చెలామణి అవుతూన్న జాతీయ దురభిమానం ప్రభావం నుండి బయట పడని ప్రజలను మరింత గందరగోళపరచడం ప్రమాదకరం.

'సహవాసి' అనువాదం ఎప్పటిలాగే ధారాప్రవాహంగా వుంది. భాష మాత్రం ఉండగలిగినంత సరళంగా లేదు. 47వ పేజీలో 'వెస్టర్న్ కంట్రీస్' అన్నమాటను తూర్పు దేశాలు అని అనువదించారు. మరొకచోట (పేజీ 32) సర్వే అన్న ఇంగ్లీష్ మాటను సర్వేక్షణ అని అనువదించారు. ఇది సరికొత్త ప్రయోగం. పుస్తకం మొదటి నుండి చివరిదాకా 'మన', 'మనము' అని ఉండవలసింది 'మా', 'మేము' అని వుంది.

1. గుప్తుల స్వర్ణయుగం : గుప్తులు క్రీ.శ. 320–550 మధ్య ఉత్తర భారతదేశాన్ని పరిపాలించిన రాజులు. వీరి పాలనలో గణిత, ఖగోళ, లోహ శాస్త్రాలలో ఎంతో అభివృద్ధి జరగడమే కాక ఎన్నో గొప్ప సంస్కృత గ్రంథాలు కూడా రచించబడ్డాయి. కాళిదాసు, ఆర్యభట్ట, వరాహమిహిరుడు, విష్ణుశర్మ, వాత్సాయనుడు ఈ కాలపువారే.
2. అక్బర్ నేర్పరితనం : మొగల్ చక్రవర్తులందరిలోకి ఎక్కువ పేరు ప్రఖ్యాతులున్న వాడు అక్బర్ (1542–1605). స్థానికులైన హిందువులతో సత్సంబంధాలు కలిగి ఉండడమే కాక మిగతా అన్ని మతాలవారితోనూ సఖ్యతగా ఉండడం ద్వారా ఆయన తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకోగలిగాడని భావిస్తారు.

3. కౌటిల్యుడు (క్రీ.పూ. 370–283) : ఈయనకు చాణుక్యుడు, విష్ణుగుప్తుడనే పేర్లు కూడా ఉన్నాయి. మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుడి (క్రీ.పూ. 321–297) గురువు, సలహాదారు కూడా. ఆయన రచించిన 'అర్థశాస్త్రం' ప్రపంచ ప్రసిద్ధి చెందింది.
4. బాండుంగ్ : ఇండోనేషియాలోని ఒక నగరం. 1955లో ఆసియా – ఆఫ్రికా దేశాల సదస్సు జరిగిందిక్కడ. అలీనోద్యమానికి మొదటి మెట్టుగా భావించే ఈ సదస్సుకు ప్రపంచ జనాభాలో సగానికి ప్రాతినిధ్యం వహించే 29 దేశాలవారు హాజరయ్యారు. నెహ్రూ ప్రకటించిన పంచశీలను ఏకగ్రీవంగా ఆమోదించారు.
5. నాజర్ (1901–1970) : పూర్తి పేరు గమాల్ అబ్దెల్ నాజర్ హుస్సేన్. 1956 నుంచి చనిపోయేవరకు ఈజిప్టు అధ్యక్షుడిగా ఉన్నారు. సూయజ్ కాలువను జాతీయం చేసి మూడవ ప్రపంచ దేశాల దృష్టిలో హీరో అయ్యారు.
6. సుకర్నో (1901–1970) : నెదర్లాండ్స్ నుండి విముక్తిని కోరుతూ ఇండోనేషియా చేసిన పోరాటానికి నాయకత్వం వహించారు. ఆ దేశానికి తొలి అధ్యక్షుడు (1945–67).
7. చౌ ఎన్ లై (1898–1976) : జన చైనా తొలి ప్రధాని. 1949 నుంచి 1976 వరకు మావో నేతృత్వంలో ప్రధానిగా పనిచేశారు.
8. నాదిర్‌షా (1688–1747) : ఇరాన్ చక్రవర్తి. 1739లో ఉత్తర భారతదేశం పైకి దండెత్తి వచ్చి మొఘల్ రాజును ఓడించి ఢిల్లీని కొల్లగొట్టి వెళ్ళాడు. నెమలి సింహాసనం, కోహినూర్ వజ్రం దోచుకెళ్ళింది ఈయనే.
9. గజనీ మహమ్మదు (971–1030) : ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోని ఘజ్నవీ రాజ్యానికి రాజు. 1000–1026 మధ్య భారతదేశంపై 17సార్లు దండెత్తి వచ్చి ఎంతో సంపదను దోచుకెళ్ళాడు.
10. ఫాహియాన్ (337–422) : చైనా నుండి భారతదేశానికి కాలినడకన వచ్చిన బౌద్ధ భిక్షువు. బౌద్ధ గ్రంథాలను సేకరించేందుకు ఆయన 13 ఏళ్ళపాటు (399–412) నేపాల్, శ్రీలంకతో సహా భారత ఉపఖండమంతా తిరిగాడు.
11. హుయాన్ సాంగ్ (602–664) : మరో చైనా యాత్రికుడు. భారతదేశంలో కొన్నేళ్ళు ఉండి సంస్కృతం, బౌద్ధం అధ్యయనం చేశాడు.
12. ప్రజ్ఞాదేవుడు (క్రీ.శ. 7వ శతాబ్దం) : బోధ్‌గయలోని మహాబోధి పీఠానికి చెందిన బౌద్ధ భిక్షువు. కన్యాకుబ్జలో జరిగిన ఒక సమావేశంలో ప్రజ్ఞాదేవుడికి, హుయాన్‌సాంగ్‌కు మధ్య తీవ్ర వాగ్వివాదం జరుగుతుంది. దానికి కారణం ప్రజ్ఞాదేవుడు హీనయానవాది కాగా హుయాన్‌సాంగ్ మహాయానానికి చెందినవాడు కావడమే.
13. హర్ష చక్రవర్తి (590–647) : కనౌజ్ రాజధానిగా 606–647 మధ్య ఉత్తర భారతాన్ని పరిపాలించిన రాజు. బౌద్ధుడు.
14. నాగార్జునుడు (150–250) : బౌద్ధ తత్వవేత్త. మహాయాన బౌద్ధంలోని మాధ్యమిక వాదాన్ని ప్రతిపాదించినవాడు. ఎక్కడివాడో కచ్చితంగా తెలియదు గాని నేటి నాగార్జున సాగర్ సమీపంలోని శ్రీపర్వతం వద్ద ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పి బౌద్ధ ధర్మాన్ని బోధించాడు. అందుకే అక్కడి కొండకు, రిజర్వాయరుకు ఆయన పేరు పెట్టారు.




**సింహావలోకనం**

**భారత స్వాతంత్ర్య సాయుధ పోరాట ప్రామాణిక గాథ**

హిందీ మూలం : సింహావలోకన్ (1951, 52, 55లలో మూడు భాగాలుగా వచ్చింది)

రచయిత : యశ్‌పాల్

తెలుగు అనువాదం : ఆలూరి భుజంగరావు

రాహుల్ సాహిత్య సదనం ప్రచురణ (1981, 82, మూడు భాగాలు కలిపి 83)

**యశ్‌పాల్ (1903–1976) :** భగత్‌సింగ్, ఆజాద్‌ల సహచరుడు. ఏడేళ్ళ జైలు జీవితం తర్వాత బయటికొచ్చి అనేక కథలు, నవలలు రాశారు. ఒక పత్రిక నడిపారు. సాహిత్య అకాడెమీ అవార్డు, పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. 'సింహావలోకనం' ఆయన ఆత్మకథ.

**ఆలూరి భుజంగరావు (1928–2013) :** రచయిత, అనువాదకుడు. హిందీ టీచరు. రాహుల్ సాంకృత్యాయన్, ప్రేమ్‌చంద్, కిషన్‌చందర్, సరోజ్ దత్తా వంటి అనేకమంది ప్రముఖుల రచనలను తెలుగులోకి అనువదించారు. తెలుగు నుంచి హిందీలోకి కూడా అనేక అనువాదాలు చేశారు.

చరిత్ర ఒక మలుపు తీసుకున్న తరువాత ఆ మలుపు చాలా సహజంగాను, అనివార్యంగాను కనిపిస్తుంది గాని ఆ సహజత్వం భ్రమ మాత్రమే. మలుపు తీసుకోక ముందున్న అన్వేషణ, ఆవేదన, సంక్షోభం, సందిగ్ధం - ఇవన్నీ కూడా చరిత్రలో భాగమే. చరిత్ర తీసుకునే ఏ మలుపయినా అప్పటి పరిస్థితులలో అనివార్యం కాదా అంటే అనివార్యమే. కాని అంతకుముందున్న అన్వేషణ, ఆ అన్వేషణకు సాధనమయిన ఆచరణ - ఆ పరిస్థితులను నిర్ణయించే శక్తులలో భాగమే కాబట్టి, ఆ అనివార్యతను యాంత్రికంగా అర్థం చేసుకోగూడదు. చరిత్రను వంకర్లు తీసి సాఫుచేస్తే అది త్వరలోనే పురాణం స్థాయికి దిగజారే ప్రమాదం వుంది.

# గత, ఆగత చరిత్ర గతి నిర్మాణం

## 'సింహావలోకనం' పై సమీక్ష

**మనిషి** తన భవిష్యత్తునే కాదు, గతాన్ని కూడా నిర్మించుకుంటాడు. ఒక దృక్పథంతో, ఒక అవగాహనతో మనం మన గతానికి రూపం ఇచ్చుకునేదాకా అది చరిత్ర కాదు, చరిత్రకు ముడిసరుకు మాత్రమే అవుతుంది.

భవిష్యత్తును నిర్మించే క్రమంలో ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క వర్గానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉంటుంది. కాని గతాన్ని ఆవిష్కరించే 'బాధ్యత' మాత్రం ఇంతవరకు ఎప్పుడూ మేధావులమీదే ఉంటూ వచ్చింది. శ్రామికజనం తమ మాటలలో, పాటలలో గతాన్ని పలికిస్తూ వుంటారు. కాని అవి జ్ఞాపకాలే తప్ప క్రమబద్ధమయిన ఆవిష్కరణ కాదు. ఒక్కొక్కసారి జ్ఞాపకాలు కూడా కాదు, కేవలం చరిత్ర వదిలివెళ్ళిన ప్రతిక్షేపాలు మాత్రమే.

అందుకే మేధావుల అభిమానాన్నీ, విశ్వాసాన్నీ పొందడం పాలకవర్గాలకు అవసరం. అవి ఉన్నంతకాలం వాళ్లు పాలకవర్గాల కళ్లతో చరిత్రను చూస్తారు. ఆ అభిమానాన్నీ విశ్వాసాన్నీ కోల్పోతే ఆ తరువాత కేవలం మేధావులలోని అవకాశ వాదులు మాత్రమే పాలకవర్గం కళ్లతో చరిత్రను చూస్తారు. తక్కినవాళ్లు ఇతర దృక్కోణాల కోసం వెతకడం ప్రారంభిస్తారు.

భారత జాతీయోద్యమ చరిత్ర రచన ఇప్పటివరకు మేధావులకు బూర్జువా వర్గం మీద (నిర్దిష్టంగా చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీమీద) గల విశ్వాసం మీద ఆధారపడుతూ వస్తోంది. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో బూర్జువావర్గం దేశాన్ని బలమయిన ఆధునిక పారిశ్రామిక దేశంగా మలచగలదని మేధావులలో ఉన్న విశ్వాసం వెనక్కి కూడా ప్రసరించి జాతీయోద్యమ చరిత్రలో కాంగ్రెస్ పుట్టుకా, పురోగమనం తప్ప తక్కినవన్నీ అప్రధానమయిన విషయాలుగా కనిపించాయి. ఏ పోరాటం ఎంత విస్తృతమయినది, ఏ పోరాటంలోని జాతీయత ఎంత, ఏ పోరాటాన్ని నడిపిందెవరు, వాటి గొంతు నొక్కిందెవరు, ప్రజలలో సంఘటన,

---

సృజన, మార్చి 1984

కదలిక ఎంతమేరకు కాంగ్రెస్ జెండా కింద వచ్చాయి, ఎంతమేరకు ఆ జెండాకు అతీతం గానో, వ్యతిరేకంగానో వచ్చాయి – ఈ ప్రశ్నలన్నీ చులకనగా తిరస్కరించ బడ్డాయి. ఇవ్వాల్టి విశ్వాసం నిన్నటి ప్రమాణాన్ని నిర్ణయించింది. నిన్నటి చరిత్రకున్న స్వాభావికమయిన ప్రమాణాలు లెక్కలోకి రాలేదు.

ఈ నిర్దిష్టమయిన నేపథ్యంలో పుట్టింది భారతజాతీయోద్యమ చరిత్రకు సంబంధించిన బూర్జువాదృక్పథం.

ఈ దృక్పథం గల చరిత్రను మూడుమాటల్లో చెప్పాలంటే – జాతి యావత్తూ అచేతనంగా కాంగ్రెస్ కోసం నిరీక్షించింది. కాంగ్రెస్ గాంధీ కోసం నిరీక్షించింది. గాంధీ వచ్చాక దేశమంతా సజావుగా స్వాతంత్ర్యం వైపు నడిచింది. 1919 నుండి మెట్లుమెట్లుగా ఖిలాఫత్ ఉద్యమం[1], సహాయనిరాకరణ[2], సైమన్ కమిషన్[3], రౌండ్‌టేబుల్ సమావేశం[4], ప్రొవిన్షియల్ ఎన్నికలు[5], క్విట్ ఇండియా ఉద్యమం[6] 1947లో స్వాతంత్ర్యం – అన్నీ ఒకదాని వెంబడి ఒకటి వచ్చాయి.

ఈ చరిత్రను గురించి రెండు రకాల అభ్యంతరాలు చెప్పొచ్చు. మొదటిది – అసలు ఏ దేశ చరిత్రా ఏ కాలంలోనూ ఇంత సజావుగా, సరళంగా ఉండదు. చరిత్ర ఒక మలుపు తీసుకున్న తరువాత ఆ మలుపు చాలా సహజంగాను, అనివార్యంగాను కనిపిస్తుంది గాని ఆ సహజత్వం భ్రమ మాత్రమే. మలుపు తీసుకోక ముందున్న అన్వేషణ, ఆవేదన, సంక్షోభం, సందిగ్ధం – ఇవన్నీ కూడా చరిత్రలో భాగమే. చరిత్ర తీసుకునే ఏ మలుపయినా అప్పటి పరిస్థితులలో అనివార్యం కాదా అంటే అనివార్యమే. కాని అంతకుముందున్న అన్వేషణ, ఆ అన్వేషణకు సాధనమయిన ఆచరణ – ఆ పరిస్థితులను నిర్ణయించే శక్తులలో భాగమే కాబట్టి, ఆ అనివార్యతను యాంత్రికంగా అర్థం చేసుకోగూడదు. చరిత్రను వంకర్లు తీసి సాఫుచేస్తే అది త్వరలోనే పురాణం స్థాయికి దిగజారే ప్రమాదం వుంది. దేశం సంగతీ, జాతి సంగతీ పక్కన పెట్టి కాంగ్రెస్ సభ్యులనే తీసుకున్నా 1919లో గాని, ఆ తరువాత చాలాకాలం వరకు కూడా వాళ్లందరూ గాంధీ నాయకత్వాన్ని నిర్ద్వంద్వంగా ఏమీ ఆమోదించలేదు. గాంధీ మార్గం స్వాతంత్ర్యాన్ని సంపాదించి పెడుతుందన్న నమ్మకం కాంగ్రెస్‌కు సహితం ఒక పట్టాన ఏర్పడలేదు. మనకు స్కూల్లో చెప్పే చరిత్రలో మాత్రం దేశం యావత్తూ గాంధీ కోసమే కాచుకు

కూర్చున్నట్టూ, ఆయనగారు ఆ మూగ ఆహ్వానాన్ని అందుకొని దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తరలివచ్చినట్టూ, ఒక పథకం ప్రకారం ఆయన దేశ పరిస్థితులను పరిశీలించి ఆ తరువాత రంగంలోకి దిగి నాయకత్వం స్వీకరించినట్టూ, ఆ పిదప ఏ అభ్యంతరాలూ, ఒడుదుడుకులూ లేకుండా ఆయన నాయకత్వం కింద జాతీయోద్యమం నడిచినట్టూ చెప్తారు. ఈ పురాణానికి పరాకాష్ఠ అటెన్‌బరో[7] తీసిన 'గాంధీ' చిత్రం.

రెండవ అభ్యంతరం ఏమిటంటే ఈ చరిత్ర ప్రకారం జాతీయోద్యమంలో కాంగ్రెస్ తప్ప వేరే సంస్థగాని, ఉద్యమంగాని లేవు; ఎవరో కొందరు 'టెర్రరిస్టులు' అని పిలవబడేవాళ్లు ఉన్నమాట వాస్తవమే; వాళ్లను గాంధీ ఆనాడు వ్యతిరేకించినా, ఈనాడు విజేతకు ఉచితమయిన ఔదార్యంతో వాళ్ళను దేశభక్తులుగా కొనియాడే మాటా వాస్తవమే. కాని వాళ్లు మన కళ్ళకు ఎట్లా కనిపిస్తారంటే విష్ణువు అవతారం ఎత్తి రక్షించడానికి రాకముందు రాక్షసులతో యుద్ధం చేయడానికి ప్రయత్నించి చావుదెబ్బలు తినే నిష్ప్రయోజకులయిన పౌరాణిక మునులలాగ. 'మంచివాళ్ళే పాపం, కాని దారీతెన్నూ తెలీక కాలం, ప్రాణం వృథా చేసుకున్నారు' అనుకునేలాగ. ఈ టెర్రరిస్టులయినా మధ్యతరగతి మనుషులు కాబట్టి వాళ్ళకు ఈపాటి ఆదరణ అయినా లభిస్తున్నది కాని కిసాన్ సంఘాలకూ, కార్మిక సంఘాలకూ జాతీయోద్యమంలో ఉన్న పాత్ర అయితే ప్రస్తావనకు కూడా రాదు.

నిజానికి భారత జాతీయోద్యమం ఒకే ఒక ప్రవాహం కాదు. అందులో ఎన్నో పాయలున్నాయి. కనీసం ఆ పాయలన్నింటినీ ఒక ప్రవాహంలోకి తెచ్చిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందా అంటే అదీ లేదు. ప్రవహింపజేయడం అటుంచి ఆనకట్టలు కట్టడంలో గాంధీ నిపుణుడు. అసలు ఆ పాయలన్నీ ఒకే ప్రవాహం ఎన్నడూ కాలేదు. వివిధ ప్రాంతాలలో వివిధ వర్గాల ప్రజలు స్థానికంగా ఎన్నో తిరుగుబాట్లు చేశారు. చాలాసార్లు కాంగ్రెస్‌తో ప్రమేయం లేకుండా చేశారు. ఒక్కొక్కసారి కాంగ్రెస్‌ను కాదని చేశారు. ఒక్కొక్కసారి కాంగ్రెస్ జెండా కిందే కాంగ్రెస్ అహింసా సత్యాగ్రహ సిద్ధాంతాలను పక్కకు పెట్టి తమ ఇష్టం వచ్చినట్టు పోరాటం చేశారు. 1930 ఏప్రిల్ నెలలో చిట్టగాంగ్[8] ఆయుధాగారం మీద

సాయుధంగా దాడిచేసిన టెర్రరిస్టులు గాంధేయమార్గానికి పూర్తిగా వ్యతిరేకమయిన పనిచేస్తూ 'గాంధీ రాజ్యం వచ్చింది' అన్న నినాదం ఇచ్చారట.

ఈ పోరాటాలలో కొన్నింటిని వ్యతిరేకించే ప్రయత్నం, కొన్నింటిని తన చెప్పుచేతల్లోకి తీసుకొని భూమి పోరాటం, కూలిపోరాటం వంటివి మాన్పించి రాట్నం తిప్పించే ప్రయత్నం చేసింది కాంగ్రెస్. అయితే ఈ ప్రయత్నాలు ఎప్పుడో గాని ఫలించలేదు. మరి కాంగ్రెస్ పార్టీ ఘనత ఏమిటంటే – వికేంద్రీకృతమయి ముక్కలు ముక్కలుగా చీలిపోయిన భూస్వామ్య సమాజంలో అది బూర్జువా వర్గాన్ని దేశవ్యాప్తంగా సంఘటితం చేయగలిగింది. ఆ కారణంగా ఆ వర్గం జాతికి నాయకత్వం వహించగలదనే భ్రమ కలిగించింది. చాలామందిని ఆకట్టుకోగలిగింది. అక్కడక్కడ బలమయిన స్థానిక ప్రజాపోరాటాలను నడిపిన చాలామంది తమ పోరాటాలను దేశవ్యాప్తం ఎలా చేయాలో తెలీక వాటిని కాంగ్రెస్ చేతులలో పెట్టారు. అంతమాత్రంచేత కాంగ్రెస్ చరిత్రే జాతీయ ఉద్యమ చరిత్ర అంటే పూర్తిగా తప్పవుతుంది. కాంగ్రెస్ చరిత్రలో ఇమడనివి, ఒక ప్రత్యామ్నాయ ప్రవాహంగా నడిచి జాతివ్యాప్తంగా ప్రజా సంఘటనను సాధించలేకపోవడం వల్ల వట్టిపోయినవి ఎన్నో ఉద్యమాలున్నాయి. వాటిలో 'టెర్రరిస్ట్' ఉద్యమం ఒకటి. ('టెర్రరిస్ట్' అన్నది నిందావాచకమే. కాని 'యశ్‌పాల్' ద్వారా భుజంగరావుగారు చేసిన 'దౌర్జన్యవాదం' అనే అనువాదం అంతకంటే మెరుగ్గా లేదు కాబట్టి ఇంగ్లీష్ మాటనే ప్రయోగిస్తాను.) 1890 నుండి 1935 వరకు సాగిన టెర్రరిస్ట్ ఉద్యమంలో రెండు తరాలున్నాయి. 'సింహావలోకనం' రెండవ తరం ఆత్మకథ.

టెర్రరిస్టులలో మొదటితరానికీ రెండవతరానికీ చెప్పుకోదగ్గ తేడాలున్నాయి. మొదటితరం టెర్రరిస్టులు హిందూమత అభిమానులు. పరమతద్వేషులు కూడా. గత కాలంలో ఒక ఉన్నతమయిన హైందవ సంస్కృతిని ఊహించుకొని, ఆ సంస్కృతిని ముస్లింలూ ఇంగ్లీష్‌వాళ్లూ నాశనం చేశారని భావించి దాన్ని పునరుద్ధరించడానికి వాళ్లు ప్రయత్నించారు. వాళ్ల 'వందేమాతరం' నినాదంలో ఈనాడే కాదు ఆనాడు కూడ జాతీయత ఎంత వుందో హైందవ దురభిమానం అంత వుంది. రెండవతరం టెర్రరిస్టులకు మతం పట్టింపు లేదు. వాళ్ళలో ప్రముఖులు (భగత్‌సింగ్[9], యశ్‌పాల్, భగవతీ చరణ్[10], చంద్రశేఖర్ ఆజాద్[11]

తదితరులు) నాస్తికులు. వాళ్లు మార్క్సిస్టు భౌతికవాదం పట్ల మొగ్గు చూపారు. అంతేకాదు. మొదటితరం ఎక్కువగా సంపన్నవర్గాల నుండి వచ్చింది. బెంగాల్‌కు చెందిన 'అనుశీలన్'[12], 'యు(జు)గాంతర్'[13] బృందాలు అప్పటి టెర్రరిస్టు గ్రూపులలోకెల్లా పేరుకెక్కినవి. తూర్పుబెంగాల్‌లో రైతులు అత్యధికంగా ముస్లింలైతే జమీందార్లు హిందువులు. 1890 నాటికి జమీందార్లలో చాలామంది చితికిపోయి తమ హోదాను, దర్జాను నిలుపుకోలేకపోయారు. ఈ జమీందారీ భూస్వామ్య కుటుంబాలనుండి వచ్చినవారే మొట్టమొదటి బెంగాల్ టెర్రరిస్టులలో అత్యధికభాగం. రెండవతరం శ్రామికవర్గం నుండి వచ్చిందని చెప్పలేం గాని, అది చాలావరకు దిగువ మధ్యతరగతి వ్యక్తులను ఆకర్షించగలిగింది. మొదటి తరానికి వ్యక్తిగత హింసావాదమే తప్ప ప్రజా ఉద్యమాలతో సంబంధం లేదు. పైగా వాళ్లలో కొందరిలో ప్రజావ్యతిరేక భావాలు కూడా ఉండేవి. జాతీయోద్యమంలో భాగంగా రైతులకు కౌలు నిరాకరణ కార్యక్రమం ఇవ్వడాన్ని అరవింద ఘోష్[14] నిరాకరించాడు. ఎందుకంటే అది జమీందార్ల అవసరాలకు వ్యతిరేకం కాబట్టి అని స్పష్టంగానే కారణం చెప్పాడు. రెండవతరం టెర్రరిస్టులు తమ పద్ధతుల కారణంగా ప్రజా ఉద్యమాలతో సంబంధాన్ని నిలుపుకోలేకపోయారు గాని, వారు మొదట్లో ప్రజా ఉద్యమాలతో సంబంధం ఉన్నవారే. దృక్పథంలో మాత్రం వాళ్ళది చివరిదాకా కచ్చితమయిన శ్రామికవర్గ దృక్పథమే. రైతుకూలీ రాజ్యాన్ని తమ ఆదర్శంగా చాటుకున్నారు. వాళ్లు నిరసన తెలపడానికి ఎంచుకున్న అంశాలు కూడా వాళ్ళ ప్రజాస్వామిక దృక్పథాన్ని చాటుతాయి. 1929లో వాళ్లు బ్రిటిష్ ప్రభుత్వం చట్టరూపం ఇవ్వబోతున్న రెండు బిల్లులపట్ల నిరసన తెలుపుతూ ఢిల్లీ అసెంబ్లీలో బాంబులు వేశారు. ఆ బిల్లులలో ఒకటి నాసా వంటి Public Safety Bill, రెండవది కార్మికుల సమ్మెహక్కును నిరోధించే Trades Disputes Bill.

ఈ తేడాలన్నిటికీ కూడా భగత్‌సింగ్ చక్కటి నిదర్శనం. భగత్‌సింగ్ జాట్ సిక్కు కులస్తుడు. జాట్ అన్న పదం తెలుగులో 'కాపు' లాంటిది. అది ఒక కులాన్నీ సూచిస్తుంది, రైతు అన్న అర్థమూ ఇస్తుంది. భగత్‌సింగ్‌ది పశ్చిమ పంజాబులోని హోషియార్‌పూర్ జిల్లా నుండి లయాల్‌పూర్ జిల్లాకు వలసవచ్చిన రైతు కుటుంబం. ఆ రోజులలో (అంటే 1920 ప్రాంతంలో) పశ్చిమ, మధ్య పంజాబ్‌లలోని జలంధర్,

హోషియార్‌పూర్, లయాల్‌పూర్, అమృతసర్ జిల్లాలలో ఒక బలమైన సిక్కు రైతాంగ ఉద్యమం నడిచింది. రూపంలో ఇది మత సంబంధమయిన ఉద్యమమే. ఎందుకంటే సిక్కుల గురుద్వారాలను అవినీతిపరులయిన మహంత్‌ల చేతుల నుండి రక్షించి ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలన్నది ఈ ఉద్యమం యొక్క ప్రధానమయిన డిమాండు. అయితే ఆ మహంత్‌లు మతం పేరు చెప్పి బాగా బలిసిన భూస్వాములు కావడంవల్ల ఈ 'గురుద్వారా' లేక 'అకాలీ' ఉద్యమానికి రైతాంగ పోరాట స్వభావం బలంగా వుండింది. 1921 నాటికి ఈ ఉద్యమం తీవ్రరూపం తీసుకొని శిస్తు నిరాకరణ, వడ్డీవ్యాపారస్తులపై దాడులు మొదలయిన పోరాట రూపాలను అవలంబించింది. టెర్రరిస్టు పద్ధతులను కూడా అనుసరించింది. ఈ ఉద్యమంలో భగత్‌సింగ్ తండ్రి కిషన్‌సింగ్ చురుగ్గా పాల్గొన్నట్టు యశ్‌పాల్ చెప్తాడు. సరిగ్గా అదే సమయంలో రౌలట్ బిల్లు[15] వ్యతిరేక ఉద్యమం, గాంధీగారి ప్రథమ సహాయ నిరాకరణ ఉద్యమం రావడంతో ఆ 'కాంగ్రెస్' ఉద్యమాలు పంజాబులో అత్యంత బలమయిన ప్రజా ఉద్యమాల రూపం తీసుకున్నాయి. కాంగ్రెస్ కళ్ళకు ఇదంతా గాంధీగారి మహిమగా అనిపించినా ఆశ్చర్యం లేదు, కాని వెనకవున్న సిక్కు రైతాంగ ఉద్యమాన్నీ, అంతకు పూర్వం నుండి వున్న గదర్‌పార్టీ[16] ప్రభావాన్నీ లెక్కలోకి తీసుకోకపోతే అప్పటి పంజాబ్‌లోని జాతీయ ఉద్యమం తీవ్రత అర్థం కాదు. భగత్‌సింగ్ తొమ్మిదవ తరగతి చదువు మానుకొని సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నాడు. 1922లో చౌరీచౌరా[17] దాడి ఫలితంగా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని విరమించుకున్నాడు. పంజాబులో సిక్కు రైతాంగ ఉద్యమం మాత్రం ముందుకే సాగింది. అప్పుడే భగత్‌సింగ్ 'అకాలీ' అయ్యాడు. జుట్టు పెంచుకొని ఖడ్గం ధరించి గురుద్వారా ఉద్యమంలో పాల్గొన్నాడు. అయితే ఆ ఉద్యమం ముగిసిన తరువాత మళ్లీ ఎన్నడూ మత సంబంధమయిన ఆసక్తి చూపలేదు.

యశ్‌పాల్ కూడా మధ్యతరగతి రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆ రోజులలో పంజాబీ అగ్రవర్ణ హిందువుల మీద ఆర్యసమాజం ప్రభావం చాలా వుండేది. ఆర్య సమాజం తాత్విక దృక్పథం ఎలాగున్నా, దానికి బ్రిటిష్ వ్యతిరేక జాతీయ స్వభావం ఉండేది. యశ్‌పాల్ తల్లి ఆర్య సమాజంలోను, కాంగ్రెస్‌లోను

కొంతకాలం పనిచేసింది. యశ్‌పాల్ కూడా ఆర్యసమాజం వారి 'గురుకులం'లో మిడిల్ స్కూల్ దాకా చదువుకున్నాడు. అయితే భగత్‌సింగ్ మీద అకాలీ ప్రభావం ఎంత దూరం నిలిచిందో యశ్‌పాల్‌మీద ఆర్యసమాజం ప్రభావమూ అంతే.

ఇద్దరు కూడా 1919–22 మధ్యకాలంలో ఖిలాఫత్ ఉద్యమంలోనూ, సహాయ నిరాకరణ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. యశ్‌పాల్ ఉపన్యాసకుడయ్యాడు. వీళ్లిద్దరిలాగే ఎంతోమంది ఇల్లూవాకిలీ వదిలి ఉద్యమంలోకి దిగారు. 1922లో గాంధీ చౌరీచౌరా సంఘటనకు బెదిరి ఉద్యమాన్ని విరమించడంతో అందరూ కూడా సందిగ్ధంలో పడ్డారు. దాని గురించి యశ్‌పాల్ ఇలా అంటాడు – "ఉత్సాహంగా ముందుకు ఉరుకుతున్న ప్రజలలో నిరాశా నిస్పృహలు వ్యాపించాయి. ఎందరో కార్యకర్తలు ఆంగ్ల ప్రభుత్వంతో తుది పోరాటాన్ని సాగించడానికి అప్పటికే ఇల్లూవాకిలీ వదిలి ఉద్యమంలోకి దూకారు. ఘోర నిరాశతో వాళ్లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇంక కాంగ్రెస్ అంటే ఖద్దరునూ, అహింసనూ ప్రచారం చేయడమే కాబోలు  అన్న భావన కార్యకర్తలలో వ్యాపించింది. కార్యకర్తలను గ్రామాలకు వెళ్లి కాంగ్రెస్ ఆదర్శాలను ప్రచారం చేయమన్నారు. ఖద్దరు గురించి ప్రచారం చేయమన్నారు. కాంగ్రెస్ మీద, గాంధీ మీద పూర్తి విశ్వాసాన్ని ఉంచి ఖద్దరు ధరించితే స్వరాజ్యం దానంతటదే వస్తుందన్నారు. ప్రజలు నిఖార్సయిన హిందూ, ముస్లిం, సిక్కు మతస్తులు కావాలన్నారు. ఇవన్నీ జరిగిననాడు స్వరాజ్యం వచ్చినట్టేనన్నారు."

గాంధీ ఈ ఎత్తుగడల్ని అవలంబించడం ఇది మొదటిసారే గాని కడసారి కాదు. ఉద్యమానికి పిలుపివ్వడం, కొంతకాలం ఉద్యమాన్ని పెరగనివ్వడం, ఆ బెదిరింపుతో బ్రిటిష్ ప్రభుత్వం నుండి రాయితీలు సంపాదించడం, హఠాత్తుగా ఉద్యమాన్ని విరమించి రాజకీయాలు వదిలిపెట్టి అహింస, ఖద్దరు, మత సామరస్యం, దీనజనోద్ధరణ మొదలయినవి ప్రచారం చేయమని కార్యకర్తలను గ్రామాలకు పంపడం – ఇదీ గాంధీ అవలంబించిన వ్యూహం. ఈ వ్యూహాన్ని కార్యకర్తలు ఎంతవరకు ఆమోదించారు? "కార్యకర్తలకు కాంగ్రెస్ నాయకులు చెప్పిన పై విషయాలలో నమ్మకమూ లేదు, ఆసక్తీ లేదు. కార్యకర్తలు నిరాశా నిస్పృహల్లో తమలోతాము అనేక విధాల తర్కించుకునేవారు. ఇల్లూవాకిలీ వదిలి

తాము ఇలా వచ్చింది మత ప్రచారం చేయడానికా, పరప్రభుత్వంతో పోరాడి దేశాన్ని స్వాతంత్ర్యపరచడానికా?" అని మధనపడి చివరికి ఎంతోమంది కార్యకర్తలు ఉద్యమాన్ని వదిలి, వ్యవసాయమైనా చేసుకోవచ్చునని తమ గ్రామాలకు మరలిపోయారని యశ్‌పాల్ అంటాడు.

పోరాటం నిలిపేసిన తరువాత ఏ సంస్థ అయినా త్వరగా దిగజారిపోతుంది. అయినా నాయకత్వం పిలుపునందుకొని కొంతమంది కార్యకర్తలతో కలిసి యశ్‌పాల్ గ్రామాలు తిరుగుతూ కాంగ్రెస్ ఆదర్శాలను ప్రచారంచేస్తూ ఉపన్యాసాలు ఇస్తాడు కొంతకాలం. కాని ప్రచారం చేయడానికి ఉద్యమం లేని కారణంగా వాళ్ళ ఉపన్యాసాలు త్వరలోనే రాజకీయాలను కోల్పోతాయి. ఒకడు వెకిలి జోకులు వేయడం మొదలుపెడతాడు. మరొకడు మత సామరస్యాన్ని ప్రచారం చేస్తూ హిందువులకోసం 'హరహరమహదేవా' అని, ముస్లింలకోసం 'అల్లాహో అక్బర్' అని, సిక్కుల కోసం 'సత్‌శ్రీఅకాల్' అని, వేరువేరుగా నినాదాలిస్తాడు. యశ్‌పాల్ మాత్రం చాలా ఓపిగ్గా భారతదేశాన్ని బ్రిటిష్‌వాళ్లు ఏ విధంగా దోపిడీ చేస్తున్నదీ గణాంకాల సహాయంతో వివరంగా చెప్తాడు. కాని పోరాటం లేనందువల్ల జనం ఆసక్తి చూపరు. చివరికి విసుగొచ్చి యశ్‌పాల్ ఉద్యమాన్ని వదులుకొని మళ్లీ చదువుకోవడానికి లాహోర్ వెళ్తాడు. అక్కడ నేషనల్ కాలేజీలో భగత్‌సింగ్, యశ్‌పాల్, సుఖదేవ్[18] సహాధ్యాయులవుతారు. భగవతీచరణ్ వీళ్ళకు రెండేళ్లు సీనియర్. కాలేజీ స్థాపకుడు కాంగ్రెస్ నాయకుడు లాలాలజపత్‌రాయ్. వీళ్ళ అధ్యాపకులలో ఒకరు జయచంద్ర విద్యాలంకార్[19] అనే పాతతరం టెర్రరిస్టు. అప్పటికి పంజాబులో 'హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీ'[20] అనే టెర్రరిస్టు సంస్థ వుంది. దాన్ని జయచంద్ర విద్యాలంకార్ తన స్వంత దుకాణంలాగ నడుపుతుంటాడు.

యశ్‌పాల్ సాహిత్యకారుడిగా కొంత పేరు సంపాదించుకుంటాడు. ఈ లోపల భగత్‌సింగ్, భగవతీచరణ్ కలిసి 'నౌజవాన్ భారత్ సభ' అనే ప్రజాసంఘాన్ని స్థాపిస్తారు. అందులో యశ్‌పాల్, ఎహసాన్ ఇలాహి[21], సుఖదేవ్ తదితరులు చేరతారు. అది 'హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీ'కి ప్రజాసంఘంగా ఉద్దేశించబడింది. ఇటువంటి ప్రజాసంఘాలు పెట్టుకోవడమే టెర్రరిస్టులకు కొత్తపోకడ. ఈ అభివృద్ధిని గుర్తించాల్సిందే, కాని అంతమాత్రం చేత వాళ్లకు పార్టీకీ ప్రజాసంఘానికీ గల

సంబంధాన్ని గురించి స్పష్టమయిన సైద్ధాంతిక అవగాహన ఉందనుకోవడానికి వీలులేదు. నిజానికి ఈ పుస్తకాన్నిబట్టిపోతే వాళ్లకసలు సిద్ధాంత సంబంధమయిన కుతూహలం సహితం అంతగా ఉన్నట్టు అనిపించదు.

'నౌజవాన్ భారత్ సభ' మొదటి నుండీ కూడా తన ప్రత్యేకతను స్పష్టం చేసుకుంది. దాని ముఖ్య కార్యక్రమం ఏమిటంటే కాంగ్రెస్ యొక్క దళారీ రాజకీయాలను విమర్శించడం, ప్రజల భావాలను 'తీవ్రవాద రాజకీయాలకు' అనుగుణంగా మార్చడం, సాయుధ పోరాటం పట్ల ప్రజలకు సానుభూతి కల్గించడం. అంతేకాకుండ మత సంబంధమయిన భావాలను విమర్శించడం కూడా ఒక ముఖ్య కార్యక్రమంగా వాళ్లు పెట్టుకున్నారు. పైన చెప్పినట్టు కాంగ్రెస్ బ్రాండు 'మతసామరస్యానికి' అర్థం ఏమిటంటే ఏ మతం వారిదగ్గర ఆ మతం నినాదాలివ్వడం. నౌజవాన్ భారత్ సభలో అందుకు సరిగ్గా విరుద్ధంగా జరిగేది. మతాన్ని విమర్శించడానికి పెట్టే మీటింగులలో ఏ మతంవారు ఆ మతాన్నే విమర్శించాలన్న నియమం పాటించేవారు.

ఆనాటికి టెర్రరిస్టు సంస్థలన్నీ చాలా బలహీనస్థితిలో ఉన్నాయి. పాత విప్లవ నాయకులంతా జెయిలులోనో లేక క్రియాశూన్యమయిన స్థితిలోనో వున్నారు. టెర్రరిజంకు సామాన్య గుణమయిన పరస్పర నిందలూ, ఆరోపణలూ వాతావరణాన్ని కలుషితం చేశాయి. జయచంద్ర విద్యాలంకార్ తన క్రియాశూన్యతను కప్పి పుచ్చడానికి భగవతీచరణ్ మీద 'సిఐడి ఏజెంట్' అన్న ఆరోపణ ప్రచారం చేశాడు.

ఇటువంటి వాతావరణంలో భగత్‌సింగ్ పూనుకొని విప్లవసంఘాన్ని పునరుద్ధరిస్తాడు. ఢిల్లీ, ఆగ్రా, కాన్పూర్, పాట్నా, కలకత్తా నగరాలు తిరిగి విప్లవ మార్గం అంటే ఇష్టం ఉన్నవాళ్లందరినీ కలుస్తాడు. అందరూ కలిసి 1928 సెప్టెంబర్ 8,9 తేదీలలో ఢిల్లీలో ఒక సమావేశం జరిపి 'హిందుస్తాన్ సామ్యవాద ప్రజాతంత్ర సంఘం' (Hindustan Socialist Republican Association) ఏర్పరచుకుంటారు. ఇది కొత్తతరానికి నాంది అనడానికి చాలా లక్షణాలున్నాయి. ఒకటి, పాత టెర్రరిస్టు 'దాదా' లెవ్వరికీ ఇందులో స్థానం లేదు. ముందునుండీ సాయుధపోరాటానికి అగ్రగామిగా వుంటూ వచ్చిన బెంగాల్‌లోని 'అనుశీలన్', 'యుగాంతర్' బృందాలు HSRA లో చేరనే లేదు. నాయకులంతా (భగత్‌సింగ్,

భగవతీచరణ్, ఆజాద్, సుఖదేవ్, తదితరులు) మూడు పదులు నిండని యువకులు. రెండవది 'సోషలిస్టు' అన్న పదం. మొదటితరం టెర్రరిస్టుల ఆధ్యాత్మికవాదం స్థానే ఇప్పుడు సోషలిజం తమ లక్ష్యం అన్న భావన పుట్టుకొచ్చింది. ఈ పరిణామంలో పంజాబు విప్లవకారులు అగ్రభాగాన నిలిచారు. దీనికి పంజాబులోని రైతాంగ ఉద్యమాలు కొంత కారణమయితే, ఎం.ఎన్.రాయ్ 1921 లో తాష్కెంట్‌లో స్థాపించిన ప్రవాస కమ్యూనిస్టు పార్టీకి పంజాబులో వున్న ప్రభావం కొంత కారణం. భగవతీచరణ్‌కు ఈ పార్టీతో సంబంధాలుండేవి. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ పట్టణానికి చెందిన శివవర్మ[22], విజయకుమార్ సిన్హా[23] అప్పటికే కాన్పూర్‌లో సంఘటితమయిన బట్టలమిల్లుల కార్మికులతో సంబంధం ఉన్నవారు కావడం వల్ల వాళ్లు కూడా 'సోషలిజం' అన్నమాటకు సుముఖంగా వున్నారు. అయితే ఈ కొత్త సంస్థను నిజమయిన విప్లవసంస్థగా భావించడానికి వీలు లేదు. అందుకు కారణం యశ్‌పాల్ తానే చెప్తాడు. "మేము వర్గ విభేదాల్ని తెలుసుకున్నాము. రైతుకూలీ రాజ్యం రావాలని మనసారా కోరుకున్నాము. అయితే కార్మిక కర్షకుల శక్తిని సంఘటితపరిచి, వర్గపోరాటాన్ని ఉజ్జీవింపజేసే వ్యావహారిక పద్ధతి మాకు తెలీదు. మా ఆదర్శం రైతుకూలీ రాజ్యమే కాని మా మార్గం రైతుకూలీలకు సంబంధించింది కాదు." మరి వీళ్ల మార్గం ఏమిటి? "అమాయకులూ, అజ్ఞానులూ, పీడితులూ అయిన ప్రజలకోసం మేము మా ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధం అవుతున్నామేగాని, వారిలో కలవడానికీ వారిలో చైతన్యం కలిగించడానికీ సిద్ధం కాలేకపోతున్నాం." ఇవన్నీ యశ్‌పాల్ 1951 నాటి చైతన్యంతో చెప్పిన మాటలు. 1928 లో ఈ తేడా తెలిసివుంటే అసలు ఆ లోపం సంభవించి ఉండేదే కాదు. తమ మార్గం టెర్రరిజం కాదనీ, సాయుధ విప్లవమనీ అన్నారు కాని ఈ తేడా ఏమిటన్నది అస్పష్టంగానే వుండిపోయింది.

ప్రజాఉద్యమాల నుండి ఈ విప్లవకారుల దూరమెంతో మొదట్లోనే బయట పడింది. కొత్తగా ఏర్పడ్డ సంస్థకు డబ్బులు కావాలి. ప్రజాపునాది లేని విప్లవ సంఘాలు డబ్బులకోసం డెకాయిటీలు చేయకతప్పదు. మొట్టమొదటి ప్రయత్నం భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ కలిసి బేతియా పట్టణంలో చేసి విఫలమవుతారు. బేతియా ఉత్తరప్రదేశ్‌లో అప్పటికి కనీసం 8 సంవత్సరాలుగా సాగుతున్న కిసాన్

ఉద్యమానికి కేంద్రమయిన జిల్లాల్లో ఒకటి. రైతుకూలీ రాజ్యం ఆదర్శంగాగల విప్లవకారులకు అటువంటి జిల్లాలో డబ్బు సంపాదించడానికి డెకాయిటీ తప్ప మార్గం లేదంటే వాళ్ళకు ఆ రైతుల నుండి, ఆ కూలీల నుండి ఉన్న దూరమెంతో అర్థమవుతుంది.

ఈ విప్లవకారులకు సిద్ధాంత సంబంధమయిన కుతూహలం అంతగా ఉన్నట్టు లేదన్నాను కదా! ఎందుకంటే తమ సంస్థ ఏర్పరచుకున్నప్పుడు వీళ్లు ఒక మానిఫెస్టో లాంటిదేదీ తయారు చేసినట్టు కనిపించదు. తరువాత కాలంలో ఏదయినా 'చర్య' చేసినప్పుడుగాని, లేక గాంధీ తమ మీద చేసిన విమర్శకు సమాధానంగాగాని రాసిన కరపత్రాలే వీళ్లకు మానిఫెస్టోలయ్యాయి. ఆ కరపత్రాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, వీళ్లకు సమగ్రమయిన విప్లవ సిద్ధాంతం లేకున్నా, కొన్ని విషయాలలో ఉండవలసిన స్పష్టత ఉన్నట్టు తోస్తుంది. 1929 డిసెంబర్‌లో వైస్రాయి రైలుకింద బాంబు పెట్టిన తరువాత రాసిన ఒక కరపత్రంలో తాము చేస్తున్న టెర్రరిస్టు చర్యలకూ, నిజమయిన విప్లవపోరాటానికీ గల తేడాను గురించీ, సంబంధాన్ని గురించీ ఒక అవగాహన ఇస్తారు. "దేశంలోని యువకులు నేడు విప్లవానికి సంసిద్ధులవుతున్నారు. మానసిక దాస్యాన్నుండి, మతపిచ్చి నుండి బయటపడుతున్నారు. ఈ దేశపు యువకులు విప్లవాన్ని అధ్యయనం చేస్తున్నారు. విదేశీయుల దాస్యశృంఖలాలను తెంచుకోవడానికి సంఘర్షిస్తున్నారు. ఈ సంఘర్షణల్లోంచి విప్లవజ్వాలలు ప్రజ్వరిల్లుతాయి. ఆ జ్వాలల్లో దోపిడీ విధానం భస్మమైపోతుంది. అన్యాయానికీ, దోపిడీకీ వ్యతిరేకంగా యువకుల హృదయాల్లో ప్రజ్వరిల్లిన క్రోధాగ్ని టెర్రరిజంగా అక్కడక్కడా బయటపడుతుంది. ఈ టెర్రరిజం రాబోయే సాయుధ పోరాటానికి స్వస్తివాచకం. *(రచయిత ఉద్దేశ్యంలో నాందీ వాచకం అయివుంటుంది – సాహితీ మిత్రులు)* దీన్ని సంపూర్ణమయిన విప్లవం అనడానికి వీలులేదు. అయితే ఈ టెర్రరిజంను మినహాయించి విప్లవమూ సంభవం కాదు. ఇంతవరకు ప్రపంచంలో ప్రభవించిన విప్లవాలన్నీ టెర్రరిజంతోనే ప్రారంభమయాయి. టెర్రరిజం దోపిడీదారుల్ని హడలగొడుతుంది. దీనులూ, నిరపాయులూ అయిన ప్రజలకు ఆత్మవిశ్వాసాన్నీ ఉత్సాహాన్నీ ఇస్తుంది. మా ఆదర్శం టెర్రరిజం కాదు. అయితే టెర్రరిజం విప్లవాన్ని ప్రభవింపజేయడానికి

సహకరిస్తుంది. విప్లవం ప్రజలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యాల్ని ప్రసాదిస్తుంది". ఈ విశ్లేషణలో టెర్రరిజంను సమర్థించే 'అతివాదం' కొంత ఉన్నమాట వాస్తవమే కాని ఒక మౌలికమయిన చారిత్రక సత్యం కూడా వుంది. ప్రపంచంలో చాలా విప్లవాలు టెర్రరిజంతో ప్రారంభమయ్యాయన్నది కాదనలేని వాస్తవం.

ఆచరణ మాటకొస్తే వీళ్లలో ఏ లోపమున్నా ప్రయత్నలోపం ఉందని మాత్రం అనలేము. 1928లోనే 'చర్య'లు ప్రారంభించారు. ఆ సంవత్సరంలో సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించమని కాంగ్రెస్ పిలుపిచ్చింది. అలా ఇవ్వడానికి గల కారణం యశ్‌పాల్ మాటలలో, "ఎంత బ్రతిమిలాడినా, దేబిరించినా తమ పార్టీ సభ్యుడిని ఒక్కణ్నీ ఆ కమిషన్‌లోకి తీసుకోలేదని కాంగ్రెస్‌వారి బాధ". నవజవాన్ భారత్ సభ కూడా సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించింది. అయితే వీళ్ల వ్యతిరేకతకు గల కారణం వేరే. "మా అదృష్టాన్ని నిర్ణయించడానికి ఇంగ్లీష్ ప్రభుత్వానికి హక్కు లేదు. అసలు కమిషన్‌ను పంపడానికి వాళ్లెవరు?" అన్నది వాళ్ల అభ్యంతరం.

లాహోరులో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ఊరేగింపు జరిగింది. లాలా లజపతిరాయ్ ఊరేగింపుకు నాయకుడు. పోలీసులు ఊరేగింపు మీద దారుణంగా లాఠీచార్జీ జరిపి ఆయనను కూడా కొట్టారు. అప్పుడు ఆయన నికార్సయిన కాంగ్రెస్ నాయకుడిలాగ ప్రవర్తించాడు. "పోలీసుల అమానుషమయిన లాఠీచార్జీకి నిరసనగా ఊరేగింపును విరమించుకుంటా" అన్నాడు. అన్నం దొరక్కపోతే నిరసనగా ఉపవాసం ఉండే ఫిలాసఫీ ఇది. దీన్ని సత్యాగ్రహం అంటారు. ఆ సాయంత్రం లాఠీచార్జీ పట్ల నిరసనగా బహిరంగసభ జరిపితే అందులో లాలాజీ చాలా ఆవేశంగా మాట్లాడాడట. వింటూన్న సుఖదేవ్ యశ్‌పాల్‌తో నవ్వుతూ ఈ విధంగా అంటాడు. "అంతకంటె ఏం చేయగలడు! పొద్దున్న (కోపం వచ్చి) ఊరేగింపు ఆపాడు. ఇప్పుడు ఇంకొంచెం కోపం వస్తే ఈ సభను మధ్యలో వదిలి వెళ్లిపోతాడు."

అయినా ఆ లాఠీదెబ్బల ఫలితంగా లాలాజీ 17 నవంబర్ 1928 నాడు చనిపోతాడు. అంతిమ యాత్రలో పాల్గొన్న లక్షలమందిలో నవజవాన్ భారత్ సభ సభ్యులూ వున్నారు. మృతదేహాన్ని కాలబెట్టిన తరువాత బ్రిటిష్ వాళ్లుగాని, పోలీసులుగాని ఆ రాత్రి చితిని అపవిత్రం చేయకుండ చూడడానికి యశ్‌పాల్,

భగవతీచరణ్ చలిలో శ్మశానం దగ్గర కాపలా పడుకుంటారు. అంతేకాదు, లాలాజీ మరణానికి ప్రతీకారంగా లారీచార్జీకి బాధ్యుడయిన పోలీస్ అధికారి శాండర్స్[24]ను వీళ్లే చంపుతారు. బీహార్ నుండి చంద్రశేఖర్ ఆజాద్ కూడా వస్తాడు. అందరూ కలిసి పథకం వేయగా భగత్‌సింగ్, రాజగురు[25] అతన్ని చంపుతారు. కాంగ్రెస్ పార్టీ యొక్క దళారీ రాజకీయాలను ఎండగట్టడం ఒక ముఖ్య కార్యక్రమంగా పెట్టుకున్న ఈ విప్లవకారులు, ఒక కాంగ్రెస్ నాయకుడి మరణాన్ని జాతికి దెబ్బగా పరిగణించి ప్రతీకారభారం తమమీద వేసుకున్నారు. ఈ ఔదార్యానికి మారుగా వాళ్లకు గాంధీనుండి తిట్లూ, నిందలూ తప్ప వేరే ఏమీ దక్కలేదు. సాండర్స్‌ను చంపినందుకు 1931 మార్చి 23న భగత్‌సింగ్‌ను, రాజగురును, సుఖదేవ్‌ను ఉరితీసినప్పుడు వాళ్లను కాపాడడానికి గాంధీ ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. సరిగ్గా అదే సమయంలో వైస్రాయితో ఢిల్లీలో ఒప్పందం చేసుకుంటూన్న గాంధీ, కాంగ్రెస్ సత్యాగ్రహులను విడిచిపెట్టాలనీ, ఉప్పు తయారీమీద పన్ను తొలగించాలనీ షరతులు పెట్టాడే తప్ప ఈ విప్లవకారుల ఉరిశిక్ష రద్దుకోసం ప్రయత్నించినట్టు కనబడదని చరిత్రకారుడు సుమిత్‌సర్కార్[26] అంటాడు.

ఇదంతా తరువాతి సంగతి. వెంటనే మాత్రం భగత్‌సింగ్ గాని, ఎవరుగాని పోలీసులకు దొరకలేదు. తమ సంస్థ పేరుమీద ఒక కరపత్రం వేసి సాండర్స్‌ను హత్య చేసింది తామేనని వాళ్ళే ప్రపంచానికి నిర్భయంగా చాటుకున్నారు. ఎందుకు హత్య చేశారంటే, “ఒక మానవుణ్ణి మరొక మానవుడు దోచుకోవడానికి వీలులేని న్యాయసమ్మతమయిన సాంఘిక రాజకీయ వ్యవస్థ కోసం మేము క్రాంతిని ఆవాహన చేస్తున్నాము” అన్నారు. ఇది ఆదర్శమేగాని, దీనికి కావలసిన సిద్ధాంతంగాని, వ్యూహం, ఎత్తుగడలుగాని (యశ్‌పాల్ భాషలో ‘వ్యవహార పద్ధతి’) లేకపోవడం వల్ల సాండర్స్‌ను హత్యచేసిన తరువాత జనంలో కలిసిపోయే అవకాశం లేక చెట్టుకొకరూ పుట్టకొకరూ అయ్యారు. అయిన తరువాత మళ్ళీ ఒకదాని తరువాత ఒకటి ఇటువంటి ‘చర్యలు’ చేయడమే తప్ప ప్రజా ఉద్యమ ప్రత్యామ్నాయం వాళ్ళకు లేదు. అందువల్ల ఎప్పుడో ఒకప్పుడు అందరూ పట్టుబడి ఉద్యమం మూతపడక తప్పదు.

పంజాబు నుండి పరారై అందరూ ఆగ్రా చేరుకుంటారు. అక్కడ తమ రెండవ 'చర్య'ను నిర్ణయించుకుంటారు. 1929లో బ్రిటిష్ ప్రభుత్వం Public safety bill అని, Trades disputes bill అని రెండు బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. వాటిని కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకించినప్పటికీ వైస్రాయి తన ప్రత్యేక వీటో అధికారంతో ఆమోదించబోతున్నాడు. ఆనాడు అసెంబ్లీలో బాంబులు వేసి ఆ శాసనాల పట్ల ప్రజల అసంతృప్తిని వ్యక్తపరచాలనీ, అసెంబ్లీలో కూర్చున్న కాంగ్రెస్ నాయకుల నిష్ప్రయోజకత్వాన్ని ఎండగడుతూ కరపత్రం వేసి దాన్ని కూడా అదే సమయంలో అసెంబ్లీలోకి విసిరివేయాలనీ, అక్కడి నుండి పారిపోకుండ అరెస్టయి విచారణ సమయంలో తమ ఆదర్శాలను ప్రజలకు వివరించి చెప్పాలనీ నిర్ణయించుకుంటారు. ఆ పని చేసే బాధ్యత భగత్‌సింగ్‌కూ, బటుకేశ్వరదత్తు[27]కూ ఇవ్వబడుతుంది. అసెంబ్లీలో బాంబు వేయాలంటే ఎవరిమీద వేయాలి అన్న ప్రశ్న తలెత్తుతుంది. బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి అయిన హోం మెంబరు మీద వేస్తే అతనికి బాగా దగ్గరగా కూర్చునే మోతీలాల్ నెహ్రూ[28], విఠల్‌భాయి పటేల్[29]లకు కూడా ప్రాణాపాయం కలుగుతుంది. కాబట్టి బాంబు ఎవ్వరి మీదా వేయకుండా వెనుకనున్న గోడమీదికి వేస్తారు. వేస్తూ, "విప్లవం వర్ధిల్లాలి ! సామ్రాజ్యవాదం నశించాలి!" అని నినాదాలిస్తారు. ఎట్లాగూ జెయిలుకు పోదల్చుకున్నారు కాబట్టి, బ్రిటిష్ హోం మెంబరునూ ఇద్దరు ముగ్గురు ప్రముఖ కాంగ్రెస్ నాయకులనూ చంపి ఉండవచ్చును కాని వాళ్లు కాంగ్రెస్‌ను దళారీ రాజకీయ పార్టీగా ఎంచి కూడా తమ ప్రత్యర్థిగానే తప్ప శత్రువుగా చూడలేదు.

ఆ తరువాత భగత్‌సింగ్, బటుకేశ్వరదత్తులు అరెస్టుకాగా తక్కినవాళ్లు మరో 'చర్య' గురించి ప్రయత్నాలు మొదలుపెట్టారు. వైస్రాయి వెళ్తున్న రైలు కింద బాంబు పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ బాధ్యత యశ్‌పాల్‌ది. చాలా ప్రయాసపడి 1929 డిసెంబర్ నెలలో ఆ పని చేయగలుగుతారు. కాని వైస్రాయి చావడు. కొద్దిలో తప్పించుకుంటాడు. గాంధీ ఈ ప్రయత్నాన్ని దూషించడం, భారతీయులకు మిత్రుడయిన వైస్రాయి ప్రాణాలు కాపాడినందుకు భగవంతుడికి ధన్యవాదాలు తెల్పడం మాత్రమే కాక తన పరపతినంతా ఉపయోగించి లాహోర్ కాంగ్రెస్ మహాసభలో అతిస్వల్ప మెజారిటితో ఈ చర్యను ఖండించే తీర్మానం

చేయిస్తాడు. తన 'యంగ్ ఇండియా' పత్రికలో బాంబులను ఆరాధించే వాళ్లుగా ఈ విప్లవకారులను విమర్శిస్తూ రాస్తాడు. దానికి సమాధానంగా చంద్రశేఖర్ ఆజాద్ పేరు మీద విప్లవకారులు ఒక కరపత్రం వేసి పంచుతారు. అందులో చాలా విషయాలు స్పష్టం చేస్తారు. "విప్లవం అంటే మా ఉద్దేశ్యంలో ఒక్క పర ప్రభుత్వంతో పోరాడడం మాత్రమే కాదు. మా విప్లవానికి ఆదర్శం న్యాయసమ్మతమైన ఒక కొత్త సమాజాన్ని స్థాపించడం. పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేసి వర్గరహితమయిన సమాజ వికాసానికి దోహదం చేయడం. విదేశీయుల దోపిడీ నుండి, దేశీయుల దోపిడీ నుండి ప్రజల్ని కాపాడి వారికి స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వడం మా విప్లవానికి ఆదర్శం. దోపిడీదారుల్ని అధికారచ్యుతుల్ని చేసి శాసనాధికారాన్ని రైతులకూ, కూలీలకూ ఇవ్వడం మా ఆదర్శం. రైతుకూలీ ప్రజారాజ్యాన్ని మేము కోరుతున్నాము." కాంగ్రెస్ పాత్రను కూడా ఈ కరపత్రం చక్కగా అంచనా కట్టింది. "కాంగ్రెస్ పార్టీ ప్రజలలో స్వాతంత్ర్యేచ్ఛను కలిగించిందని మేమూ ఒప్పుకుంటాము... కాని ఆ సంస్థ మీద దళారీ రాజకీయాలను అభిమానించే నాయకుల ప్రాబల్యం ఎక్కువయింది. కాంగ్రెస్ చెప్పే అహింస విదేశీపాలకులతో రాజీబేరాలకు దిగడానికి ఒక సాకుగా తయారయింది." అన్యాయాన్ని ద్వేషించకుండా న్యాయం కోసం పోరాడడం సాధ్యమనే వారి బూటకాన్ని చక్కగా విమర్శించింది. "ప్రేమించినవారితో స్నేహం చేయడం, హింసించినవారిని ద్వేషించి పోరాడడం సర్వసాధారణమైన విషయాలు. ద్వేషం కారణంగానే పోరాటాలు సంభవిస్తాయి. సర్వసాధారణమయిన ఈ నియమానికి విరుద్ధంగా ప్రేమతో స్వాతంత్ర్య పోరాటాన్ని నడపండి అని దేశ ప్రజలకు చెప్పడంలో అర్థం లేదు. అన్యాయానికి ప్రతిగా పోరాడడానికి కావలసింది ప్రేమ కాదు, ద్వేషం".

ప్రజలు గాంధీని అనుసరించడానికి కారణం గాంధీ 'ప్రజల మనిషి' కావడం అన్న అభిప్రాయం ఇవ్వాళ్టికీ ప్రచారంలో ఉంది. దానికి 50 ఏళ్ళనాడే ఈ కరపత్రం సమాధానం ఇచ్చింది. "గాంధీగారు గడిచిన పది సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ప్రజలు అహింసా సిద్ధాంతాన్ని అధికాధికంగా స్వీకరించడాన్ని గమనించానని చెప్పారు. దేశ ప్రజలకు గాంధీగారి మీద భక్తి

వుంది. శ్రద్ధ ఉంది. అందుకు అనుమానం లేదు. అంతమాత్రానికి దేశ ప్రజలందరూ గాంధీగారి రాజకీయ సిద్ధాంతాల్ని అనుసరించే వారనుకోవడం పొరబాటు. ఈ దేశ ప్రజలలో ఎక్కువమంది అశిక్షితులు. వారికి ఏ రాజకీయాలు పట్టవు. ప్రజలు గాంధీగారిని ఆధ్యాత్మిక శక్తి సంపన్నులయిన మహా పురుషులుగానే చూస్తున్నారు. గాంధీగారి రాజకీయ అభిప్రాయాలుగాని, ఆదర్శాలుగానీ ప్రజలకు పట్టవు". ఇందులో చివరివాక్యం ముఖ్యమయినది. అవతార పురుషులకు అలవాటుపడ్డ జనం గాంధీని అవతార పురుషుడిగానే భావించారు. ఆయన పేరు చెప్పి సత్యాగ్రహం చేసింది కొందరయితే, మిగిలినవాళ్లు పోలీస్‌స్టేషన్లపై దాడిచేశారు. భూస్వాముల గోదాములు కాలబెట్టారు. అడవి చట్టాలకు వ్యతిరేకంగా అడవులు నరికారు. వడ్డీ వ్యాపారస్తులపై దాడిచేసి అప్పు కాగితాలు కాలబెట్టారు – ఇవన్నీ 'గాంధీబాబా' పేరు చెప్పే. అంటే 'గాంధీబాబా చేయమన్నా'డని చెప్పి ఆయన చేయొద్దన్న పనులన్నీ చేశారు. గాంధీ భారత జాతీయతకు ఒక సంకేతం, ఒక మంత్రం అయ్యాడు. ఇందులో గాంధీ గొప్పతనం వేరే ఏమీ లేదు. నెహ్రూ తదితరులలాగ పాశ్చాత్య వేషభాషలకు పోకుండా ఫకీర్ వేషం వేసుకొని ఆధ్యాత్మికపు మాటలు మాట్లాడడం ద్వారా ప్రజల భ్రమలకు వస్తువు (object) కాగలిగాడు. 1920ల వరకు ఒక్క గాంధీయేకాదు, రైతాంగ, గిరిజన నాయకులంతా సన్యాసులూ, ఫకీర్లూ, బాబాలే. ప్రజల దృష్టిలో అవతార పురుషులే. గాంధీ సమకాలికులనే చెప్పుకోవాలంటే, బాబా రాంచంద్ర[30], స్వామి సహజానంద[31], అల్లూరి సీతారామరాజు[32] – అందరూ ఈ కోవకు చెందినవారే. 1930 తరువాత, కమ్యూనిస్టులు రైతాంగ ఉద్యమాలలోకి ప్రవేశించినాకనే 'అవతార పురుషులు' కాని రైతాంగ నాయకులు వచ్చారు. మరి మిగిలిన 'అవతార పురుషులు' విఫలమయిన చోట గాంధీ ఎందుకు విజయాన్ని పొందగలిగాడంటే దానికి కూడా ఒక కారణముంది. వాళ్లంతా ప్రజల వెనుకబాటుతనాన్ని ప్రజల కోసమే వాడుకున్నారు. గాంధీకి అది సాధ్యమయ్యే పని కాదు. గాంధీ ప్రజల వెనుకబాటుతనాన్ని బూర్జువావర్గ ప్రయోజనాల కోసం వాడుకున్నాడు. అది బహు చక్కగా సాధ్యమని గాంధీయే కాదు, ఆయన వారసులు కూడా నిరూపించారు.

వైస్రాయి మీద చేసిన ఈ ప్రయత్నంతో 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' చరిత్ర ముగిసినట్టే చెప్పుకోవచ్చు. అందరూ పరారవుతారు. కొందరు బాంబులు తయారుచేయడానికి ఇక్కడా అక్కడా ఫ్యాక్టరీలు పెట్టినా ఒక్కొక్కరే పోలీసులకు లొంగిపోవడం మొదలవుతుంది. కొందరు అప్రూవర్‌లు అవుతారు. ఇతరులు పరస్పర అనుమానాలతో ఆరోపణలతో విచ్ఛిన్నం అవుతారు. భగత్‌సింగ్‌ను, రాజగురును, సుఖదేవ్‌ను ఉరితీస్తారు. చేతిలో బాంబు పేలి భగవతీచరణ్ చనిపోతాడు. చంద్రశేఖర్ ఆజాద్ పోలీసులతో ఒక పార్కులో 'ఎదురుకాల్పులు' జరిపి చివరి గుండుతో తన్నుతాను పేల్చుకొని చనిపోతాడు. యశ్‌పాల్ అరెస్టయి 14 సంవత్సరాల జైలు శిక్ష పొందుతాడు. అంతటితో ఆ ప్రవాహం సమాప్తం.

ప్రజలతో సంబంధం లేకుండా మతోన్మాదంతో బయలుదేరిన టెర్రరిజం – మతాన్ని వదిలిపెట్టి నాస్తిక దృక్పథాన్నీ, సోషలిస్టు ఆదర్శాన్నీ సంతరించుకొని ప్రజాపునాది కోసం వెతుక్కోవాలని రెండవతరంలో గుర్తించింది. కాని ఆ అన్వేషణ పూర్తికాక ముందే ఆ ప్రవాహం వట్టిపోయింది. 1938లో కాంగ్రెస్ మంత్రులు రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చిన తరువాత విప్లవకారులను జైళ్ల నుండి వదిలిపెడతారు. హింసామార్గాన్ని వదిలిపెట్టాలన్న షరతు పెట్టే ప్రయత్నం చేస్తారు గాని యశ్‌పాల్ వంటివాళ్లు ప్రతిఘటించడంతో బేషరతుగా వదిలిపెడతారు. బయటికివచ్చిన విప్లవకారులు తమ ఉద్యమం ఏమయిందని ఆలోచించుకుంటారు. తమ లక్ష్యాలకూ కమ్యూనిస్టు పార్టీ లక్ష్యాలకూ తేడా లేదని గుర్తిస్తారు. 'హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్' రద్దయింది. యశ్‌పాల్ సాహిత్యకారుడిగా కమ్యూనిస్టులకు చాలా సన్నిహితుడవుతాడు. మరొక టెర్రరిస్టు నాయకుడు అజయ్‌ఘోష్[33] కమ్యూనిస్టు పార్టీలో చేరి తరువాత కాలంలో కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి కూడా అవుతాడు.

1. ఖిలాఫత్ ఉద్యమం (1919–24) : మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఓటొమాన్ సామ్రాజ్యాన్ని విభజించడానికి బ్రిటిష్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ముస్లింలు చేపట్టిన ఉద్యమం. దీనికి గాంధీ కూడా మద్దతు తెలిపారు.
2. సహాయ నిరాకరణ (1920 డిసెంబర్ నుండి 1922 ఫిబ్రవరి వరకు) : భారత స్వాతంత్రోద్యమంలో ఒక ముఖ్య ఘట్టం. విదేశీ వస్తు బహిష్కరణ, ప్రభుత్వ చదువులు, ఉద్యోగాల నిరాకరణ ఈ ఉద్యమంలోని ప్రధాన అంశాలు. మొదట్లో అహింసాయుతంగా జరిగినా చౌరీచౌరాలో పోలీసుల హత్య, తదితర హింసాత్మక ఘటనలు జరగడంతో గాంధీ ఉద్యమాన్ని విరమింపజేశారు.
3. సైమన్ కమిషన్ : భారతదేశ పరిపాలనకు సంబంధించిన రాజ్యాంగ మార్పుల్ని సూచించ డానికి సర్ జాన్ సైమన్ అధ్యక్షతన ఏడుగురు బ్రిటిష్ ఎం.పి.లతో ఒక కమిషన్ ఏర్పడింది. ఈ బృందం 1928లో ఇండియాలో పర్యటించినప్పుడు 'సైమన్ గో బ్యాక్ ' నినాదంతో నిరసన తెలిపారు.
4. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ : సైమన్ కమిషన్ నివేదికను చర్చించడానికి లండన్‌లో 1930–32 మధ్య మొత్తం మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగాయి.
5. ప్రొవిన్షియల్ ఎన్నికలు : భారతీయులకు పరిపాలన అప్పగించే దిశగా 1936–37లో బ్రిటిష్ ప్రభుత్వం జరిపించిన ఎన్నికలు. 11 ప్రావిన్సెస్‌కు ఎన్నికలు జరగగా 8 చోట్ల కాంగ్రెస్ గెలిచింది.
6. క్విట్ ఇండియా ఉద్యమం (1942) : సంపూర్ణ స్వాతంత్ర్యం మినహా మరేదీ తమకు ఆమోదయోగ్యం కాదని తెలిపేందుకే కాంగ్రెస్ పార్టీ ఈ నినాదంతో ఉద్యమాన్ని నడిపింది.
7. అటెన్‌బరో (1923–2014): పూర్తి పేరు రిచర్డ్ శామ్యూల్ అటెన్‌బరో. ఆంగ్ల నటుడు, దర్శకుడు, నిర్మాత. జురాసిక్ పార్క్, గ్రేట్ ఎస్కేప్ లాంటి పలు ప్రఖ్యాత సినిమాల్లో నటించారు. 'గాంధీ' సినిమాకు నిర్మాణ దర్శకత్వ బాధ్యతలు రెండూ నిర్వహించారు.
8. చిట్టగాంగ్ తిరుగుబాటు (1930) : చిట్టగాంగ్ ఆయుధాగారం మీద దాడిచేసి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడానికి కొందరు భారత విప్లవకారులు చేసిన ప్రయత్నమే ఈ తిరుగుబాటు. సూర్యసేన్ నాయకత్వంలో 65 మంది ఈ దాడిలో పాల్గొన్నారు. కాని వారి ప్రయత్నం విజయవంతం కాలేదు. సూర్యసేన్‌ను 1934లో ఉరితీశారు.
9. భగత్‌సింగ్ : 1907లో పుట్టి 1931లో ఉరితీయబడ్డాడు. అతని గురించిన మిగతా వివరాలన్నీ ఈ వ్యాసంలోనే ఉన్నాయి.
10. భగవతీ చరణ్ ఓహ్రా (1904–1930) : నవ జవాన్ భారత్ సభ, హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌లలో వ్యవస్థాపక సభ్యులు. భగత్‌సింగ్ తదితరులను

జైలు నుంచి తప్పించడానికి ఒక బాంబును తయారుచేసి పరీక్షిస్తుండగా అది పేలి మరణించారు.

11. చంద్రశేఖర్ ఆజాద్ (1906–1931) : హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీకి, ఆ తర్వాత హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్‌కి నాయకులు. భగత్‌సింగ్‌కు గురువులాంటి వాడు. పోలీసులకు పట్టుబడకుండా ఉండేందుకు తనను తాను కాల్చుకుని చనిపోయారు.

12 &13 అనుశీలన్, యు(జు)గాంతర్ : రెండూ కవలల్లాంటివి. మొదట అనుశీలన్ 1902లో కలకత్తాలో ఏర్పడింది. తర్వాత 1906లో ఢాకాలో ఏర్పడింది. యువతకు శరీర దారుఢ్యం, నైతిక శిక్షణ ఇచ్చేందుకు ఉద్దేశించిన ఈ సంఘం పశ్చిమ బెంగాల్‌లో కంటే తూర్పు బెంగాల్‌లో ఎక్కువ వేగంగా వ్యాపించింది. అయితే బెంగాల్ విభజన (1905) తర్వాత ఇది బ్రిటిష్‌వాళ్ళకు వ్యతిరేకంగా టెర్రరిస్టు కార్యకలాపాలను ప్రారంభించింది. అనుశీలన్ సంఘాలలోని తీవ్రవాదులు లేదా విప్లవవాదులు యుగాంతర్ గ్రూపుగా ఏర్పడి బాంబు దాడులు, ఆయుధ సేకరణ, నగదు దోపిడీలు, కొన్ని హత్యలు సైతం చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టుచేసి ఉరితీసిన వాళ్ళలో ఖుదీరామ్ బోస్, సూర్యసేన్ (మాస్టర్‌దా) ప్రముఖులు. ఈ సంఘాల వ్యవస్థాపక సభ్యుల్లో అరవింద్ ఘోష్, ఆయన తమ్ముడు బరీంద్రకుమార్ ఘోష్ కూడా ఉన్నారు.

14. అరవింద ఘోష్ (1872–1950) : కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదువుకుని బరోడా కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. బెంగాల్ విభజన తర్వాత కలకత్తా వచ్చి అనుశీలన్, యు(జు)గాంతర్ సంఘాలలో సభ్యుడయ్యారు. అనేక కేసులలో అరెస్టయి, విడుదలై, చివరికి 1910లో బెంగాల్ నుంచి తప్పించుకుని పాండిచ్చేరి చేరారు. ఆధ్యాత్మికత వైపు మళ్ళి అరవిందాశ్రమాన్ని నెలకొల్పారు.

15. రౌలట్ బిల్లు : మొదటి ప్రపంచ యుద్ధం సందర్భంగా బ్రిటన్ అమల్లోకి తెచ్చిన కొన్ని 'అత్యవసర చర్యల'ను నిరవధికంగా పొడిగించడానికి ఉద్దేశించిన బిల్లు. భారతీయులు వ్యతిరేకించినప్పటికీ 1919లో దీన్ని చట్టం చేశారు.

16. గదర్ పార్టీ : భారత స్వాతంత్ర్యం కోసం 1913లో అమెరికా, కెనడాలలో నివసిస్తున్న పంజాబీలు నెలకొల్పిన పార్టీ. లాలా హర్‌దయాళ్, రాస్‌బిహారీ బోస్ తదితరులు దీనికి నాయకులు.

17. చౌరీచౌరా : గోరఖ్‌పూర్ జిల్లాలోని ఒక ఊరు. సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా కొందరు నిరసనకారులు హింసకు పాల్పడ్డప్పుడు పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. ప్రతీకారంగా వారు 5–2–1922 నాడు పోలీస్ స్టేషన్‌ను తగలబెట్టడంతో 23 మంది పోలీసులతో సహా 26 మంది మరణించారు.

18. సుఖ్‌దేవ్ (1907–1931) : పూర్తి పేరు సుఖ్‌దేవ్ థాపర్. మొదటి నుండి భగత్‌సింగ్, రాజ్‌గురులతో కలిసి పనిచేశారు. 'నవ జవాన్ భారత సభ' వ్యవస్థాపక సభ్యులు. శాండర్స్ హత్య కేసులో పై ఇద్దరితో కలిసి ఉరితీయబడ్డారు.
19. జయచంద్ర విద్యాలంకార్ (1898– ? ) : ఈయన ప్రభావం భగత్‌సింగ్ మీద బలంగా ఉంది. భగత్‌సింగ్‌ను Hindustan Republican Army వ్యవస్థాపకుడైన సచీంద్రనాథ్ సన్యాల్‌కు పరిచయం చేసింది ఈయనే. స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం హిందీ ప్రతి తప్పొప్పులను సరిదిద్దే నిపుణుల కమిటీలో సభ్యుడుగా ఉన్నారు.
20. హిందుస్తాన్ రిపబ్లికన్ ఆర్మీ : దీన్ని రాంప్రసాద్ బిస్మిల్, సచీంద్రనాథ్ సన్యాల్ తదితరులు 1925లో ఏర్పరచారు. అదే సంవత్సరం ఆగస్టు 9న కాకోరీ దగ్గర రైల్లోంచి రైల్వే డబ్బును దోచుకున్నారు. ఈ కేసులో నలుగుర్ని ఉరితీసి, నలుగుర్ని అండమాన్‌కు పంపి, మరో 17 మందికి దీర్ఘకాల జైలుశిక్షలు విధించారు. ఉరితీయబడ్డ వారిలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫఖుల్లా ఖాన్ కూడా ఉన్నారు.
21. ఎహసాన్ ఇలాహి : నవజవాన్ భారత సభలో చురుకైన కార్యకర్తగా పనిచేశారని తప్ప ఇతర వివరాలు తెలియలేదు.
22. శివవర్మ (1904–1997) : హిందుస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడు. లాహోర్ కుట్రకేసులో జైలుశిక్ష పడడంవల్ల 1947లో స్వాతంత్ర్యం వచ్చేదాకా విడుదల కాలేదు. తర్వాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో, 1964 తర్వాత మార్క్సిస్టు పార్టీలోను అనేక బాధ్యతలు చేపట్టారు. 'సెలెక్టెడ్ రైటింగ్స్ ఆఫ్ భగత్‌సింగ్' గ్రంథానికి సంపాదకుడు.
23. విజయకుమార్ సిన్హా (1905–1972) : విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చాడు. లాహోర్ కుట్ర కేసులో భగత్‌సింగ్ తదితరులకు ఉరిశిక్ష పడగా సిన్హాకు మొదట కఠిన కారాగారశిక్ష, ఆ తర్వాత అండమాన్‌లో ద్వీపాంతర శిక్ష విధించారు. 1945లో విడుదలయ్యారు. రాజ్యం సిన్హా ఆయన భార్య. 1962 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా కాన్పూర్ నుండి పోటీచేసి ఓడిపోయారు.
24. శాండర్స్ ( ? –1927) : పూర్తి పేరు జాన్ పి. శాండర్స్. లాహోర్ ఎ.ఎస్.పి. లాలా లజపతిరాయ్‌పై లాఠీఛార్జి జరిపి ఆయన మృతికి కారకుడైన వ్యక్తి. ఆ కోపంతోనే భగత్‌సింగ్ ప్రభృతులు ఆయన్ని కాల్చి చంపారు.
25. రాజ్‌గురు (1908–1931) : పూర్తి పేరు శివరామ్ హరి రాజ్‌గురు. పూనా దగ్గర్లోని ఖేడ్ అతని జన్మస్థలం. పోలీసు అధికారి జె.పి. శాండర్స్ హత్య కేసులో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌తో కలిసి ఉరితీయబడ్డాడు. అతని గౌరవార్థం ఖేడ్‌కు రాజ్‌గురునగర్ అని పేరు పెట్టారు.

26. సుమిత్ సర్కార్ (1939–  ) : ఆధునిక భారతదేశ చరిత్రకారుడు. అనేక పుస్తకాలు రాశారు.
27. బటుకేశ్వర దత్తు (1910–1965) : భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌లతోపాటు ఢిల్లీ అసెంబ్లీ బాంబు కేసులో నిందితుడు. అండమాన్‌లో జైలుశిక్ష అనుభవించి తిరిగివచ్చాక కూడా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. దానికి మరో నాలుగేళ్ళు జైలులో ఉండాల్సి వచ్చింది. స్వాతంత్ర్యానంతరం 18 ఏళ్ళు బతికినా అతనికి రావాల్సిన గుర్తింపు రాలేదు. చనిపోయాక అతని శవాన్ని హుస్సేనీవాలా తీసుకెళ్ళి భగత్‌సింగ్ తదితరుల సమాధుల పక్కనే సమాధి చేశారు.
28. మోతీలాల్ నెహ్రూ (1861–1931) : అలహాబాద్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది. రెండుసార్లు (1919–20, 1928–29) కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఉండి స్వాతంత్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ తండ్రి.
29. విఠల్ భాయి పటేల్ (1873–1933) : సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్న. మొదట్లో కాంగ్రెస్‌లో ఉన్నా గాంధీ పోరాట పద్ధతులు నచ్చక చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూలతో కలిసి స్వరాజ్ పార్టీ నెలకొల్పారు. ఆ తర్వాత మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరి, మరోసారి బయటికి వచ్చి సుభాష్ చంద్రబోస్‌కు మద్దతు తెలిపారు. బోస్‌కు మద్దతు కూడగట్టడం కోసం యూరప్ అంతా తిరిగారు. అనారోగ్యంతో చనిపోయే ముందు 1.20 లక్షల రూపాయలు విలువచేసే ఆస్తిని సుభాష్ పేరన రాశారు కాని కోర్టుకేసు కారణంగా ఆ డబ్బు బోసుకు దక్కలేదు.
30. బాబా రామచంద్ర (1875–1950) : అసలు పేరు శ్రీధర్ బల్వంత్ జోధ్‌పుర్కార్. మహారాష్ట్ర బ్రాహ్మణుడు. గ్వాలియర్ సంస్థానంలో జీవించారు. పేదరికం కారణంగా కూలి పనుల కోసం ఫిజి దీవుల కెళ్ళినప్పుడు రామచంద్రరావుగా పేరు మార్చుకున్నారు. అక్కడ దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడినందుకుగాను ఇండియా తిరిగి రావాల్సి వచ్చింది. పెళ్ళిచేసుకుని అయోధ్యలో స్థిరపడ్డాకే బాబా రామచంద్రగా పేరు మార్చుకున్నారు. ఔధ్‌లో 1919లో భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా రైతు ఆందోళన నిర్వహించారు. 1920లో ఔధ్ కిసాన్ సభను ఏర్పరచారు.
31. స్వామి సహజానంద సరస్వతి (1889–1950) : ఉత్తరప్రదేశ్‌లోని ఘాజిపూర్‌కు చెందిన బ్రాహ్మణ సన్యాసి. జమీందార్లకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం పోరాడేందుకు 1929లోనే బీహార్ ప్రావిన్షియల్ కిసాన్ సభను నెలకొల్పారు. అదే సమయంలో రైతు పోరాటాలు దేశవ్యాప్తం కావడంతో కాంగ్రెస్ పార్టీ 1936లో ఆల్ ఇండియా కిసాన్ సభను ఏర్పాటుచేసింది. స్వామి సహజానందే దీనికి తొలి అధ్యక్షుడు. ఈ సంస్థలో

ఆచార్య ఎన్.జి. రంగా, రాహుల్ సాంకృత్యాయన్, లోహియా, జయప్రకాశ్ నారాయణ్, పుచ్చలపల్లి సుందరయ్య తదితర ప్రముఖులు ఉన్నారు.

32. అల్లూరి సీతారామరాజు (1897–1924) : గోదావరి జిల్లాల్లోని మన్యం ప్రాంతంలో ఆదివాసులను కూడగట్టి బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడారు. 1922–24 మధ్య జరిగిన ఈ పోరాటాలను 'రంప తిరుగుబాటు' అంటారు. 1924లో బ్రిటిష్ సైనికులు చుట్టుముట్టి కాల్చి చంపారు.

33. అజయ్‌ఘోష్ (1909–1962) : భగత్‌సింగ్ సహచరుడిగా ఉండి లాహోర్ కుట్ర కేసులో అరెస్టయ్యారు. 1933లో జైలు నుంచి విడుదలయ్యాక కమ్యూనిస్టు పార్టీలో చేరి 1951 నుంచి 1962 వరకు దాని కార్యదర్శిగా పనిచేశారు.




**మనకు తెలియని మన చరిత్ర**
**తెలంగాణ రైతాంగ పోరాటంలో స్త్రీలు**

రచయితలు : కె. లలిత, వసంత కణ్ణబిరాన్, రమా మెల్కొటే, ఉమామహేశ్వరి, సూసీతారు, వీణా శత్రుఘ్న, ఎమ్. రత్నమాల

స్త్రీ శక్తి సంఘటన ప్రచురణ (1986)

రచయితలందరూ ప్రముఖ స్త్రీవాదులు. వివిధ రంగాల్లో పేరొందిన వారు. 'అన్వేషి', 'అస్మిత' సంస్థలను నెలకొల్పి స్త్రీవాద దృక్పథంతో వివిధ కార్యక్రమాలు, అనేక రచనలు చేశారు. రత్నమాల విరసం సభ్యురాలు, పౌర హక్కుల సంఘం అధ్యక్షురాలుగా కూడా పనిచేశారు.

ఏదయినా ఒక రాజకీయ ఉద్యమంలోకి వచ్చే వ్యక్తులు తాము ఎందుకు ఉద్యమంలోకి వచ్చామని ఆలోచిస్తే అందుకు రాజకీయార్థిక కారణాలే కాక 'వైయక్తిక'మయిన కారణాలూ కనిపిస్తాయి. (ఇవి కూడ నిజంగా వైయక్తికమయినవి కాదు, జాగ్రత్తగా విశ్లేషిస్తే ప్రచురణకర్తలు అభిశంసించే స్థూలచరిత్రకు అందే విషయాలే.) ఒకరు ఇంట్లో తండ్రి పెత్తనం వల్ల అణచివేతను వ్యతిరేకించడం అలవర్చుకొని ఉండవచ్చును. ఒకరు అనాథాశ్రమంలో పెరిగిన కారణంగా ప్రపంచంతో తలపడడం చిన్నతనం నుండే అలవర్చుకొని ఉండవచ్చును. అయితే ఇటువంటి వైయక్తికమయిన కారణాలు వెయ్యి కలిపినా చరిత్ర చోదకశక్తి కాదు. ఈ వెయ్యి రకాల వైయక్తికమయిన కారణాలూ ఒకే పోరాటానికి – దేశముఖ్‌లకూ, నిజాం నవాబుకూ వ్యతిరేకమయిన రైతాంగ తిరుగుబాటుకు – ఎందుకు దారితీయాలి? ఇన్ని రకాల కారణాలవల్ల తిరుగుబాటు మనస్తత్వం అలవర్చుకున్న వాళ్లంతా ఒకే పోరాటంలోకి ఎందుకు వచ్చారు? అవే వైయక్తికమయిన కారణాలు వేరే కాలంలో, వేరే సందర్భంలో ఖలిస్తాన్ ఉద్యమానికో, సంతోషిమాత పూజలకో ఎందుకు దారితీస్తాయి? వీటికి సమాధానాలు స్థూలమయిన రాజకీయార్థిక విశ్లేషణలోనే దొరుకుతాయి. అదే చరిత్ర అవుతుంది.

# సహేతుకమయిన ప్రశ్నలు - అశాస్త్రీయమయిన దృక్పథం

## 'మనకు తెలియని మన చరిత్ర'పై సమీక్ష

**హైదరాబాద్** స్త్రీ శక్తి సంఘటన[1] ప్రచురించిన 'మనకు తెలియని మన చరిత్ర'లో చాలా విషయాలున్నాయి. చదవడానికి ఆసక్తికరంగా ఉన్న సజీవమయిన జీవిత అనుభవాలున్నాయి. చరిత్రను గురించే కాక చరిత్ర రచనా పద్ధతిని గురించి కూడా ఒక అవగాహన, ఒక చారిత్రక సిద్ధాంతం (historiography) ఉన్నాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం ఎట్లా అనే జ్ఞాన సిద్ధాంత (epistemological) ప్రశ్నకు ఒక సమాధానం వుంది. స్త్రీలకు మానవ చరిత్రలో క్రియాశీలకమయిన పాత్ర ఉండడమే కాక స్త్రీలదే అయిన చరిత్ర కూడా ఒకటి ఉంటుందనే ప్రతిపాదన ఉంది. రాజకీయ పోరాటాలు అందులో పాల్గొనే వ్యక్తుల జీవిత సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కొట్టి పారేయకుండ వాటిని కూడ ఉద్యమంలో భాగమయిన సమస్యలుగా అర్థం చేసుకొని వాటిని గురించి సెంటిమెంటల్‌గా కాక రాజకీయంగా ఆలోచించాలనే సూచన వుంది, ఇంకా చాలా విషయాలున్నాయి. ఇవేవీ 'కొత్త విషయాలు' కావు – అంటే స్త్రీ శక్తి సంఘటనతో పుట్టినవి కావు, కాని మన దగ్గర మొట్టమొదటిసారిగా చర్చకు వస్తున్న విషయాలవి. ఈ అభిప్రాయాలు, ఈ అవగాహన గత రెండు మూడు దశాబ్దాలుగా పాశ్చాత్య దేశాలలో ప్రారంభమయి ప్రపంచమంతటా విస్తరిస్తున్న ఒక నిర్దిష్టమయిన ప్రాపంచిక దృక్పథం నుండి పుట్టినవి. పాశ్చాత్య బూర్జువా సమాజాన్ని విమర్శనాత్మకంగా ఎదుర్కొంటూ ముందుకొస్తున్న వివిధ ఉద్యమాలలో (ఫెమినిజం వీటిలో ఒకటి మాత్రమే) అంకురించి, ఎన్ని అంతర్గత విభేదాలున్నా స్థూలంగా తాత్విక ఏకత (unity) ఉన్న ప్రాపంచిక దృక్పథం వీటికి మూలం. ఒక్క వాక్యంలో చెప్పాలంటే ఈ ప్రాపంచిక దృక్పథం ఇటు పెట్టుబడిదారీ సమాజాన్నీ అటు మార్క్సిజాన్నీ కూడా విమర్శిస్తూ, విభిన్న విషయాలలో విడివిడిగా

---

అరుణతార, ఏప్రిల్ – మే 1987

పరిగణనీయమయిన (significant) విమర్శ చేస్తుంది కాని మొత్తంగా చూస్తే భావవాద తాత్విక దృక్పథాన్ని ఆశ్రయిస్తుంది. ఈ తాత్విక దృక్పథానికి ప్రేరణ ప్రధానంగా అస్తిత్వవాదం (existentialism) నుండి వచ్చిందని చెప్పవచ్చును. దాని ప్రధానమయిన లక్షణాలు జ్ఞాన సిద్ధాంతంలో వ్యక్తిగత అనుభవానికి ప్రాధాన్యం యిచ్చే విషయీవాదం (subjectivism), సమాజం లోనూ ప్రకృతిలోనూ విశ్లేషణకు అంతా అందదనీ, అందే దానికంటే అందనిదే ముఖ్యమని భావించే అహేతుకవాదం (irrationalism), ప్రాపంచిక దృక్పథంలో వ్యక్తిని కేంద్రంగా ఎంచుకునే వ్యక్తివాదం (individualism).

ఆ ప్రాపంచిక దృక్పథం మన దగ్గర కొత్తకావడం వల్లనూ, ప్రచురణ కర్తలు దాన్ని సమగ్రంగా ప్రతిపాదించే ప్రయత్నంగాని, పోనీ వివరించే ప్రయత్నంగాని, కనీసం దాని సహాయంతో తాము సేకరించిన ముడిపదార్థాన్ని వ్యాఖ్యానించే ప్రయత్నం గాని విపులంగా చేయకపోవడం వల్లనూ ఈ పుస్తకాన్ని కొంచెం వివరంగా సమీక్షించవలసి వస్తోంది. (అంటే ఇతరత్రా ఈ పుస్తకానికి ఆ అర్హత లేదని కాదు, ఈ ప్రత్యేకమయిన కారణాల వల్ల ఆ ఆవశ్యకత ఉందని.) ప్రచురణకర్తల తాత్విక ప్రాపంచిక దృక్పథాన్ని మొదట సమగ్రంగా అర్థం చేసుకొని, అందులో అంతర్భాగంగా పుస్తకంలో స్పష్టాస్పష్టంగా సూచించిన వివిధ విషయాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయకపోతే విమర్శ అంతా కూడా లెనిన్‌ను తిట్టారనో, సుందరయ్య[2]ను 'సహితం' అభిశంసించారనో అభ్యంతరం తెలిపే చాదస్తానికి పరిమితమయ్యే ప్రమాదం వుంది. ఈ చాదస్తం వల్ల వీళ్ళ విమర్శలోని పరిగణనీయమయిన విషయాలను తేలికగా కొట్టి పారేయడమో, లేక (తాత్వికంగా అప్రమత్తంగా ఉండకపోతే) ఆ విమర్శలోని పదును ప్రలోభంలో పడి భావవాద ప్రాపంచిక దృక్పథానికి లొంగిపోవడమో – రెండింటిలో ఒక ప్రమాదం తప్పక ఉంటుంది.

ఈ తాత్విక దృక్పథం ప్రచురణకర్తలు అనవసరంగా తెచ్చిపెట్టుకున్న తల బరువు అనుకునే ప్రమాదం కూడా లేకపోలేదు. కేవలం తార్కికంగా చూస్తే వాళ్ళ తాత్విక అభిప్రాయాలు వాళ్ళు లేవదీయదల్చుకొన్న చర్చకు 'అనవసరమే' కాక ప్రతిబంధకం కూడా. అయితే అభిప్రాయాలను కేవలం తార్కికంగా చూడడం హేతువాదుల లక్షణం. అభిప్రాయాలను సామాజికంగా, చారిత్రకంగా చూస్తే వాటిలో 'అనవసరం' అయినవి ఏవీ ఉండవు, అన్నీ 'అవసరం' అయినవే.

## సహేతుకమయిన ప్రశ్నలు – అశాస్త్రీయమయిన దృక్పథం

కమ్యూనిస్టు ఉద్యమాలు స్త్రీల పట్ల – అంటే స్త్రీల సమస్యల పట్ల, స్త్రీ కార్యకర్తల పట్ల – ప్రదర్శించే వైఖరిని చర్చకు పెట్టడం ప్రచురణకర్తల ముఖ్య ఉద్దేశ్యం. దానితోపాటు సెకండరీ ఉద్దేశ్యాలు కొన్ని ఉన్నాయి – చరిత్రలో స్త్రీల పాత్ర, చరిత్ర పట్ల 'స్త్రీల' దృక్పథం, విజ్ఞానానికీ అనుభవానికీ గల సంబంధం, రాజకీయ ఉద్యమాలలో ఉత్పన్నమయ్యే వ్యక్తిగత సమస్యల పరిష్కారం, తదితర విషయాలను చర్చించడం కూడా వాళ్ళ ఉద్దేశ్యాలుగానే కనబడతాయి. ఈ విషయాలను కేవలం సైద్ధాంతికంగా చర్చించక జీవిత అనుభవం నుండి చర్చించాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రైతాంగ పోరాటం[3]లో పాల్గొన్న స్త్రీలను ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూలలో పదహారిటిని ప్రచురించి వాటి ప్రాతిపదికగా తమ ప్రతిపాదనలను చర్చించాలని ఉద్దేశించినట్టు అర్థం అవుతుంది.

లక్ష్యాన్ని గురించి ఆక్షేపణ ఉండదు గాని వాళ్ళ ప్రయత్నం మాత్రం అసంతృప్తికరం అనిపించకమానదు. పుస్తకం మొత్తం చదివిన వాళ్ళకు ప్రచురణ కర్తలు ఏం చెప్పదల్చుకున్నారో సమగ్రంగా అర్థం అవుతుందా అంటే అనుమానమే. 'చివరి మాట'లో క్లుప్తంగా లేవదీసిన ప్రశ్నలకూ, ఇంటర్వ్యూలలో ఆ స్త్రీలు వ్యక్తీక రించిన అవగాహనకూ, విషయాలకూ అక్కడక్కడ మాత్రమే సంబంధం ఉన్నట్టు అనిపిస్తుంది. చాలామందికి ఆ ఇంటర్వ్యూలన్నీ అర్థం అవుతాయని కూడా అనుకోను. ఇది భాషకు (తెలంగాణ భాషగాని, స్త్రీల భాషగాని) సంబంధించిన సమస్య కాదు. మాట్లాడిన మాటలను టేప్ నుండి ఉన్నదున్నట్టు ట్రాన్స్క్రైబ్ చేస్తే, మాట్లాడిన వ్యక్తులు చదువుకున్న వాళ్ళు – అంటే రాసే భాషకు సన్నిహితంగా మాట్లాడే వాళ్ళు – అయినా కూడా సరిగ్గా అర్థం కాదు. ఇక పాలకుర్తి ఐలమ్మ[4] దూడల సాలమ్మ[5]ల సంగతి చెప్పనవసరం లేదు. మాట్లాడేటప్పుడు మనం మాటల తోనే కాక హావభావాలతో కూడా విషయాన్ని కమ్యూనికేట్ చేస్తాము. ఒక్కోసారి నొక్కిచెప్పడం, తటపటాయించటం జరుగుతుంది. టేప్ చేసి ట్రాన్స్క్రైబ్ చేస్తే వట్టి మాటలు మిగులుతాయి. "మామూలుగా మాట్లాడేటప్పుడు మనం వాక్యాలను ఎన్నో రకాలుగా పూర్తి చేస్తూంటాం. కొన్ని సగంలోనే ఆగిపోతాయి. కొన్నిసార్లు పూర్తి చేయడానికి చేతులూపడమో, తలతిప్పడమో జరుగుతుంది.... ఇవన్నీ పుస్తకంలోకి తీసుకు రావడం పెద్ద సమస్య" అని ప్రచురణకర్తలు కూడా గుర్తించారు ('ఈ పుస్తకంలోని భాష గురించి రెండు మాటలు'). అయితే ఈ విషయం

గుర్తించినప్పటికీ భాషను ఎడిట్ చేస్తే – వ్యాకరణ బద్ధంగా వాక్యాలను పూరించడం మేరకే అయినా – ప్రజల భాషను, అందులో ప్రత్యేకించి స్త్రీల భాషను, రాసే భాషలోనికీ, 'మగవాళ్ళు' నిర్ణయించిన వాక్య నిర్మాణంలోనికీ తీసుకురావడం జరుగుతుందని జంకి అట్లాగే వదిలేయడం వల్ల తెలంగాణ భాషతోనూ, తెలంగాణ స్త్రీలు వాడే నుడికారంతోనూ పరిచయం ఉన్న వాళ్ళకు కూడా కొన్ని ఇంటర్వ్యూలు అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. మాట్లాడేటప్పుడు విషయాన్ని కమ్యూనికేట్ చేయడానికి ఉపకరించే హావభావాలు రాసేటప్పుడు ఉపయోగపడవు కాబట్టే ఒక 'రాసేభాష' అవసరం అయింది. తత్సంబంధమయిన నియమాల మీద సమాజంలో ఆధిపత్య స్థానంలో ఉన్న భావజాలం ప్రభావం కచ్చితంగా ఉంటుంది – అందులో భాగంగా పురుషాధిపత్యం ప్రభావం కూడా ఉండవచ్చు. అయితే 'రాసేభాష' అనేది ఒకటి ఉండడమే అణచివేత అనుకుంటే పొరబాటు, అది చాలా సహజమయిన అవసరం. మాండలికంలో రాసినా రాసేభాష మాట్లాడే భాషకన్నా భిన్నంగా ఉంటుంది. విద్యావంతురాలు, పార్టీలో ప్రముఖ స్థానంలో వున్న వ్యక్తి అయిన మల్లు స్వరాజ్యంగారి[6] ఇంటర్వ్యూ నుండి కొన్ని వాక్యాలను ఉటంకిస్తే ఈ అవసరం అర్థం అవుతుంది. "వాళ్ళు మనల్ని గుర్తించరండీ అసలు, మనం వాళ్ళను గుర్తించాలని అడుగుడేంది? ఉద్యమానికి వాళ్ళే నాయకులు, కర్తలు. మన లైఫ్‌కంతా కూడా వాళ్ళే కర్తలాంటారేంటి మీరు? దాన్ని నేనొప్పుకోను. అసలు ఈ పోరాటానికి కర్తలు ఎవరు? ప్రజలు, చరిత్ర. మనం స్త్రీలందరినీ ఎక్కడికీ పంపకుండా సెట్రయిట్ చేసి పునరావాసం కల్పించే పరిస్థితి ఎట్లా చేయగల్గుతారు? చేయలేరు. పోరాటానికి అవసరమయినంత ఉపయోగించుకుంటారు. సాంఘిక పరిస్థితులు బాగుపడితే, ఆర్థిక సమస్యలు బాగుపడితే మన పరిస్థితి మారుతుందనేది వాళ్ళు శ్రద్ధ తీస్కొని డెవలప్ చేయడం లేదు. మన పోరాట హక్కుని గుర్తింపజేసే అవసరం మనకుంది". ఆవేశపూరితమయిన ఆలోచనల సుడిగుండం నుండి స్పాంటేనియస్‌గా పుట్టుకొచ్చిన ఈ వాక్యాలు ప్రత్యక్షంగా కూర్చుని విన్న వాళ్ళకు అర్థం అవుతాయేమో గాని అచ్చులో వీటి భావాన్ని ఏమని గ్రహించాలి? ఇది తెలంగాణ భాషకు గాని, స్త్రీల భాషకు గాని సంబంధించిన సమస్య కాదని మరొకసారి గుర్తు చేయనవసరం లేదు. అయితే బహుశా, స్పాంటేనిటీని దానంతటదే విలువయినదిగా భావించే అస్తిత్వవాద తాత్విక

దృక్పథం ప్రచురణ కర్తలలో ఉండబట్టి భావాన్ని చాలామంది గ్రహించలేకపోవడం కూడా వాళ్ళకు 'అర్థవంతం'గా కనిపిస్తుందేమోనని అనుమానించాల్సి వస్తుంది. అలా కాకపోతే, ట్రాన్స్‌క్రైబ్ చేయడంతో బాటు ఎడిట్ చేయడం చాలా అవసరం. నిజమే, భావానికీ దాని వ్యక్తీకరణలోని విలక్షణతకూ హాని కలగకుండా ఎడిట్ చేయడానికి కొంత సాహసం కావాలి. కాని ఆ సాహసమే లేకపోతే ఇన్నేళ్ళ ఫెమినిస్టు ఉద్యమం సాధించిన అవగాహనను తమ ఆలోచనలలో జీర్ణించుకున్న ప్రచురణకర్తలు తాముగా పాఠకులకు ఇచ్చేది ఏముంది? ప్రజల అనుభవాన్నీ, జ్ఞాపకాలనూ ముట్టుకుంటే పాడయిపోతాయని భావించే దృక్పథం అనుభవాన్ని విజ్ఞానానికి పరమావధిగా భావించే భావవాదమే కాని ప్రచురణకర్తలు భావించేటట్టు నూతనమయిన విమర్శనాత్మకత కాదు.

మరికొన్ని సమస్యలు కూడా వున్నాయి. గతానికి చెందిన తమ జీవిత అనుభవాలను జ్ఞాపకం తెచ్చుకొని చెప్పమని అడిగితే జనం చెప్పేది అస్తవ్యస్తంగా, కలగాపులగంగా వుంటుంది. (వాక్య నిర్మాణం సరిగ్గా లేకపోవడం కేవలం వ్యాకరణ దోషం కాదు, భావవ్యక్తీకరణే అసమగ్రంగా ఉంటుంది). కాలక్రమంలో ముందువి వెనక్కూ, వెనకవి ముందుకూ వస్తాయి. సంఘటనలు, తేదీలు, ప్రదేశాలు, వ్యక్తులు; ఒకరితో మరొకరు, ఒక దానితో మరొకటి కలిసిపోవడం జరుగుతుంది. అసంబద్ధం, పరస్పర విరుద్ధం అనిపించే అభిప్రాయాలు పక్క పక్క వాక్యాలలో – ఆవేశం వల్ల కావచ్చు, ఆవేదన వల్ల కావచ్చు, ఆలోచనారాహిత్యం వల్ల కావచ్చు, ఆలోచనలలో అభిప్రాయాలు ఏర్పడుతున్న క్రమంలోనే మాట్లాడడం వల్ల కావచ్చు – చోటు చేసుకుంటాయి. (పైన ఉటంకించిన మల్లు స్వరాజ్యం గారి మాటలు ఇందుకు ఉదాహరణ.) చాలా విషయాలు అవసరమయిన వివరణ లేకుండా ప్రస్తావించబడతాయి. వాళ్ల జీవితానుభవాన్ని వాళ్లు ఎట్లా గుర్తు చేసుకున్నారో దాన్ని ఉన్నదున్నట్టు పాఠకుల ముందు ఉంచాలి అనే సిద్ధాంతంతో ఎడిట్ చేయకుండా అచ్చువేయడం వల్ల వాళ్ల అనుభవం నుండి ప్రచురణకర్తలు నిర్ధారించదల్చుకున్న విషయాలేమిటో పాఠకులకు అందకుండా పోయే ప్రమాదం వుంది. వాక్యాలను మార్చడం ఇష్టం లేకపోతే కనీసం విరివిగా నోట్స్ ఇచ్చి అయినా వివరించాలి.

ఇంటర్వ్యూలను సరిగ్గా ఎడిట్ చేయకుండా ప్రచురించడం పొరబాటనుకుంటే, వాటిని వ్యాఖ్యానించే ప్రయత్నం, విశ్లేషించే ప్రయత్నం చేయకపోవడం చాలా

తీవ్రమయిన లోపం అని భావించాలి. పాలకుర్తి ఐలమ్మ అయినా, మల్లు స్వరాజ్యం అయినా వాళ్ల అనుభవాల నుండి స్త్రీ శక్తి సంఘటన – తన అనుభవంతో, తన చైతన్యంతో – నిర్ధారించే విషయాలు ఏమీ లేవా? ఇంతచేసి, ఇన్ని దశాబ్దాల ఫెమినిస్టు ఉద్యమం నుండి మనల్ని నేర్చుకోమనేది – చరిత్రకు మేము ఇచ్చే వ్యాఖ్యానం ఏమీ లేదు, చరిత్ర నిర్మాణంలో పాల్గొన్న స్త్రీలు తమ నోటితో ఏం చెబితే దాన్ని జాగ్రత్తగా ఒక్క వాక్యం కూడా పొల్లుపోకుండ చదువుకోండి అనేనా? ప్రచురణకర్తలు తాము చేస్తున్నది కేవలం డాక్యుమెంటేషన్ అని వుంటే ఈ ప్రశ్న వేయాల్సిన అవసరం ఉండేది కాదు. అయితే వాళ్ళు తాము చరిత్ర రాస్తున్నామని, ఇది కొత్తతరహా చరిత్ర రచన అనీ, సాధారణ చరిత్ర రచనా పద్ధతి కంటే ఉన్నతమయినదనీ ప్రకటించడం వల్ల ఈ ప్రశ్న వేయాల్సి వస్తోంది. తాము చేయదల్చుకొన్న చర్చకు ప్రచురణకర్తలు జీవితాన్ని ప్రాతిపదికగా తీసుకోదల్చుకున్నారు. అంతవరకు సంతోషమే. కాని జీవితాన్ని వ్యాఖ్యానిస్తే తప్ప అది అర్థవంతం కాదని గుర్తించడానికి మాత్రం సిద్ధంగా లేరు. ఒక సిద్ధాంత దృక్పథంతో విశ్లేషించి వ్యాఖ్యానించినప్పుడే జీవిత అనుభవం అర్థవంతం అవుతుంది, చరిత్ర అవుతుంది. దానంతట అదే చరిత్ర ఎన్నటికీ కాదు. 'మా గురించి' అన్న ముందుమాటలో, తాము మొదట ఇంటర్వ్యూల మీద ఆధారపడి విశ్లేషణ ఇవ్వాలని ఉద్దేశించామని, అయితే క్రమంగా తమలోతాము ఏకీభవించ గలమా, న్యాయం చేకూర్చగలమా, సంతృప్తికరంగా వుంటుందా అనే అనుమానాలు రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకొని ఇంటర్వ్యూలను ఉన్నదున్నట్టు పాఠకుల ముందు ఉంచామని అన్నారు. అశక్తతను నిర్మొగమాటంగా ఒప్పుకోవడం గొప్పతనమే అనుకున్నా, దానిని సిద్ధాంతీకరించడం ఎంతవరకు సమంజసం? జీవిత అనుభవాన్ని విశ్లేషించి దాన్ని చరిత్రగా రూపుదిద్దే సాహసం తమకు లేదు కాబట్టి జీవిత అనుభవమే చరిత్ర కంటే ఉన్నతమయినదనీ, అదే అసలు చరిత్ర అనీ సిద్ధాంతీకరించడం భావ్యమా? అయినా, 16 మంది వ్యక్తుల జీవిత అనుభవాన్ని ఏడుగురు భావసారూప్యత గల ప్రచురణకర్తలు వివరించడానికి పూనుకొని తమలోతాము ఏకాభిప్రాయానికి రాగలమో లేదో అని జంకి విరమించుకున్నారంటేనే అనుభవం అనేది దానంతటది ఎంత అర్థవంత మవుతుందో అర్థం అవుతూనే వుంది.

## సహేతుకమయిన ప్రశ్నలు - అశాస్త్రీయమయిన దృక్పథం

అయితే ఇదంతా అశక్తత అనో, అసంసిద్ధత అనో కొట్టిపారేస్తే ప్రచురణ కర్తలకు అన్యాయం చేసిన వాళ్ళం అవుతాము. 'చివరిమాట'లో యిచ్చిన క్లుప్తమయిన విశ్లేషణను బట్టి చూస్తే అంతకంటే చాలా వివరంగా వ్యాఖ్యానించ గలరనే తోస్తుంది. అయినా ఆ పని చేయకుండా వదిలేయడానికి గల కారణం తెలుసుకోవాలంటే ప్రచురణకర్తల తాత్విక దృక్పథంలోని లోపాన్ని అర్థం చేసుకోవడం అవసరం.

'స్త్రీల చరిత్ర అంటే...' అనే ముందుమాట నుండి కొన్ని వాక్యాలను ఉటంకిస్తే ఈ తాత్విక దృక్పథం స్పష్టంగా అర్థం అవుతుంది. మార్క్సిజం సామాజిక విశ్లేషణలో 'బాహ్యంగా పని చేసే శక్తులకు' ప్రాధాన్యత ఇస్తుందని ప్రచురణ కర్తలు అన్నారు. అది నిజమే. మరి వ్యక్తిగత 'అనుభవం' మాట ఏమిటంటే జీవిత అనుభవం ఈ బాహ్యా శక్తులు నిర్దేశించే చట్రంలో నడుస్తుందని, అందులోని వైరుధ్యాలకూ, విలువలకూ మూలం ఈ బాహ్యా శక్తులలోనే ఉందని మార్క్సిజం భావిస్తుంది అన్నారు. 'అనుభవం' అనేది మార్క్సిజానికి ఒకవేళ నిజంగానే - ప్రచురణ కర్తలు అన్నట్టు - 'కంటకం'గా ఉంటే అందుకు ఒక కారణం, భౌతిక శక్తులు నిర్దేశించే జీవిత చట్రాన్ని సమగ్రంగా విశ్లేషించి, జీవిత అనుభవాన్ని ఆ చట్రం నేపథ్యంలో వ్యాఖ్యానించడంలో సహజంగానే వుండే ఇబ్బంది. రెండవ కారణం, భౌతిక జీవితంలో వచ్చే మార్పులు వాటంతటవి రావు. మానవ జీవిత అనుభవంలో అంతర్భాగమయిన ఆదర్శాలే వాళ్ళ ఆచరణను ప్రేరేపిస్తాయి. ఆ ఆచరణ ద్వారా భౌతిక జీవితంలో మార్పులు వస్తాయి. అందువల్ల అనుభవానికీ భౌతిక జీవితానికీ గల గతితార్కిక సంబంధాన్ని ఎటువంటి 'అతివాదానికీ' లోను కాకుండ అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. అటువంటి 'అతివాదమే' ఈ పుస్తకం ప్రచురణకర్తలలో వుంది. వీళ్ళు జీవితానికి అనుభవమే ప్రమాణం అని, అనుభవం జీవితానికి విశ్లేషణ యిచ్చే చోట దాన్ని 'పూర్తిగా వివరిస్తుంది' అని, 'ఎంత తీక్షణమయిన విశ్లేషణ అయినా అనుభవం ముందు పనికిరాదు' అని అభిప్రాయపడ్డారు. పైగా విశ్లేషణకు అందని విషయాలే చరిత్రలో మార్పుకు దోహదం చేస్తాయన్నారు. ఇవి చాలా ఆశ్చర్యం కలిగించే ప్రతిపాదనలు. దేనినయినా విశ్లేషించకుండా 'పూర్తిగా వివరించడం' సాధ్యమా? అసలు విశ్లేషణ లేకుండా వివరణ ఒక్క అంగుళం అయినా ముందుకు నడుస్తుందా? అనుభవాన్ని

విశ్లేషించడం ద్వారా విజ్ఞానం వస్తుందని మామూలుగా అనుకుంటాం. ఇంకొంచెం గతితార్కికంగా ఆలోచించే అలవాటుంటే విశ్లేషించడం అనేది అనుభవానికి అతీతంగా జరగదు, అనుభవానికి అనుబంధంగా సాగుతూ అనుభవాన్ని అనుక్షణం ప్రభావితం చేస్తూ అవగాహనకు దోహదం చేస్తుందని అనుకుంటాం. అంతేగాని, విశ్లేషణకూ అనుభవానికీ విరోధం కల్పించి, పైగా వట్టి అనుభవం విశ్లేషణ కంటే ఉన్నతమని తీర్మానించడం అహేతుకవాదం తప్ప వేరే కాదు.

నిజానికి ఈ అవగాహనలో కొంచెం ఆత్మవంచన కూడ వుంది. సిద్ధాంతాలకూ విశ్లేషణకూ అందని అనుభవాన్ని ఉన్నదున్నట్టు రికార్డు చేయాలన్న ప్రయత్నంలో తెలిసీ తెలియక చాలా విశ్లేషణ చోటుచేసుకుంది. తాము ఇంటర్వ్యూ చేసిన స్త్రీలు తమ అనుభవాన్ని 'ఉన్నదున్నట్టు' చెప్పలేదని ప్రచురణకర్తలు గుర్తించారు. ఎందుచేతనంటే 'సైద్ధాంతిక పద్ధతులు వడబోయకుండా అటు జ్ఞాపకం గాని, ఇటు అనుభవం గాని మిగిలి ఉండదు' అని అర్థం చేసుకున్నారు. దీనినేదో 'దురదృష్టకరమయిన విషయం'గా భావించకుండా దీని నుండి గ్రహించవలసి ఉండిన విషయం ఏమిటంటే తమ సైద్ధాంతిక దృక్పథం ఏమిటో స్పష్టపరచి, దానితో తాము కూడా 'వడబోసి' వ్యాఖ్యానిస్తేనే తాము చెప్పదల్చుకున్న విషయం పాఠకులకు అర్థం అవుతుందని. ఈ పని వ్యక్తం (explicit) గా చేయకపోవడం వల్ల అవ్యక్తంగా, అందువల్ల – అసమగ్రంగా జరిగింది. ఆ స్త్రీలకు స్పష్టాస్పష్టంగా ఉండే సిద్ధాంత అభిప్రాయాలే కాక, ప్రచురణకర్తలు వేసే ప్రశ్నలలో నిగూఢంగా ఉండే సిద్ధాంత అవగాహన కూడా ఎవరికీ తెలియకుండానే కొంత 'వడపోత' చేస్తుంది. అడిగే ప్రశ్నలోనే ఒక సిద్ధాంతం ఉంటుంది. అది సమాధానానికి ఒక చట్రాన్ని నిర్ణయిస్తుంది. అడిగిన ప్రశ్న ఏమిటో తెలియకపోతే చెప్పిన సమాధానం అర్థం కాదు. ప్రచురణకర్తలు నాలుగయిదు గంటలు ఒక్కొక్కరినీ ఇంటర్వ్యూ చేసినప్పుడు ఎన్నో ప్రశ్నలు వేసే ఉంటారు. ఎన్నో వివరాలు అడిగే ఉంటారు. ప్రచురణ సమయంలో తమ ప్రశ్నలన్నీ తీసేసి సమాధానాలను మాత్రం ఒకచోట చేర్చి 'వాళ్ళ మాటలు'గా మన ముందుంచారు. అవి కేవలం వాళ్ళ మాటలు మాత్రమే కాదని గ్రహించడానికి ప్రమీల తాయి[7] గారి కథనాన్ని తక్కిన కథనాలతో పోలిస్తే చాలు. ప్రమీల తాయి గారికి – సమాధానం చెప్పే ముందు అడిగిన ప్రశ్నను తన నోటితో మళ్ళీ చెప్పి సమాధానం చెప్పే అలవాటు ఉన్నట్టుంది

(ఉదాహరణకు : 'మీది ఏ వూరు?' అని అడిగితే 'మాది ఏ వూరంటారా, ఫలానా వూరు' అని చెప్పడం). ఈ అలవాటు వల్ల ఆమెను అడిగిన ప్రశ్నలన్నీ మనకు తెలుస్తున్నాయి. ఉదాహరణకు, పెళ్లి చేసుకోవడానికి పార్టీ అనుమతి తీసుకున్నారా, ఆడవాళ్ళను ఆర్గనైజ్ చేయడానికి ఉపయోగించిన మార్గాలేమిటి, జిల్లా కమిటీలో తాను సభ్యురాలిగా ఏవయినా సలహాలిస్తే మిగతావాళ్లు (మగవాళ్లు) ఏ విధంగా తీసుకున్నారు, తన కార్యకలాపాలకు తన తల్లిగారు అభ్యంతరం తెలిపారా, ఆమె తనను అర్థం చేసుకోలేదని తాను బాధ పడిందా, ఇత్యాది. ఈ ప్రశ్నలకు సమాధానంగా అర్థం చేసుకున్నప్పుడే ఆమె కథనంలోని అభిప్రాయాలు అర్థవంతం అవుతాయి. కోటేశ్వరమ్మగారి[8] కథనానికి కూడా కొంతమేరకు ఈ లక్షణం వుంది. మిగిలిన వాళ్లు చెప్పిన సమాధానాలు కూడా వాళ్ళను అడిగిన ప్రశ్నలేమిటో తెలిస్తేనే పూర్తిగా అర్థవంతం అవుతాయి.

ఇంటర్వ్యూలు ఇచ్చిన స్త్రీల జీవిత దృక్పథం వాళ్ళ అనుభవాన్ని కొంత 'ఫిల్టర్'చేసింది, అడిగిన ప్రశ్నలు మరికొంత చేశాయి. 'వడబోయ'కుండా మన అనుభవాన్ని మనం గ్రహించలేము. అసలు 'అనుభవించ'లేము కూడా. దీనిని 'దురదృష్టకరమయిన విషయం'గా కాక జ్ఞాన సిద్ధాంతానికి సంబంధించిన మౌలిక సూత్రంగా గుర్తించి, తమ సిద్ధాంత దృక్పథం ఏమిటో స్పష్టపరచి, ఇంటర్వ్యూలను కృత్రిమంగా, ధారావాహికంగా గుర్తుచేసుకున్న జీవిత అనుభవాలుగా ప్రచురించ కుండా నిర్దిష్టమయిన ప్రశ్నలకూ, వ్యాఖ్యలకూ స్పందించి ఇచ్చిన సమాధానాలుగా రికార్డు చేసి వుండాల్సింది. ఇంటర్వ్యూ చేసినప్పుడే, వాళ్ళ గత అనుభవానికి సంబంధించిన అపురూపమయిన జ్ఞాపకాలను వాళ్ళ మాటలలోనే రాబట్టాలి అనే ప్రయత్నం చేయకుండా తాము ఆశించే చర్చకు ప్రాతిపదిక ఏర్పడే పద్ధతిలో ప్రశ్నలూ, వ్యాఖ్యలూ వాళ్ళ ముందు ఉంచాల్సింది. ఆ విధంగా సేకరించిన సమాచారాన్ని తమ సిద్ధాంత దృక్పథంతో వివరంగా వ్యాఖ్యానించి 'చివరిమాట'లో తాము లేవదీసిన ప్రశ్నలకు సమాధానాలను వివరంగా చర్చించి వుంటే కనీసం – తాము ఆశించినట్టు – చర్చ జరిగేది, చర్చకు ఒక ప్రాతిపదిక ఏర్పడేది. చర్చలో పాల్గొనదల్చుకున్న వాళ్ళకు చర్చ ఏమిటో అర్థం అయ్యేది. ప్రస్తుతం ఉన్న రూపంలో పుస్తకాన్ని చదివే పాఠకులకు – ప్రచురణకర్తలు ఆహ్వానం పలుకుతున్న చర్చకు (ఒకటి రెండు అంశాలు మినహాయిస్తే) పరిధి ఏమిటో,

ప్రమాణం ఏమిటో, ప్రతిపాదనలు ఏమిటో, ప్రతివాదం ఏమిటో అర్థం అవుతుందనుకోను.

విశ్లేషణకు, అనుభవానికి మధ్య కృత్రిమంగా కల్పించిన ఈ వైరుధ్యం ప్రచురణకర్తలకు 'చరిత్ర' పట్ల ఉన్న అవగాహనలో కూడా కనబడుతుంది. 'విస్తృత (macro) చరిత్రకు ఉన్న అధికారంతో అది అనుభవాన్ని వక్రీకరించి మొద్దు బారేట్టు చేస్తుంది' అన్నారు. తద్వారా, 'దాని స్వభావానికి వ్యతిరేకమయిన జ్ఞాపకాలను తుడిచిపెట్టగలిగే శక్తి ఆ చరిత్రకు ఉంది', 'అణచివేతకు, దోపిడీకి గురయ్యే వాళ్ళ ఏ అనుభవాలయితే సిద్ధాంతాల్లోకి పూర్తిగా ఇమడలేదో ఆ అనుభవాలే కార్యాచరణకు, మార్పుకు దోహదం అవుతాయి'. ఈ వ్యాఖ్యలు చరిత్ర పట్ల ప్రచురణకర్తలకు ఎంత అశాస్త్రీయమయిన అవగాహన ఉందో తెలుపుతాయి. చరిత్రలోనయినా, భౌతిక శాస్త్రంలోనయినా ఒకే కోవకు చెందిన వివిధ విషయాల వైయక్తిక ప్రత్యేకతలను పక్కకు పెట్టి వాటి సామాన్య లక్షణాలను విశ్లేషిస్తే వాటి స్వభావం అర్థం అవుతుందనేది శాస్త్రీయదృక్పథం. ఈ పుస్తక ప్రచురణకర్తల దృక్పథం అందుకు పూర్తిగా భిన్నమయినది. సామాన్య లక్షణాలను విస్తృత ప్రాతిపదిక మీద స్థూలంగా విశ్లేషించే ప్రయత్నం సున్నితమయిన ప్రత్యేకతలను మొద్దుబారేట్టు చేస్తుందని వాళ్ళు అంటారు. పైగా ఆ ప్రత్యేకతలలోనే అసలు చోదక శక్తులు ఉన్నాయి కాబట్టి, విషయాన్ని అర్థం చేసుకోవడానికి స్థూలవిశ్లేషణ పనికి రాదంటారు కూడా.

నిజానికి సామాజిక మార్పును విశ్లేషించి దానికి కారణం అయిన చోదక శక్తులను అర్థం చేసుకోవడమే చరిత్ర రచనకు గల ఉద్దేశ్యం. నిజమయిన చోదక శక్తులు సిద్ధాంతాలలోకి ఇమడవన్న వారి అభిప్రాయాన్ని బట్టి చూస్తే, చరిత్ర రచనే అసలు అసాధ్యం అనుకోవాలి. అటువంటప్పుడు తాము సేకరించిన ముడిపదార్థాన్ని విశ్లేషించకుండా 'ఇదే చరిత్ర, ఇందులో ఒక్కొక్క జీవితంలోని ప్రత్యేకతలే తెలంగాణ పోరాటానికి కారణం అయ్యాయి' అని మన ముందు పడేశారంటే ఆశ్చర్యం ఏముంది? ప్రచురణకర్తల తాత్విక దృక్పథం ఎంత వైయక్తికమయినదో ఇప్పుడు అర్థం అవుతుంది. అందులోని లోపం ఏమిటో కూడా సులభంగానే అర్థం అవుతుంది. ఏదయినా ఒక రాజకీయ ఉద్యమంలోకి వచ్చే వ్యక్తులు తాము ఎందుకు ఉద్యమంలోకి వచ్చామని ఆలోచిస్తే అందుకు

రాజకీయార్థిక కారణాలే కాక 'వైయక్తిక'మయిన కారణాలూ కనిపిస్తాయి. (ఇవి కూడ నిజంగా వైయక్తికమయినవి కాదు, జాగ్రత్తగా విశ్లేషిస్తే ప్రచురణకర్తలు అభిశంసించే స్థూలచరిత్రకు అందే విషయాలే.) ఒకరు ఇంట్లో తండ్రి పెత్తనం వల్ల అణచివేతను వ్యతిరేకించడం అలవర్చుకొని ఉండవచ్చును. ఒకరు అనాథాశ్రమంలో పెరిగిన కారణంగా ప్రపంచంతో తలపడడం చిన్నతనం నుండే అలవర్చుకొని ఉండవచ్చును. అయితే ఇటువంటి వైయక్తికమయిన కారణాలు వెయ్యి కలిపినా చరిత్ర చోదకశక్తి కాదు. ఈ వెయ్యి రకాల వైయక్తికమయిన కారణాలూ ఒకే పోరాటానికి – దేశముఖ్‌లకూ, నిజాం నవాబుకూ వ్యతిరేకమయిన రైతాంగ తిరుగుబాటుకు – ఎందుకు దారితీయాలి? ఇన్ని రకాల కారణాలవల్ల తిరుగుబాటు మనస్తత్వం అలవర్చుకున్న వాళ్లంతా ఒకే పోరాటంలోకి ఎందుకు వచ్చారు? అవే వైయక్తికమయిన కారణాలు వేరే కాలంలో, వేరే సందర్భంలో ఖలిస్తాన్ ఉద్యమాని[9]కో, సంతోషిమాత[10] పూజలకో ఎందుకు దారితీస్తాయి? వీటికి సమాధానాలు స్థూలమయిన రాజకీయార్థిక విశ్లేషణలోనే దొరుకుతాయి. అదే చరిత్ర అవుతుంది. ఆ చరిత్ర మొద్దుబారేట్టు చేస్తుందని ప్రచురణకర్తలు భావించే సున్నితమయిన వైయక్తిక విషయాలను కూడ స్థూలంగా (at a macro level) అర్థం చేసుకున్నప్పుడే, చారిత్రకంగా, సామాజికంగా అర్థం చేసుకున్నప్పుడే అర్థవంతమవుతాయి. నలుగురికి సామాన్యమయిన విషయాలకు మాత్రమే సామాజికంగా అర్థం ఉంటుంది. పూర్తిగా వైయక్తికమయిన విషయాలకు (అసలు అటువంటివి ఏమయినా ఉంటే) అర్థం ఉండదు. వాటిని అర్థం చేసుకోవాలనే ప్రయత్నానికీ అర్థం ఉండదు. వాటినే చరిత్ర చోదక శక్తులుగా అందలం ఎక్కించి, అనుభవాన్ని ఆస్వాదించడం తప్ప విశ్లేషించడం అసాధ్యం, అనవసరం అని ప్రకటించడం శాస్త్రీయదృక్పథానికి అభాస.

### 'స్త్రీల చరిత్ర'

ఈ పుస్తక ప్రచురణకర్తలు సాధించదల్చుకున్న ప్రయోజనాలలో ఒకటి 'స్త్రీల చరిత్ర' అనే భావాన్ని – కార్మికచరిత్ర, రైతాంగం చరిత్ర మొదలయిన భావాలకు సమాంతరంగా – ప్రతిపాదించడం. తాము ప్రచురించిన ఇంటర్వ్యూలే చరిత్ర అంటున్నారు కాబట్టి అవి చదివితే ఈ భావం ఏమిటో అందుతుందనుకుంటే పొరబాటు అవుతుంది. 'స్త్రీల చరిత్ర అంటే...' అనే ముందుమాట నుండి ఈ

భావాన్ని అర్థం చేసుకోవాలి. ఇంగ్లీషులో రాసి తెలుగులోకి అనువదించినట్టు ఉన్న ఈ ముందుమాటలో ప్రచురణకర్తలు సాంప్రదాయిక చరిత్ర రచనకు స్త్రీల పట్ల ఉన్న వైఖరిని చర్చించారు. మూడు రకాల వైఖరులను ప్రస్తావించి, పూర్వపక్షంచేసి తమ అభిప్రాయాన్ని ప్రతిపాదించారు. ఒక రకమయిన చరిత్ర రచనలో అసలు స్త్రీలకు పాత్ర ఉండదు. చరిత్రలో చెప్పుకోదగ్గ మార్పులన్నీ మగవాళ్లే సాధిస్తారు. స్త్రీలకు పాత్ర అంటూ ఉంటే మగవాళ్ల తగాదాలకో, విలాసాలకో వస్తువులుగా మాత్రమే – ముంతాజ్ మహల్[11], హెలెన్ ఆఫ్ ట్రాయ్[12]ల లాగా. రెండవరకం చరిత్ర రచనలలో రాణీఝాన్సీ[13], రుద్రమదేవి[14], సరోజిని నాయుడు[15], మేడం క్యూరీ[16] లాంటి 'గొప్ప' స్త్రీలకు మాత్రమే స్థానం ఉంటుంది. వీళ్ళ 'గొప్ప' తనం ఏమిటంటే మగవాళ్ల ప్రపంచంలో, మగవాళ్లు గొప్పవిగా భావించే విలువల ప్రమాణంలో, మగవాళ్లతో సమంగా పోటీపడగలగడం. ఇటువంటి 'గొప్ప' స్త్రీల పాత్రను వెలికితెచ్చే చరిత్ర రచనను ప్రచురణకర్తలు నష్టపరిహార (Compensatory) చరిత్ర రచన అన్నారు. మూడవరకం చరిత్ర రచనలో 'గొప్ప' స్త్రీలు కాక మామూలు స్త్రీలు ఉంటారు. అయితే వీళ్లు స్త్రీలుగా కాక కార్మిక లేక రైతాంగ కుటుంబాల స్త్రీలుగా ఉంటారు. మగవాళ్లు నిర్ణయించి, మగవాళ్లు నిర్వహించే పోరాటాలలో స్త్రీలు ఏ రకంగా సహకరించారనేది ఈ రకమయిన చరిత్ర రచనలో విషయంగా ఉంటుంది. కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రలు స్త్రీల పాత్రను గురించి రాసేటప్పుడు ఈ వైఖరిని అవలంబిస్తాయి. దీనిని సహకార (Contributory) చరిత్ర అన్నారు.

ఒక స్థాయిలో ఈ చివరి రెండు అభ్యంతరాలు సమంజసమయినవిగానే తోస్తాయి. (మొదటి రకం చరిత్ర రచనను చర్చించవలసిన అవసరమే లేదు.) రుద్రమదేవిని ఆమె తండ్రి 'కొడుకులాగ' పెంచాడని, సరోజిని నాయుడు మగవాళ్లతో 'సమంగా' రాజకీయ దక్షత ప్రదర్శించారనీ చరిత్ర పుస్తకాలలో చదువుకున్నాం. పోరాటాల మాటకొస్తే, 'మగవాళ్లతో భుజం భుజం కలిపి స్త్రీలు పోరాడారు', 'మగవాళ్లు ముందు నిలబడితే స్త్రీలు రాళ్లు అందిచ్చారు' మొదలయిన వాక్యాలు అందరికీ పరిచితమే. ప్రచురణకర్తలు ఇటువంటివి నిర్దిష్టంగా ఉటంకించారు కూడా. ఇప్పటికీ పోరాటాల రిపోర్టులలో ఇటువంటి అభిశంసనీయ మయిన వాక్యాలు అడపాదడపా చూస్తుంటాము.

## సహేతుకమయిన ప్రశ్నలు - అశాస్త్రీయమయిన దృక్పథం

ఇటువంటి వాక్యాలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని ప్రచురణకర్తలు విమర్శిస్తున్నారని దీని నుండి అర్థం చేసుకొని ఆగిపోతే మాత్రం పొరబాటవుతుంది. వాళ్ళ విమర్శ వాక్య నిర్మాణానికీ దాని వెనకున్న పురుషాధిక్యభావానికీ మాత్రమే పరిమితమయిందని అనుకుంటే ఆ విమర్శకూ, మన అవగాహనకూ కూడా అన్యాయం చేసిన వాళ్ళం అవుతాము. వాళ్ళు లేవదీస్తున్న ప్రశ్న అంతకంటే లోతయినది. 'రుద్రమదేవి మగవాళ్ళతో సమంగా పోరాట దక్షత గల స్త్రీ' అనే వాక్యం పురుషాధిక్య భావం నుండి పుట్టిందని మాత్రమే వాళ్ళు అనడం లేదు. అసలు 'యుద్ధంలో దక్షత కలిగి ఉండడం' అనే విలువే మగవాళ్ళ విలువ, 'మగవాళ్ళ పబ్లిక్ ప్రపంచం' నిర్దేశించిన విలువ. సరోజిని నాయుడి 'రాజకీయ దక్షత' అయినా, 'మగవాళ్ళతో భుజం భుజం కలిపి పోరాడిన' స్త్రీలు రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాటపటిమ అయినా మగవాళ్ళ ప్రపంచానికి చెందిన విలువలు. వీటిలో ఒకవేళ స్త్రీలు ఘనత సంపాదించినా దాన్ని 'మగవాళ్ళతో' సమంగా చూడడమే, అసలు దానినొక ఘనతగా భావించడమే - తప్పుకాదు గాని - 'స్త్రీలచరిత్ర'కు అనవసరం, అసందర్భం. తెలంగాణ రైతాంగ పోరాటం 'స్త్రీల ప్రమేయం లేని ఉద్యమం'. మరి అందులో స్త్రీలు పాల్గొనలేదా అంటే 'స్త్రీలుగా' పాల్గొనలేదు. ఇంకొక రకంగా చెప్పాలంటే వాళ్ళు ఆ ఉద్యమానికి 'ఉపయోగపడ్డారే తప్ప' విడిగా పాల్గొనలేదు. వాళ్ళు ఏ విధంగా ఉపయోగపడ్డారో చూడడమే (వాక్యనిర్మాణం, దానివెనుకనున్న భావం ఎంత ప్రజాస్వామికంగా ఉన్నా సరే) 'సహకార చరిత్ర' అవుతుంది గాని 'స్త్రీల చరిత్ర' కాదు. స్త్రీలకు ఆ ఉద్యమం ఏ విధంగా ఉపయోగపడిందో చూడడం స్త్రీల చరిత్ర. రాజకీయ పోరాటాలలో స్త్రీల పాత్రను వివరించే ప్రయత్నం పురుషాధిక్య చరిత్ర రచన కంటే మెరుగయింది కావచ్చు, స్త్రీల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించటానికి అది ఉపయోగపడవచ్చు, కాని అసలు చేయవలసింది స్త్రీల చరిత్రకు ఆ పోరాటాల ప్రాముఖ్యత ఏమిటో చూడడం. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే ప్రచురణకర్తలు ఇంటర్వ్యూ చేసిన 16 మందిలో ఏ ఒక్కరికీ ఈ దృక్పథం లేదు. వాళ్ళంతా తమను తాము రైతాంగంలో భాగంగా - అందులో అంతర్భాగంగా స్త్రీలుగా - చూసుకున్నారే తప్ప కేవలం 'స్త్రీలు' గా చూసుకోలేదు. రేణాచక్రవర్తి[17]కి,

లెనిన్‌కు కూడా ఈ దృక్పథం లేదంటే అందుకు వాళ్లిద్దరినీ మెచ్చుకోవలసిందే – ఒకే గాటన కట్టి మెచ్చుకున్నా, విడివిడిగా మెచ్చుకున్నా ఫరవాలేదు.

మరయితే 'స్త్రీల చరిత్ర' అంటే ప్రచురణకర్తల దృష్టిలో ఏమిటి? ఒక్క మాటలో జవాబు చెప్పే ప్రయత్నం చేయకుండా వివరంగా చెప్పుకుందాం. జీవితాన్ని ప్రచురణకర్తలు పబ్లిక్ రంగం, ప్రైవేట్ రంగం అని విభజించారు. ఇది వస్తుగతంగా ఉన్న విభజనే. నాగరికత పుట్టినప్పటి నుండి మగవాళ్లు పబ్లిక్ రంగాన్ని స్వంతం చేసుకొని స్త్రీలను ప్రైవేట్ రంగానికి పరిమితం చేశారు. (అట్లాగని ప్రైవేట్ రంగం స్త్రీల 'స్వంత'మా అంటే కాదు, దాని మీద ఆధిపత్యం వహించే సాంస్కృతిక భావజాలంలో పురుషాధిక్యత ఒక ముఖ్య అంశంగా వుంటుంది.) పబ్లిక్ రంగంలో వచ్చే మార్పే చరిత్రగా పరిగణించబడింది. రాజకీయ ఆచరణ, తాత్విక విమర్శ కూడా పబ్లిక్ రంగానికే పరిమితం అయ్యాయి. అందువల్లే చరిత్ర 'నిర్మాత' లంతా మగవాళ్లుగానే కనబడతారు. అందులో స్త్రీలకు పాత్ర ఏమయినా ఉంటే అది 'నా భార్య సహకారం లేకపోతే నేనింతటి వాడిని అయివుండేవాడిని కాను' అనే వాత్సల్య పూర్వకమయిన ప్రశంస మాత్రమే. మార్క్సిజం తదితర ప్రజాస్వామిక దృక్పథాలు స్త్రీలు ప్రైవేట్ రంగానికి పరిమితం కాకుండా తాము కూడ పబ్లిక్ రంగంలోకి వచ్చి పాల్గొనాలని, అట్లా వచ్చి చురుగ్గా పాల్గొన్నప్పుడే స్త్రీవిముక్తి సాధ్యం అవుతుందని భావించాయి.

ఫెమినిస్టు ఉద్యమం ఈ విషయంలో ఒక ముఖ్యమయిన మార్పు తెచ్చింది. పబ్లిక్ రంగంలో జరిగే పోరాటాలలోనికి స్త్రీలు ముందుకు రావడమే కాదు, అసలు ప్రైవేట్ రంగం అనే దాన్నే రాజకీయంగా, విమర్శనాత్మకంగా పరిశీలించాలని, ప్రజాస్వామికంగా మార్చడం కోసం పోరాడాలని వాదించింది. 'వైయక్తిక విషయాలు కూడ రాజకీయమయినవే' (The personal is also political) అనే సూత్రీకరణ రూపంలో ఈ వాదన ముందుకొచ్చింది. ఈ వాదన కేవలం స్త్రీ పురుష సంబంధాలకు పరిమితం అయింది కాదు – సమస్త వైయక్తిక సంబంధాలకూ ఇది వర్తిస్తుంది. అయినా, స్త్రీలను కేవలం వైయక్తిక జీవితానికి పరిమితం చేయడం వల్ల ఈ అవసరాన్ని ఫెమినిస్టు ఉద్యమం ముందు గుర్తించడంలో అంత ఆశ్చర్యం లేదు. ఫెమినిస్టు ఉద్యమం నుండి వచ్చిన పరిగణనీయమయిన విషయాలలో ఇదొకటి. మార్క్సిజం దీనిని అంగీకరించడానికి వెనుకాడవలసిన అవసరం లేదు.

## సహేతుకమయిన ప్రశ్నలు - అశాస్త్రీయమయిన దృక్పథం

'వైయక్తికమయినవి కూడా అంతిమ విశ్లేషణలో సామాజికమే' అని మార్క్సిజం భావిస్తుంది. అయినా 'అంతిమ విశ్లేషణ'తో సంతృప్తి చెందక వైయక్తిక విషయాలలో కూడా విమర్శనాత్మకంగా, రాజకీయంగా వ్యవహరించవలసిన అవసరాన్ని మార్క్సిజం గుర్తించాలి. గుర్తింపులో సమస్యలు లేవని కాదు. ఆ మాటకొస్తే, పబ్లిక్ రంగంలో కూడా అన్ని విషయాల కంటే కార్మికవర్గ రాజ్యాధికారం కోసం జరిగే పోరాటం, వ్యూహం, ఎత్తుగడలు ప్రధానం అనీ, తక్కినవన్నీ అందుకు లోబడి జరుగుతాయనీ మార్క్సిజం భావిస్తుంది. దానివల్ల ఆచరణలో ఎన్నో వైరుధ్యాలు, సమస్యలు తలెత్తుతాయి. వాటంతటవి ప్రధానంగా అనిపించే విషయాలను పక్కకు పెట్టడం, ఉపేక్షించడం జరుగుతుంటుంది. వైయక్తిక విషయాలలో రాజకీయంగా వ్యవహరించాలని ప్రయత్నిస్తే కూడా అటువంటి సమస్యలు తప్పక వస్తాయి. అయినప్పటికీ సూత్రప్రాయంగా ఈ విషయాన్ని అంగీకరించక తప్పదు. ఈ అవసరాన్ని గుర్తించకపోవడం వల్ల ప్రస్తుతం జరుగుతున్నదేమిటంటే తమను తాము మార్క్సిస్టులుగా భావించుకునే వాళ్ళలో కూడా వైయక్తిక విషయాలలో – ఇటు సాంప్రదాయకమయిన అణచివేత విలువలు గాని, అటు నీతికీ నియమాలకూ మానవతా విలువలకూ అతీతమయిన అరాచకత్వం గాని కనపడతాయి. ఈ ఇద్దరి మధ్య వాదన అంటూ జరిగితే వాదించుకోవడానికి ఇద్దరికీ మార్క్సిస్టు ప్రమాణాలు లేవు – ఒకరు క్రమశిక్షణ గురించి మాట్లాడితే వేరొకరు బూర్జువా వ్యక్తివాదాన్ని ఆశ్రయిస్తారు.

అయితే ఈ పుస్తక ప్రచురణకర్తలకు చరిత్ర పట్ల ఉండే అవగాహన ప్రైవేట్ రంగంలో జరిగే పోరాటాలు, మార్పులు కూడా చరిత్రే అనే గుర్తింపుకు పరిమితం కాలేదు. అయివుంటే ఎవరికీ పేచీ ఉండదు. వీళ్లు మరొక అడుగు ముందుకు పోయి స్త్రీలు 'స్త్రీలు'గా (ప్రస్తుత దశలో ఎక్కువగా ప్రైవేట్ రంగంలో) ఎదుర్కొనే సమస్యలే 'స్త్రీల సమస్యలు' అనీ, వాటిని గురించి జరిపే పోరాటాలే స్త్రీల పోరాటాలు అనీ, వాటిని రికార్డు చేసేదే స్త్రీల చరిత్ర అనీ, వేరే ఏదయినా 'స్త్రీల ప్రమేయంలేని పోరాటాలకు' స్త్రీలు చేసే సహకారం మాత్రమే అవుతుంది లేదా మగవాళ్ళ చరిత్రలో స్త్రీల పాత్ర మాత్రమే అవుతుంది – అంతేకాని 'స్త్రీలచరిత్ర' కాదని – ప్రతిపాదించారు. 'తెలంగాణ పోరాటంలో స్త్రీలు ఏం చేశారని కాదు, తెలంగాణ పోరాటం స్త్రీలకు ఏం చేసింది' అనేది వాళ్ళ ప్రశ్న.

ఒక సామ్యం చెప్పుకుంటే దీని భావం పూర్తిగా బోధపడుతుంది. తెలంగాణ పోరాటంలో దళితులు (మాల మాదిగ తదితర పంచమ కులస్తులు) చాలామంది పాల్గొన్నారు. మన దేశంలో జరిగిన అన్ని శ్రామిక పోరాటాలలోనూ దళితులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అంబేద్కర్‌వాదులు కూడా దీన్ని ఈ పుస్తకం ప్రచురణకర్తలు ప్రదర్శించే వైఖరిలాంటి వైఖరితోనే చూస్తారు. వాళ్ళు చాలా తరచుగా, 'కమ్యూనిస్టు ఉద్యమాలు దళితులను ఉపయోగించుకుంటున్నాయి గాని వాటివల్ల దళితులకు ఏం వచ్చింది?' అని అడుగుతారు. దళితులకు ప్రత్యేకమయిన సమస్యల గురించి – 'అంటరానితనం' అనే పేరున టోకున వ్యవహరించే సవాలక్ష సమస్యల గురించి – జరిపే పోరాటాలే నిజమయిన 'దళితుల చరిత్ర' అనీ, తక్కినదంతా కమ్యూనిస్టు ఉద్యమాలు దళితులను ఏ విధంగా వాడుకున్నాయనే 'సహకార చరిత్రే' గాని దళితుల చరిత్ర కాదనీ అంబేద్కర్‌వాదులు వాదిస్తుంటారు (ఈ పదజాలం ఉపయోగించక పోవచ్చును). ఇట్లా ఒక్కొక్కరూ – స్త్రీలు, దళితులు. గిరిజనులు, యువకులు (మమ్మల్ని కొరియర్లుగా వాడుకున్నారు గాని మాకేం వచ్చింది?) వాదిస్తే చివరికి ఒక ప్రశ్న సహజంగానే వస్తుంది. అందరూ వాడుకోబడే వాళ్ళే అయితే వాడుకునేది ఎవరు? కేంద్ర కమిటీ లేక పొలిట్ బ్యూరో లోని అరడజను మంది నాయకులేనా? వాళ్ళు వీళ్ళనందరినీ ఎందుకోసం 'వాడు' కుంటున్నారు? తాము అధికారం సంపాదించుకొని పెత్తనం చేయడానికేనా? స్త్రీలను తిండిపెట్టడానికి, కొరియర్లుగా పనిచేయడానికి, షెల్టర్ ఇవ్వడానికి, రాళ్లూ కర్రలూ అందియ్యడానికి ఉపయోగించుకున్నారనే తర్కం ఎక్కడి దాకా పోతుందో స్పష్టమే.

అంతేకాదు, ఈ రకంగా చూస్తే తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర అంటూ ఏదీ ఉండదు. 'స్త్రీల సమస్యల' గురించి స్త్రీలు చేసిన పోరాటం స్త్రీల చరిత్ర; 'దళితుల సమస్యల' గురించి దళితులు చేసిన పోరాటం దళితుల చరిత్ర; 'గిరిజనుల సమస్యల' గురించి గిరిజనులు చేసిన పోరాటం. గిరిజనుల చరిత్ర – ఇటువంటి చరిత్రలు ఎన్ని కలిపినా తెలంగాణ రైతాంగ పోరాట చరిత్ర కాదు. ఎందుకంటే పోరాటానికి కేంద్రమయిన అంశం వెట్టిచాకిరీకి, భూమిపైన భూస్వాముల గుత్త పెత్తనానికీ వ్యతిరేకంగా జరిపిన పోరాటం. అది ఏ ఒక్కరి సమస్యా కాదు, అందరి ఉమ్మడి సమస్య. కాబట్టి ఈ పోరాటం నిజానికి అందరి చరిత్ర అవుతుంది. అది ఎవ్వరినీ 'ఉపయోగించు'కోలేదు. అందరూ తమ కోసం, తమందరి కోసం

అందులో పాల్గొన్నారు. అందులో అంతర్భాగంగానే ఇతర పోరాటాలు (కేవలం స్త్రీలవే లేక దళితులవే అయినవి) అర్థం అవుతాయి. ఒకవేళ ఆ ఇతర పోరాటాలు సవ్యంగా జరగకుంటే ఆ నిర్లక్ష్యం కూడా అందులో అంతర్భాగంగానే - లేక ఆ నేపథ్యంలోనే - అర్థం అవుతుంది. స్త్రీలు కేవలం 'స్త్రీలుగా' ఆ పోరాటంలో పాల్గొనలేదు, రైతాంగంలో భాగంగా పాల్గొన్నారు. ఆ క్రమంలోనే స్త్రీలవే అయిన సమస్యలను ఎదుర్కొన్నారు. ఎదుర్కొన్న క్రమంలో పార్టీ ఇచ్చిన సహకారాన్ని, ప్రదర్శించిన అలసత్వాన్ని కూడా చవిచూశారు. దళితులయినా, గిరిజనులయినా అంతే. నిజమే, భూ పోరాటం ఫలితంగా రైతాంగానికి భూమి దక్కిన తరువాత కూడా స్త్రీలకు ఆస్తిహక్కు లేని కారణంగా వాళ్ళు ఆ ఫలితాన్ని ప్రత్యక్షంగా కాక పరోక్షంగా మాత్రమే అనుభవించగలిగారు. భూసంస్కరణలలో భూమి గరిష్ఠ పరిమితిని (ఒక్క జనగామ తాలూకాలో మినహాయించి) చాలా ఎక్కువగా పెట్టిన కారణంగా దళితులు చాలామందికి భూమి దొరకలేదు.

ఇవి కాక కుటుంబంలో మగవాళ్ళ పెత్తనం దగ్గర నుండి సమాజంలో అంటరానితనం వరకు అనేక 'ఆర్థికేతర' మయిన సమస్యల మీద పోరాటం అరకొరగానే సాగింది. ఈ అసమానత ఎందుకు వచ్చిందని ప్రశ్నించడం సమంజసమే. దానికి పార్టీవైపు నుండి వచ్చే సమాధానం కూడా తెలిసిందే. ఒక్కొక్క చారిత్రక దశలో కొన్ని విషయాలను ప్రధానంగా ఎంచుకోవడం, వాటిమీద పోరాటాన్ని కేంద్రీకరించడం జరుగుతుంది. తత్ఫలితంగా మిగిలిన పోరాటాలకు కొంత అన్యాయం జరగవచ్చును కాని ప్రాధాన్యత అనేదాన్ని గుర్తించకపోవడం అచారిత్రకం, అశాస్త్రీయం. ఈ సమాధానం చారిత్రక భౌతికవాద అవగాహన నుండి పుట్టినదే. అయితే ఒక చారిత్రక దశలో ఏ పోరాటం ప్రధానం అనేది చారిత్రక భౌతికవాదం వస్తుగతంగా నిర్ణయిస్తుంది గాని, తక్కిన పోరాటాలకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలి, వాటిని ఎంతవరకు పక్కకు నెట్టడం అనివార్యం అనేవి వస్తుగతంగా నిర్ణయించబడవు. వాటిని పార్టీ నిర్మాణం, అవగాహన, ప్రజలకు ఇచ్చే చైతన్యం, పార్టీకి అందుబాట్లో ఉండే వనరులు నిర్ణయిస్తాయి. వాటి కోసం పార్టీ ఎంత ప్రయత్నం చేసిందని ప్రశ్నించడం సమంజసమే. దానికి పార్టీ యిచ్చే సమాధానాన్ని చర్చించడం అవసరమే. వస్తుగత పరిమితులు ఆచరణకు పరిధిని నిర్ణయిస్తాయనేది ఒక వైపు వాదన అయితే ఆ పరిధి లోపల జరిగే

ఆచరణే ఆ పరిమితుల్ని తొలగిస్తుందనేది రెండవవైపు సమాధానం కాగలదు. అయితే ఈ చర్చ చేయడానికి – పోరాటంలో పాల్గొన్న స్త్రీల పాత్ర నిజమయిన భాగస్వామ్యం కాదనీ, వాళ్లు కేవలం 'ఉపయోగించుకోబడ్డారనీ,' అసలది స్త్రీల ప్రమేయం లేని పోరాటం అనీ, ఇంకా కుట్ర పూరితంగా పార్టీ స్త్రీలకు ఇచ్చిన చైతన్యం అంతా కూడా పోరాట విరమణ తరువాత ఇళ్ళకుపోయి కుటుంబాలను నిలబెట్టుకోవడానికే పనికొచ్చిందని వాదించవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. మార్క్సిస్టు అవగాహనలోనూ, ఆచరణలోనూ వచ్చే లోపాలను మార్క్సిజానికి వ్యతిరేకమయిన దృక్పథంతో విమర్శిస్తే విషయం అర్థం కాదు, పరిష్కారం దొరకదు. తార్కికంగా గానీ, ఆచరణలో గానీ సాధ్యం కాని 'స్త్రీల చరిత్ర' అనే భావాన్ని ప్రతిపాదించవలసిన అవసరమూ లేదు. మరి 'కార్మిక చరిత్ర', 'రైతాంగ చరిత్ర' అనేవి ఉన్నాయి కదా – అంటారేమో. నిజానికి, మొత్తం సమాజం చరిత్ర నుండి విడదీసి ఒక వర్గం చరిత్రను పరిశీలించడం సరయింది కాదు. కాని కార్మిక రైతాంగ పోరాటాలు సమాజంలో నిర్ణాయకమయిన ఉత్పత్తి సంబంధాలను ప్రత్యక్షంగా తాకుతాయి కాబట్టి ఆ చరిత్రలు అర్థవంతం అవుతాయి. 'స్త్రీల చరిత్ర' ఆ విధంగా అర్థవంతం కాదు.

ఈ విచిత్రమయిన దృక్పథం వల్ల ప్రచురణకర్తలు లేవదీసిన ప్రశ్నలు కూడా కొన్ని పాక్షికంగా, వక్రంగా వున్నాయి. ఉదాహరణకు ఉద్యమం విరమణ తరువాత ఉద్యమంలో పాల్గొన్న స్త్రీలను తిరిగి ఇళ్ళకుపోయి పెళ్లిళ్లు చేసుకొని బ్రతకమన్నారని ప్రచురణకర్తల ఆరోపణ. ఈ ఆరోపణకు ఇంటర్వ్యూలలో స్త్రీలు పదే పదే చెప్పిన విషయాలు ఆధారమయ్యాయి. అయితే ఇది పార్టీ తన వ్యూహాన్ని మౌలికంగా మార్చుకున్నప్పుడు కేడర్‌కు ఒక కార్యక్రమం చూపలేకపోవడం అనే నిర్మాణ సంబంధమయిన లోపంగా కనబడక, 'మగవాళ్ళ'యిన పార్టీ నాయకత్వం ఆడవాళ్ళను ఉద్యమం కోసం వాడుకున్నంత కాలం వాడుకొని అవసరం తీరిపోయిన తరువాత మీ బ్రతుకు మీరు బ్రతకండి అని ఇళ్ళకు పంపించేశారన్న ఆరోపణ రూపం తీసుకుంది. ఇదే తర్కాన్ని ప్రయోగిస్తే, 1952కు పూర్వం తమ ఆస్తులన్నీ పార్టీకోసం అమ్మి ఇచ్చేసి, పోరాట విరమణ తరువాత దిక్కు లేకుండా పోయిన కుటుంబాలు కూడా 'పార్టీ మా ఆస్తుల్ని హరింపచేసి అవసరం తీరిన తరువాత అడుక్కు తినమనింది' అనొచ్చు. అంతవరకు ప్రజానాట్యమండలిలో

పనిచేసి పోరాట విరమణ తరువాత పార్టీ ఒక కార్యక్రమం ఇవ్వలేకపోయిన కారణంగా సినిమాలలోకి, పత్రికలలోకిపోయి రకరకాలుగా దిగజారిపోయిన కళాకారులు కూడ ఈ మాటే అనొచ్చు.

## స్త్రీ సమస్య - కమ్యూనిస్టు పార్టీ

'స్త్రీల పనికి పార్టీలో ఎటువంటి విలువ ఉండిందని అర్థం చేసుకోవడానికి – స్త్రీలు తీసుకున్న బాధ్యతలనీ, వాళ్ళ పని పట్ల వాళ్ళకే వున్న అవగాహననూ, పార్టీ వ్యక్తులకు స్త్రీల పని పట్ల ఉన్న దృష్టినీ, పార్టీ ఎటువంటి బాధ్యతల్ని వాళ్ళకు అప్పగించిదన్న వాస్తవాల్నీ అన్ని కోణాలనుండి పరిశీలించవలసి ఉంటుంది' అని చివరిమాటలో (పేజీ 285) అన్న వాక్యాలను ఈ పుస్తకానికి లక్ష్య ప్రకటనగా భావించవచ్చును. ఆ పరిశీలనకు ఈ 16 ఇంటర్వ్యూలు చక్కగా ఉపయోగ పడవలసింది కూడా. అయితే వీటిలో ఏ విషయాన్ని గురించీ, ఏ కోణం నుండి కూడా చర్చ సమగ్రంగా ప్రతిపాదించబడలేదు. విడివిడిగా చాలా అభిప్రాయాలు మాత్రం ఉన్నాయి. 'పార్టీలో మాత్రం స్త్రీలను తక్కువగా చూసే భావం లేదు. మా కామ్రేడ్సు కెవరికీ ఆ భావం లేదు', అనే బ్రిజ్ రాణి[18] అభిప్రాయం ఉంది (పేజీ 212). 'నన్ను మగవాళ్ళతో సమానంగా చూశారా, నాకు బాధ్యతలు అప్పగించారా అని అడుగుతున్నారు కదా! తప్పకుండా ఇచ్చారు' అన్న ప్రమీలాతాయి అభిప్రాయం వుంది (పేజీ 91). 'వాళ్లు (మగవాళ్ళు) మనల్ని గుర్తించరండీ అసలు, మనం వాళ్ళు గుర్తించాలని అడుగుడేంది?' అనే మల్లు స్వరాజ్యం అభిప్రాయం వుంది (పేజీ 266). వీటిలో మొదటి అభిప్రాయం ఆత్మవంచనో లేక విమర్శనాత్మక దృష్టి లోపించడం వల్ల అనుభవానికీ ఆదర్శానికీ తేడా చూడలేని బలహీనతోనన్న ప్రచురణకర్తల అభిప్రాయం వుంది. నిజానికి ఇంటర్వ్యూలలోని అభిప్రాయాలనూ ప్రచురణకర్తల అభిప్రాయాలనూ ఒకచోట పెడితే పై ప్రశ్నలకు ఏ సమాధానం కావాలంటే ఆ సమాధానం రాబట్టవచ్చును. అంటే విభిన్న అభిప్రాయాలకు ఇక్కడ తావుందని అర్థం. వాటిని వివరంగా చర్చించడానికి ఈ స్త్రీల జీవిత అనుభవాలు చక్కటి ప్రాతిపదిక అయ్యేవి – సరిగ్గా ఉపయోగించుకొని ఉంటే. ఇంటర్వ్యూలు వాళ్ళ అనుభవాలను రికార్డు చేయాలనే దృష్టితో కాక, చర్చను వాళ్ళ అనుభవం నుండి ప్రతిపాదించాలి అనే దృష్టితో విశ్లేషణాత్మకంగా నిర్వహించి, చర్చగానే

రికార్డు చేసి, తమ సిద్ధాంత దృక్పథంతో వ్యాఖ్యానించి వుంటే బాగుండేది. వస్తుగత వాస్తవానికీ మన విజ్ఞానానికీ ఉండే జ్ఞాన సిద్ధాంత సంబంధాన్ని గురించి తప్పుడు అభిప్రాయం ఉండబట్టి చర్చ ఆదిలోనే అంతం అయింది.

ఉదాహరణకు 'స్త్రీలు ఇంట్లో – తల్లిదండ్రులతో, భర్తతో – తగాదా పెట్టుకొని ఉద్యమంలోకి రావడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, పార్టీ నాయకత్వం 'గొడవలు జరుగుతా'యని భయపడి ప్రోత్సహించలే'దన్న ఆరోపణ వుంది. ఆ స్త్రీల దృష్టితో చూస్తే అది అన్యాయంగానే తోస్తుంది. పార్టీ నాయకత్వాన్ని అడిగితే మొత్తం ఉద్యమాన్నీ, ప్రజల సంసిద్ధతనూ, విస్తృత ప్రాతిపదిక మీద ఉద్యమానికి మద్దతు సంపాదించవలసిన అవసరాన్నీ దృష్టిలో ఉంచుకొని ఆ నిర్ణయం తీసుకున్నామంటారు. ఈ ఒక్క విషయంలోనే కాదు, చాలా విషయాలలో మొత్తం ఉద్యమం అవసరాలకు – అంటే కార్మికవర్గం రాజ్యాధికారాన్ని చేపట్టడానికి అవసరమయ్యే వ్యూహం, ఎత్తుగడలకు – అనివార్యంగా ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల అంతకంటే తక్కువ ప్రాముఖ్యం గల విషయాలకు అన్యాయం జరుగుతూనే ఉంటుంది. ఉత్సాహవంతులను నిరుత్సాహపరచడం అనే ఒక్క విషయమే తీసుకున్నా, ఇల్లు వదిలిపెట్టడానికి సిద్ధంగా వున్న స్త్రీలే కాదు, ఆస్తులు అమ్ముకొని పార్టీలో చేరతామని, ఉద్యోగం, చదువు మానుకొని పార్టీలో చేరతామని ముందుకు వచ్చిన వాళ్ళను పార్టీలు తరచుగా నిరుత్సాహపరుస్తూ ఉంటాయి. (నూటికి నూరు పాళ్ళు స్త్రీ సమస్యలు కానివాటిని కేవలం స్త్రీ సమస్యలుగా చిత్రించే పొరబాటుకు ఇది మరొక ఉదాహరణ.) ఈ వివాదంలో రెండు వైపులనూ సమర్థించే అభిప్రాయాలు ఈ పుస్తకంలోని ఇంటర్వ్యూలలో దొరుకుతాయి. 'ఇంట్లో దెబ్బలాడి – పార్టీ సహకారం ఇవ్వలేదని, ఆ విషయంలో సరయిన దృక్పథం లేకపోవడమే అందుకు కారణం' అని భావించిన ప్రియంవద[19] అభిప్రాయం ఉంది (పేజీ 46), అందుకు భిన్నంగా 'కొన్నిసార్లు మనం అంతకంటే ముందుకు పోవడం సాధ్యం కాదు. పార్టీ మన కొరకా, జనం కొరకా? జనం కొరకే అయితే జనానికి అవసరం అయిన మోతాదులోనే మార్పు కోరతాం మనం. అందుకే అంతకు మించి చేయలేం' అని చెప్పి, మళ్ళీ సందేహంగా 'పార్టీ హయ్యర్ కమిటీలో చర్చిస్తే సూత్రబద్ధమయిన వైఖరే చెప్పారు. చెప్పడంలో వెనుక ముందేం లేదు. ఇంప్లిమెంటేషన్‌కి వచ్చేవరకే

మనకున్న సమాజం లొసుగుల వల్ల అవి చాలా అవకతవకలుగా అవుతున్నాయి' అని ముగించిన మల్లు స్వరాజ్యం అభిప్రాయం ఉంది(పేజీ 256).

ఈ అభిప్రాయాలను చర్చించాలంటే కొన్ని మౌలికమయిన ప్రశ్నలు వేసుకోవాలి. ఉద్యమం చేపట్టే సమస్యలలో ప్రాముఖ్యత దృష్ట్యా తరతమ భేదాలు (priorities) ఉంటాయా? ఉంటే దేని ప్రాముఖ్యత ఎంత? ఏ అవసరం కోసం ఏ అవసరాన్ని పక్కకు పెట్టవచ్చు? దానికి సంబంధించి కేడర్‌ను గాని, జనాన్ని గాని విద్యావంతుల్ని చేయడం ఎలా? కేడర్‌ను అయినా, ప్రజల్నయినా కొన్ని పోరాటాలు చేపట్టకుండా, అదే సమయంలో వాళ్ళు నీరుగారి పోకుండా సున్నితంగా వ్యవహరించడం ఎలా – ఇవన్నీ క్లిష్టమయిన ప్రశ్నలు. ఈ ప్రశ్నలను చర్చించక పోతే 'ఇద్దరూ రైటే' అన్న ఉదారవాదం మాత్రమే మిగులుతుంది. దానివల్ల ఇటు స్త్రీ సమస్యకు గాని, అటు పార్టీలకు గాని ప్రయోజనం ఉండదు. పైగా, ఉద్యమం వ్యూహానికీ, ఎత్తుగడలకూ, నిర్మాణానికీ సంబంధించిన సమస్యలను ఆ నేపథ్యం నుండి వేరు చేసి కేవలం అందులో ఒకానొక అంశమయిన 'స్త్రీ సమస్య' అనే దృక్పథం నుండి చూసి 'పురుషాధిక్యత' అనే టోకు సమాధానంతో సంతృప్తి చెందడం వల్ల అసలు చర్చకు అవకాశం కూడా లేకుండ పోతుంది. ఇక్కడ మరొకసారి గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ వైఖరి ప్రచురణకర్తలదే గాని ఇంటర్వ్యూ ఇచ్చిన స్త్రీలది కాదు. వాళ్ళు – తమ పరిమితులలో – సమస్యను మొత్తంగానే చూసినట్టు అనిపిస్తుంది. పార్టీ నాయకత్వంలో పురుషాధిక్య భావం లేదని కాదు. ఈ సమాజంలో పుట్టిన మగవాళ్ళే కాబట్టి ఉండడంలో ఆశ్చర్యం లేదు. అయితే విషయాన్ని నిర్మాణ సంబంధమయిన సమస్యలలో అంతర్భాగంగా చర్చించినప్పుడు మాత్రమే ఆ ఆధిక్య భావం నిజంగా ఏ మోతాదులో ఉందో అర్థం అవుతుంది. దాని పరిష్కారం కూడా అర్థం అవుతుంది. నేపథ్యం నుండి వేరు చేసి నిర్మాణ సంబంధమయిన ఇబ్బందులను కూడా పురుషాధిక్య భావానికి అంటగడితే అసలు సమస్య పక్కకు పోయి పరస్పర ఆరోపణలు, అనుమానాలు, అభిశాపాలు మాత్రమే మిగులుతాయి.

తాము లేవదీసిన ప్రశ్నలలో ఒక్కదానిని మాత్రమే ప్రచురణకర్తలు కొంచెం వివరంగా చర్చించారు. అది, పార్టీ రహస్య కార్యకలాపాలలోకి – సాయుధ స్క్వాడ్లతో సహా – స్త్రీలను తీసుకోవడం పట్ల పార్టీకి ఉన్న వైఖరి. స్త్రీలను ఎక్కువగా తీసుకోక

పోవడానికి కారణం కొన్ని 'టెక్నికల్ సమస్యలు' అని చెప్పి వాటిని సోదాహరణంగా వివరించారు. వీటిలో ప్రధానమయినవి – పిల్లల్ని కనడం అనే సమస్య, పార్టీలో సెక్స్ సంబంధాల సమస్య. ఈ రెండు సమస్యలకూ స్త్రీలదే బాధ్యత అయినట్టు పార్టీ ప్రవర్తించడాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇది న్యాయమయిన విమర్శే. వీటితో హేతుబద్ధంగా, విమర్శనాత్మకంగా, రాజకీయంగా వ్యవహరించి పరిష్కరించాలే తప్ప, బాధ్యత స్త్రీల మీద పెట్టి వాళ్ళను 'శిక్షించడం' లేక 'అదుపులో పెట్టడం,' లేకపోతే అసలు పార్టీలోకి తీసుకోకనే పోవడం అభిశంసనీయం అని అంగీకరించక తప్పదు. ఇవే కాదు, ఉద్యమ క్రమంలో ఎదురయ్యే వైయక్తిక జీవిత సమస్యలన్నిటి పట్లా అదే వైఖరి అవసరం. ఈ దృక్పథాన్ని అలవర్చు కున్నప్పుడే వైయక్తిక జీవితంలో నైతిక వర్తనకు మార్క్సిస్టు ప్రమాణాలు ఏమిటి అనే సమస్యను కూడా ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటి దాకా ప్రత్యక్షంగా తలపడకుండా దాటేస్తూ వస్తున్న ఈ సమస్యను ఎదుర్కోవడం కూడా చాలా అవసరం.

1. స్త్రీశక్తి సంఘటన : 1970 దశకం చివర్లో హైదరాబాద్‌లో, ప్రధానంగా రాడికల్ లెఫ్ట్ గ్రూపులలో పనిచేసిన స్త్రీలతో ఏర్పడిన సంఘం. మొదట్లో రేప్, స్త్రీలకు హానికరమైన గర్భనిరోధక మందులు వంటి అంశాలపై ఆందోళనలు జరిపారు. తర్వాతి కాలంలో సైద్ధాంతిక చర్చల మీద ఎక్కువ దృష్టిపెట్టారు. 'మనకు తెలియని మన చరిత్ర : తెలంగాణ రైతాంగ పోరాటంలో స్త్రీలు' (తెలుగు, ఇంగ్లీషు), 'సవాలక్ష సందేహాలు' వీరు తీసుకొచ్చిన పుస్తకాలు.
2. సుందరయ్య (1913–1985) : పూర్తి పేరు పుచ్చలపల్లి సుందరయ్య. మొదట సిపిఐ లోనూ, తరువాత సిపిఎంలోనూ ముఖ్య నాయకులు. తెలంగాణ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించిన వారిలోనూ ముఖ్యులు. 'వీర తెలంగాణ : విప్లవ పాఠాలు' పేరుతో తెలంగాణ పోరాటం మీద ఒక పుస్తకం రాశారు.
3. తెలంగాణ రైతాంగ పోరాటం (1946–1951) : తెలంగాణలోని దొరల, భూస్వాముల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా మొదలై ఆ తర్వాత నిజాంపాలనకు వ్యతిరేకంగా కొనసాగిన పోరాటం. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరిగిన ఈ పోరాటంలో వేలాదిమంది అసువులు బాశారు.
4. పాలకుర్తి ఐలమ్మ (1919–1985) : చిట్యాల ఐలమ్మ, చాకలి ఐలమ్మ అని కూడా అంటారు. వరంగల్ జిల్లాలోని కృష్ణాపురం ఆమె స్వగ్రామం. పాలకుర్తి ఆమె అత్తగారి

ఊరు. నాలుగెకరాల భూమిని నిలబెట్టుకోవడానికి విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డితో ఆమె చేసిన ఒంటరి పోరాటం తెలంగాణ పోరాటానికి అంకురార్పణ లాంటిది. తర్వాత ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీలలో సభ్యురాలై తన ఇంటినే పోరాట కార్యకలాపాలకు కేంద్రంగా మార్చారు.

5. దూడల సాలమ్మ (1925- ) : వరంగల్ జిల్లా ఖిలాషాపురం ఈమె స్వగ్రామం. గౌడ కులస్తురాలు. తెలంగాణ రైతాంగ పోరాటంలో దళ నాయకురాలిగా పనిచేశారు.
6. మల్లు స్వరాజ్యం (1931- ) : నల్గొండ జిల్లా సూర్యాపేట దగ్గరి కవిదల కొత్తగూడెం ఈమె స్వగ్రామం. 11 ఏళ్ళ వయస్సులోనే ఆంధ్ర మహాసభలో చేరి వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి దళ కమాండర్‌గా పనిచేశారు. 1964లో పార్టీ చీలిపోయాక సిపిఎంలో ముఖ్య నాయకులుగా ఉన్నారు. పదేళ్ళు శాసన సభ్యురాలిగా కూడా పనిచేశారు.
7. ప్రమీలాతాయి : బొంబాయి నగరంలో పెరిగి 1942లో హైదరాబాద్ వచ్చి పాత నగరంలోని బన్సీలాల్ బాలికల ఉన్నత పాఠశాలలోను, ధర్మవంత ఉన్నత పాఠశాలలోను పనిచేశారు. ఉపాధ్యాయ ఎం.ఎల్.సి.గా పోటీ చేశారు. హైదరాబాద్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కమిటీ సభ్యురాలిగా, కార్మిక సంఘాల అధ్యక్షురాలిగా, ప్రపంచ మహిళా సంఘం కార్యదర్శులలో ఒకరుగా (బెర్లిన్‌లో) పనిచేశారు. తెలంగాణ రైతాంగ పోరాట సమయంలో ఆయుధాలతో పట్టుబడి జైలుపాలయ్యారు. కార్మిక నాయకులు కె.ఎల్. మహేంద్రను వివాహం చేసుకున్నారు.
8. కొండపల్లి కోటేశ్వరమ్మ (1921- ) : స్వస్థలం కృష్ణా జిల్లాలోని పామర్రు. 1940-52 మధ్య కమ్యూనిస్టు పార్టీలో, ప్రజానాట్యమండలిలో పనిచేశారు. ఆమె ఆత్మకథ 'నిర్జన వారధి' మూడేళ్ళ క్రితం హెచ్‌బిటి ప్రచురణగా వచ్చింది.
9. ఖలిస్తాన్ ఉద్యమం : భారత - పాకిస్తాన్ విభజన సందర్భంగా సిక్కులలో ఏర్పడ్డ అభద్రత ఖలిస్తాన్ ఆలోచనకు అంకురార్పణ చేసింది. అది వివిధ రూపాల్లో వ్యక్తమవుతూ చివరికి 1970, 1980లలో అనేక వేర్పాటువాద సంస్థల ఏర్పాటుకు, హింసాత్మక చర్యలకు దారితీసింది.
10. సంతోషిమాత : ఉత్తర భారతదేశంలో, నేపాల్‌లో ఈ మాతకు భక్తులు ఎక్కువ. 1960లలో హఠాత్తుగా వెలుగులోకి వచ్చిన ఈ మాత 1975లో వచ్చిన 'జై సంతోషిమాత' సినిమా తర్వాత దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. పురాణ పాత్ర కాకపోయినప్పటికీ వినాయకుని కూతురనే గాథను కల్పించారు. మహాలక్ష్మి భంగిమ, దుర్గాదేవి ఆయుధాలు, సతీ అనసూయ లక్షణాలు కలిగిన దేవతా స్వరూపిణి.
11. ముంతాజ్ మహల్ (1593-1631) : మొఘల్ చక్రవర్తి షాజహాన్ పట్టమహిషి. అసలు పేరు అర్జుమంద్ బాను బేగం. షాజహాన్ కట్టించిన తాజ్‌మహల్ వల్ల ఆమె పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.
12. హెలెన్ ఆఫ్ ట్రాయ్ : ప్రసిద్ధ గ్రీకు గాథలో ఒక పాత్ర. చాలా అందగత్తె అని పేరు. ఆమె కారణంగా గ్రీకులకు, ట్రాయ్ రాజ్యానికి మధ్య భీకర యుద్ధం జరిగి ట్రాయ్

పూర్తిగా ధ్వంసమైందని కథ. హోమర్ దీని ఆధారంగా 'ఇలియడ్' అనే ప్రసిద్ధ కావ్యాన్ని రాశారు. అయితే ఈ గాథకు అనేక ఇతర కథనాలు కూడా ఉన్నాయి.

13. రాణి ఝాన్సీ (1835–1858) : మహారాష్ట్రలోని ఝాన్సీ రాజ్యాన్ని పరిపాలించిన రాణి. అసలు పేరు మణికర్ణిక అయినా లక్ష్మీబాయిగా ప్రసిద్ధురాలు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి మరణించింది.
14. రుద్రమదేవి : (1259–1289) : ఓరుగల్లు రాజధానిగా పరిపాలించిన కాకతీయుల రాణి. గణపతిదేవుని వారసురాలిగా 14వ యేటే గద్దెనెక్కి వీరనారిగా పేరు తెచ్చుకుంది.
15. సరోజిని నాయుడు (1879–1949): స్వాతంత్ర్య పోరాట నాయకురాలు. కవి. 'నైటింగేల్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధురాలు. స్వాతంత్ర్యానంతరం గవర్నర్‌గా కూడా పనిచేశారు.
16. మేడం క్యూరి (1867–1934) : ప్రముఖ శాస్త్రవేత్త. రెండుసార్లు నోబెల్ బహుమతి గెలుచుకున్న మొదటి వ్యక్తి, ఏకైక మహిళ కూడా. పోలోనియం, రేడియం మూలకాలను కనిపెట్టారు. స్వదేశం పోలెండ్. ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. పారిస్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు.
17. రేణూ చక్రవర్తి : ఈమె రాసిన 'కమ్యూనిస్ట్స్ ఇన్ ద ఇండియన్ విమెన్స్ మూవ్‌మెంట్' (న్యూఢిల్లీ, విపిహెచ్, 1980) పుస్తకంలోని అనేక విషయాలను 'మనకు తెలియని మన చరిత్ర' సంపాదకులు 'స్త్రీల చరిత్ర అంటే...' అనే తమ ముందుమాటలో ప్రస్తావించారు. ఆమె గురించి ఇతర వివరాలు తెలియలేదు.
18. బ్రిజ్‌రాణి (1915–2000) : స్వస్థలం హైదరాబాద్. కమ్యూనిస్టు పార్టీలో చాలా చురుకుగా పనిచేసి పలుమార్లు అరెస్టయ్యారు. 1947లో రాజ్‌బహదూర్ గౌర్‌ను వివాహం చేసుకున్నారు. సిపిఐలోనే కొనసాగారు.
19. ప్రియంవద (      ) : స్వగ్రామం నల్గొండ జిల్లా తూర్పుగూడెం. చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీలో చేరి అన్ని రకాల కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొన్నారు. దళాలలో కూడా పనిచేశారు.




## చారిత్రక దృక్పథం

**'సమీక్ష'** రెండే రెండు సంచికలు వచ్చి ఆగిపోయిన మాసపత్రిక. విజయవాడ నుంచి వెలువడ్డ ఈ పత్రిక సంపాదకురాలు ఏలూరి అజిత. సంపాదక బృందంలో ఉషా ఎస్ డానీ, ఖాదర్ మొహియుద్దీన్, ఎన్. వేణు గోపాల్, బి.ఎస్. రాములు, కె. నరసింహాచారి, కె. బాలగోపాల్ ఉన్నారు.

నిజమైన రసాయనిక శాస్త్రం అంటూ ఏదీ లేనట్టే 'నిజమయిన' చరిత్ర అనేది కూడా వుండదు. అన్ని విజ్ఞానశాస్త్ర విషయాలలాగా చరిత్ర కూడా అవిచ్ఛిన్నంగా సాగే పరిశోధనా ఫలితం. గతాన్ని గురించి మన అవగాహన మారుతూనే ఉంటుంది. ఒక చారిత్రక సిద్ధాంతం వెలుగులో మనం గతాన్ని పరిశీలిస్తాం. విషయ సేకరణ చేస్తాం. ఒక అవగాహన ఏర్పరచుకుంటాం. ఆ అవగాహన వల్ల మన చారిత్రక సిద్ధాంతం మరింత పురోగమిస్తుంది. కొత్త సిద్ధాంత విషయాలు తెలుస్తాయి. ఆ వెలుగులో గతాన్ని మరింత నిశితంగా పరిశీలిస్తాం. అంతే కాదు, సమకాలిక సామాజిక సంఘర్షణలు కూడా మన చారిత్రక సిద్ధాంతాలను ప్రభావితం చేస్తాయి. దక్షిణ భారత దేశంలో బ్రాహ్మణాధిక్యానికి వ్యతిరేకంగా ఈ శతాబ్దంలో సాగిన ఉద్యమాలు మన చరిత్రను బ్రాహ్మణ అబ్రాహ్మణ సంఘర్షణల దృష్టితో చూడడం నేర్పాయి. దానివల్ల శంబూకుడు, ఏకలవ్యుడు, చార్వాకుడు, తదితరుల కథలు పరిశోధనా విషయాలయ్యాయి. బ్రాహ్మణ ఆధిక్యం స్వతంత్ర విషయం కాదు, భూస్వామ్య రాచరిక ఆధిపత్యంలో అంతర్భాగమేనని అర్థం చేసుకొన్నప్పుడు ఈ కథలు ఇంకొంచెం వివరంగా అవగాహన అవుతాయి. మన దేశంలో భూస్వామ్య వ్యవస్థ ఒక్క పూటలో ఏర్పడలేదనీ, విడతలు విడతలుగా ఆటవికులను లొంగదీసుకునే క్రమంలో ఏర్పడిందనీ అర్థమయితే ఈ కథలు ఇంకా బాగా అర్థం అవుతాయి.

# చారిత్రక దృక్పథం

**ఇంగ్లీషులో** హిస్టోరియోగ్రఫీ అనే మాట వాడతారు. హిస్టోరియోగ్రఫీ అంటే చరిత్రను గురించిన సిద్ధాంత దృక్పథం అని అర్థం. తెలుగులో చారిత్రక సిద్ధాంతం అని అనువదించుకోవచ్చు. ఇక్కడ చరిత్రను గురించిన సిద్ధాంత దృక్పథం అన్నప్పుడు రెండు అర్థాలు వస్తాయి. ఒకటి – చరిత్రను అర్థం చేసుకునే విధానాన్ని గురించిన సిద్ధాంత దృక్పథం అని, రెండోది – అసలు చరిత్రను గురించిన దృక్పథం అని. చరిత్రను అర్థం చేసుకోవడం ఎట్లా అన్నది మొదటిదయితే, చరిత్ర అంటే ఏమిటి అనేది రెండోది. ఈ రెండు ప్రశ్నలను విడదీయడం కష్టం కాబట్టి ఈ రెండు అర్థాలలోను చారిత్రక సిద్ధాంతం అనే మాటను వాడవచ్చును. ఇందులో రెండవదే – చరిత్ర అంటే ఏమిటనేదే – చారిత్రక సిద్ధాంతం అనే ప్రయోగానికి అసలైన అర్థం. అయితే విభిన్న చారిత్రక సిద్ధాంతాల మధ్య చర్చ తరచుగా చరిత్ర అధ్యయన పద్ధతి పరంగా సాగుతుంది. విషయం స్వభావానికీ, దాన్ని తెలుసుకునే పద్ధతికీ ఉండే గతితార్కిక సంబంధం ఇక్కడ సిద్ధాంత చర్చను మొదటి దానిమీద నుండి రెండవ దానిమీదకు తిప్పుతుంది.

రాజుల కృత్యాలు – అకృత్యాలతో సహా – చరిత్ర ముడిపదార్థం అనేది బహుశ అన్నిటికంటే మొదట పుట్టి, ఇప్పటికీ అన్నిటికంటే బలంగా నిలిచిపోయిన చారిత్రక సిద్ధాంతం. పాశ్చాత్య దేశాల ప్రాచీన చరిత్రకారులు (గ్రీస్, రోమ్ దేశాలకు చెందినవారు) ఈ రకమైన చరిత్ర రచన మొదలుపెట్టారు. అప్పటినుండి, అసలు చరిత్ర రచన అంటూ జరిగిన దేశాలలో, కాలాలలో ఈ రకమైన చరిత్రలు రాస్తూనే ఉన్నారు. ఈ రచనలు వాటంతటవే అర్థరహితమైనవి కానవసరం లేదు. వాటిలో ఆసక్తికరమైన విషయం లేనే లేదనడానికి అంతకంటే వీల్లేదు. రాజులు సర్వసత్తాక అధికారాలతో పరిపాలిస్తున్న కాలంలో కేవలం రాజుల చరిత్రే రాసినా చాలా విషయాలు చెప్పడం సాధ్యమవుతుంది. అయితే రాజుల ప్రవర్తనకు గల కారణాలను గుర్తించడంలోనే తేడాలుంటాయి. అక్కడే ఆ చరిత్ర రచన ఎంతవరకు

'సమీక్ష' ప్రారంభ సంచిక, మే 1987

అర్థవంతమవుతుందనేది తేలుతుంది. సాంప్రదాయక చారిత్రక సిద్ధాంతం చేసే పొరపాటు యిక్కడే వుంది. చరిత్రలో రాజుల కృత్యాకృత్యాలు ముఖ్య విషయమయితే, వాటికి ప్రోద్బలం లభించేది రాజుల వ్యక్తిత్వం నుండి, యిష్టాయిష్టాల నుండి, కోరికల నుండి, కోపతాపాల నుండి. ఉదాహరణకు, అశోకుడు[1] సాత్వికుడు కాబట్టి మౌర్యసామ్రాజ్యం పతనమైంది, సముద్రగుప్తుడి[2] పరాక్రమం వలన గుప్త సామ్రాజ్యం దేశవ్యాప్తంగా నెలకొనింది, ఔరంగజేబు[3] మతోన్మాది కావడం వల్ల మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమయింది, నెహ్రూ ప్రజాస్వామికవాది కావడం వలన భారతదేశం ప్రపంచదేశాలన్నిట్లోకి ఏకైక పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా నిలిచింది – యిత్యాది సిద్ధాంతాలు అందరికీ పరిచితమే. దీనిని విధాతల సిద్ధాంతం అనవచ్చును. ఈ సిద్ధాంతం అర్థమేమిటంటే ఆయా కాలాలలో ఆయా వ్యక్తులు కాక వేరేవాళ్లు ఉండి ఉంటే యివన్నీ జరగకపోయి ఉండేవని. మరొకరకంగా చెప్పాలంటే చరిత్రను నడిపించేది యాదృచ్ఛిక సంఘటనలని. దీనినే ఇ.హెచ్. కార్[4] Cleopatra's nose theory of history[5] అన్నాడు. క్లియోపాత్రా అందమైంది కాకపోతే రోమ్ చరిత్ర వేరే విధంగా ఉండేదని ఈ రకమైన సిద్ధాంతాల నుండి అర్థం చేసుకోవాలి. ఇట్లా చెపితే అపహాస్యంగా ఉంటుంది కాని, నిజానికి మన చరిత్ర పుస్తకాలలో ఒక చారిత్రక సిద్ధాంతమంటూ ఉంటే అది Cleopatra's nose లేదా విధాతల సిద్ధాంతమే.

ఒక సమాజంలో ఒక కాలంలో ఫలానా చారిత్రక సిద్ధాంతం ప్రబలంగా ఉందంటే దానికి కారణం కూడా ఆ సమాజంలోనే దొరుకుతుంది. ప్రపంచంలోని అన్ని దేశాలు చాలాకాలం పాటు సర్వసత్తాక రాజ్యాధికారాల కింద బతికాయి. ఆధునిక ప్రజాస్వామ్యాలలో ప్రభుత్వాలు అడపాదడపా మారతాయి కాని రాజ్యాంగయంత్రానికి ఉండే ఆధిపత్యం గతంలో కంటే ఎంత మాత్రం తక్కువ కాదు. బహుశ రవాణా, ప్రసార సాధనాలు, ఆయుధాల సాంకేతిక పురోగమనం కారణంగా ఎక్కువయినయ్యేమో కూడ. నాగరికత పుట్టిన నాటినుండి కూడా రాజ్యాంగయంత్రం సామాన్య మానవుడి కళ్ళకు ఒక అద్భుతశక్తిగానే కనబడుతోంది. అది మార్క్స్ అన్నట్టు పరాయీకరణ ఫలితమే కావచ్చు. అంతిమ విశ్లేషణలో రాజ్యాంగయంత్రం కూడా ఒక సామాజిక మానవ సంబంధమే. అయితే

మానవులు కల్పించిన దేవుడిలాగ అది కూడా పరాయీకరణ చెంది మానవ జీవితాన్ని శాసించే శక్తి అయింది. ఈ అద్భుతశక్తి పాలనలో జీవించే మానవులు తమ మనుగడకు, అందులోని మార్పులకు గల కారణాలు ఆ అద్భుతశక్తిలోనే వెతకడం సహజం. ఆ శక్తిని తమ అధీనంలోకి తీసుకున్న రాజుల లేక యితర పాలకుల వ్యక్తిత్వాలలో, యిష్టాయిష్టాలలో, లీలా విలాసాలలో తమ భాగ్యాన్ని దర్శించుకోవడం కూడా అంతే సహజం. ఈ విషయంలో రాజరిక యుగపు చరిత్ర రచనకు, ఆధునిక చరిత్ర రచనకు తేడా లేదు.

అయితే ఆధునిక కాలంలో ఒక ముఖ్యమైన తేడా వస్తోంది. భూస్వామ్య వ్యవస్థకు, పెట్టుబడిదారీ వ్యవస్థకు గల తేడాలలో యిది ఒకటి. భూస్వామ్య యుగంలో రాజ్యాధికారం సమాజంలోని అన్ని రంగాలతోను కలగలసి పోయి ఉంటుంది. సాహిత్యం రాజుల పోషణలో సాగుతుంది. సంగీతం, శిల్పం, నాట్యం, అన్ని కళలు అంతే. తత్వచింతన కూడా జరిగితే రాజాస్థానాలలో జరుగుతుంది (మొట్టమొదటి వేదాంతి అయిన యాజ్ఞవల్క్యుడు జనకుని ఆస్థానంలో ఉండిన తాత్వికుడు) లేదా రాజపోషణలో జరుగుతుంది. ఆర్థిక రంగానికి కూడా స్వయం ప్రతిపత్తి చాలా తక్కువగా ఉంటుంది. భూమిశిస్తు నుండి వ్యాపార లావాదేవీల దాకా అన్నీ కూడా రాజ్యాధికార నియంత్రణలో సాగుతాయి. రాజ్యాధికారంతో ప్రత్యక్షంగా నిమిత్తంలేని సామాజిక జీవితం అనేది భూస్వామ్య యుగంలో ఉండదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ విషయం మారుతుంది. కళల నుండి ఆర్థిక రంగందాకా ఒక్కొక్కటీ రాజ్యాధికారం ప్రత్యక్ష నియంత్రణ నుండి విడివడి స్వయంప్రతిపత్తిని సాధించుకుంటాయి. నిజానికి యూరప్‌లో పెట్టుబడిదారీ వర్గం ఈ నియంత్రణను వదిలించుకోవడానికి జరిపిన పోరాటం అక్కడి బూర్జువా విప్లవాలలో ప్రధానఘట్టం. ఈ స్వయంప్రతిపత్తి ఎంత సంపూర్ణమనేది పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత సంపూర్ణంగా, ఎంత 'స్వచ్ఛంగా' అభివృద్ధి చెందింది అనే దాని మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు మన దేశంలో పెట్టుబడిదారీ సంబంధాల వ్యాప్తి అసంపూర్ణంగా ఉండిపోయింది కాబట్టి అన్ని సామాజిక విషయాలలో రాజ్యాధికారం జోక్యం ఎంతో కొంత కొనసాగుతూనే ఉంది. బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో మాత్రం సామాజిక విషయాలు రాజ్యాధికారం నుండి స్వయంప్రతిపత్తిని సాధించుకోవడం స్పష్టంగానే కనిపిస్తుంది.

కళలను, సాహిత్యాన్ని ప్రభుత్వాలు పోషించవు. కళాకారులు తమ సామర్థ్యాన్ని బజారులో అమ్ముకుని ఆదాయం సంపాదించుకుంటారు. ఆర్థికరంగం ప్రత్యక్ష ప్రభుత్వ నియంత్రణలో సాగదు. లాభనష్టాల తక్కెడలో సమతుల్యాన్నీ, అసమతుల్యాన్నీ అదే వెతుక్కుంటుంది. తాత్వికులు రాజాస్థానాల నుండి బయటపడి, భూదానాలు లేకుండా, రచయితలుగా, మేధావులుగా తమ సామర్థ్యాన్ని విక్రయించి బతుకుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్యాధికారం నుండి విడివడిన ఒక పౌర సమాజం (civil society) ఏర్పడుతుంది. మార్క్స్ నుండి గ్రామ్‌సీ[6] (Gramsci) దాకా మార్క్సిస్టు తాత్వికులు పెట్టుబడిదారీ సమాజాన్ని అర్థం చేసుకునేటప్పుడు ఈ పౌరసమాజానికి ప్రాముఖ్యం యిచ్చారు. భూస్వామ్య వ్యవస్థలో పౌరసమాజం రాజకీయ సమాజం (political society) లో కలిసిపోయి ఉంటుందని, అది విడిపోయి స్వతంత్ర అస్తిత్వాన్ని ఏర్పరచుకోవడం ఆధునిక సమాజ లక్షణమని హెగెల్[7] చేసిన సూత్రీకరణను ఇక్కడ మార్క్సిజం తనలో ఇముడ్చుకుంది.

వెంటనే కాకున్నా కొంతకాలానికి ఈ పౌరసమాజం ఆవిర్భావం చరిత్ర రచన మీద తన ప్రభావాన్ని వేసింది. చరిత్ర చెప్పడమంటే రాజకీయ చరిత్ర మాత్రమే కాదని ఆర్థికరంగం, కళలు, సాహిత్యం, తత్వం మొదలైన విషయాల గురించి కూడా విడిగా చెప్పాలనే అభిప్రాయం బయలుదేరింది. దీని ప్రభావం మన చరిత్ర పుస్తకాలమీద స్పష్టంగానే కనబడుతుంది. ఈ మధ్య వచ్చే చరిత్ర పుస్తకాలలో – ఉదాహరణకు – కాకతీయుల యుగం అనే శీర్షికతో అధ్యాయం మొదలుపెట్టి మొదట రాజవంశం గురించి కొంత చెప్పి, ఆ తరువాత రాజవంశం పాలనలో ఆర్థికరంగం ఎలా ఉండిందీ, కళలూ సాహిత్యం ఏ విధంగా విలసిల్లినాయి, మతంలో ఏ మార్పులు వచ్చాయి అనేవి ఒక దాని తరువాత ఒకటి ఏకరవు పెడుతున్నారు. ఆర్థికరంగాన్నయినా చారిత్రకంగా వివరించడానికి రాజవంశాల ప్రాతిపదికమీద చేసే అధ్యాయాల విభజన ఎంతవరకు అర్థవంతం అవుతుందనే అనుమానం ఈ పుస్తకాల రచయితలకు రాదు. కాలేజీ పాఠ్యపుస్తకాల నుండి కంభంపాటి సత్యనారాయణగారు మార్క్సిస్టు అధ్యయనం పేరున రాసిన 'ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి' దాకా ఇటువంటి పుస్తకాలు చాలానే ఉన్నాయి.

ఈ పాఠ్యపుస్తకాలకూ, రాజుల, రాజవంశాల చరిత్రలే చరిత్ర అనుకుని రాసేవాటికీ ఒక విషయంలో తేడా లేదు. రెండూ కూడా విధాతల చరిత్రలే.

ఇప్పుడు జరిగేదేమిటంటే విధాతల సంఖ్య పెరుగుతున్నది. మౌర్య సామ్రాజ్యం ఘనతకు, పతనానికి అశోకుడిది ఒక్కడిదే బాధ్యత అయితే, ఈ చరిత్ర పుస్తకాలలో ఆధునిక భారతదేశ ప్రగతికి (పతనాన్ని గురించి ఇప్పుడిప్పుడే రాయరు) నెహ్రూతోపాటు వివిధ సామాజిక రంగాలలోని ప్రముఖులు– హోమిభాభాలు[8], పి.సి.మహలనోబిస్‌లు[9], జస్టిస్ భగవతులు[10], బహుశా సునీల్ గవాస్కర్‌లు[11] కూడా – బాధ్యులవుతారు. గొప్పవాళ్ళ సామర్థ్యమే చరిత్రను నడుపుతుంది. ప్రజాస్వామిక యుగంలో ఈ గొప్పవాళ్ళ సంఖ్య మాత్రం పెరుగుతుంది.

విధాతల చరిత్రకు కనీసం ఒక సద్గుణం ఉంది. అది చరిత్ర అర్థరహిత మైంది కాదని, దానికి ఒక స్వాభావికమైన 'ధర్మం' ఉందని ఒప్పుకుంటుంది. సమర్థవంతులైన వ్యక్తుల కోర్కెలు చరిత్రను నడుపుతాయనేది కూడా ఒక చారిత్రక సిద్ధాంతమే. ఇంతకంటే అధ్వాన్నమయింది, అసలు చరిత్రకు మొత్తంగా ఒక అర్థమంటూ లేదని, విభిన్న చారిత్రక సంఘటనలకు మాత్రమే అర్థముండగలదని భావించే దృక్పథం. చరిత్రకు అర్థం ఉందంటే అది చరిత్రకు లక్ష్యాలు, ఉద్దేశాలు అంటగట్టడం (Teleology) అవుతుందని, చరిత్రకే ఒక చైతన్యాన్ని ఆపాదించడం (reify) అవుతుందని ఒక వాదన ఉంది. ఈ విధంగా రాసేది చరిత్ర కాదు, చరిత్ర అభాస (Historicism) అన్నారు. మరి చరిత్రకారుడి కర్తవ్యం ఏమిటంటే గతంలో జరిగిన అన్ని సంఘటనలను పోగు పెట్టడం. అట్లా పోగుపెట్టిన తరువాత వాటిలో దేనికైనా ఏమైనా అర్థముంటే తెలుసుకోవచ్చును. అంటే ముందు విషయ సేకరణ జరగాలి. ఆ తరువాత వీలయినమేరకు వ్యాఖ్యానం చేయాలి. అంతే తప్ప ముందే ఒక చారిత్రక సిద్ధాంతంతో మొదలుపెడితే సిద్ధాంత పరిమితుల వల్ల చరిత్రను చరిత్రకారుడు పాక్షికంగా మాత్రమే చూస్తాడు. విషయసేకరణ అసమగ్రంగా ఉండిపోతుంది.

కాని ఈ దృష్టితో (నిష్పాక్షికంగా 'అన్ని విషయాలను' ముందు సేకరించాలనే దృష్టితో) చరిత్ర రాయాలని ఎవరైనా ప్రయత్నిస్తే అది ఎంత అసాధ్యమో వెంటనే అర్థమవుతుంది. ఉదాహరణకు అక్బర్ పరిపాలనలో మొగలాయి సామ్రాజ్యం అంత వైభవంగా ఎందుకుండిందో ఒక చరిత్రకారుడు అధ్యయనం చెయ్యదలుచు కున్నాడనుకోండి. అతనిది విధాతల చరిత్ర దృక్పథం అయితే తన దృష్టిని అక్బర్ వ్యక్తిత్వం మీద, లేదా అప్పటి మొగల్ సామ్రాజ్యంలోని ఇతర ప్రముఖుల వ్యక్తిత్వాల మీద, వాళ్ళ ఆశలు, ఆశయాలు, ఆదర్శాల మీద,

కొట్లాటల మీద, కలహాల మీద కేంద్రీకరిస్తాడు. ఆ దృష్టితో విషయ సేకరణ చేస్తాడు. తప్పో ఒప్పో ఒక నిర్ధారణకు వస్తాడు. అక్బర్ తన రాజ్యవ్యవహారాల నిర్వహణలో పాలక వర్గాలలోని హిందువులను, ముస్లింలను సమంగా ఆదరించాడని, చివరికి ఒక రాజపుత్ర స్త్రీని వివాహం సైతం చేసుకున్నాడని, ఈ దక్షతే ఆ కాలపు మొగలాయి ఘనతకు పునాది అని చిన్నప్పుడు అందరం చదువుకున్నాం. రాజ్యం ఘనతకు కారణం రాజు వ్యక్తిత్వంలో చూడాలి అనే చారిత్రక సిద్ధాంతం లేకపోతే ఈ అవగాహన పుట్టేది కాదు. ఏ సిద్ధాంతమూ లేకుండా 'అన్ని విషయాలు' ముందు సేకరించి, ఆ తరువాతే వ్యాఖ్యానించాలని నిర్ణయించుకున్న చరిత్రకారుడు ఎప్పటికీ ఏ నిర్ధారణకూ రాడు. అన్ని విషయాలు – అంటే ఎన్ని విషయాలు? అక్బర్ రాజకీయదక్షత ఎంతటి విషయమో అతని నాలుగవ భార్యకు ఎంతమంది కొడుకులున్నారనేది కూడా అంతటి విషయమే అవుతుంది. ఇట్లా ఎన్ని విషయాలు సేకరిస్తే విషయ సేకరణ పూర్తి కావాలి? ఇందులో రెండవది ముఖ్యమైన విషయం కాదంటారేమో. అంటే ఏమిటి? ముఖ్యమైన విషయాలకు, కానివాటికి తేడా చూడాలని. తేడా చూడగలగాలంటే ఒక విషయం ప్రాముఖ్యాన్ని నిర్ణయించే ప్రమాణం కావాలి. అంటే ఒక సిద్ధాంతం కావాలి. రాజులు చేపట్టే కార్యక్రమాలు, చేసే పనులు చరిత్రను నడుపుతాయనుకునే చరిత్రకారుడికి అప్పుడు అక్బర్ వ్యక్తిత్వం ముఖ్య విషయం అవుతుంది. చరిత్ర పాఠ్యపుస్తకాలలో ఈ దృక్పథమే ప్రబలంగా వుంది. అట్లా కాక మొగల్ రాజరికానికి ఆర్థికపునాది అయిన వ్యవసాయరంగంలోని సంఘర్షణలు, ఆటుపోట్లు ఆ రాజరికం చరిత్రను నడిపించాయి అనుకునే చరిత్రకారుడికి అక్బర్ వ్యక్తిత్వం అప్రధానం అయిపోతుంది. వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి, శిస్తుపరిమాణం, జాగీర్దారుల దోపిడీ, మన్సబ్‌ల అస్థిరత ముఖ్య విషయాలవుతాయి. ఇర్ఫాన్ హబీబ్ ఈ దృక్పథంతో మొగల్ సామ్రాజ్య చరిత్రను విశ్లేషించాడు. ఏ సిద్ధాంతమూ లేకుండా 'నిష్పాక్షికంగా' విషయసేకరణ చేయదలుచుకున్న చరిత్రకారుడికి మాత్రం ఏది ముఖ్య విషయం, ఏది కాదు అనే విచక్షణ ఉండదు. అతని విషయ సేకరణ ఎప్పటికీ అంతం కాదు.

అంటే ప్రతి చరిత్రకారుడికి – ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా – ఒక చారిత్రక సిద్ధాంతం ఉంటుంది. దాని వెలుగులో విషయసేకరణ చేస్తాడు. సేకరించిన విషయాలమీద ఆధారపడి చరిత్రను వివరిస్తాడు. తాను సేకరించిన విషయాలు

తన సిద్ధాంతాన్ని అసంపూర్ణంగా ఉన్నట్టు చూపితే అంతమేరకు సిద్ధాంతాన్ని సవరించుకుంటాడు. సవరించిన ఈ సిద్ధాంతం వెలుగులో కొత్తగా మళ్లీ విషయాలు సేకరిస్తాడు. ఈ విధంగా సిద్ధాంత అవగాహన, విషయసేకరణ పరస్పర గతి తార్కిక చర్యలో సాగుతాయి. అంతేగాని ముందు విషయసేకరణ అంతా చేసేసి ఆ తరువాత సిద్ధాంత నిరూపణ ఏ చరిత్రకారుడూ చేయడు. అంతేకాదు. సరైన సిద్ధాంతం లేకపోతే కొన్ని విషయాల మీదికి మన దృష్టి పోను కూడా పోదు. చీకట్లో బయలు ప్రదేశంలో ఎన్నో వస్తువులుంటాయి. అయితే ఒక వస్తువుమీదికి మన చేతిలోని దీపాన్ని ప్రసరింపజేసినప్పుడే ఆ వస్తువు అక్కడున్నట్టు తెలుస్తుంది. లేకుంటే అది ఉన్న విషయం కూడా తెలియదు. అన్ని విషయాలూ నిష్పాక్షికంగా సేకరించడమనేది అనంతమైన ప్రయాసే కాదు, అసలు అసాధ్యం కూడా.

మరి ఒక్కొక్క చారిత్రక సిద్ధాంతం ఒక్కొక్క 'చరిత్ర'కు దారితీసేటట్టయితే నిజమైన చరిత్రంటూ ఏదీ లేదా? అని అనుమానం వస్తుంది. ఒకవేళ ఉంటే దాన్ని ఎవరయినా ఎట్లా తెలుసుకుంటారు? అనే ప్రశ్న కూడా వస్తుంది. ఈ ప్రశ్నలకు మార్క్సిజం మాత్రమే సమగ్రమైన సమాధానాలు యివ్వగలదు.

నిజమైన రసాయనిక శాస్త్రం అంటూ ఏదీ లేనట్టే 'నిజమయిన' చరిత్ర అనేది కూడా వుండదు. అన్ని విజ్ఞానశాస్త్ర విషయాలలాగ చరిత్ర కూడా అవిచ్ఛిన్నంగా సాగే పరిశోధనా ఫలితం. గతాన్ని గురించి మన అవగాహన మారుతూనే ఉంటుంది. ఒక చారిత్రక సిద్ధాంతం వెలుగులో మనం గతాన్ని పరిశీలిస్తాం. విషయ సేకరణ చేస్తాం. ఒక అవగాహన ఏర్పరచుకుంటాం. ఆ అవగాహన వల్ల మన చారిత్రక సిద్ధాంతం మరింత పురోగమిస్తుంది. కొత్త సిద్ధాంత విషయాలు తెలుస్తాయి. ఆ వెలుగులో గతాన్ని మరింత నిశితంగా పరిశీలిస్తాం. అంతేకాదు, సమకాలిక సామాజిక సంఘర్షణలు కూడా మన చారిత్రక సిద్ధాంతాలను ప్రభావితం చేస్తాయి. దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణాధిక్యానికి వ్యతిరేకంగా ఈ శతాబ్దంలో సాగిన ఉద్యమాలు మన చరిత్రను బ్రాహ్మణ అబ్రాహ్మణ సంఘర్షణల దృష్టితో చూడడం నేర్పాయి. దానివల్ల శంబూకుడు, ఏకలవ్యుడు, చార్వాకుడు, తదితరుల కథలు పరిశోధనా విషయాలయ్యాయి. బ్రాహ్మణ ఆధిక్యం స్వతంత్ర విషయం కాదు, భూస్వామ్య రాచరిక ఆధిపత్యంలో అంతర్భాగమేనని అర్థం చేసుకొన్నప్పుడు ఈ కథలు ఇంకొంచెం వివరంగా అవగాహన అవుతాయి. మన దేశంలో భూస్వామ్య వ్యవస్థ ఒక్క పూటలో ఏర్పడలేదనీ, విడతలు విడతలుగా

ఆటవికులను లొంగదీసుకునే క్రమంలో ఏర్పడిందనీ అర్థమయితే ఈ కథలు ఇంకా బాగా అర్థం అవుతాయి. ఉదాహరణకు ఏకలవ్యుడి విలువిద్యా నైపుణ్యాన్ని నాశనం చేసిన ద్రోణుడు కూడా నిజానికి ఆటవికుడేననీ, మొదటి నాగరిక సమాజం అతన్ని బ్రాహ్మణీకరించి స్వంతం చేసుకుని అతనిచేతనే ఏకలవ్యుడి బొటనవేలు నరికించిందనీ అర్థం అవుతుంది.

'నిజమయిన' చరిత్ర అనే పదార్థం ఒకటి ఉండదు గాని నిజమయిన చారిత్రక సిద్ధాంతం మాత్రం ఉంటుంది. మార్క్సిజం దానిని చారిత్రక భౌతికవాదం అంటుంది. సామాజిక నిర్మాణంలోని సంఘర్షణలే చరిత్రను నడుపుతాయి. సామాజిక నిర్మాణానికి పునాది ఉత్పత్తిరంగం కాబట్టి చరిత్రను నడిపే సంఘర్షణలు సాధారణంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వర్గసంఘర్షణలు అయివుంటాయి. వ్యక్తుల ఆశలూ ఆశయాలయినా, సామర్థ్యం అసమర్థతలయినా ఈ సంఘర్షణ నేపథ్యంలోనే అర్థవంతమవుతాయి. అంతేతప్ప వీటినే చరిత్ర చోదకశక్తులుగా భావించడం తప్పు. మార్క్సిస్టు చరిత్ర రచన ఈ చారిత్రక సిద్ధాంతం వెలుగులో విషయసేకరణ చేస్తుంది. రాజుల వ్యక్తిత్వాల గురించి కాక సామాజిక నిర్మాణంలోని వైరుధ్యాల గురించి, వాటి నుండి పుట్టే సంఘర్షణల గురించి సమాచారాన్ని సేకరిస్తుంది. అయితే విభిన్న సమాజాలకు ఈ చారిత్రక సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా అన్వయింప జేసినప్పుడే దాని అర్థం కూడా పూర్తిగా అవగతం కాగలదు. చారిత్రక భౌతికవాదం అనేది చారిత్రక సిద్ధాంతం మూలసూత్రాలను మాత్రమే అందించగలదు. అన్వయంలోనే దాని వివరణ పూర్తిగా అర్థం అవుతుంది. ఆ అన్వయానికి ప్రేరణ నిష్పాక్షికమయిన విషయసేకరణ నుండి రాదు; సమకాలిక సామాజిక సంఘర్షణల నుండి, భవిష్యత్తును గురించి అవి ఆవిష్కరించే ఆదర్శాల నుండి వస్తుంది. ఉదాహరణకు భారతదేశ చరిత్రను రైతాంగపోరాటాల దృష్టితో చూడాలనే ఆలోచన నక్సల్బరీతో ప్రారంభమయిన రైతాంగ పోరాటాలతోనే వచ్చింది. అంతకుముందు చరిత్ర పరిశోధనలో రైతాంగపోరాటాల గురించి పట్టించుకున్నవాళ్ళు లేకపోలేదు గాని, ఒక పోకడగా మాత్రం ఈ దశలోనే ప్రారంభం అయింది. ఈ మధ్యకాలంలో స్త్రీల హక్కుల గురించి పట్టింపు పెరుగుతున్న కారణంగా బహుశా పురుషస్వామ్య సామాజిక వ్యవస్థ నుండి పుట్టే అణచివేత, సంఘర్షణల దృష్టితో చరిత్రను చూసే అలవాటు ఇకమీదట పెరగవచ్చును. అప్పుడు ఇంతవరకు ఎవరికీ అందని 'విషయాలు' వెలుగులోకి

రావచ్చును. అదే విధంగా కాంగ్రెస్ నుండి కమ్యూనిస్టు పార్టీలదాకా అన్ని రాజకీయ పక్షాలూ రాజకీయంగా విఫలమయ్యాయన్న అభిప్రాయం ఈ మధ్యకాలంలో బలపడడంతో గతకాలపు ఉద్యమాలలో కూడా నాయకుల వ్యూహాలూ, ఎత్తుగడలూ, నిర్మాణ దక్షతా కాక వాటిలో ప్రజలు ఎందుకు పాల్గొన్నారు, ఏ విధంగా నిర్మాణంలోకి వచ్చారు అనే విషయాలు పరిశోధకులను ఆకర్షిస్తున్నాయి. దీనివల్ల సంతాల్[12] నుండి వర్లీ[13] దాకా అన్ని రైతాంగ, గిరిజన పోరాటాల గురించి కొత్త విషయాలు చాలా తెలుస్తున్నాయి. వర్తమాన సామాజిక సంఘర్షణలో ఈ ఉద్యమాలూ, పోరాటాలూ, వైఫల్యాలూ ముందుకు రాకపోతే గతానికి సంబంధించిన ఆ 'విషయాలు' ఎప్పటికీ మరుగునే ఉండిపోయేవేమో !

అయితే ఈ చారిత్రక సిద్ధాంతాన్ని చరిత్ర రచనలో అన్వయింపజేసేటప్పుడు ఒక పొరపాటు తరచుగా జరుగుతుంటుంది. ఒక చారిత్రక దశలో ఉత్పత్తి రంగం స్వభావం ఏ విధంగా వుండింది, దాని ఫలితంగా సామాజిక నిర్మాణంలో ఎటువంటి వైరుధ్యాలు ఉన్నాయి, అవి ఎటువంటి సంఘర్షణలకు దారితీశాయి అని పరిశోధించడం పోయి చరిత్రలో ఏయే దశలు, ఏయే వైరుధ్యాలు, ఏయే సంఘర్షణలు ఉండాలో ముందే నిర్ణయించి, ఒక మూస తయారు చేసి, ఆ మూసలోకి చరిత్రను బలవంతంగా నెట్టే ప్రయత్నం చేయవచ్చు. మార్క్సిజాన్ని ఆమోదించిన చరిత్రకారులు మొదట్లో ఈ పనిచేశారు కూడా. అయితే కోశాంబి రచనల ఫలితంగా ఈ మూసరచనా పద్ధతి నుండి భారతదేశంలో మార్క్సిస్టు చరిత్ర రచన విముక్తమయింది. వేరే అన్ని పరిశోధనారంగాల కంటే చరిత్ర రచనలో మార్క్సిస్టులు యివ్వాళ మన దేశంలో బలమయిన స్థానాన్ని సంపాదించుకున్నారు.

1. అశోకుడు (క్రీ.పూ. 304–232) : మౌర్య సామ్రాజ్య చక్రవర్తులలో ప్రసిద్ధుడు. క్రీ.పూ. 269 నుండి 232 వరకు భారత ఉపఖండంలో అత్యధిక భాగం ఆయన పరిపాలనలో ఉండేది. కళింగ యుద్ధంలో లక్షమంది చనిపోయారన్న బాధతో బౌద్ధం స్వీకరించి ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాడు.
2. సముద్ర గుప్తుడు (క్రీ.శ. 335–375) : ఈయన పరిపాలనా కాలాన్నే స్వర్ణయుగం అని పిలుస్తారు. సముద్రాలను జయించినవాడు కనుకనే ఆయనకు సముద్రగుప్తుడు అనే పేరు వచ్చిందంటారు. గొప్ప సైనిక వ్యూహకర్తగా కూడా ప్రసిద్ధుడు.
3. ఔరంగజేబు (1618–1707) : పూర్తి పేరు అబుల్ ముజఫర్ మొహియుద్దీన్ ముహమ్మద్ ఔరంగజేబ్. ఔరంగజేబ్ అంగీర్ (విశ్వవిజేత) అనేవారు. షాజహాన్ తర్వాత 1658లో చక్రవర్తి అయి 49 ఏళ్ళు ఏకధాటిగా పరిపాలించాడు.

4. ఇ.హెచ్. కార్ (1892–1982) : బ్రిటిష్ చరిత్రకారుడు, దౌత్యవేత్త, జర్నలిస్టు. 'వాట్ ఈజ్ హిస్టరీ?' 'హిస్టరీ ఆఫ్ రష్యన్ రెవల్యూషన్' వంటి అనేక పుస్తకాలు రాశారు.
5. క్లియోపాత్రా నాసికా సిద్ధాంతం : అలెగ్జాండర్ తర్వాత ఈజిప్టును పరిపాలించిన గ్రీకు రాణి క్లియోపాత్రా (క్రీ.పూ. 69–30). ఆమె ముక్కు అంత అందంగా లేకుండా ఉంటే మార్క్ ఆంటోనీ ఆమె పట్ల అంతగా ఆకర్షితుడయ్యేవాడు కాదని, అప్పుడు రోమ్ చరిత్ర మరోరకంగా ఉండేదని ఒక అభిప్రాయం ఉంది. దాన్నించి యాదృచ్ఛిక సంఘటనలు చరిత్రను నడిపిస్తాయనే సిద్ధాంతానికి ఈ పేరు వచ్చింది.
6. గ్రామ్‌సీ (1891–1937) : ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. మార్క్సిస్టు సిద్ధాంత వేత్త. 'రాజ్యం' అంటే ప్రభుత్వం ఒక్కటే కాదని, పౌర సమాజం (కుటుంబం, విద్యా వ్యవస్థ, కార్మిక సంఘాలు వగైరా) కూడానని; పెట్టుబడిదారీ రాజ్యం ప్రభుత్వ వ్యవస్థల ద్వారా బలంతోను, పౌరవ్యవస్థల ద్వారా సమ్మతితోనూ పరిపాలిస్తుందని చెప్పినవాడు.
7. హెగెల్ (1770–1831) : జర్మన్ తత్వవేత్త. మార్క్స్‌ను చాలా ప్రభావితం చేసినవాడు.
8. హోమిభాభా (1909–1964) : పూర్తి పేరు హోమి జహంగీర్ భాభా. ప్రఖ్యాత అణు శాస్త్రవేత్త. 'టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్', 'ట్రామ్‌బే అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్'ల వ్యవస్థాపక డైరెక్టరు. రెండోదానికి ఇప్పుడు ఆయన పేరే పెట్టి BARC అని పిలుస్తున్నారు.
9. పి.సి. మహలనోబిస్ (1893–1972) : పూర్తి పేరు ప్రశాంతచంద్ర మహలనోబిస్. గణాంక శాస్త్రవేత్త. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు. ప్రణాళికా సంఘం సభ్యుడు.
10. జస్టిస్ భగవతి (1921–1986) : పూర్తి పేరు ప్రఫుల్ల చంద్ర నట్వర్‌లాల్ భగవతి. 1985–86 సంవత్సరాలలో భారత సుప్రీంకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌కు ప్రాచుర్యం కల్పించిన న్యాయమూర్తులలో భగవతి ముఖ్యులు.
11. సునీల్ గవాస్కర్ (1949 – ) : భారత క్రికెట్ జట్టుకు చాలాకాలం ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్. టెస్ట్ పరుగుల్లో అనేక రికార్డులు నెలకొల్పారు.
12. సంతాల్ తిరుగుబాటు (1855–1856) : బ్రిటిష్ ప్రభుత్వం క్రూరంగా అణచివేసిన ఆదివాసీ తిరుగుబాటుల్లో ఇది ఒకటి. బ్రిటిష్ పెత్తనానికి, జమీందారీ పీడనకు వ్యతిరేకంగా 1855 జూన్ 30న సంతాలులు పెద్దఎత్తున తిరుగుబాటు చేశారు. దీనికి నాయకత్వం వహించిన నలుగురు అన్నదమ్ముల్లో ఇద్దర్ని బ్రిటిష్ వాళ్ళు చంపేసి, ఏనుగులతో సంతాలుల గ్రామాలను ధ్వంసం చేయించారు. నేటి జార్ఖండ్ ప్రాంతంలో జరిగిన ఈ తిరుగుబాటులో 15 వేల మందికి పైగా సంతాలులు మరణించారని అంచనా.
13. వర్లీ తిరుగుబాటు (1945–1947) : వర్లీలు మహారాష్ట్ర – గుజరాత్ సరిహద్దులోని తీరప్రాంతంలో కొండల మీద నివసించే ఒక ఆదివాసీ తెగ. ముంబయికి 60 మైళ్ళ దూరంలోని ఈ ప్రాంతం క్రమేణా భూస్వాముల పెత్తనంలోకి వెళ్ళిపోవడంతో వర్లీలు తిరగబడ్డారు. మహారాష్ట్ర కిసాన్ సభ ప్రతినిధిగా గోదావరి పరులేకర్ కొంతకాలం వారితోనే ఉండి వారికి సహాయ సహకారాలు అందించారు.




**మనలో మనం - సామాజిక అభివృద్ధి తీరుతెన్నులు**

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రొ. తుమ్మల వేణుగోపాలరావు గౌరవార్థం కాళీపట్నం రామారావు గౌరవ సంపాదకత్వంలో వెలువడ్డ ఈ వ్యాస సంకలనంలో 25 మంది రాసిన వ్యాసాలున్నాయి.

సాగర గ్రంథమాల (విశాఖపట్నం) ప్రచురణ (సెప్టెంబర్ 1990)

సామ్రాజ్యవాదానికి మనబోటి దేశాలలోని అన్ని వనరులూ, అందరు ప్రజలూ అక్కరలేదు. ఇక్కడి వ్యాపారస్తులూ పెట్టుబడిదారులూ వ్యవసాయదారులే సామ్రాజ్యవాదం అవసరాలకు తగినట్టు వారి వారి వ్యవహారాలను రూపొందించుకోవాలి. అంటే స్వంత సాంకేతిక పరిజ్ఞానం, స్వావలంబన అంటూ అతిశయాలకు పోకూడదు. ఇక్కడి ప్రభుత్వాలూ అందుకు అనుగుణంగా నడుచుకుంటూ దిగుమతులకూ ఎగుమతులకూ విదేశీ 'సహాయ సహకారాలకూ' అడ్డం రాకుండా ఉండాలి. ఉపనిర్మాణ (infrastructural) అవసరాలను సమకూర్చాలి. అయితే, జనాభాలో 10 లేక 15 శాతం మంది సామ్రాజ్యవాదం ఉత్పత్తిచేసే సరుకులనూ సాంకేతిక ప్రక్రియలనూ కొనుక్కోవడానికీ వినియోగించుకోవడానికీ అవసరమయిన స్తోమతనూ సామాజిక సంస్కృతినీ కలిగి ఉండాలి. ఆ 10 లేక 15 శాతం వినా మిగిలిన జనం అలజడులు చేయకుండా, 'శాంతి భద్రతలకు' విఘాతం కలిగించకుండా బ్రతకాలి.

# తెలుగువారి రాజకీయార్థిక జీవితం

**ప్రభుత్వం** ప్రకటించే గణాంకాల ద్వారా ఆర్థిక రంగాన్ని గురించి తెలుసుకోవడంలో కొన్ని సమస్యలుంటాయి. 'అన్నింటి గురించీ' గణాంకాలు ఎక్కడా ఉండవు. ఒక లక్ష్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని సేకరించే గణాంకాలు ఆ ప్రమాణానికి వర్తించే సమాచారాన్ని మాత్రమే ఇస్తాయి. అనుకూలమయిన సమాచారం మట్టుకే కాదు, నిజాయితీ ఉంటే ప్రతికూలమయినది కూడా ఇస్తాయి. భారత ప్రభుత్వ గణాంకాల నిజాయితీని అప్పుడప్పుడు ప్రశ్నించడం జరిగిన మాట వాస్తవమే గానీ అది పూర్తిగా అబద్ధపు సమాచారం మట్టుకు కాదు. అయితే అది నిర్దేశించుకున్న ప్రమాణ చట్రానికి వెలుపల ఉన్న విషయాల గురించి సమాచారం అందులో దొరకడం అసాధ్యం. ప్రస్తుత విషయానికి వర్తించే ఒక ఉదాహరణ చెప్పుకుందాం. మన రాష్ట్రంలోని కోటీశ్వరులు ఇవ్వాళ రకరకాల రూపాలలో డబ్బులు సంపాదించుకుంటున్నా గతంలో భూమి మీద, గ్రామీణ సామాజిక జీవితం మీద వీళ్ళ తాత ముత్తాతలకు ఉండిన ఆధిపత్యంలోనే ఈ వర్గం చారిత్రక పునాదులు ఉన్నాయి. అక్కడ నుండి ఇక్కడికి రావడానికి వాళ్ళు ప్రయోగించిన బాటలు రెండు ఉన్నాయి. కొందరు వ్యవసాయంలో వచ్చిన అభివృద్ధినీ, వ్యవసాయాధారమయిన వర్తకాన్నీ వ్యాపారాన్నీ పరిశ్రమనూ ఆశ్రయించి సంపన్నులయ్యారు. కొందరు ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారానూ, రాజకీయాల ద్వారానూ సంపన్నులయ్యారు. ఇందులో మొదటిది మన ప్రభుత్వం ప్రకటించుకున్న 'అభివృద్ధి' చట్రంలో గుర్తింపు పొందిన మార్పే కాబట్టి దాని గురించి సమాచారం సేకరించడం సాధ్యం అవుతుంది. విశ్లేషించడం సులభం అవుతుంది. రెండవ క్రమాన్ని అధికార గణాంకాల ద్వారా అధ్యయనం చేయడం కష్టం. దానికి అధికార భావజాలంలో ఆమోదం లేదు, 'లెజిటిమెసీ' లేదు.

ఒక్క కోటీశ్వరుల గురించే కాదు, ఏ సామాజికవర్గాన్ని గురించయినా ఇంతే. అభివృద్ధి, ఆధునీకరణ, మిశ్రమ ఆర్థిక విధానం, ప్రణాళికలు, సోషలిజం, సంక్షేమ విధానాలు మొదలయిన అంశాలతో కూడిన అధికార విశ్లేషణా చట్రంలో

సెప్టెంబర్ 1990

అంతర్భాగంగా పరిశీలించడానికి పనికొచ్చే సమాచారం మట్టుకే సులభంగా దొరుకుతుంది. మనం విమర్శించినా ఈ చట్రంలోనే విమర్శిస్తూ ఉంటాము. తద్వారా – మనం ఉద్దేశించకుండానే – ఒకవైపు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నట్టు కనబడుతూనే ఆ చట్రాన్ని బలపరుస్తాము. గిరిజనుల కోసం ఐ.టి.డి.ఏ. ఎన్ని వేల ఇళ్ళు మంజూరు చేసిందో, ఎన్ని ఆశ్రమ పాఠశాలలు నిర్మించిందో, ఎన్ని వందల ఎకరాల కాఫీ, మల్బరీ తోటలు పెంచిందో మనకు ప్రభుత్వమే చెప్తుంది. ఇదంతా అభివృద్ధి క్రమంలో గిరిజనులను 'సాధారణ జీవన స్రవంతి'లోకి తీసుకు రావడం అనే సంక్షేమ చట్రంలోకి వస్తుంది. అందువల్ల దానికి కేటాయించిన నిధులు – మొత్తం బడ్జెట్‌లో ఎంత శాతమో, పోలీసుల మీదా ఎన్‌జీవోల జీతాల మీదా పెట్టే ఖర్చులో అది ఎంత కొంచెమో లెక్కగట్టడం కష్టం కాదు. ఆ పైన ఆ ప్రాతిపదిక మీద తీవ్రంగా విమర్శించడమూ కష్టం కాదు. ఆ చట్రం లోపల జరిగే విమర్శ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టినా అది అంతిమంగా వ్యవస్థ అనుసరించే 'అభివృద్ధి' పథానికి (అంటే ఆర్థిక విధానానికి) బలం చేకూరుస్తుందన్న దూరదృష్టి పాలకవర్గాలలోని ముందుచూపు గల వ్యక్తులకు ఉంటుంది. అందుకే వాళ్ళు విమర్శను యూనివర్సిటీలలోనూ, దినపత్రికలలోనూ బంధించి ఈ అధికార భావజాలం పరిధికి అనుగుణ్యమయిన గణాంకాల సౌలభ్యాన్ని కలిగిస్తారు. ఆ పైన సౌలభ్యాన్ని బట్టి సమాచారాన్ని వెతుక్కునే అలసత్వం మిగిలిన కార్యాన్ని పూర్తి చేస్తుంది. 'ఐ.టి.డి.ఏ' చట్రాన్ని తిరస్కరించి, గిరిజనుల భూమి సమస్య గురించీ, ఆకలి సమస్య గురించీ, కూలి కోసం పట్టణాలకూ ప్రాజెక్టులకూ సాగే వలసల గురించీ తెలుసుకోవాలంటే చాలా కష్టపడాలి. అయితే మనం ప్రతిపాదించే ప్రత్యామ్నాయ చట్రాన్ని గురించి మనకు స్పష్టత ఉంటే, నిబద్ధత ఉంటే ఇది అసాధ్యం కాదు. ప్రభుత్వం ప్రకటించే సమాచారాన్ని అధికార చట్రంలోనే విమర్శించే కార్యక్రమానికి పరిమితం కాకుండా, ఆ సమాచారం ఏ మేరకు పనికి వస్తే ఆ మేరకు ఉయోగించుకొని, ప్రత్యామ్నాయ చట్రానికి అనుగుణ్యమయిన విషయ సేకరణ దానికి వెలుపలే ప్రధానంగా జరుగుతుందన్న అవగాహనతో విశ్లేషణకు పూనుకుంటే ఏ సామాజిక విషయాన్నయినా ప్రజలపరంగా అర్థం చేసుకోవడం అసాధ్యం కాదు.

## తెలుగువారి రాజకీయార్థిక జీవితం

తెలుగువారి రాజకీయార్థిక జీవితాన్ని దేశ రాజకీయార్థిక జీవితం నుండి వేరుచేసి విశ్లేషించడం సాధ్యం కాదు. ఈ దేశాన్ని గతంలో – మొదట బ్రాహ్మణ కుల ధర్మం, ఆ తరువాత మొగలాయి రెవెన్యూ యంత్రాంగం, ఆ పైన బ్రిటిష్ సామ్రాజ్యం ఐక్యంగా ఏలాయి. ఆ తరువాత 'స్వతంత్ర' భారత పాలక వర్గాలు ఈ మూడు లక్షణాలకూ వారసులుగా ఐక్యంగానే ఏలుతున్నారు. ఈ ఏలికకు ఇవ్వాళ ప్రకటించుకొంటూన్న రాజకీయ సిద్ధాంత చట్రం ఏదయినా, అసలు లక్ష్యాలుగా ఈ క్రింది వాటిని గుర్తించగలం.

1) దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల సంపన్నుల ఆస్తులనూ సాంప్రదాయిక అధికారాన్నీ సంరక్షించడం, మరింత పెంపొందింప జేయడం, సామ్రాజ్యవాద పెట్టుబడి అవసరాలను తీర్చడం.

2) చాలా వైవిధ్యం ఉన్న ఈ సంపన్న వర్గాలను ఐక్యంగా ఉంచి ఒక త్రాటి మీద నడిపించడం.

3) శ్రామిక వర్గాలలో వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడం, అది సాధ్యంకానప్పుడు అణచివేత ప్రయోగించడం.

ఇది స్వతంత్ర భారత పాలకుల అజెండా. ఈ అజెండాను వాళ్ళు ఒక నిర్దిష్టయిన నేపథ్యంలో అమలు చేయవలసి వచ్చింది. ఆ నేపథ్యంలో ఒక అంశం ప్రపంచవ్యాప్తమయిన సామ్రాజ్యవాద పెత్తనం కాగా, రెండవ అంశం ప్రపంచ వ్యాప్తంగానూ, ప్రత్యేకించి భారతదేశంలోనూ ఒక శతాబ్దంపైగా జరుగుతూన్న భూస్వామ్య సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు. ఈ నేపథ్యంలోనే దోపిడీ వర్గాల ఆస్తులనూ అధికారాన్నీ సంరక్షించి పెంపొందింపజేసే కర్తవ్యాన్ని నిర్వహిస్తూ భారత పాలకులు తమ రాజకీయార్థిక వ్యూహ రచన చేశారు. తెలుగువారి రాజకీయార్థిక జీవితమూ ఇందులో భాగంగానే మార్పులకు లోనయింది.

## గతకాలం

ఈ మార్పులను అర్థంచేసుకునేటప్పుడు గతకాలపు ప్రభావాలను ఏ మేరకు పరిగణనలోకి తీసుకోవాలనే ప్రశ్న వస్తుంది. సాధారణంగా కేవలం బ్రిటిష్ పాలనా కాలాన్నీ, అందులోనూ ఒకటి రెండు అంశాలనూ చర్చించి సంతృప్తి పడడం జరుగుతోంది. జమీందారీ, రైతువారీ వ్యవస్థల[1]ను, కాటన్ దొర[2] కట్టించిన

ఆనకట్టలనూ చర్చించి 'చరిత్ర'ను ముగించేయడం జరుగుతోంది. అయితే నూటికి తొంభై శాతం రైతువారీ ప్రాంతం అయిన గుంటూరు, ప్రకాశం జిల్లాలకూ, సగ భాగం జమీందారీ ప్రాంతమయిన కృష్ణా, గోదావరి జిల్లాలకూ ఆ కారణం వల్ల సంక్రమించిన తేడాలు స్వల్పం. ఒక్క జమీందారీ కూడా లేని కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకూ, సగభాగం జమీందారీ ప్రాంతమైన చిత్తూరు జిల్లాకూ మధ్య ఇవ్వాళ కనిపించే తేడాలకు మూలం అక్కడ లేదు. హైదరాబాద్ సంస్థానంలో మహత్తరమైన భూస్వామ్య వ్యతిరేక పోరాటం నడిచిన వరంగల్, నల్గొండ జిల్లాలు రెవెన్యూ పరిభాషలో 'రైతువారీ' ప్రాంతమే! రైతువారీ ప్రాంతంలో అందరూ కష్టం చేసే రైతులు ఎలా కారో, జమీందారీ ప్రాంతంలో జమీందార్లు మట్టుకే భూస్వాములు కారు. పట్టాదారునికీ ప్రభుత్వానికీ మధ్య మధ్యవర్తులెవరయినా ఉంటారా లేదా అన్నది మట్టుకే ఈ రెండు వ్యవస్థలకూ ఉన్న తేడా. ఇతరత్రా చూస్తే రెండింటిలోనూ అనేక భూస్వామ్య లక్షణాలు సామాన్యంగా ఉండేవి. వందల ఎకరాల భూములుండే భూస్వాములు, గ్రామ పెద్దల ఫ్యూడల్ పెత్తనం, వెట్టిచాకిరీ, కుల పెత్తనం, నడ్డి విరిచే శిస్తు వసూలు రెండు వ్యవస్థలకూ సామాన్య గుణాలే. గ్రామీణ సామాజిక నిర్మాణంలో కులవ్యవస్థ సర్వత్రా ఉన్నదే. ఈ భూస్వామ్య వ్యవస్థను అర్థం చేసుకోవ డానికి చరిత్రలో చాలా దూరం పోవాలి. థామస్ మన్రో[3] రాయలసీమలో రైతువారీ వ్యవస్థను ప్రవేశపెట్టగానే పాత చరిత్ర అంతా ఒక్కనాటితో తుడిచిపెట్టుకు పోలేదు. కాటన్ దొర కోస్తాలో ఆనకట్టలు కట్టగానే భూస్వామ్య వ్యవస్థ ఎగిరిపోయి వ్యాపార పంటలూ పెట్టుబడిదారీ సమాజమూ వచ్చేయలేదు.

మన దేశంలో గ్రామాలన్నీ ఒక్క పద్ధతిలో ఏర్పడలేదు గానీ వాటి స్వరూపాన్ని విశదీకరించే ఒక ప్రధాన క్రమం ఉంది. స్థిర వ్యవసాయ గ్రామాలు పెద్దఎత్తున ఏర్పడడం మొదలయి రెండువేల సంవత్సరాలు గడచినా ఆదిలోని లక్షణాల ముద్ర మన గ్రామాలను ఇంకా వదలలేదు. దాని ఫలితం మన రాజకీయాలనూ వదల లేదు. ఒక వ్యవసాయదారుల బృందం కొంత భూభాగాన్ని నాగలి కిందికి తేవడం ద్వారా మొదట గ్రామాలు ఏర్పడ్డాయి. చెరువు నీటి పారకంగానీ, ఇతర సౌలభ్యంగానీ ఉన్న పల్లపు భూములు మాత్రమే మొదట సాగులోకి వచ్చాయి.

ఈ భూముల యజమానులు – అది వ్యష్టి యాజమాన్యంగానీ, సమష్టి యాజమాన్యంగానీ – సమీపంలోని మెట్ట ప్రాంతంలో ఇళ్ళు వేసుకొని 'గ్రామం' ఏర్పాటు చేశారు. వీళ్ళంతా సాధారణంగా ఒకే తెగ లేక కులానికి చెందినవారు. వాళ్ళ కులపెద్ద ఆ గ్రామానికి పెద్ద. వాళ్ళ కుల పంచాయితీ ఆ గ్రామ పంచాయితీ. ఇప్పటికీ చాలా గ్రామాలలో ఏదో ఒక కులం వాళ్ళే – రెడ్డి, కమ్మ, కాపు, వెలమ వగైరా – ఎక్కువగా వుంటారు. అది 'వాళ్ళ' గ్రామంగా పరిగణించబడుతుంది. ఉన్నంతలో మంచి భూములన్నీ వాళ్ళకే వుంటాయి.

ఈ రకంగా ప్రారంభమయిన గ్రామంలోకి క్రమేపీ వేరేవాళ్లు వచ్చి చేరుతారు. వీళ్ళు సాధారణంగా కొంచెం తక్కువ కులం వాళ్ళయి ఉంటారు. వీళ్లు 'గ్రామ పెద్దల' అనుమతితో కొత్తగా భూమిని సాగులోకి తెస్తారు. ఆ భూమి వాళ్ళ స్వంతం కావడానికి సాధారణంగా చాలా కాలం పడుతుంది. వీళ్ళు కాక రకరకాల వృత్తుల వాళ్ళూ వచ్చి స్థిరపడతారు. కూలిచేసే జనం కూడా వచ్చి, ఊరిబయట గుడిసెలు వేసుకొని – 'అంటరానివాళ్ళు' కాబట్టి – వీళ్ళందరి పొలాలలో పనిచేసుకొని బ్రతుకుతారు.

ఈ నిర్మాణాన్ని కుల వ్యవస్థ సిద్ధాంతీకరించింది. తద్వారా సమర్థించింది. బ్రాహ్మణులు దానిని ప్రచారం చేసి వ్యవస్థను నిలబెట్టే భావజాలంగా మలిచారు. అస్సాం నుండి పంజాబుదాకా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలదాకా గ్రామీణ వ్యవస్థ ఆవిర్భావంలో ఈ నిర్మాణమే ప్రధాన చారిత్రక రూపం. దేశంలో ఏ మూలకు పోయినా గ్రామీణ జీవితం ఈ కారణంగానే ఒకేలాగ కనిపిస్తుంది. మన దేశభక్తులు గొప్పగా చెప్పే సాంస్కృతిక ఐక్యతకు ప్రాతిపదిక ఇక్కడ వుంది. ఈ క్రమంలో ఎన్నడూ పాలుపంచుకోని నాగా, మిజో తదితర సరిహద్దు ప్రజలు తమది ఈ దేశం కాదనీ, ఈ సంస్కృతీ కాదనీ భావించడానికి కారణం కూడా ఇక్కడే వుంది.

ఈ గ్రామీణ వ్యవస్థలో జరిగిన ఉత్పత్తిలో దాదాపు సగభాగాన్ని పాలక వర్గం శిస్తు రూపంలో దోచుకొని బ్రతికింది. ఇందులో రాజులు, రాజన్యులు, అధికారులు, పండితులు, పురోహితులు, వర్తకులేకాక గ్రామపెద్దలూ గ్రామీణ భూస్వాములూ కూడా వున్నారు. శిస్తు వసూలుకు ప్రాతిపదిక మట్టుకు మారుతూ వచ్చింది. మన దేశ చరిత్రలో సత్పరిపాలన, దుష్పరిపాలన అనే మాటలకు అర్థం

ఏదయినా ఉంటే ఆ తేడా ఈ యంత్రాంగంలోనే వుంది. ఒక్కొక్కసారి శిస్తు వసూలు నగ్నమైన దోపిడీ రూపంలో ఉండేది. రాజులు శిస్తు వసూలు బాధ్యతను సామంతులకూ ఇతర అధికార్లకూ అప్పజెప్పేవాళ్ళు. వాళ్ళు పంట కోతలప్పుడు గ్రామంమీద దాడిచేసి గ్రామపెద్దల సాయంతో పంటలో శిస్తు వాటాను ధాన్యం రూపంలోనే తీసుకుపోయేవారు. తమ వాటా, గ్రామపెద్దల వాటా పోగా మిగిలింది రాజుగారికి అప్పజెప్పేవారు. రాజుగారి ఖజానా సంక్షోభంలోపడ్డప్పుడు మరింత అన్యాయమయిన పద్ధతిని ఉపయోగించేవారు. శిస్తు వసూలు చేసే అధికారాన్ని వేలంవేసి (ఇవ్వాళ సారాయి దుకాణాలను వేలంవేసినట్టు) ఎవరు ఎక్కువ శిస్తు వసూలు చేయడానికి ఒప్పుకుంటే వాళ్ళకు అప్పజెప్పేవారు. ఇంగ్లీష్‌లో దీనిని రెవెన్యూ ఫార్మింగ్ అంటారు. ఈ పద్ధతిని అనుసరించేటప్పుడు రైతులు విపరీత మయిన దోపిడీకీ, దౌర్జన్యానికీ గురయ్యేవారు. ఉదాహరణకు తెలంగాణ జిల్లాలలో సాలార్‌జంగ్[4] సంస్కరణలకు పూర్వం ఈ పద్ధతే అమలులో ఉండేది. దీనిని సంస్కరించే సాలార్‌జంగ్ గొప్పవాడనిపించుకున్నాడు. అయితే పాత శిస్తు కాంట్రాక్టర్లు కొత్త వ్యవస్థలో దేశ్‌ముఖ్‌లయి తమ దోపిడీని కొత్త రూపాలలో కొనసాగించేసరికి రైతాంగం వారికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేయవలసి వచ్చింది.

ఢిల్లీ సుల్తాన్ల కాలంలో – ముఖ్యంగా అల్లావుద్దీన్ ఖిల్జీ[5], ఫిరోజ్ తుగ్లక్[6]ల పాలనలో – మరికొంత క్రమబద్ధమయిన రెవెన్యూ యంత్రాంగం వచ్చింది. అది మనకు ఇవ్వాల్టికీ మిగిలి వుంది. భూమిని సర్వేచేయడం, పట్టాలు ఇవ్వడం, పంట దిగుబడిని అంచనావేసి దానినిబట్టి శిస్తు పరిమాణాన్ని నిర్ణయించడం, సగటు ధరలను అనుసరించి దానిని రొక్కంలోకి మార్చడం, రైతులకు తక్కావీ ఋణాలు ఇవ్వడం, కరువు కాటకాలు వచ్చినప్పుడు శిస్తు మాఫు చేయడం – ఇవన్నీ కూడా ఢిల్లీ సుల్తాన్ల కాలం నుండి ఒక్కొక్కటీ రూపం తీసుకున్నాయి. ఈ రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రవేశపెట్టింది ముస్లిం సుల్తాన్లయినా, వాళ్ళ మతం కులానికి వ్యతిరేకమయినా, వాళ్ళు గ్రామంలోని కుల వ్యవస్థను ముట్టుకోకపోగా, కుల వ్యవస్థలో భాగంగా ఆవిర్భవించిన 'గ్రామ పెద్ద'కు ఈ రెవెన్యూ యంత్రాంగంలో స్థానం కల్పించి తమ అవసరాలకు తగ్గట్టుగా మలచుకున్నారు.

గ్రామం నుండి శిస్తు సక్రమంగా వసూలయ్యేలాగ చూసే బాధ్యత గ్రామ పెద్దది. అందుకే చేసే విధి ఒకటే అయినా ఈ హోదాకు గల పేరు ప్రాంతాన్ని బట్టి, సంస్కృతిని బట్టి మారుతూ వచ్చింది. పటేల్, పాటిల్, ముఖియా, ముఖద్దం, చౌదరి, రెడ్డి, గౌడ మొదలైనవి ఆయా ప్రాంతాలలో వాడిన పేర్లు. పైస్థాయి రెవెన్యూ అధికార్లయిన తాసీల్దారు, సుబేదారు మొదలయిన హోదాలను మట్టుకు అన్ని ప్రాంతాలలో ఒకే పేరుతో పిలిచారు.

అంతేకాదు, ముస్లిం రాజ్యాధికారం ఏర్పడే క్రమంలో వాళ్ళ చేతిలో ఓడిపోయిన హిందూ పాలకులను కూడా వాళ్ళు తమ రెవెన్యూ యంత్రాంగంలో ఇముడ్చుకున్నారు. 'జమీందార్లు' ఎక్కువగా మొగలాయీల చేతిలో ఓడిపోయిన స్థానిక పాలకులే. వీళ్ళకు శిస్తు వసూలుచేసే బాధ్యతను అప్పజెప్పి స్థానిక పరిపాలనా వ్యవహారాలు చూసుకునే అధికారం ఇచ్చారు. వసూలు చేసిన శిస్తులో వారు కొంత భాగం తమ వాటాగా ఉంచుకొనేవారు. తర్వాత బ్రిటిష్ వాళ్ళు ఈ జమీందార్లకు భూమి మీద యాజమాన్యం కూడా కల్పించి ఈ వ్యవస్థను కొనసాగించారు. ఈ ఒక్క విషయంలోనే కాదు, మొత్తం రెవెన్యూ యంత్రాంగాన్నీ, గ్రామీణ సామాజిక వ్యవస్థనూ బ్రిటిష్ వాళ్ళు మౌలికంగా మార్చకుండా తమ అవసరాలకు అనుగుణ్యంగా మలచుకున్నారు. భూమిశిస్తును క్రమబద్ధంగా వసూలుచేసి తద్వారా వీలయినంత ఎక్కువ ఆదాయాన్ని పొందడం బ్రిటిష్‌వారి భూమిశిస్తు విధానానికి కీలకమయిన విషయం. జమీందారీ, రైతువారీ వ్యవస్థలు బ్రిటిష్‌వాళ్ళ సృష్టి కాదు. గతంలో ఉన్న భూమి సంబంధాలను సామ్రాజ్యవాదం అవసరాలకు, వాటికొక సాధనమయిన బూర్జువా సివిల్ చట్టానికి లోబరచిన క్రమంలో ఈ వ్యవస్థలు ఏర్పడ్డాయి. కోస్తా ఆంధ్రలో అప్పటికే ఉన్న జమీందార్లను కొనసాగించారు. కొంత స్వాతంత్ర్యం ఉన్న చిల్లర రాజులను జమీందార్లుగా లోబరచుకున్నారు. జమీందార్లందరికీ భూమిమీద ఆస్తిహక్కు కల్పించారు. రాయలసీమలోని పాలెగాళ్ళ దగ్గర ఇది సాధ్యం కాలేదు కాబట్టి వాళ్ళను పూర్తిగా అణచివేసి అక్కడ రైతువారీ వ్యవస్థను ప్రవేశపెట్టారు. (అయినా పాలెగాళ్ల వ్యవస్థ సామాజిక రాజకీయ అవశేషాలు రాయలసీమను ఇంకా వదలలేదు. అక్కడి రాజకీయ నాయకులలో బూర్జువా పార్లమెంటరీ లక్షణాలకంటే పాలెగాళ్ళ

లక్షణాలే ఎక్కువ). బ్రిటిష్‌వాళ్ళు రాకపూర్వం మన దేశంలో భూమిమీద సంపూర్ణ యాజమాన్యం చాలా అరుదుగా వుండేది. రకరకాల హక్కులు మాత్రమే ఉండేవి. ఎవ్వరికీ పూర్తి యాజమాన్యం లేకుండా రైతుకు, గ్రామపెద్దలకు, గ్రామ ఆయగార్లకు, జమీందార్లకు, రాజులకు రకరకాల హక్కులుండేవి. బ్రిటిష్‌వాళ్ళు ఈ సంబంధాల సారాంశాన్ని మార్చకుండా వీళ్ళలో ఒకరికి పూర్తి యాజమాన్యాన్ని ఇచ్చి తక్కినవారి హక్కులకు రకరకాల సర్దుబాట్లు చేశారు. ఈ రకంగా ఏర్పడిన వ్యవస్థకు ఒకచోట రైతువారీ వ్యవస్థ అనీ, ఒకచోట జమీందారీ వ్యవస్థ అనీ, ఒకచోట మహల్‌వారీ[7] వ్యవస్థ అనీ రకరకాల పేర్లు పెట్టారు. ఒకే ప్రాంతంలో కొన్నాళ్లు ఒక ప్రయోగం, కొన్నాళ్ళు మరొక ప్రయోగం చేశారు. దీనినంతా వాళ్ళు రికార్డో[8] ఆర్థిక సిద్ధాంతాలతోనూ, జేమ్స్ మిల్[9] రాజకీయ సిద్ధాంతాలతోనూ సమర్థించు కున్నప్పటికీ, ఉన్న పరిస్థితులను మరీ ఎక్కువగా కదిలించకుండా, భూమి మీద ఒకరికి పూర్తి యాజమాన్యం ఇచ్చి భూమి క్రయవిక్రయాలను ప్రోత్సహించడం అభివృద్ధికి దోహదం చేస్తుందన్న తమ అవగాహనను అమలుచేసేందుకు వారు చేసిన ప్రయత్న ఫలితమే ఈ వివిధ వ్యవస్థలు. ముఖ్యంగా, గ్రామాలలో కులం ప్రాతిపదికగా ఏర్పడిన సామాజిక నిర్మాణాన్నీ, ఉత్పత్తి సంబంధాలలో కులం పాత్రనూ, వెట్టి చాకిరీ, కట్టు బానిసత్వం వంటి శ్రమ రూపాలనూ, గ్రామపెద్దల ఫ్యూడల్ పెత్తనాన్నీ బ్రిటిష్ వాళ్ళు ముట్టుకోలేదు.

ఆనకట్టలు కట్టడంలోనూ వ్యవసాయ అభివృద్ధి కంటే వరదల నివారణ, నౌకా రవాణాకు అవసరం అయిన కాలవల నిర్మాణం బ్రిటిష్ వారి ప్రధాన ఉద్దేశ్యం అనిపిస్తుంది. వ్యవసాయ అభివృద్ధి జరిగితే భూమిశిస్తు పెరుగుతుందనీ, ప్రజలలో తమ పాలన పట్ల ఆదరాభిమానాలు పెరుగుతాయనీ ఆ తరువాత కాలంలో గుర్తించినట్టున్నారు. గోదావరికి ఆనకట్ట 1852లోనూ, కృష్ణానదికి ఆనకట్ట 1855లోనూ పూర్తి అయ్యాయి. దానితో అంతకుముందు తరచుగా వరదలపాలయిన ఆ రెండు నదుల డెల్టాలు, కరువుపాలయిన ఎగువ ప్రాంతమూ సస్యశ్యామలమయ్యాయి. ఆ సంపద సృష్టించిన మధ్యతరగతే ఆ తర్వాత జాతీయ ఉద్యమంలోనూ, సంస్కరణ ఉద్యమాలలోనూ ప్రముఖ పాత్ర వహించింది. కాలక్రమంలో ఆ సంపద వర్తకం లోనికీ, సినిమా పరిశ్రమలోనికీ ప్రవేశించి

ప్రస్తుత ఆంధ్ర రాష్ట్రంలోని సంపన్న పాలకవర్గాలలో ఒక ముఖ్య భాగానికి పునాది అయింది. సంఘవ్యతిరేక సాంస్కృతిక వికాసానికి, సాహిత్య రౌడీయిజానికి కూడా పునాది అయింది.

బ్రిటన్ ఒక పారిశ్రామిక దేశం కాక పూర్వమే బ్రిటిష్ పెట్టుబడి వర్తక పెట్టుబడి రూపంలో భారతదేశంలోకి ప్రవేశించింది. చివరి రోజులదాకా వర్తకం దాని ప్రధాన లక్ష్యంగానే ఉండింది. ఇక్కడి నుండి వ్యవసాయ ముడిసరుకులనూ ఖనిజాలనూ కొనుక్కుపోయి పారిశ్రామిక ఉత్పత్తులను మనకు అమ్మేవారు. పారిశ్రామిక ముడిసరుకులుగా ఉపయోగపడగల పంటలను కొంతవరకు ప్రోత్సహించేవారు. మన రాష్ట్రంలోని పాత గుంటూరు జిల్లా (ప్రస్తుత గుంటూరు, ప్రకాశం జిల్లాల)లో పత్తి, పొగాకువంటి పంటలకు 1866 తరువాత లభించిన ప్రోత్సాహం ఇందుకు ఉదాహరణ. అప్పటి నుండి నిన్న మొన్న వార్తలకెక్కిన పత్తి రైతుల ఆత్మహత్యల దాకా ఆ ప్రాంతం చరిత్రంతా సామ్రాజ్యవాద 'అభివృద్ధి'తోనే ముడిపడి ఉంది.

'అభివృద్ధి' వల్ల కొంత ప్రయోజనం పొంది ఆ పైన సంక్షోభంలో పడ్డవారి కథ ఇది అయితే, ఎప్పుడూ కూడా నష్టమే తప్ప ఏ ప్రయోజనమూ పొందని జనం చరిత్ర తిరుగుబాట్ల చరిత్ర. పెద్ద మొత్తంలో వసూలు చేసిన భూమిశిస్తు పట్ల రైతాంగంలో చాలా అసంతృప్తి ఉండింది. అలజడులూ జరిగాయి. కాంగ్రెస్‌వారు పెద్దగా ఉత్సాహం చూపకపోయినా అనేక పోరాటాలూ జరిగాయి. ఆదివాసులు – మన రాష్ట్రంలో ప్రధానంగా తూర్పు గోదావరి ఏజెన్సీలోనూ, ఆదిలాబాద్‌లోనూ – ఎడతెరిపి లేకుండా పోరాటాలు చేశారు. ' రంప పితూరీలు'[10] బ్రిటిష్‌వారికి పెద్ద తలనొప్పి అయ్యాయి.

పెట్టుబడి ఎక్కడ ప్రవేశించినా అక్కడ ఒక కొత్త దోపిడీ రూపాన్ని ప్రవేశ పెడుతూ అదే సమయంలో ప్రజల సాంస్కృతిక వికాసానికి దోహదంచేసే నూతన భౌతిక జీవితాన్ని వాళ్ళ అందుబాట్లోకి తెస్తుందనే భ్రమను సామ్రాజ్యవాద పెట్టుబడి పటాపంచలు చేసింది. పెట్టుబడికి పుట్టినిల్లయిన యూరప్‌లో ఇది జరిగిందిగానీ వలసలలో జరగలేదు. సామ్రాజ్యవాదానికి ఆ సామర్థ్యం లేదు. అది ఇక్కడి శ్రామికులలో ఏ రకమయిన వికాసానికీ దోహదం చేయకుండా దోపిడీని మట్టుకు

పెంచింది. నైసర్గికంగా చాలా అనుకూలంగావున్న ప్రాంతాలను మినహాయిస్తే ఇతర ప్రాంతాలలో ఆస్తిపరులకు సహితం నాలుగు ఇంగ్లీష్ ముక్కలు నేర్పి ఆస్తి మీద పూర్తి యాజమాన్యం ఇచ్చి కోర్టులచుట్టూ తిప్పిందేగానీ వేరే ఒరగబెట్టిందేమీ లేదు. పెట్టుబడి ఎక్కడున్నా తన మూసలో సమాజాన్ని పునర్నిర్మిస్తుందనే భ్రమ ఇవాళ మళ్ళీ కొత్త కొత్త రూపాలలో ముందుకు వస్తోంది కాబట్టి ఈ చారిత్రక సత్యాన్ని గుర్తించడం అవసరం. బ్రిటిష్ వాళ్లు వచ్చిన తరువాత వందల సంఖ్యలో జరిగిన రైతాంగ గిరిజన తిరుగుబాట్లు ఈ సత్యానికి నిదర్శనాలు.

కమ్యూనిస్టు పార్టీకి వలస దేశాలలో ప్రజాతంత్ర విప్లవాన్ని గురించి సరయిన అవగాహన ఉండి ఉంటే ఈ తిరుగుబాట్లు సంఘటితమై ప్రజా విముక్తి పోరాటాలు అయి ఉండేవి. కాని చైనా విప్లవాన్ని 'గుర్తించడానికే' చాలాకాలం తటపటాయించిన భారత కమ్యూనిస్టు పార్టీకి అటువంటి అవగాహనగానీ, ప్రోగ్రాం గానీ, పంథాగానీ ఏ రోజూ లేవు. అయితే 1940 తరువాత తీవ్రంగా పెరిగిపోయిన రాజకీయార్థిక సంక్షోభ కాలంలో దేశంలో చాలాచోట్ల ప్రజానీకమే పెద్దఎత్తున పోరాటాలకు సంసిద్ధం కాగా, భారత కమ్యూనిస్టు పార్టీ వారిని ఖండిస్తూ తీర్మానం చేయకుండా వారికి నాయకత్వం వహించింది. మొత్తంగా రాజ్యాధికారానికి సంబంధించి ఒక అవగాహన లేకపోయినా స్థానికంగా మహత్తర పోరాటాలు నిర్వహించింది. బ్రిటిష్ వారికి సామంతుడిగా ఉంటూ వారికి కప్పం చెల్లిస్తూ వారి సైన్యాన్ని పోషిస్తూ వారి పాలనా విధానాన్ని అనుకరించాలని ప్రయత్నం చేసిన హైదరాబాద్ నిజాం సంస్థానంలో సామ్రాజ్యవాద పెట్టుబడి ఆధ్వర్యంలో విపరీతంగా పెరిగిపోయిన భూస్వామ్య దోపిడీని ప్రతిఘటిస్తూ అప్పటి వరంగల్, నల్గొండ జిల్లాలలో ప్రజ్వరిల్లిన తెలంగాణ రైతాంగ పోరాటం వీటన్నింటిలోనికీ ముఖ్యమయినది.

## స్వాతంత్ర్యానంతరం

బ్రాహ్మణుల కుల వ్యవస్థను మొగలాయి రెవెన్యూ యంత్రాంగం తనలో ఇముడ్చుకున్నట్టే, ఆ రెండింటినీ సామ్రాజ్యవాద యంత్రాంగం ఇముడ్చుకున్నట్టే, ఆ మూడింటినీ కూడా స్వతంత్ర భారత పాలనా యంత్రాంగం తనలో ఇముడ్చు కుంది. అయితే ఈ లోపల వచ్చిన మార్పులకు – ముఖ్యంగా ప్రజా పోరాటాలకు

– కొన్ని రాయితీలు ఇవ్వక తప్పలేదు, కొన్ని సర్దుబాట్లు చేసుకోక తప్పలేదు. ఈ అవిచ్ఛిన్నతను (Continuity) దృష్టిలో పెట్టుకుంటేనే గత నాలుగు దశాబ్దాల చరిత్ర సరిగ్గా అర్థం అవుతుంది.

ప్రజాతంత్ర విప్లవం నిర్వహించవలసిన ఏ కర్తవ్యాన్నీ మన జాతీయోద్యమం పరిపూర్ణం చేయలేదు. పిడికెడు మంది జాగీర్దార్ల జాగీర్లనూ, జమీందార్ల ఎస్టేట్లనూ (అది కూడా నష్టపరిహారం ఇచ్చి) రద్దుచేశారు కానీ అసంఖ్యాకంగా ఉన్న భూస్వామ్య వర్గం ఆస్తులకు ఇబ్బంది కలిగించలేదు. జమీందార్లు కూడా రెవెన్యూ సెటిల్ మెంట్‌లో పొందిన ఎస్టేట్లు పోగొట్టుకున్నారు గానీ తమ స్వంత భూములుగా పరిగణించిన వాటిని (ఒక్కొక్కసారి కొన్ని వేల ఎకరాల భూములను) మాత్రం దక్కించుకున్నారు. వాళ్ళ సామాజిక రాజకీయ ఆధిపత్యం మాటకొస్తే, దానిని పోగొట్టుకోక పోవడమేకాక, పాలకవర్గ రాజకీయాలలో చేరి ఆ ఆధిపత్యానికి వాళ్లు పార్లమెంటరీ రూపం ఇచ్చుకున్నారు.

ఈ జమీందార్లు పోగా మిగిలిన భూస్వామ్య వర్గం కాంగ్రెస్‌పార్టీ సామాజిక పునాదిలో ముఖ్యభాగం. వాళ్ళను కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ పడిన పాట్లే ఒక చరిత్ర. రైతాంగం జాతీయోద్యమ కాలంలో నిర్వహించిన అనేక పోరాటాలకు రాయితీగా కౌలుదార్ల హక్కులకు రక్షణ కల్పించే చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వమే చేయడం మొదలుపెట్టింది. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని కొనసాగించింది. నిజమయిన ప్రజాతంత్ర విప్లవం ఈ సమస్యను 'దున్నేవానిదే భూమి' అనే సూత్రం ప్రాతిపదికగా పరిష్కరిస్తుంది. కౌలుదార్ల పక్షం వహించి వాళ్ళకు భూస్వాముల భూములు ఇప్పిస్తుంది. కాని మన దేశంలో అట్లా చేయకుండా ఇరుపక్షాలనూ సమంగా చూసే బూర్జువా సివిల్ చట్టానికీ, రెవెన్యూ యంత్రాంగానికీ రైతులను వదిలేశారు. అసమానులను 'సమంగా' చూడడం ద్వారా బలవంతులకు మేలు చేయడమే బూర్జువా చట్టం నీతి కాబట్టి దీనివలన లాభం పొందిన కౌలుదార్లు అల్పసంఖ్యాకులే. అంతే కాకుండా, భూమిని కౌలుకిచ్చే అలవాటు ఈ చట్టాల వలన మొదట్లో తగ్గినా, ఈ మధ్య కాలంలో మళ్ళీ పెరిగింది. అయితే ఇప్పుడు కౌలుకు ఇచ్చేవాళ్ళు చట్టాలకు దొరక్కుండా జాగ్రత్తపడుతున్నారు.

రైతువారీ ప్రాంతంలోని భూస్వాములూ, జమీందార్ల ఎస్టేట్లలోని పెద్ద రైతులూ, కౌలుదారీ చట్టాలను వినియోగించుకోగలిగిన పెద్ద కౌలుదార్లూ స్వాతంత్ర్యానంతర గ్రామీణ వ్యవస్థలో ఒక బలమయిన వర్గంగా స్థిరపడ్డారు. వీళ్ళకు సంప్రదాయకంగా గ్రామాలలో గ్రామపెద్దలుగా ఉన్న ఆధిపత్యం, అగ్రకుల పెత్తనం అట్లాగే కొనసాగాయి. చాలా ప్రాంతాలలో వెట్టిచాకిరీ, కట్టుబానిసత్వం, తదితర ఫ్యూడల్ దోపిడీ రూపాలూ కొనసాగాయి. వడ్డీ వ్యాపారం నుండి మిల్లులూ రోడ్డు కాంట్రాక్టుల దాకా సకల గ్రామీణ వ్యవసాయేతర ఆర్థిక వ్యవహారాలలోనూ పెత్తనం వీళ్ళదే. భూమి సీలింగ్ చట్టాలు వీళ్ళ ఆస్తిని దెబ్బతీస్తాయని కాంగ్రెస్ పార్టీ కొన్నాళ్ళు ప్రజలను భ్రమింపజేసింది గానీ అటువంటిదేమీ జరగలేదు. దేశం మొత్తం మీద వ్యవసాయ యోగ్యమయిన భూభాగంలో కేవలం 1 శాతమే సీలింగ్ క్రింద మిగులు భూమిగా గుర్తించబడింది (ఇంకొంత భూమి కోర్టు లిటిగేషన్లలో ఇరుక్కుని వుంది). ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే దామాషాలో 275 లక్షల ఎకరాల సేద్యపు భూమిలో కేవలం 3 లక్షల ఎకరాలు మట్టుకే మిగులు భూమిగా ప్రభుత్వం చేత సేకరించబడింది.

ఈ రకంగా రూపొందిన గ్రామీణ భూస్వామ్య వర్గాన్ని పెట్టుబడిదారీ వ్యవసాయదారులుగా మార్చడానికి భారత ప్రభుత్వం పూనుకుందని ఆర్థికశాస్త్ర పరిశీలకులలో చాలామంది అభిప్రాయపడుతున్నారు. కానీ మనబోటి దేశాలలో పెట్టుబడి పునర్వ్యాప్తికి (extended reproduction) ఏ మాత్రం అవకాశం వుందని ఆలోచించకుండా ఇటువంటి నిర్ధారణలు చేయడంలో అర్థం లేదు. అయితే ఈ వర్గం పెత్తనాన్నీ, సంపదనూ మరింత పెంచడానికి మటుకు భారత ప్రభుత్వం చాలానే కృషి చేసింది. సంపద (wealth) దానంతటది అదే పెట్టుబడి (Capital) కాదని అర్థం చేసుకుంటే ఈ గందరగోళం ఉండదు.

మన రాష్ట్రానికున్న ప్రత్యేకత ఏమిటంటే పట్టణ ప్రాంత ఆర్థిక రంగాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఈ గ్రామీణ భూస్వామ్య వర్గాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుంది. ఉత్తర భారతదేశంలో పట్టణప్రాంత ఆర్థిక రంగంలో మార్వాడీ, జైన్, బనియా వ్యాపారస్తులది ప్రధాన స్థానం కాగా మన దగ్గర కోమట్లూ మార్వాడీలూ ఆ స్థానాన్ని ఎప్పుడో కోల్పోయారు. దానిని కమ్మ, రెడ్డి, కాపు,

బలిజ తదితర 'వ్యవసాయ' కులాలవాళ్ళు ఆక్రమించారు. ఉత్తర భారతదేశంలో వ్యవసాయ రంగంలో బలపడిన జాట్ కులస్తులు ఇప్పటికీ అత్యధికంగా వ్యవసాయానికే పరిమితం అయివున్నారు. మహారాష్ట్రలోని మరాఠీలు మన కమ్మ, రెడ్డి కులాలలాగా పట్టణ ప్రాంత ఆర్థికరంగంలోకి బాగా ప్రవేశించి ఉన్నప్పటికీ బొంబాయి నగరంలో గుజరాతీ మార్వాడీ పార్సీ పెట్టుబడిదే పూర్తిగా పైచేయి. మహేంద్రసింగ్ తికాయత్[11], శరద్ జోషీలు[12] 'గ్రామీణ' అవసరాలకు ప్రతినిధులుగా చలామణి కావడంలో సాఫల్యం చెందడానికి, అటువంటి పరిణామం ఆంధ్రలో జరగకపోవడానికి గల కారణాలలో ఇది ఒకటి.

కాబట్టి నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రుల ఆర్థిక జీవితాన్ని నడిపించిన ప్రధాన సూత్రాన్ని ఒక్క వాక్యంలో ఈ విధంగా నిర్వచించవచ్చును. 'సామ్రాజ్య వాదం గొడుగు క్రింద గ్రామీణ ధనికవర్గాల సంపదనూ ఆధిపత్యాన్నీ పెంపొందింప జేయడం, ఆ సంపద పట్టణాలకు వలసపోవడానికి అవసరం అయిన సౌకర్యాలూ అవకాశాలూ కల్పించడం'. అయితే ఆర్థిక అభివృద్ధి వర్గపోరాట క్రమం కాబట్టి, దేశంలోని వనరులను పంచుకోవడంలో ఈ వర్గంతో పోటీపడే గుత్తపెట్టుబడిదారీ వర్గాన్ని ఒకవైపు, సంపదకు మూలమయిన శ్రామిక జనాన్నీ, మధ్యతరగతి రైతాంగాన్నీ ఇంకొకవైపు ఈ నిర్వచనంలోకి చేర్చాలి. గుత్తపెట్టుబడిదారీ వర్గంతో చాలా కాలంపాటు సామరస్యపూరితమయిన ఏర్పాటే కొనసాగింది. ఆ ఏర్పాటు పూర్తిగా గుత్తపెట్టుబడిదారీ వర్గం అవసరాలకే తోడ్పడిందని ఇవాళ వినవస్తూన్న అభిప్రాయం ఆ సామరస్యం విఫలమయిన తరువాత పుట్టిన ఆరోపణే. మధ్య తరగతి రైతాంగం విషయానికొస్తే 'అభివృద్ధి'లో కొంతచోటు చూపించి వారిని తమవైపు తిప్పుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆ ప్రయత్నం పూర్తిగా విఫలమయిందని అనడానికి వీలు లేదుగానీ పాలకవర్గాలు ఆశించినంతగా విజయవంతం కాలేదు. శ్రామిక జనాన్ని రాయితీలతో తమవైపు తిప్పుకోవాలని చేసిన ప్రయత్నం మట్టుకు దాదాపు పూర్తిగా విఫలమయింది. ఇక తుపాకులే మిగిలాయి.

ఈ దృష్టితో గత నాలుగు దశాబ్దాల ఆంధ్ర రాష్ట్ర చరిత్రను చూద్దాం. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మన రాష్ట్రంలోని వ్యవసాయయోగ్యమయిన

భూభాగంలో నాలుగవ వంతు 25 ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న పెద్ద కమతాల కింద వుంది. ఈ పెద్ద కమతాల సంఖ్య మొత్తం కమతాలలో 3.4 శాతం. అయితే ఇది రాష్ట్రంలోని భూస్వామ్య వర్గాన్ని సూచిస్తుందనుకుంటే పొరబాటవుతుంది. 25 ఎకరాల భూమివున్నా దానిమీద వచ్చే ఆదాయం కేవలం జీవనానికి మట్టుకే సరిపోయే ప్రాంతాలు రాష్ట్రంలో చాలా వున్నాయి. 10 ఎకరాలమీద సంవత్సరానికి 1 లక్ష రూపాయల ఆదాయం వచ్చే భూములూ వున్నాయి. అంతేగాక, ఇవ్వాళ గ్రామీణ ప్రాంతాలలో సంపదనూ అధికారాన్నీ సూచించడానికి భూమి ఒక్కటే చాలదు. సహకార సంఘాలు, రైస్‌మిల్లులు, రాజకీయాలు, పైరవీలు, వడ్డీవ్యాపారం, వర్తకం, సినిమాలు, కాంట్రాక్టులు, సామాజిక పెత్తనం మొదలయిన అంశాలన్నింటినీ లెక్కలోకి తీసుకోవలసి ఉంటుంది. అన్నింటినీ లెక్కలోకి తీసుకున్నప్పుడే భూస్వామ్య వర్గాన్ని హేతుబద్ధంగా గుర్తించగలుగుతాం.

ప్రభుత్వం అనుసరించే 'గ్రామీణ అభివృద్ధి' మౌలికంగా ఈ వర్గం అభివృద్ధే తప్ప మొత్తం గ్రామీణ ప్రజల అభివృద్ధి కాదు. మొత్తం గ్రామీణ ప్రజల అభివృద్ధిని సాధించాలంటే మొదట భూసంస్కరణలు అమలు చేయాలి. ఆ పైన భూసార సంరక్షణ మీద, సేద్యపునీటి సరఫరా మీద దృష్టి కేంద్రీకరించాలి. విత్తనాలు, ఎరువులు, మందులు మొదలయిన వాటిని దేశ నైసర్గిక స్థితిగతులనూ, సంప్రదాయక సాంకేతిక విజ్ఞానాన్నీ దృష్టిలో ఉంచుకొని కర్షక బాహుళ్యానికి ఉపయోగపడేటట్టు అభివృద్ధి చేయాలి. గ్రామీణ పేదలకు పని కల్పించేందుకు స్థానిక ముడిసరుకులతో వ్యవసాయేతర ఉత్పత్తి రంగాన్ని అభివృద్ధి చేయాలి.

మన దేశంలో ఇదేదీ జరగడం లేదు. భూసంస్కరణల గురించి గానీ భూసార సంరక్షణ గురించి గానీ గ్రామీణ నిరుద్యోగ సమస్య పరిష్కారాన్ని గురించి గానీ మన ప్రభుత్వాలు ఎక్కడా శ్రద్ధ చూపించలేదని వివరించనక్కరలేదు. సేద్యపు నీటి అభివృద్ధిని గురించి నిరంతరాయంగా మాట్లాడుతుంటారు కాబట్టి ఏదో చేస్తున్నారన్న అభిప్రాయం కలుగుతుంది గానీ అది కూడా చాలావరకు భ్రమే. మన రాష్ట్రంలో ఇప్పటికీ కేవలం 35% సేద్యపు భూభాగానికి మాత్రమే నీటివసతి వుంది. అందులో నాలుగవ వంతును సమకూర్చేది చెరువులు. (తెలంగాణ

జిల్లాలలో నయితే 35 శాతం సేద్యపు నీరు చెరువుల నుండి వస్తుంది). ఈ చెరువుల మరమ్మతు గురించి గానీ సక్రమ నిర్వహణ గురించి గానీ ఏ రకమైన శ్రద్ధా చూపడం లేదు. అసలు మరమ్మతులకు ప్రత్యేకమైన నిధుల కేటాయింపే లేదు. నీటిపారుదల శాఖకు ఇచ్చే కేటాయింపులో వాళ్ళ జీతాలూ జీపుల ఖర్చులూ ఆఫీసు అద్దె ఖర్చు పోగా ఏమయినా మిగిలితే దానిని చెరువుల మరమ్మతుకు ఉపయోగించాలి. ఈ కారణంగా చెరువులు వర్షాభావం ఉన్నప్పుడు నీళ్ళులేక ఎండిపోతే, వర్షాలు బాగా పడినప్పుడు కట్టలకు గండ్లు పడి చుట్టుపక్కలవున్న పొలాలను నాశనం చేస్తున్నాయి. భారీ వర్షాలు పడినప్పుడల్లా తెలంగాణ, రాయల సీమ జిల్లాలలోని చెరువులకు ఇదేగతి పడుతూ వుంది.

మరొక నాలుగవ వంతు నీటివసతి బావుల నుండి వస్తుంది. (రాయల సీమలోనయితే 50 శాతం, తెలంగాణలోనయితే 35 శాతం నీరు బావుల నుండి వస్తుంది.) ఈ నీటి వసతి నిర్వహణ పూర్తిగా వ్యవసాయదారుల వ్యక్తిగత బాధ్యతే. కాని భూగర్భంలోని జలవనరులను పెంపొందింపజేసే బాధ్యత వాళ్ళకు సాధ్యమయ్యే పనికాదు, ప్రభుత్వమూ చేపట్టదు. ఇక మిగిలింది ఏమిటంటే ఎవరికి వాళ్ళు తమ స్తోమతను బట్టి బ్యాంకులలో అప్పులు చేసి బావులు తవ్వించుకోవడం, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వారికి లంచాలు మేపి బావులకు కరెంటు కనెక్షన్లు పెట్టుకొని పంప్‌సెట్లు పెట్టుకోవడం, లేదా గొట్టపు బావులు వేసుకోవడం. అంటే బ్యాంకులకు పెట్టుబడి సమకూర్చడం వినా ప్రభుత్వానికి వేరే బాధ్యత లేదు.

ఇక మిగిలిన సగం సేద్యపు నీరు నదుల నుండి వస్తుంది. నదులకు ప్రాజెక్టులు కడుతున్నారు గానీ ఈ ప్రాజెక్టులు ఎక్కువగా విదేశీ అప్పులమీద ఆధారపడి ఉంటున్నాయి. ఉదాహరణకు మన రాష్ట్ర అభివృద్ధిలో ఘనంగా చెప్పుకొనే నాగార్జునసాగర్ ప్రాజెక్టు పి.ఎల్-480[13] డబ్బులతో కట్టింది. ఆ తరువాత వచ్చిన ప్రాజెక్టులు ప్రపంచ బ్యాంకు పెట్టుబడితో కట్టినవి. ఈ అప్పులు ముట్టడంలోనూ తీర్చడంలోనూ వున్న ఇబ్బందుల వల్ల ప్రాజెక్టులు చాలా మందకొడిగా నడుస్తున్నాయి. మన రాష్ట్రంలో చిన్నవీ పెద్దవీ మొత్తం 40 నదులు ఉన్నాయి. అన్నింటిలోనూ కలిపి ప్రతీ సంవత్సరం మొత్తం 18,500 కోట్ల ఘనపు మీటర్ల నీరు అందుబాట్లో ఉంటుంది. అయితే అందులో సరిగ్గా సగం మట్టుకే మనం

ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకుంటున్నాం. మిగిలినది వృధాగా సముద్రంలోకి పోతోంది.

విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కొత్తపంట రకాలు మొదలయిన వాటి విషయానికొస్తే, హరిత విప్లవానికి పూర్వమయినా ఆ తరువాతయినా వీటి విషయంలో ప్రభుత్వం వైఖరి విస్తృత అభివృద్ధీ కాదు, మన నైసర్గిక స్థితిగతులకూ సాంకేతిక సామర్థ్యానికీ అనుగుణమైన అభివృద్ధీ కాదు, దానికి ప్రజల చొరవ చాలా కావలసి ఉంటుంది. ప్రజలు 'అభివృద్ధి'ని తమదిగా భావించవలసి ఉంటుంది. అందుకు వేరే వ్యవస్థ అవసరం అవుతుంది. ప్రజల చొరవమీద కాక సామ్రాజ్యవాద పెట్టుబడిమీద ఆధారపడే 'అభివృద్ధి' పంథా వికృతమైన ప్రగతిని మట్టుకే సాధిస్తుంది. అది సామ్రాజ్యవాద పెట్టుబడి అవసరాలను తీర్చి, ఆ పెట్టుబడికి లాభాలను సమకూరుస్తుంది. సామ్రాజ్యవాద పెట్టుబడి దేశంలోకి ప్రవేశించడానికి అవసరమయిన 'మార్కెట్'ను తయారుచేస్తుంది. భూస్వామ్య వర్గం సంపదనూ పెత్తనాన్నీ పెంచుతుంది. మధ్యతరగతి రైతాంగంలో ఆశలు పెంచి వాళ్ళను సామ్రాజ్యవాద సంక్షోభంలోకి లాగుతుంది. కూలివాళ్ళ కూలిరేట్లు పెంచినట్టే చూపించి ధరల పెరుగుదలతో దానిని వమ్ముచేసి, వాళ్ళ పేదరికాన్నీ అణచివేతనూ పెంచుతుంది.

ఇది పెట్టుబడికి ఎక్కడయినా వుండే లక్షణమే కదా అనవచ్చును. కానీ మనబోటి పరాధీన దేశాల స్థితి ఏమిటంటే ఇక్కడ పెట్టుబడికి సమగ్రమయిన వ్యాప్తి కూడా ఉండదు. వేగంగానూ అనాయాసంగానూ వ్యాపించగల మేరకు మట్టుకే వ్యాపిస్తుంది. కృష్ణా గోదావరి నదుల పుణ్యాన మనం వ్యవసాయ అభివృద్ధి చాలానే సాధించాం. అయితే ఈ అభివృద్ధి నైసర్గికంగా అనుకూలమయిన ప్రాంతాలకు మట్టుకే పరిమితం అయింది. మన ప్రమేయం లేకుండా ప్రవహించే నదీజలాలకు మనకు కష్టంలేకుండ ఎవరో సమకూర్చి పెట్టిన పెట్టుబడితో ఆనకట్టలు కట్టుకున్నాం. (ఆ తరువాత అప్పులు తీర్చడానికి కష్టపడాలనుకోండి – కాని అది ఎప్పుడో కదా!) అంతే తప్ప భూగర్భజలాలను పెంపొందింప జేయడానికి గానీ వాన నీళ్ళు వృధాకాకుండ చెరువులలోకి మళ్ళించడానికి గానీ ఎటువంటి ప్రయత్నమూ చేయడం లేదు. నిజానికి మొత్తం నీటి వనరులను

శాస్త్రీయంగా వినియోగించుకుంటే ఆంధ్ర రాష్ట్రంలో నూటికి నూరు శాతం సేద్యపు భూమికి నీరు దొరుకుతుందని నిపుణుల అంచనా. అయితే దీనికి చాలా శ్రమ కావలసి ఉంటుంది. పెట్టుబడికి అంత 'ఆసక్తి' లేదు. ఉండి ఉంటే అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాలు ఎండిపోయేవి కావు. కాలం చెల్లిపోయిన పెట్టుబడి ఆధిపత్యాన్ని కూలదోసి శ్రామిక రాజ్యం ఏర్పరచిననాడే ఆ శ్రమ సామాజికంగా సాధ్యం అవుతుంది. అది జరిగిననాడే రాయలసీమ జిల్లాలనూ, తెలంగాణ దక్షిణార్థాన్ని ఎడారి కాకుండా కాపాడుకోగలుగుతాం. ప్రస్తుతానికి మట్టుకు వ్యవసాయ 'అభివృద్ధి' కాటన్ దొర నాంది పలికిన చట్రంలోనే ఉండిపోయింది.

కాగా, ఈ 'అభివృద్ధి' ఫలితంగా పుట్టిన సంపదకు పెట్టుబడి లక్షణాలు పెద్దగా లేవు. మన రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల గురించి నివేదికలు సమర్పించు కున్నప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు దీని గురించి వాపోతుంటారు. ఖనిజ వనరులలో మన రాష్ట్రం బీహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌ల తరువాత చెప్పుకోదగ్గ స్థానంలో ఉంది. ఇక్కడి వ్యవసాయ అభివృద్ధి నుండి పుట్టిన సంపదకు పెట్టుబడి లక్షణాలు ఉండి వుంటే అది ఈ వనరులను గుప్పిట్లోకి తీసుకొని రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వుండేది. అయితే 'తెలుగు' పెట్టుబడి సినిమాలపట్ల, కాంట్రాక్టులపట్ల చూపించిన ఆసక్తి తనచుట్టూ వున్న పారిశ్రామిక ముడి వనరులపట్ల ఎన్నడూ చూపలేదు. బయటి పెట్టుబడి కూడా చాలా పరిమితంగానే దీనిపట్ల ఆసక్తి చూపిస్తోంది. ఈ కారణంగా మనం పారిశ్రామికంగా వెనకబడ్డ రాష్ట్రాల జాబితాలో వున్నాం. గత పదేళ్ళ కాలంలో భారత ప్రభుత్వ పెట్టుబడి, బహుళ జాతి పెట్టుబడి హైదరాబాద్ పరిసర ప్రాంతంలోనూ, విశాఖపట్నంలోనూ ప్రవేశించి 'అభివృద్ధి' జరుగుతోందనే భ్రమ కలిగిస్తున్నాయి. అయితే అది సహజ సిద్ధమయిన పరిణామం కాదు. నిలదొక్కుకోగల ఒరవడీ కాదు. స్థానిక పెట్టుబడి వ్యవసాయాధారమయిన పరిశ్రమలకూ, అంతకు రెండు రెట్లు వర్తకం, హోటళ్లు, సినిమాలు, కాంట్రాక్టులు మొదలయిన తృతీయరంగ (tertiary sector) వ్యవహారాలకూ పరిమితం అయింది. ఆంధ్ర రాష్ట్ర నికర ఉత్పత్తిలో సగం (50 శాతం) వ్యవసాయంలో జరుగుతుండగా, మూడవ వంతు (33 శాతం) తృతీయ రంగం లోను, ఆరవవంతు (17 శాతం) పరిశ్రమలలోను జరుగుతోంది (ఇవి 1982-83

గణాంకాలు). కాగా, పారిశ్రామిక రంగంలోని నికర ఉత్పత్తిలో 54 శాతం వ్యవసాయాధారమయిన పరిశ్రమలలో జరుగుతోంది. పారిశ్రామిక కార్మికులలో 52 శాతం ఈ రంగంలో పనిచేస్తున్నారు. వ్యవసాయాధారమైన పరిశ్రమలకు ఎక్కువగా పరిమితం కావడం దానంతటదే 'వెనుకబాటుతనం' కాదు. అయితే పెట్టుబడి ఈ రంగంలో సాధించిన సాంకేతిక ప్రగతి మృగ్యం. సాంకేతికంగా పురోగమిస్తున్న పారిశ్రామిక రంగం స్వల్పమేకాక, అందులో పెట్టుబడి స్థానిక పెట్టుబడి కాదు. విదేశ పెట్టుబడితో ముడిపడివున్న ప్రభుత్వ పెట్టుబడి, లేక ప్రైవేటు గుత్త పెట్టుబడి. దీని చలవ వల్లనే హైదరాబాద్‌కు, విశాఖపట్టణానికి కృత్రిమమైన 'ఆధునిక' ముస్తాబు గత పదేళ్ళ కాలంలో వచ్చింది.

మన విశ్లేషణ అప్పుడే కొంచెం తలక్రిందులుగా నడుస్తోందని గమనించాలి. అధికార గణాంకాలే సమాచారం అనుకోగానే ఆ గణాంకాలకు ప్రాతిపదిక అయిన సిద్ధాంతమూ మన విశ్లేషణలోనికి దిగుమతి అయింది. పాలక వర్గాలూ వారి అర్థ శాస్త్ర నిపుణులూ ఉపయోగించే అభివృద్ధి సంబంధమైన సిద్ధాంత చట్రాన్ని అరువు తీసుకొని 'అభివృద్ధి' జరగలేదని విమర్శిస్తున్నాం. కాని నిజానికి భారత పాలక వర్గాలకు 'అభివృద్ధి' – సోషలిస్టు అభివృద్ధిగానీ, పెట్టుబడిదారీ అభివృద్ధిగానీ – సాధించడం ప్రధాన లక్ష్యం కాదు. సోషలిజం పూర్తిగా బూటకం కాగా, పెట్టుబడి దారీ అభివృద్ధిని సాధించడానికి అవసరమయిన పునర్వ్యాప్తి సామర్థ్యం ఈ పరాధీన పెట్టుబడికి లేదు. కనీసం రోడ్లూ రవాణా సౌకర్యాలూ కూడా ఈ 40 ఏళ్ళలో పెరగలేదంటే ఈ అభివృద్ధి సామర్థ్యం ఎంతో మనకు అర్థం అవుతుంది. మన రాష్ట్రంలోని రైలు రూట్లూ రహదార్లూ బ్రిటిష్ వాళ్లు రూపొందించినవే. ఈ నలభై ఏళ్ళలో మనకు కొత్త రహదార్లు రూపొందించవలసిన అవసరం రాలేదు. బ్రిటిష్ పెట్టుబడి భారతదేశంలోనికి వచ్చినప్పుడు ఒక కొత్త వ్యవస్థాగతమైన మార్పు వచ్చిందనే దానికి చిహ్నంగా కొత్త రహదార్లూ పట్టణాలూ ఏర్పడ్డాయి. ప్రాచీన కాలం నుండి మన దేశంలో ప్రముఖ పట్టణాలుగా ఉన్న పాట్నా, సూరత్, భరూచ్, మచిలీపట్నం మొదలయినవి వారి అవసరాలకు సరిపోక వాళ్లు మద్రాసు, కలకత్తా, బొంబాయి నగరాలను నిర్మించారు. అవే కాలక్రమంలో ప్రధాన నగరాలయ్యాయి. వాటిని ఇతర ప్రాంతాలకు కలుపుతూ రైలు మార్గాలూ రహదార్లూ వేశారు.

వాళ్ళు వెళ్ళిపోయి నలభై ఏళ్ళైనా మనకు కొత్త అవసరాలు ఏర్పడలేదు. కొత్త రవాణా వ్యవస్థ అవసరం కాలేదు. అవే రైల్వే లైన్ల మీద బొగ్గు రైళ్ళ బదులు డీజిల్ రైళ్ళు, ఇప్పుడు కరెంటు రైళ్ళు నడుపుకుంటున్నాం. గ్రాండ్ ట్రంక్ రోడ్ అని వాళ్ళు పేరుపెట్టిన దానికి జాతీయ రహదారి అని పునర్నామకరణం చేసి ఫోర్డు, డాడ్జి లారీల బదులు ఆల్విన్ – నిస్సాన్ ట్రక్కులు నడుపుకుంటున్నాం. పెట్టుబడి బ్రిటిష్ వలసవాదుల చట్రాన్ని దాటి వ్యాపించి ఉంటే రవాణా వ్యవస్థ కూడా వ్యాపించి ఉండేది. అదీ జరగలేదు, ఇదీ జరగలేదు.

కాబట్టి 'అభివృద్ధి' అనే ప్రమాణాన్ని పక్కకు పెట్టి భారత పాలనా యంత్రాంగం అజెండాగా మనం మొదట్లో చెప్పుకున్న మూడు పాయింట్లను చర్చించుకుందాం.

సామ్రాజ్యవాదానికి మనబోటి దేశాలలోని అన్ని వనరులూ, అందరు ప్రజలూ అక్కరలేదు. ఇక్కడి వ్యాపారస్తులూ పెట్టుబడిదారులూ వ్యవసాయదారులే సామ్రాజ్యవాదం అవసరాలకు తగినట్టు వారి వారి వ్యవహారాలను రూపొందించుకోవాలి. అంటే స్వంత సాంకేతిక పరిజ్ఞానం, స్వావలంబన అంటూ అతిశయాలకు పోకూడదు. ఇక్కడి ప్రభుత్వాలూ అందుకు అనుగుణంగా నడుచుకుంటూ దిగుమతులకూ ఎగుమతులకూ విదేశీ 'సహాయ సహకారాలకూ' అడ్డం రాకుండా ఉండాలి. ఉపనిర్మాణ (infrastructural) అవసరాలను సమకూర్చాలి. అయితే, జనాభాలో 10 లేక 15 శాతం మంది సామ్రాజ్యవాదం ఉత్పత్తిచేసే సరుకులనూ సాంకేతిక ప్రక్రియలనూ కొనుక్కోవడానికీ వినియోగించుకోవడానికీ అవసరమయిన స్తోమతనూ సామాజిక సంస్కృతినీ కలిగి ఉండాలి. ఆ 10 లేక 15 శాతం వినా మిగిలిన జనం అలజడులు చేయకుండా, 'శాంతి భద్రతలకు' విఘాతం కలిగించకుండా బ్రతకాలి. పట్టణ ప్రాంత పెట్టుబడిదారులూ వర్తకులూ పెద్ద ఉద్యోగస్తులూ గ్రామీణ ప్రాంత భూస్వాములు మాత్రమే ఈ 10 లేక 15 శాతం జనాభాలోకి వస్తారు.

సామ్రాజ్యవాదానికి అవసరమయిన ఈ భూమికను తయారుచేస్తూ, అదే సమయంలో దేశంలోని పెట్టుబడిదార్లకు, వ్యాపారస్తులకు, భూస్వాములకు అవసరమైన వాటిని కూడా ప్రభుత్వం సమకూరుస్తుంది. వీటిని సమకూర్చడం

కేవలం సామ్రాజ్యవాదం అవసరాలను సాధించడానికే అనే తప్పుడు అవగాహన విస్తృతంగా వుంది కాబట్టి, అది భారత రాజ్యం విడిగా కూడా కాంక్షించే విషయమేనని నొక్కి చెప్పాలి. భారత ప్రభుత్వం కేవలం సామ్రాజ్యవాదం ఏజెంటు మట్టుకే కాదు, సకల దోపిడీ వర్గాల అవసరాలను సమన్వయపరచి సమకూర్చే ఏజెంటు. ఈ సమన్వయంలో వైరుధ్యాలు తలెత్తవని కాదు. తలెత్తుతుంటాయి. కాని అవి అప్పుడప్పుడు తీవ్ర సంక్షోభాలకు దారితీసినా ఎవరికీ 'ప్రాణాంతకం' మాత్రం కావు.

మన రాష్ట్రానికి వచ్చేటప్పటికి ఈ స్థానిక దోపిడీ వర్గాల గురించి చర్చించ డానికి గ్రామీణ భూస్వామ్యవర్గంతో మొదలుపెట్టి దాని పట్టణ ప్రాంత వ్యాప్తినీ పురోభివృద్ధినీ చర్చించడం సబబుగా ఉంటుందని పైన చెప్పుకున్నాం. ఈ వర్గం పురోభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలానే చేశాయి. భూసంస్కరణలను వమ్ము చేసి వాళ్ళ ఆస్తులను ఏ రకంగా కాపాడిందీ వివరించనక్కరలేదు. ఆ పైన ప్రపంచ బ్యాంకు దగ్గర అప్పుచేసి 1400 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మొదటి 6 ప్రణాళికల కాలంలో తుంగభద్ర, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్, వంశధార, సోమశిల, శ్రీశైలం, పోలవరం ప్రాజెక్టులు కట్టారు (కడుతూ ఉన్నారు అంటే ఇంకా సబబుగా వుంటుందేమో – వీటిలో మొదటి రెండు తప్ప తక్కినవేవీ పూర్తయినట్టు లేదు). నీళ్ళుంటాయో లేవో తెలియని తెలుగుగంగ కాలవను ఇప్పుడు తవ్వుతున్నారు. బావులకూ ఇళ్ళకూ రైస్ మిల్లులకూ సినిమా టాకీసులకూ కరెంటు పెట్టుకోవడానికి రాష్ట్రాన్ని దాదాపు నూటికి నూరుశాతం విద్యుదీకరించారు. 1983 నాటికి 4 లక్షల వ్యవసాయ బావులకు కరెంటు పంప్ సెట్లు వచ్చాయి. (మరొక 2.5 లక్షల బావులకు డిజిల్ పంప్ సెట్లు పెట్టారు). సేద్యపు నీరు లభించే భూభాగం 64 లక్షల ఎకరాల నుండి 112 లక్షల ఎకరాలకు పెరిగింది (అయినప్పటికీ నదీజలాలలో సగభాగం వృధా అవుతున్నాయనీ, 35 శాతం వ్యవసాయ భూభాగానికి మట్టుకే నీరు లభిస్తోందని చూశాం).

సేద్యపు నీటి సౌకర్యం పెరగడం వల్ల కేవలం భూస్వాములే లాభపడలేదు, మామూలు రైతులూ ప్రయోజనం పొందారు. అయితే సేద్యపు నీటితోనూ దానిని ప్రాతిపదికగా చేసుకున్న ప్రగతి పంథాతోనూ వచ్చిన రకరకాల (ద్రవ్య, వాణిజ్య,

నైసర్గిక) సంక్షోభానికి తట్టుకొని నిలదొక్కుకుని ఆస్తులు బాగా పెంచుకున్నది భూస్వామ్యవర్గం మట్టుకే. మామూలు రైతాంగం కొంత ప్రయోజనం పొంది, మరిన్ని ఆశలు పెంచుకొని, ఆ పైన సంక్షోభానికి తట్టుకోలేక నానా ఇబ్బందులకూ గురవుతున్నది. ఈ మధ్య కొన్ని చోట్ల ఆత్మహత్యలు సహితం చేసుకుంటున్నారు.

సేద్యపు నీటినేకాక ద్రవ్య సదుపాయం కూడా ప్రభుత్వం స్తోమత గల వ్యవసాయదారులకు పెద్దఎత్తున అందజేస్తోంది. వ్యవసాయ సహకార బ్యాంకుల పేరుతో, ప్రధానంగా రిజర్వ్ బ్యాంక్ పెట్టుబడితో పనిచేసే రుణ సంస్థలను చాలా కాలం క్రితమే ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో ఇవ్వాళ 8000కు పైగా సహకార బ్యాంకులున్నాయి. అవి సాలీనా 500 కోట్ల రూపాయల అప్పులు ఇస్తున్నాయి. ఇవికాక, బ్యాంకుల జాతీయకరణ తరువాత పెద్ద వాణిజ్య బ్యాంకుల గ్రామీణ బ్రాంచీలు, వ్యవసాయ అభివృద్ధి శాఖలు, భూమి తనఖా బ్యాంకులు (ఇప్పుడు వీటి స్వభావం మార్చకుండా పేరు మార్చి భూమి అభివృద్ధి బ్యాంకులంటున్నారు), మూడు నాలుగు జిల్లాలకు ఒక గ్రామీణ బ్యాంకు (సరస్వతి, శ్రీవిశాఖ, కాకతీయ, నాగార్జున, చైతన్య, రాయలసీమ మొదలైన పేర్లతో) ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం కొన్ని వేల కోట్ల రూపాయలను వ్యవసాయ దారులకు ఈ ద్రవ్య సంస్థల నుండి అప్పులుగా ఇస్తున్నారు. అయితే 1987-88లో కేవలం స్వల్పకాల రుణాలే 1136 కోట్ల రూపాయలు ఇచ్చారు. ఈ అప్పులలో అధికభాగం సక్రమంగానూ అక్రమంగానూ భూస్వామ్య వర్గాల చేతిలోకి పోవడమే కాక, ఈ అప్పుల కోసం జరిగే పైరవీలు, సిఫారస్‌లు, సహకార బ్యాంకులమీద పెత్తనమూ భూస్వామ్య వర్గాల చేతిమీదుగానే జరుగుతాయి. గ్రామ పెద్దలుగా తమకు సాంప్రదాయకంగా ఉండే స్థానాన్నీ, గ్రామీణ సమాజ నిర్మాణంలో కుల వ్యవస్థకు ఉండే పాత్రనూ వినియోగించుకొని వీళ్ళు ఈ పెత్తనం చలాయిస్తున్నారు. సామాన్య రైతాంగాన్ని అందుకోసం తమ వెంట సమీకరించుకొంటున్నారు. ఈ పెత్తనం వీళ్ళకు ఎంత లాభదాయకంగా ఉందంటే ఆదర్శవంతమయిన ఆర్థిక సంబంధాలకు నిదర్శనంగా భావించే సహకార సంఘాల ఎన్నికలు కుల విద్వేషాలకూ హింసాకాండకూ ఆలవాలమయ్యాయి. వంగవీటి మోహనరంగారావు[14] హత్య కారణంగా రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర సంక్షోభానికి దారితీసిన పరిస్థితులకు

నాంది పలికిన సంఘటనగా పేర్కొనే దేవినేని మురళి[15] హత్య రెండేళ్ళ క్రితం నిర్వహించిన సహకార సంఘాల ఎన్నికలప్పుడు జరిగిందని గుర్తుంచుకోవాలి.

ఇదంతా 1950లలోనే ప్రారంభం అయింది. 1967 తరువాత ఈ మార్పులకు కొనసాగింపుగా 'హరిత విప్లవం' మొదలయింది. 1966-67 సంవత్సరాలలో దేశాన్ని కుదిపేసిన కరువుకు సమాధానంగా ఆహార ఉత్పత్తిని సత్వరం పెంచేందుకు ఈ విప్లవాత్మక కార్యక్రమాన్ని చేపట్టినట్టు ప్రభుత్వం చెప్పుకుంటుంది. ఆ తొందరను ఆసరా చేసుకొని ప్రపంచ బ్యాంకు తన ఆదేశాలను (ప్రపంచ పెట్టుబడి అవసరాలకు అనుకూలమయిన పంథాను) భారత ప్రభుత్వం మీద రుద్దిందని పరిశీలకులు విమర్శిస్తారు. ఈ రెండూ వాస్తవాలే కానీ 1950ల నుండి భారత ప్రభుత్వం అనుసరిస్తూవున్న గ్రామీణ విధానానికి హరిత విప్లవం కొనసాగింపు అన్న వాస్తవాన్ని కూడా గుర్తించాలి. భారత ప్రభుత్వం కేవలం అంతర్జాతీయ పెట్టుబడికి మాత్రమే ఏజెంటనే పాక్షికమైన అవగాహన వివిధ రూపాలలో ప్రచారంలో ఉండడం వల్ల అది గ్రామీణ ధనికవర్గాల అవసరాలను కేవలం కాకతాళీయంగా కాక ఒక పద్ధతి ప్రకారం సాధిస్తోందన్న వాస్తవం మరుగునపడుతోంది.

అయితే ఈ మార్పు కూడా వనరుల రీత్యా, ఉపనిర్మాణం రీత్యా అనుకూలంగా ఉన్న ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయింది. సామ్రాజ్యవాద పెట్టుబడి ఆసక్తి తీసుకున్న మేరకు మాత్రమే జరిగింది. మన రాష్ట్రంలో వరి, జొన్న ప్రధానమయిన పంటలు. 275 లక్షల ఎకరాల సేద్యపు భూమిలో 91 లక్షల ఎకరాలలో వరి, 53 లక్షల ఎకరాలలో జొన్నపంట వేస్తున్నారు. జొన్నలు ఎక్కువగా పండించేది రాయలసీమ, తెలంగాణ వంటి వెనుకబడ్డ ప్రాంతాలలో. అందులోనూ ఎక్కువగా పేద రైతులు పండిస్తారు. అయితే 'హరిత విప్లవం' ఫలితం ఎక్కువగా కనబడేది వరిపంటలో. వరిపంటలో 70 శాతం అధిక దిగుబడినిచ్చే కొత్త విత్తనాలతో సాగవుతుంటే, జొన్నపంటలో 85 శాతం ఇంకా సంప్రదాయిక పద్ధతిలోనే సాగవుతోంది. పప్పుధాన్యాల సాగు హరిత విప్లవం తరువాత తగ్గు ముఖం పట్టింది. నూనెగింజలకు కూడా కొంత కాలం ఇదే గతి పట్టింది గానీ 1980 తరువాత రాయలసీమ జిల్లాలను విపరీతంగా పీడించిన కరువు కాలంలో

వేరుశెనగ అక్కడి వ్యవసాయదారులకు ప్రధాన ఆధారం కావడంతో మళ్ళీ కొంచెం పెరిగింది. అయితే ఇది సేద్యపు భూభాగంలో పెరుగుదలే గానీ ఉత్పాదకతలో పెరుగుదల కాదు. ఉత్పాదకత విషయంలో పప్పుధాన్యాలు గానీ నూనె గింజలు గానీ సాధించిన అభివృద్ధి స్వల్పం. నీటిపారుదల సౌకర్యంలేని సామాన్య రైతాంగం ఎక్కువగా పండించేది జొన్నలు, పప్పుధాన్యాలు, వేరుశెనగ, నువ్వులు మొదలయిన పంటలు. వీళ్ళకు 'హరిత విప్లవం' ఒరగబెట్టిందేమీ లేదు.

అంతేకాకుండా 'హరిత విప్లవం' ప్రవేశపెట్టిన సేద్యపు పద్ధతులకు అధిక పెట్టుబడి అవసరం. విత్తనాలు, ఎరువులు, మందులు, బావులకు మోటార్లు, డీసెల్ మొదలయినవాటి కోసం వేల రూపాయల డబ్బు ఖర్చుపెట్టుకోవాలి. బావులకు కరెంటు కనెక్షన్ల కోసం ఎలెక్ట్రిసిటీ బోర్డు సిబ్బందికి వేల రూపాయల లంచాలు ఇచ్చుకోవాలి. అస్తవ్యస్తమయిన కరెంటు సరఫరావల్ల మోటార్లు పాడయితే మరమ్మతులకు ఖర్చుపెట్టుకోవాలి. స్తోమత ఉన్న పెద్ద వ్యవసాయదారులు ఈ భారానికి తట్టుకొని అధిక లాభాలు సంపాదించుకొని 'హరిత విప్లవం' ఫలితంగా లక్షాధికారులయ్యారు. అంతేగానీ మొత్తంగా వ్యవసాయ ఉత్పత్తి పుంజుకోలేదు. హరిత విప్లవం పూర్వకాలానికీ తరువాతి కాలానికీ వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల రేటును పోల్చి చూస్తే గణనీయమైన పెరుగుదల లేదని నిపుణులు అంటారు. కానీ కొంతమంది భూస్వాములూ ధనిక రైతులూ మట్టుకు లాభపడిన మాట వాస్తవం. కాని వాళ్ళను అనుకరించి 'ఆధునిక' వ్యవసాయ పద్ధతులను అలవర్చుకున్న మధ్యతరగతి రైతులు మట్టుకు పంట విఫలమైనప్పుడల్లా అప్పుల పాలవుతున్నారు. రెండు మూడు పంటలు వరసగా విఫలం అయితే ఇంక కోలుకో లేని స్థితి ఏర్పడుతోంది. ప్రకాశం, గుంటూరు జిల్లాల పత్తి రైతుల గురించి ఇప్పటికే ప్రస్తావించాం. గత రెండేళ్ళుగా గోదావరి డెల్టాలో వచ్చిన వరదలు మరొక రెండేళ్ళు కూడా వస్తే అక్కడి రైతాంగమూ ఇదే స్థితిని ఎదుర్కొంటారు. ఇతర రాష్ట్రాలలో ఈ సమస్య ఇప్పటికే పెత్తందార్ల నాయకత్వంలో నడిచే 'రైతాంగ ఉద్యమాల'కు దారితీసింది.

శరద్‌జోషి, మహేంద్రసింగ్ తికాయత్‌ల నాయకత్వంలో పుట్టిన ఉద్యమాల లోని 'పాజిటివ్' అంశం ఈ సంక్షోభమే. మన రాష్ట్రంలోనూ అటువంటి ఉద్యమాలు

రాగల పరిస్థితులున్నాయి. సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో భాగంగా ఈ ఉద్యమాలకు ప్రజాతంత్ర విప్లవశక్తులు నాయకత్వం వహించకపోతే ఇతర రాష్ట్రాలలోలాగ ఇక్కడ కూడా అవి హరిత విప్లవంవల్ల లాభపడిన భూస్వామ్య వర్గం చేతిలోకి పోతాయి. ఆ వర్గం గ్రామాలలో పట్టణ నాగరికతపట్ల ఉండే వ్యతిరేకతను ఆసరా చేసుకొని తన పెత్తనాన్ని ఈ ఉద్యమాల ద్వారా మరింత పటిష్టం చేసుకుంటుంది. ఈ మధ్య పుట్టిన కర్షక పరిషత్ మీటింగ్‌లో భూస్వామీ, హోటళ్ళ యజమానీ, కోటీశ్వరుడూ అయిన చంద్రబాబునాయుడు[16] ఇస్తున్న ఉపన్యాసాలు వింటే ఈ విషయం చక్కగా అర్థం అవుతుంది.

అయితే ఈ మార్పులు భారత పాలకవర్గాలు తమ 'అభివృద్ధి' పంథాగా ప్రకటించుకొని చేపట్టిన చర్యల ఫలితంగా వచ్చినవి. మొదట్లో అన్నట్టు ఈ మార్పులను మట్టుకే విశ్లేషిస్తే మనకు విషయం పూర్తిగా అర్థం కాదు. వ్యవసాయ ఆధునీకరణకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో అనుసరించిన ఈ వ్యూహమే కాక వేరే అనేక అప్రకటిత రూపాలలోనూ గ్రామీణ భూస్వామ్యవర్గం గత నలభై ఏళ్ళలో లాభపడింది. వీటిలో ప్రధానంగా చెప్పుకోవలసింది కాంట్రాక్టులు, రాజకీయాలు. వ్యవసాయ అభివృద్ధికి నైసర్గికంగా అనుకూలంగా లేని ప్రాంతాల లోని గ్రామీణ భూస్వామ్య వర్గం కాంట్రాక్టులూ, రాజకీయాలూ, పైరవీలు తదితర రూపాలలో లక్షలు సంపాదించి బలపడింది. వ్యవసాయాధారమైన సంపదకు కృష్ణా గోదావరి డెల్టాలు ఉదాహరణ అయితే ఈ రెండవ మార్గానికి నెల్లూరు జిల్లాను ఉదాహరణగా చెప్పుకోవచ్చును. అయితే రాయలసీమ, తెలంగాణలలోని అన్ని జిల్లాల నుండి కూడా ఈ రకమయిన ఉదాహరణలు దొరుకుతాయి.

ఈ రెండు రకాల 'అభివృద్ధి'కీ సహకార బ్యాంకులు, ఇతర రూపాలలో లభ్యమయ్యే ప్రభుత్వ పెట్టుబడీ, పంచాయతీ స్థాయి నుండి పార్లమెంటు స్థాయి దాకా విస్తరించిన రాజకీయ సంబంధాలూ, ప్రభుత్వం చేపట్టిన ప్రగతి పథకాలూ ఎంతగా ఉపయోగపడ్డాయో భూస్వామ్యవర్గానికి సంప్రదాయకంగా గ్రామాలలో ఉన్న పెత్తనమూ, కులవ్యవస్థ, కుల అభిమానం కూడా అంతగా ఉపయోగపడ్డాయి. ఈ సంప్రదాయక సంబంధాలు భూస్వాముల 'అభివృద్ధి'కి ఒకవైపు ఉపయోగ పడుతూ అదే సమయంలో తాము బలపడుతున్నాయి. బ్యాంకులలో అప్పు

సంపాదించడానికీ, ఎన్నికలలో వోట్లు సంపాదించడానికీ, పరిశ్రమలకు లైసెన్సులూ రుణాలూ సంపాదించడానికీ, కాంట్రాక్టులు దొడ్డిదారిన సంపాదించడానికీ, సకల రాజకీయ ఆర్థిక వ్యవహారాలకూ కులం ఒక బలమయిన సాధనంగా ఉపయోగ పడుతూ ఆ క్రమంలో తాను మరింత బలపడుతూ వుంది. (అయితే వెనుకబడ్డ కులాలవాళ్ళు ఉద్యోగాల కోసమో సీట్ల కోసమో తమ కులాన్ని వాడుకుంటే మట్టుకు ఈ కాంట్రాక్టర్ల బిడ్డలంతా రోడ్లోకి వచ్చి 'ప్రతిభ' నాశనమయి పోతోందనీ, కులతత్వం పెరిగిపోతోందనీ ఊరేగింపులు తీస్తారు).

ఈ విధంగా ప్రకటిత అప్రకటిత 'అభివృద్ధి' ఫలితంగా గ్రామీణ సంపన్న వర్గం సంపాదించుకున్న సంపదలో కొంత భాగం మట్టుకే వ్యవసాయరంగంలో తిరిగి మదుపు పెడుతున్నారు. పోనీ పారిశ్రామిక రంగానికి తరలిస్తున్నారా అంటే అదీ లేదు. వ్యవసాయానికీ పరిశ్రమలకూ అవసరమయిన పెట్టుబడి అంతా భారత ప్రభుత్వమో దేశీయ విదేశీయ గుత్తపెట్టుబడిదారులో సమకూరుస్తున్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకూ, కరెంటు ఉత్పత్తికీ, డీజిల్ సబ్సిడీకీ, గ్రామీణ బ్యాంకుల మూల ధనానికీ, ప్రభుత్వరంగంలో ఉత్పత్తి అయ్యే ఎరువులకూ కావాల్సిన పెట్టుబడి ప్రభుత్వం నుండే వస్తున్నది. ఆ ప్రభుత్వం గ్రామీణ ధనికవర్గంమీద ఆదాయపు పన్ను సహితం విధించదు. మరి తమ సంపదనంతా వాళ్ళు ఏం చేస్తున్నారంటే విలాసవంతమైన జీవన విధానంలోనూ, ఇళ్ళూ ఇళ్ళస్థలాల వంటి స్థిరాస్తుల కొనుగోలులోనూ, సినిమాలూ, సారాయి దుకాణాలూ, హోటళ్ళు తదితర 'తృతీయ'రంగ వ్యవహారాలలోనూ మదుపు పెడుతున్నారు. మన రాష్ట్రంలో ఈనాటికీ పారిశ్రామిక ఉత్పత్తి కంటే వర్తకమూ, హోటళ్ళలో జరిగే వ్యాపారమే ఎక్కువ. (ఉదాహరణకు 1982-83 సం॥లో రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తి 413 కోట్ల రూపాయలు కాగా, వర్తకమూ, హోటళ్ళూ, రెస్టారెంట్లలో జరిగిన వ్యాపారం 470 కోట్ల రూపాయలు).

సంప్రదాయక వర్తక వర్గాలయిన కోమటి, మార్వాడీ, తదితర వైశ్య కులాల కంటే మన రాష్ట్రంలోని పట్టణ ప్రాంత వ్యాపారరంగంలో గ్రామాల నుండి తరలి వచ్చినవారి ప్రాబల్యమే ఎక్కువ అని పైన చెప్పుకున్నాం. వీళ్ళు సంఖ్యలో అధికులేకాక రాజకీయంగా వైశ్యుల కంటే బలవంతులు. గ్రామాలతో వీరికి నేటికీ

ఉన్న సజీవ సంబంధాలు ఈ బలానికి కారణం. వీళ్ళల్లో చాలామందికి గ్రామాలలో భూములున్నాయి. లేనివాళ్ళు కూడ సంప్రదాయక సంబంధాలను – ముఖ్యంగా కులం ప్రాతిపదికమీద ఏర్పడిన సంబంధాలను – కొనసాగిస్తూ తమ రాజకీయ పురోగమనం కోసం వాడుకుంటున్నారు. తమ కులాలకు చెందిన సామాన్య రైతులను తమ రాజకీయ పునాదిగా వాడుకుంటున్నారు. వీళ్ళ నాయకత్వానికి సంప్రదాయకమైన 'లెజిటిమెసీ' వుంది. కాబట్టి రైతులు వీళ్ళను సులభంగా అనుసరిస్తున్నారు. దీనివలన రైతాంగం యొక్క రాజకీయ చైతన్యం బాగా బలహీన పడుతోంది. రాయలసీమ దీనికి చక్కటి ఉదాహరణ. 'పెద్దరెడ్డి' మాటలను బట్టి నడుచు కోవడం రాయలసీమ గ్రామీణ సంస్కృతి. అసలు రెడ్డి అంటేనే గ్రామ ముఖ్యుడు అని అర్థం. అది ఈనాటికీ రాయలసీమలో ఒక స్పష్టమయిన కులం కాదు. ఈ పెద్దరెడ్లు పోను పోను కాంట్రాక్టర్లయి, గనుల యజమానులయి, సినిమా థియేటర్ల ఓనర్లయి, కోటీశ్వరులయ్యారు. బోర్ పంపులు వేసుకునీ, బావులకు కరెంటు పెట్టుకునీ వరి సాగు నుండి పళ్ళతోటల పెంపకం దాకా అన్నిరకాల వ్యవసాయమూ చేస్తున్నారు. ఆ పైన రాజకీయ నాయకులూ అయ్యారు. వీళ్ళే కాంగ్రెస్ నాయకులూ, వీళ్ళే తెలుగుదేశం నాయకులూ, వీళ్ళే శ్రీబాగ్ ఒప్పందాన్ని[17] గురించీ, కృష్ణానది మిగులు జలాల గురించీ గణాంకాలు వల్లించే వాళ్లు, వీళ్ళే నాటుబాంబులూ నాటు తుపాకులూ తయారు చేయించి ముఠాలుగా తయారయి హత్యలూ గృహదహనాలూ చేయించేవాళ్ళు, మళ్ళీ వీళ్ళే రాయలసీమను కరువు నుండీ కాటకాల నుండీ విముక్తిచేసే రాయలసీమ విమోచనోద్యమ నాయకులు కూడా. ఈ పాలెగాళ్ళ నాయకత్వం చలామణి కావడానికి రాయల సీమలో తరతరాలుగా ఉన్న సామాజిక సంస్కృతే తప్ప వేరే కారణం లేదు. ఇతర ప్రాంతాలలోనూ – ఇంత స్పష్టంగా కాకున్నా – ఇదే సామాజిక వాస్తవం మనకు కనబడుతుంది.

భారత పాలనా యంత్రాంగం అజెండాలో మొదటి విషయంగా మనం చెప్పుకున్నది – ఆస్తిపరుల సంపదనూ అధిపత్యాన్నీ పెంపొందించడం – మన రాష్ట్రంలో ఈ విధంగా అమలయింది. కాలక్రమంలో ఈ ప్రోగ్రాం సంక్షోభంలోపడి పాలకవర్గాల మధ్య సామరస్యం – అజెండాలోని రెండవ అంశం – బాగా

దెబ్బతినింది. మొదట్లో 'జాతీయ ఆర్థిక విధానం'గానూ, 'జాతీయ అవసరాలు'గానూ భావించినవీ, పాలకవర్గాలలోని అన్ని సెక్షన్ల చేతా ఆమోదింపజేసినవీ కేవలం గుత్తపెట్టుబడికీ, సామ్రాజ్యవాద పెట్టుబడికీ మట్టుకే ఉపయోగపడ్డాయనీ, తక్కిన వారంతా నెహ్రూ చేతా, ఇందిరాగాంధీ చేతా మోసగించబడ్డారనీ ప్రాంతీయ సంపన్నుల వర్గం నుండి ఒక బలమయిన వాదన బయలుదేరింది. 'ఈనాడు' దినపత్రిక సంపాదకీయాలూ, యలమంచిలి శివాజీ[18] వంటి పరిశీలకుల విశ్లేషణలూ తెలుగు వారికి ఈ వాదనను బాగా పరిచితం చేశాయి. ఈ వాదనను జనాకర్షణీయంగా మలచడానికి పట్టణాల పట్ల గ్రామాలలో ఉండే వ్యతిరేకతనూ, విదేశీ సంస్కృతి పట్ల ప్రజా సామాన్యంలో ఉండే వ్యతిరేకతనూ చాలా చాకచక్యంగా వినియోగించుకుంటున్నారు. తెలుగుదేశంపార్టీ రాజకీయాలకు ఒక సిద్ధాంత ముసుగంటూ ఏదయినా ఉంటే అది ఈ వాదనే. ఈ వాదనకు అనుబంధంగానే కేంద్ర – రాష్ట్ర సంబంధాల గురించి, ఫెడరల్ వ్యవస్థ గురించి అలజడీ ఆందోళనా జరుగుతోంది. నిజానికి కాంగ్రెస్ పార్టీ రూపొందించిన ఆర్థిక విధానం సకల పాలక వర్గాల అవసరాలనూ తీర్చేదే అయినప్పటికీ అది పారిశ్రామిక పురోభివృద్ధిని తన వ్యూహానికి పునాదిగా ఎంచుకున్నందువల్ల పైకి చూడడానికి ఈ వాదనలలో కొంత సత్యం ఉందన్న భ్రమ కలగకపోదు.

పరాధీన పెట్టుబడికి ఉండే పరిమితుల కారణంగా మరికొన్ని సమస్యలు వచ్చాయి. ముఖ్యంగా ఈ నలభై ఏళ్ళలో ప్రాంతీయ అసమానతలు బాగా పెరిగాయి. వెనుకబడ్డ ప్రాంతాల సంపన్నవర్గాలు తమ అవసరాలు ఈ వ్యవస్థలో సరిగ్గా తీరడం లేదని భావించడం, వెనుకబాటుతనం కారణంగా అసహనంగా వున్న ప్రజానీకాన్ని సమీకరించి ఉద్యమాలు నడపడం దేశంలో చాలాచోట్లే జరిగింది. (అన్ని 'ప్రాంతీయ' ఉద్యమాల స్వభావమూ ఇదేనని అనడం లేదు. అది సరయిన అవగాహన కాదు.) మన రాష్ట్రంలో 1969లో ప్రారంభమయి మూడేళ్ళపాటు బలమైన ఉద్యమంగా నడిచిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, చాలాకాలంగా అస్తవ్యస్తంగా నడుస్తూన్న రాయలసీమ కరువు సమస్య పరిష్కార ఉద్యమం ఈ కోవకు చెందినవే. ఆర్థిక ప్రగతికి సంబంధించిన అన్ని సూచికలలోనూ తెలంగాణ రాయలసీమ ప్రాంతాలు కోస్తాకంటే బాగా వెనుకబడి వున్నాయి. మనది వ్యవసాయ

ప్రధానమయిన జీవితం కాబట్టి వ్యవసాయ రంగానికి సంబంధించిన ఒక ఉదాహరణ చెప్పుకొంటే సరిపోతుంది. మన రాష్ట్రంలోని మొత్తం సేద్యపు భూమిలో 68.6 శాతం తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో ఉందిగానీ నీటిపారుదల వసతి ఉన్న భూమిలో 43 శాతం మట్టుకే తెలంగాణ రాయలసీమ జిల్లాలలో ఉంది. స్కూళ్ళు, కాలేజీలు, ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పరిశ్రమలు, రోడ్లు, రైలుమార్గాలు, తదితర విషయాలన్నింటిలోనూ ఈ అసమానతే కనిపిస్తుంది. దురదృష్టవశాత్తూ ఈ అసమానత పట్ల పెల్లుబికిన వ్యతిరేకత భూస్వామ్యవర్గాల నాయకత్వంలోకి పోయి ఏమీ సాధించకుండా సమసిపోయింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కనీసం పట్టణప్రాంత విద్యార్థి యువజనులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దానికి ద్రోహంచేసిన చెన్నారెడ్డి[19] వంటి నాయకులను రాజకీయంగా ఎండగట్టారు. రాయలసీమ 'విమోచన' ఉద్యమంలో ఇవి రెండూ ఇప్పటికీ జరగలేదు.

దోపిడీ వర్గాల సామరస్యం ఈ మధ్య తీవ్రమయిన సంక్షోభంలో పడింది. వాళ్ళందరి అవసరాలూ తీర్చడానికని పాలకవర్గాలు 1950లలో తయారు చేసుకున్న ఆర్థిక వ్యూహం ఒకటిన్నర దశాబ్దాలపాటు కొంత ఫలప్రదంగా పనిచేసి ఆ తరువాత ఇబ్బందులలో చిక్కుకుంది. దానిని బయటకు తీయడం కోసం ఇందిరా గాంధీ పడ్డ ప్రయాస ఫలించకపోగా ఆ ఇబ్బందుల ఫలితంగా పుట్టిన అనైక్యత ఆమెను ఒకసారి పదవీభ్రష్టను చేసి చివరికి ఆమె ప్రాణాన్నే తీసింది. వేరే పరిష్కారం దొరకక ఆమె తన చివరి రోజులలో ఆర్థిక రంగాన్ని విదేశీ పెట్టుబడికి అప్పజెప్పడం మొదలుపెట్టింది. ఆమె మరణానంతరం ఆమె కుమారుడు ఆ పరిష్కారాన్నే మరింత పట్టుదలతో కొనసాగిస్తున్నాడు. ఎగుమతి దిగుమతులమీద ఆంక్షలు చాలావరకు సడలించాడు. విదేశీ పెట్టుబడిమీద నియంత్రణను సడలించాడు. గతంలో ప్రభుత్వ రంగానికే పరిమితం చేసిన కీలక పారిశ్రామిక రంగాలలో కూడా ప్రైవేట్ పెట్టుబడికీ విదేశీ పెట్టుబడికీ అవకాశం కల్పిస్తున్నాడు. 'ఆధునీకరణ' పేరిట విదేశీ సాంకేతిక ప్రక్రియలను పెద్దఎత్తున దేశంలోకి దిగుమతిచేసి 'స్వావలంబన' అంటూ ఏదయినా ఎన్నడయినా ఉండివుంటే దానికి గోరీ కడుతున్నాడు. ఈ మార్పులపట్ల దోపిడీ వర్గాలలో ఎవరికీ

అభ్యంతరం లేదు. గుత్తపెట్టుబడిదార్లకూ లేదు, ప్రాంతీయ దోపిడీవర్గాలకూ లేదు. అయితే ఈ మార్పులు తమ సంక్షోభాన్ని పరిష్కరించడానికి సరిపోతాయా లేదా, ఈ మార్పుల ఫలితంగా రూపొందగల ఆర్థిక నిర్మాణం ఎవరి ప్రాబల్యాన్ని ఏ మేరకు పెంచుతుంది అనే సందేహాలూ అనుమానాలూ ఆరాటమూ వాళ్ళను క్షోభపెడు తున్నాయి. ఎవరికి వాళ్లు సంక్షోభాన్ని తమకు అనుకూలంగా మలచుకొని కొత్త నిర్మాణం రూపొందితే అందులో తామే అగ్రభాగాన ఉండాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇది పాలకవర్గాల మధ్య అపూర్వమైన అంతఃకలహాలకు దారితీస్తోంది. ఒకరి అవినీతిని ఒకరు నిస్సిగ్గుగా బయటపెట్టుకుంటున్నారు. ఆధారాలు దొరక్కపోతే అబద్ధాలు ఆడుతున్నారు. డాక్యుమెంట్లమీద దొంగ సంతకాలు పెట్టించి చలామణి చేస్తున్నారు. తిట్టుకుంటున్నారు, దూషించు కుంటున్నారు, కొట్టుకుంటున్నారు, చంపుకొంటున్నారు. రేడియో, దూరదర్శన్, దినపత్రికలు తదితర ప్రసార సాధనాలన్నీ ఇందుకు వినియోగపడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలో వున్న రేడియో, దూరదర్శన్‌లు శ్రోతలకే సిగ్గనిపించేంతటి అబద్ధపు ప్రచారానికి బాకాలయ్యాయి. పత్రికా రంగం కూడా విశ్వసనీయత, విషయ నిబద్ధత మొదలైన ఆదర్శాలను పూర్తిగా పక్కకు పెట్టి ముఠా తగాదాల రంగంలోకి దిగింది. వార్తల పేరుమీద వారి వారి ఇష్టాయిష్టాలు, ఊహలు, భయాందోళనలు, ఆశలు, అన్నిటినీ ప్రచురిస్తున్నారు. ఒకేరోజు పొద్దున్న 'ఈనాడు', 'ఆంధ్రభూమి' పత్రికలు కొని చదివితే రెండు పేపర్లూ ఒకే రాష్ట్రంలో ఒకే రోజున జరిగిన విషయాలను మనకు తెలియజేస్తున్నాయని నమ్మడం కష్టం.

ఈ తగాదాలో కాంగ్రెస్ పార్టీ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోందనీ, తెలుగుదేశం వంటి పార్టీలు ప్రాంతీయ దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయనీ ఒక దురభిప్రాయం ప్రచారంలో వుంది. అది వాస్తవం కాకపోగా దానిని ప్రజలు నమ్మడం ప్రాంతీయ దోపిడీ వర్గాలకే మేలు చేస్తుంది. పెద్ద దోపిడీ వర్గాల కంటే చిన్న దోపిడీ వర్గాలు కొంచెం నయం కాబట్టి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీకి మద్దతునివ్వాలనే తప్పుడు సిద్ధాంతానికి అది దారితీస్తుంది. నిజానికి కాంగ్రెస్ పార్టీ సకల దోపిడీ వర్గాల అవసరాలనూ సమన్వయపరచి సమకూర్చిన పార్టీ. 'కాంగ్రెస్ ఒక్కటే నిజమయిన జాతీయ పార్టీ' అనే స్వాతిశయం వెనకవున్న వాస్తవం ఇది. అయితే కాలక్రమంలో ఆ సమన్వయ

సూత్రం దెబ్బతిని సామరస్యం నశించేసరికి అది కాంగ్రెస్ పార్టీలో 'అసమ్మతి' అనే జాడ్యానికి దారితీసింది. ఇప్పుడది కాంగ్రెస్ పార్టీకి నిజంగానే రాచపుండు అయి కూర్చుంది. అయినప్పటికీ కొత్త సమన్వయ సూత్రాన్ని సామరస్యంగానే సాధించాలని నమ్మేవాళ్ళు పాలక వర్గాలలో ఉన్నారు. వాళ్ళు గుత్త పెట్టుబడిదార్ల లోనూ వున్నారు, భూస్వాములలోనూ ఉన్నారు. వీళ్ళ రాజకీయ వ్యక్తీకరణగానే కాంగ్రెస్ పార్టీ కొనసాగుతోంది. అదే విధంగా సామరస్యాన్ని పక్కకు పెట్టి ఆర్థిక పునర్నిర్మాణాన్ని తమ అవసరాలకు అనుకూలంగా రూపొందించు కోవాలని ఆశించే వాళ్ళూ పెట్టుబడిదార్లలోనూ, ప్రాంతీయ దోపిడీ వర్గాలలోనూ వున్నారు. ఆ దృక్పథం వున్న ప్రాంతీయ దోపిడీవర్గాల వేదికగా తెలుగుదేశం పార్టీ పుట్టింది. ఈ దృక్పథంతో అసంతృప్తి చెందిన వ్యక్తులు తెలుగుదేశం పార్టీ రాజకీయాల నుండి వైదొలగినప్పుడు ఈ వాస్తవం బయటపడుతుంది. నాదెండ్ల భాస్కరరావు[20] ఇందుకు చక్కటి ఉదాహరణ.

తెలుగుదేశం పార్టీ పుట్టింది ఆంధ్రప్రదేశ్‌లోనే కావడంవల్ల పాలకవర్గాల అనైక్యత తన నగ్న స్వరూపాన్ని ఆంధ్రరాష్ట్రంలోనే స్పష్టంగా ప్రదర్శిస్తోంది. ఎన్నికలలో హింసాకాండ, రిగ్గింగ్, హత్యలు, పరస్పర దూషణ గత నాలుగయి దేళ్ళలో అనూహ్యంగా పెరిగిపోయాయి. ఎవరికివారు ఈ కొట్లాటలో ప్రజలను తమ వెంట సమీకరించుకోవడానికి ఎటువంటి నైచ్యానికీ వెనకాడడం లేదు. ఈ ప్రాంతీయ దోపిడీ వర్గాలకు – ఇటు కాంగ్రెస్‌లో ఉన్నవారికైనా, అటు తెలుగుదేశం పార్టీలో ఉన్నవారికైనా – గ్రామాలతోనూ వ్యవసాయ రంగంతోనూ భూమితోనూ సజీవ సంబంధాలున్నాయి. గ్రామీణ జీవితంలో ప్రముఖపాత్ర వహించే కులం జనసమీకరణకు బలమైన సాధనం అయింది. ఈ పెత్తందార్లు తమ తమ కులాలకు చెందిన సామాన్య రైతాంగాన్ని తమ వెంట సమీకరించు కుంటున్నారు. ఇది ముందు నుండి వున్నదే గానీ ఈ సంక్షోభ కాలంలో పూర్తిగా లజ్జ లేకుండా సాగుతోంది. కులం పేరిట జనాన్ని విడదీయడం, కులతత్వాన్ని రెచ్చగొట్టడం, కుల తగాదాలు ప్రేరేపించడం, రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ విషయం అయింది. పోను పోను ఈ పరిస్థితి మరింత క్షీణిస్తుందని ఊహించడానికి సందేహించ వలసిన అవసరం లేదు.

**ప్రజలు**

ఇక అజెండాలోని మూడవ అంశానికి వద్దాం.

'అభివృద్ధి' అనేది దేశ ఆర్థికరంగంలో వ్యవసాయ రంగం ప్రాధాన్యతను తగ్గించి పారిశ్రామిక రంగాన్ని పెంచాలని బూర్జువా అర్థశాస్త్ర సిద్ధాంతాలు చెప్తాయి. ఆ మార్పు అంతర్గతంగా జరగక బయటినుండి దిగుమతి అయితే అది శ్రామిక వర్గం సాంస్కృతిక మానసిక వికాసానికి దోహదం చేయదనీ, పైమెరుగుగానే వుండిపోతుందనీ ఇవాళ విమర్శిస్తున్నాం. అదట్లాగుంచి ఆ మార్పును దిగుమతి చేసుకునే ప్రయత్నం నామమాత్రంగా కూడా సఫలం కాదని మన దేశ చరిత్ర రుజువు చేస్తుంది. సామ్రాజ్యవాదానికి దేశంలోని మొత్తం వనరులూ, అందరు ప్రజలూ అక్కరలేదని చూశాం. బహుళజాతి గుత్తపెట్టుబడిదారులది ప్రపంచవ్యాప్త దృక్పథం. ప్రపంచాన్ని ఒక మొత్తంగా, అందులో పాశ్చాత్య దేశాలను కేంద్రంగా చూస్తూ అవి తమ పెట్టుబడి మదుపునూ, సాంకేతిక ప్రక్రియల ఆవిష్కరణనూ నిర్ణయిస్తాయి. దీనికి ఒక భారతదేశాన్నో, ఇండోనేషియానో ఏ మేరకు పారిశ్రామికీకరించాలో ఆ మేరకే చేస్తాయి. రెండవది, సామ్రాజ్యవాద పరిశ్రమ పెట్టుబడి ప్రధానమయినదే తప్ప శ్రమ ప్రధానమైనది కాదు గనుక, ఆ ఇంత పారిశ్రామిక అభివృద్ధి కూడా ఇక్కడి కూలిజనానికి కొత్త జీవితాన్ని కల్పించజాలదు. మన రాష్ట్రాన్నే ఉదాహరణగా తీసుకుంటే గత రెండు దశాబ్దాల కాలంలో విశాఖపట్నం, హైదరాబాదు తదితర ప్రాంతాలలో కొంత ఆధునిక పరిశ్రమ పెరిగిందని చెప్పాం. అయితే ఈ పరిశ్రమలలో ముఖ్యమయినవి రసాయనిక (chemical), లోహ (metals), యంత్రపరికరాల (machinery and spare parts) పరిశ్రమలు. 1977-78 నాటికి రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ పరిశ్రమల వాటా (వరుసగా) 12.4 శాతం, 4.2 శాతం, 16.3 శాతం కాగా, పారిశ్రామిక కార్మికులలో ఈ పరిశ్రమలలో పనిచేసే వారి వాటా వరుసగా 3.8 శాతం, 1.8 శాతం, 9.6 శాతం. కాబట్టి సామ్రాజ్యవాదం గొడుగు క్రింద జరిగే 'అభివృద్ధి' అసలే స్వల్పం, సంక్షుభితం అనుకుంటే దానివల్ల ప్రజలకు ఒనగూరే జీవనాధారం మరీ స్వల్పం.

దీని ఫలితాన్ని నిరుద్యోగంలో చూడవచ్చును. ఇవ్వాళ రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య 20 లక్షలు దాటిందని అంటూంటారు. అయితే ఇది నిరుద్యోగ సమస్యను

పూర్తిగా కాదు సరికదా సగం కూడా ప్రతిఫలించదు. నిరుద్యోగులుగా లెక్కించబడని వారు చాలామంది సంవత్సరంలో కొద్ది కాలం మాత్రమే పనిచేస్తారు. ఇది ముఖ్యంగా గ్రామీణ పేదలకు వర్తిస్తుంది. మన రాష్ట్రంలో గ్రామీణ జనాభా మొత్తం జనాభాలో 1961 నాటికి 82.6 శాతం వుండింది, 1981 నాటికి 76.7 శాతానికి మట్టుకే తగ్గింది (వ్యవసాయరంగంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి లేకుండా గ్రామీణ జనాభా దాదాపు ఒకే దామాషాలో ఉండిపోవడం అనేది వక్రమయిన 'అభివృద్ధి'కి మరొక నిదర్శనం). 1981 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలోని శ్రామికుల సంఖ్య 2.45 కోట్లు కాగా అందులో వ్యవసాయ కార్మికులు 83 లక్షల మంది (33 శాతం), రైతులు 74 లక్షల మంది (30 శాతం) కాగా ఫ్యాక్టరీ కార్మికులు కేవలం 5.5 లక్షల మంది (2.2 శాతం). వ్యవసాయ కార్మికులందరూ, రైతులలో ఎంతలేదన్నా సగం మంది (ఇద్దరూ కలిపి 1.20 కోట్ల మంది), సంవత్సరానికి సగటున 6 నెలలు పనీ ఆదాయమూ లేకుండా బ్రతుకుతూ ఉంటారు. వీళ్ళకు జీవనం కల్పించి వీళ్ళ శ్రమను సద్వినియోగం చేయనిదే ఈ దేశంలో 'అభివృద్ధి' అనేది సాధ్యం కాదు. ఆ పని చేయకుండా విచ్చలవిడిగా నూతన సాంకేతిక ప్రక్రియలనూ వాడకపు వస్తువులనూ దిగుమతి చేసుకుని ముఖానికి ఆధునికత అనే రంగు పులుముకొని కాలక్షేపం చేస్తున్నాం మనం.

ప్రజలకు జీవనం కల్పించడంలో ఇంత ఘోరంగా విఫలమైన వ్యవస్థ ఇక వాళ్ళను (మొదట్లో చెప్పినట్టు) తుపాకులతోను, రాయితీలతోనే పరిపాలించాలి. రాయితీలు ఎంతవరకు పనిచేస్తాయన్నది రెండు విషయాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రజలకు రాయితీలు ఇవ్వగల స్తోమత వ్యవస్థకు ఏ మాత్రం ఉందనేది ఒక విషయం కాగా ప్రజల చైతన్యం రాయితీలతో సంతృప్తిచెందే స్థాయిని దాటి ఎంత దూరం ఎదిగిందనేది రెండవ విషయం.

భూమి సమస్యను పరిష్కరించకపోయినా, ప్రభుత్వ బంజర్లు ఉన్నంత కాలం బంజర్లలో పేదలకు ఇళ్ళ ప్లాట్లు ఇప్పించగలరు. రాష్ట్రంలో నిరక్షరాస్యత 70 శాతం (స్త్రీలలో 80 శాతం) ఉంటూండగానే చదువుకున్న కొద్దిమంది యువకులు అసంతృప్తికి లోను కాకుండ ఉండేందుకు వసతులు లేని కాలేజీలు

తెరిచి స్కాలర్‌షిప్పులు ఇవ్వగలరు. గిరిజనుల భూమి సమస్యను పరిష్కరించకుండా ఐ.టి.డి.ఏ. ఆధ్వర్యంలో వాళ్ళకు ఆశ్రమ పాఠశాలలు కట్టియ్యగలరు. సన్నకారు చిన్నకారు రైతులకు, కూలివాళ్ళకు ఎడ్లో గేదెలో కొనుక్కోవడానికి అప్పులిచ్చి ఆ పశువు తిండిలేక చచ్చిపోతే అప్పు మాఫ్ చేయగలరు.

అయితే 4 దశాబ్దాల ప్రగతి తరువాత కేవలం 4 శాతం పెరుగుదల రేటును చేరుకొని అక్కడ స్థిరపడిపోయిన ఆర్థిక రంగం ఇవ్వగల రాయితీలు స్వల్పమే. అంతకంటే ముఖ్యంగా, పాలకవర్గాలలో అంతఃకలహమూ అసహనమూ పెరిగేకొద్దీ జాతీయ ఆదాయంలో వచ్చే పెరుగుదల వాళ్ళ పంపకాలకే సరిపోదు కాబట్టి ప్రజలకు ఇవ్వడానికేమీ మిగలదు. తుపాకులుండగా రాయితీలు ఎందుకనే అవగాహనకు పాలకవర్గాలు త్వరలోనే వస్తారు. ఎన్టీఆర్[21]కు ఈ అవగాహన పదవిలోకి వచ్చిన నాటి నుండీ ఉంది.

ఇక చైతన్యం విషయానికొస్తే, ఇంతటి పోరాట సంప్రదాయం ఉన్న ప్రజలు చిన్న చిన్న రాయితీలతో సంతృప్తిచెందేవారు కారు గానీ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల చైతన్యాన్ని నీరుగార్చడంలో పాలక వర్గాలకు చాలా తోడ్పడింది. అధికారంలో ఉన్న పాలకవర్గాల పార్టీలన్నిటికీ ఏదో ఒక 'కమ్యూనిస్టు' పార్టీ మద్దతు ఉంటూనే వస్తోంది. వాళ్ళు ఇచ్చే వాగ్దానాలకూ చిన్న చిన్న రాయితీలకూ వీళ్ళు అభ్యుదయం రంగు పులిమి ప్రజలను మోసం చేయడంలో దోహదపడుతున్నారు. ఈ దుర్మార్గం వల్ల బాగా లాభపడ్డ పాలకవర్గ నాయకురాలు ఇందిరాగాంధీ. ఈనాటికీ మన రాష్ట్రంలో చాలాచోట్ల దళితులు ఒక బావినో, బోర్ పంపునో చూపించి 'ఇందిరమ్మ వేయించింది' అని చెప్పుకుంటారంటే ఆ దౌర్భాగ్యపు పరిస్థితిలో 'కమ్యూనిస్టుల' పాత్ర చాలా వుంది. సి.పి.ఐ.(ఎం.) ఆరేళ్ళుగా ఎన్టీఆర్‌కు సేవచేస్తూనే వున్నా రాష్ట్రంలోని పేద ప్రజానీకంలో తనకే ఉన్న మద్దతు అంతంత మాత్రం కాబట్టి అంతటి ఫలితాన్ని సాధించలేకపోయింది.

ప్రజలలో చైతన్యం పెరిగేకొద్దీ ఎందరు 'కమ్యూనిస్టులు' సహాయం చేసినా ఈ రకమైన బూటకం పనిచేయదు. బలప్రయోగం అవసరం అవుతుంది. ఆ చైతన్యం వ్యవస్థ పునాదులకే ఎదురుతిరిగినా, పాలకుల 'అభివృద్ధి' పంథాకు అడ్డం వచ్చినా లేక పాలకులు తమ అంతర్గత సంక్షోభానికి వెదుక్కొంటున్న

పరిష్కారాలకు తెలిసో తెలియకో అడ్డం వచ్చినా ఆ బలప్రయోగం అత్యంత పాశవికంగా ఉంటుంది.

ఇందులో మొదటి రెండు కారణాలవల్ల తీవ్రమయిన అణచివేతను ఎదుర్కొంటున్నది అడవి ప్రాంతాల జనం, ప్రత్యేకించి గిరిజనులు. గత 150 సంవత్సరాల 'అభివృద్ధి' ఫలితంగా గిరిజనులకు జరిగినంత అన్యాయం వేరే ఎవ్వరికీ జరగలేదు. ఆ వాస్తవాన్ని మన రాష్ట్రంలో స్పష్టంగా చూడవచ్చును. మన రాష్ట్రంలో మొత్తం 150 లక్షల ఎకరాల అడవులు ఉన్నాయని ప్రభుత్వం అంటుంది. ఇది మొత్తం భూభాగంలో 23.6 శాతం. (ప్రభుత్వం 'అడవులు'గా భావించే భూభాగంలో ఒక్కొక్కప్పుడు పొలాలుండవచ్చును, ఊళ్ళుండవచ్చును, ఇళ్ళుండ వచ్చును, బీళ్ళుండవచ్చును. అయినప్పటికీ అడవుల విస్తీర్ణంలో మన రాష్ట్రం దేశంలో సగటు కంటే 20 శాతం ఎక్కువే ఉందనేది వాస్తవం.) ఈ అడవులలో ప్రధానమయినవి గోదావరీలోయ అడవులు, కృష్ణాలోయ అడవులు, తూర్పు కనుమల అడవులు. గోదావరీలోయ అడవులూ తూర్పు కనుమల ఉత్తరభాగపు అడవులూ కలిసిపోయి వున్నాయి. ఇవి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు పశ్చిమ గోదావరులు, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవులలో సవర, జాతాపు, కొండ దొర, బగత, కోందు, కొండరెడ్డి, కోయ, గోండు, నాయకపు, కొలాం, పరధాన్ తదితర తెగలు నివసిస్తున్నాయి. వీళ్ళలో పూర్తిగా పోడు వ్యవసాయానికి పరిమితమయిన కోందుల నుండి ఎంతో కొంత నాగరిక వ్యవసాయంచేసే గోండులు, కోయల దాకా అన్ని రకాలవాళ్ళూ ఉన్నారు. తర్వాత తూర్పు కనుమల మధ్యభాగమయిన నల్లమల అడవులూ కృష్ణానదీలోయ అడవులూ కలిసివున్నాయి. ఇవి మహబూబ్ నగర్, కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో విస్తరించి ఉన్నాయి. చెంచులు ఇక్కడి ముఖ్య తెగ. వీళ్లు బాగా వెనకబడ్డ జనం. ఇప్పటికీ చెంచులలో స్థిర వ్యవసాయం చేసేది బహుకొద్దిమంది. ఇక తూర్పు కనుమల దక్షిణ భాగపు అడవులు నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలలో విస్తరించి ఉన్నాయి. ఎరుకలు, యానాదులు ఇక్కడ కనిపిస్తారు గానీ వీళ్లు ప్రధానంగా అడవి జనం కారు. మైదాన ప్రాంతాలలో చిల్లర వృత్తులూ నేరాలూ చేస్తూ బ్రతుకుతున్నవాళ్ళు.

ఈ తెగలు కాక చెప్పుకోవలసింది లంబాడీలు. ఈ జిల్లా ఆ జిల్లా అనే తేడా లేకుండా వీళ్లు రాష్ట్రమంతటా కనిపిస్తారు. వృత్తులలో వ్యాపారాలలో ఉద్యోగాలలో తక్కిన గిరిజనుల కంటే ఎక్కువ కనిపిస్తారు.

రాష్ట్ర జనాభాలో గిరిజనులు కేవలం 6 శాతమే ఉన్నా, అడవివాసులు కావడంవల్ల అణచివేతకూ నిర్బంధానికీ ఎక్కువగా గురయ్యేది వీళ్ళే. అడవుల సహజ సంపద నాగరికులకూ, వారి 'అభివృద్ధి'కీ చాలా అవసరం. ఆధునిక కాలానికి పూర్వం నుండీ కూడ గిరిజనేతరులు గిరిజనులను అణచివేసి అడవి భూములను ఆక్రమించుకుంటూనే ఉన్నారు. ఆధునిక కాలంలో పారిశ్రామిక తదితర నాగరిక అవసరాల కోసం అడవిలోని కలపనూ ఖనిజాలనూ నాగరికులు కాంక్షించడం మొదలవడంతో అటవీ జనం మీద దాడులు మరింత అయినాయి. అడవులమీద గిరిజనులకు సంప్రదాయకంగా వున్న హక్కులన్నీ ఒక్కొక్కటీ వాళ్ళవి కాకుండా పోయాయి. ప్రభుత్వం అడవులమీద తన గుత్తాధిపత్యాన్ని ప్రకటించు కొని, అడవులను నరికి సేద్యం చేయడాన్ని నిషేధించడమేకాక తరతరాలుగా సేద్యం చేస్తున్న భూములను సహితం అడవులుగా ప్రకటించి గిరిజన గ్రామాలను ఖాళీచేయిస్తోంది. ఖాళీచేయకపోతే ఇళ్లు తగలబెడుతూ వుంది, అరెస్టులు చేస్తోంది, కేసులు పెడుతూ వుంది. మరొకవైపు గిరిజనుల భూములను ఆక్రమించుకున్న గిరిజనేతరుల నుండి  ఆ భూములు తిరిగి స్వంతదారులకు ఇప్పించడానికని చెప్పి రూపొందించిన చట్టాలను అమలు చేయకపోగా, గిరిజనేతరులు పూర్తిగా ఆక్రమించుకున్న ప్రాంతాలలో గిరిజనులెవ్వరూ మిగలలేదన్న నెపంమీద ఆ ప్రాంతాలను 'డీ–నోటిఫై'చేసి షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి తొలగించే యోచన చేస్తోంది. 19వ శతాబ్దం ప్రథమార్థంలో మొదలయి ఒక తలనొప్పిగా పరిణమించిన 'రంప పితూరీల' ఫలితంగా బ్రిటిష్ వాళ్ళు 1917లో గిరిజనులు ఎక్కువగా నివసించే ప్రాంతాలను  ఏజెన్సీ ప్రాంతంగా 'నోటిఫై' (ప్రకటించి) చేసి ఆ ప్రాంతాల పాలనకు ప్రత్యేకమయిన యంత్రాంగాన్ని ప్రతిపాదించారు. ఈనాటికీ గిరిజన పోరాటాలు రాష్ట్రంలో జరుగుతూనేవున్నా తెలుగుదేశం ప్రభుత్వం ఆ కనీస సంస్కరణ మనస్తత్వం కూడా లేకుండా ఆనాటి సంస్కరణలను వెనక్కి తీసుకునే ప్రయత్నం చేస్తోంది.

ఈ నేపథ్యంలో, ఉత్తరాంధ్ర, తెలంగాణ జిల్లాల అడవి ప్రాంతమంతా అల్లకల్లోలమయిందంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. 'నక్సలైట్ల' వల్ల అది అల్లకల్లోలమయిందని ప్రభుత్వం ఆరోపిస్తుందిగానీ విప్లవ కమ్యూనిస్టుల అండ దండలు లేకపోతే గిరిజనులు ఈపాటికి నామరూపాలు లేకుండా పోయేవారు. గత సంవత్సరం దాపురించిన కరువువల్ల ఆదిలాబాద్ మరొక కలహండి అయి ఉండేది. అది జరిగివుంటే దానిని ఎవ్వరూ హింసగా భావించి ఉండరు గానీ దానిని ప్రతిఘటించే రాజకీయం మట్టుకు అందరికీ దుస్సహమైన హింసగానే కనిపిస్తుంది.

ఈ రెండు నాల్కల వైఖరికి అడవి ప్రాంతాలేకాక కరీంనగర్ జిల్లా మైదాన ప్రాంతాలు కూడా ఒక ఉదాహరణే. 1978 దాకా కరీంనగర్ గ్రామాలలో నెలకొని ఉన్న భూస్వామ్య సంబంధాల గురించి వింటే కాశీమజిలీ కథలలాగ వుంటుంది. వెట్టి చాకిరీ, బలవంతపు పంచాయితీలు, 'దండుగలు', వెట్టి సేవలు, స్త్రీలపైన లైంగిక అత్యాచారాలు – అన్నీ ఏ జమానాలోనో పోయాయనుకున్నవి మూడు దశాబ్దాల సంక్షేమ రాజ్యం తరువాత కూడా కరీంనగర్‌లో ఇంకా మిగిలే ఉన్నాయి. 1946–51 కాలంలో వరంగల్, నల్గొండ జిల్లాలలో రైతాంగపోరాటం రాకపోతే అక్కడ కూడా మిగిలే ఉండేవి. ఆ జిల్లాలలో ఈ పోరాటం నిర్వహించిన కర్తవ్యాన్ని కరీంనగర్ జిల్లాలో విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం తలకెత్తుకుంది. రాజ్యాంగానికీ ప్రజాస్వామ్య భావనకూ మానవత్వానికీ వ్యతిరేకమయిన ఈ అత్యాచారాలన్నీ కొనసాగుతుండినా దానిని ఎవ్వరూ 'హింస' అనుకోలేదు. ప్రభుత్వం తన కర్తవ్యంలో విఫలమయినట్లు ఎవరూ అనుకోలేదు. కానీ వీటిని ప్రతిఘటించే ఉద్యమం పుట్టగానే అందులో అందరికీ హింస కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిరిసిల్ల, జగిత్యాల తాలూకాలను 'కల్లోలిత ప్రాంతాలు'గా ప్రకటించకపోతే అది తన కర్తవ్యంలో విఫలమయినట్టు కూడా అందరూ తప్పక అనుకొనేవారు. ఇక అప్పటినుండీ కరీంనగర్ జిల్లా చరిత్ర రాక్షస పురాణంగా మారింది. చిత్రహింసలు, గృహ విధ్వంసం, 'ఎన్‌కౌంటర్' హత్యలు, నిర్బంధితుల 'అదృశ్యం' ఎడతెరిపి లేకుండా జరుగుతూనే వున్నాయి.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే భూస్వామ్య పెత్తనాన్ని ఎదిరించే క్రమంలో విప్లవోద్యమం కరీంనగర్ జిల్లాలో 'అభివృద్ధి'కి గట్టిగానే అడ్డం తగిలింది. 'అభివృద్ధి'

అనేది భూస్వామ్య వ్యతిరేక క్రమం అయితే ఇది జరిగివుండేది కాదు గానీ మన 'అభివృద్ధి' స్వభావమే అంత. 1970లలోనే గోదావరికి పోచంపాడు దగ్గర శ్రీరాంసాగర్ అనే పేరుతో ప్రాజెక్టు కట్టారు. అది ఉండేది నిజామాబాద్ జిల్లాలో నయినా నీళ్ళు ఇచ్చేది కరీంనగర్‌కు. కరీంనగర్‌లో ఒక్క సిరిసిల్లను మినహాయిస్తే మిగిలిన అన్ని తాలూకాలకూ ఆ ప్రాజెక్టు నీళ్ళు వస్తాయి. సిరిసిల్ల మాటకొస్తే ఆ తాలూకాలో ముందు నుండీ కూడా బావుల కింద వ్యవసాయం ఎక్కువ. కరెంటు వచ్చిన తరువాత పంప్ సెట్లతో అది కూడా ఆధునీకరించబడింది. ఈ ఆధునీకరణే కాక, కరీంనగర్ జిల్లాలో బొగ్గు, విద్యుత్తు, సిమెంటు, ఎరువులు, కరెంటు ఉత్పత్తి చేసే పరిశ్రమలున్నాయి. బొగ్గు బావులు నిజాం జమానా నుండి ఉన్నవే అయినా తక్కిన పరిశ్రమలు స్వాతంత్ర్యం తరువాత వచ్చినవి. మొత్తం మీద కరీంనగర్ చాలా అభివృద్ధి సాధించింది. (అయినా గ్రామీణ సమాజంలో భూస్వామ్య పెత్తనం ఎంతగా ఉందో పైన చెప్పాం. అంతేకాక గ్రామీణ పేదరికం చాలా ఎక్కువగా వున్న జిల్లాలలో కరీంనగర్ ఒకటని ప్రభుత్వ గణాంకాలు చెప్తాయి. కరీంనగర్ గ్రామాలలో దరిద్రరేఖకు దిగువన నివసించే జనాభా 78 శాతం అని ప్రభుత్వ లెక్కలు.)

అంతా బాగుంటే కరీంనగర్ భూస్వాములు తమ భూస్వామ్య పెత్తనాన్ని వినియోగించుకొని ఈ 'అభివృద్ధి'వల్ల చాలా ప్రయోజనం పొంది ఉండేవారు. కృష్ణా గుంటూరు జిల్లాల చౌదర్లు, నెల్లూరు జిల్లా రెడ్లలాగ కరీంనగర్ జిల్లా వెలమ దొరలు కూడా రాష్ట్ర రాజకీయార్థిక రంగంలో ప్రముఖ స్థానాన్ని త్వరలోనే సాధించుకొని ఉండేవారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఈ సహజ క్రమానికి అడ్డం వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్న రాక్షస నిర్బంధాన్ని అర్థం చేసుకునేటప్పుడు దీనినొక ముఖ్య విషయంగా పరిగణనలోకి తీసుకోవాలి.

ఈ ఉద్యమాలూ సంఘటిత పోరాటాలూ ఒక ఎత్తయితే జనం ఎక్కడికక్కడ అసంఘటితంగా వ్యక్తీకరిస్తూన్న నిరసన ఒకెత్తు. రాయితీలూ సంస్కరణలూ భ్రమలూ అన్నీ పోగా ప్రజలకు నిరసన ఒక్కటే ఇవాళ మిగిలింది. గ్రామాలలో మంచినీటి సౌకర్యం కోసం, ఇళ్ళస్థలాల కోసం, పోరంబోకు భూముల కోసం, విద్యా వైద్య సౌకర్యాల కోసం, కూలి రేట్ల కోసం, మిగులు భూముల కోసం

ఆందోళన చేస్తున్నారు. చేనేత కార్మికులూ ఇతర చేతివృత్తుల వాళ్ళూ ఏనాటి కానాడు కోల్పోతున్న జీవనాన్ని కాపాడుకోవాలని ఆందోళన చేస్తున్నారు. మాల మాదిగ కులస్తులు అంటరానితనానికీ కులపరమయిన వివక్షకూ వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. గత నాలుగేళ్ళుగా అభివృద్ధి చెందుతున్న దళిత ఉద్యమం ఫలితంగా ఈ చివరి ఆందోళన ఇప్పుడిప్పుడే కొంత సంఘటిత రూపం తీసుకుంటోంది.

ఆర్థిక రంగం పాలక వర్గాల దోపిడీ అవసరాలను దాటి కొంచెం విస్తరిస్తే ఈ ప్రజల ఆకాంక్షలను కొంతవరకు ఇముడ్చుకోవడం అధికార యంత్రాంగానికి సాధ్యం అయ్యేది. అయితే ఆర్థిక రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. పాలక వర్గాల లోని వివిధ సెక్షన్ల అవసరాలు తీర్చడానికే అది సరిపోవడం లేదు. ఇక ప్రజలకు రాయితీలు ఇచ్చే ప్రసక్తి లేదు. అంతేకాక, సంక్షోభం నుండి బయటపడే ప్రయత్నంలో పాలక వర్గాలలోని వివిధ సెక్షన్లు ఎవరికి వారు తమది పైచేయి కావాలని ఆకాంక్షిస్తున్నారు. దాని కోసం ప్రజలమీద అజమాయిషీ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది కూడా ప్రజల మీద హింసాకాండను మరింత పెంచు తోంది. నిజానికి ప్రజల కోర్కెలు తీర్చలేకపోవడం అనే వైఫల్యం కంటే ప్రజల మీద పెత్తనం పెంచుకోవాలన్న ఆరాటమే పెరుగుతూన్న హింసాకాండకు ఎక్కువగా దోహదం చేస్తోందనిపిస్తుంది. ఆ కారణంగా పాలకవర్గాల అంతర్గత సంఘర్షణ ఎక్కడ తీవ్రంగా ఉంటే ప్రజలమీద జరిగే హింసాకాండ కూడా అక్కడే తీవ్రంగా ఉంది. వాళ్ళ కొట్లాటలలో అవసరమయిన జన సమీకరణకు జనం చైతన్యం అడ్డం వస్తోంది. పాలక వర్గాల అంతర్గత సంఘర్షణ, జనం చైతన్యస్థాయి – రెండూ కూడా ఎక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల మీద పాలకవర్గాలు అమలుచేసే హింసాకాండ కూడా అధికంగా వుంది. కాంగ్రెస్ రాజకీయాల ఆధిపత్యాన్ని కూలదోసే లక్ష్యంతో పోరాటం ప్రకటించిన తెలుగుదేశం పార్టీకి ఆరుకోట్ల ఆంధ్రుల ఏకగ్రీవమయిన మద్దతు దొరక్కుండా అడ్డుపడుతూన్న రాజకీయశక్తుల పట్ల – విప్లవ కమ్యూనిస్టులు గానీ, దళిత ఉద్యమకారులు గానీ, ఈ మధ్య వ్యూహం మార్చుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ గానీ, తెలుగుదేశం నాయకులను వ్యక్తిగతంగా అప్రతిష్టపాలుజేసిన పింగళి దశరథరాం[22] వంటి వారుగాని – ఎన్టీఆర్ ప్రదర్శిస్తూన్న ఫాసిస్టు అసహనం ఈ నేపథ్యంలో పుట్టింది.

తెలంగాణ జిల్లాలలో జనం చైతన్యానికి స్ఫూర్తినిచ్చింది రాజకీయ ఉద్యమం కాబట్టి అక్కడ నిర్బంధం పోలీసు యంత్రాంగం ద్వారా అమలవుతోంది. కోస్తా జిల్లాలలో చైతన్యానికి ప్రాతిపదిక సామాజిక పరిణామం కావడంవల్ల పోలీసు యంత్రాంగాన్ని ప్రయోగించడానికి నెపం దొరకక కులపరమయిన దాడులకు పూనుకుంటున్నారు. తెలంగాణ జిల్లాలలో వ్యవసాయ శ్రామిక జనంలో వ్యవసాయ కూలీలకంటే రైతుల సంఖ్య కొద్దిగా ఎక్కువ (రైతులు 52 శాతం, వ్యవసాయ కూలీలు 48 శాతం), రాయలసీమ జిల్లాలలో ఇరువర్గాలూ దాదాపు సమానం కాగా కోస్తా జిల్లాలలో రైతులకంటే వ్యవసాయ కూలీలు చాలా ఎక్కువ (రైతులు 41 శాతం, వ్యవసాయ కూలీలు 59 శాతం). అంతేకాక రైతులు, వ్యవసాయ కూలీలు అనే వర్గ విభజన కోస్తా జిల్లాలలో మరింత స్పష్టంగా ఉంది. మన దేశంలో అవలంబించిన 'అభివృద్ధి' పంథాకు కులం ఒక అవరోధం కాకపోగా ఒక సాధనం అయిన కారణంగా చాలా 'అభివృద్ధి'ని చవిచూసిన కోస్తా జిల్లాలలో కులతత్వమూ ఎక్కువగానే ఉంది. కొంత క్రైస్తవమత ప్రభావంవల్ల, కొంత అక్షరాస్యతవల్ల, మరికొంత చాలా దశాబ్దాలుగా కోస్తా జిల్లాల మీద ప్రభావం వేసిన కమ్యూనిస్టు, నాస్తిక తదితర ఉద్యమాల వల్ల ఆ ప్రాంతంలోని మాల మాదిగ కులస్తులలో చైతన్యమూ ఎక్కువగానే వుంది. అయితే వారిని అణచి వేయడానికి స్థానిక పెత్తందార్లు కూడా కులాన్ని వినియోగించుకుంటున్నారు. తమ కులానికి చెందిన మధ్యతరగతి జనాన్ని కులం పేరుమీద రెచ్చగొట్టి దళితులమీద దాడులు చేయిస్తున్నారు. తరతరాలుగా వస్తూన్న గ్రామీణ సమాజ నిర్మాణం ఇందుకు దోహదపడుతోంది. కారంచేడు నుండి పిప్పరదాకా ఏ దాడిని చూసినా ఈ విషయం అర్థమవుతుంది. రాయలసీమ జిల్లాలలోకెల్లా కొంత 'అభివృద్ధి'ని చవి చూసిన చిత్తూరు జిల్లాలోనూ గత అయిదారేళ్ళుగా ఈ రకమయిన దాడులు జరుగుతున్నాయి. ఇవి భవిష్యత్తులో పెరిగేవే తప్ప తరిగేవి కావని చెప్పడానికి మనం 'ద్రష్టలం' కానక్కరలేదు.

ముగించేటప్పుడు భవిష్యత్తును గురించి ఆశాభావం వ్యక్తం చేయడం సంప్రదాయం. సుదూర భవిష్యత్తు సంగతేమోగానీ సమీప భవిష్యత్తును గురించి ఆశాభావం కంటే ఆందోళన వ్యక్తం చేయడమే నిజాయితీ అనిపించుకుంటుంది.

తమ సంక్షోభానికి పరిష్కారం ఎంత తన్నుకున్నా పాలక వర్గాలకు అంతుపట్టడం లేదు. వెతికి పెట్టవలసిన బాధ్యత మన మీద లేదు. ప్రత్యామ్నాయ వ్యవస్థకు అవసరమయిన ప్రజా ఉద్యమాల నిర్మాణాన్ని కష్టతరం చేస్తున్న ఆటంకాలన్నీ అట్లాగే ఉన్నాయి. వీటిని తొలగించడానికి తీవ్రమయిన ప్రయత్నం చేయకుండా ముందుకు సాగలేము.

1. జమీందారీ, రైతువారీ వ్యవస్థలు : బ్రిటిష్‌వాళ్ళు భారతదేశాన్ని అంచెలంచెలుగా స్వాధీనం చేసుకున్న క్రమంలో రైతుల నుంచి పన్ను వసూళ్ళకు మూడు రకాల వ్యవస్థలపై ఆధార పడ్డారు. 1793లో జమీందారీ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం జమీందారుకి భూమిపై సర్వహక్కులు ఉంటాయి. రైతులందరూ అతని కౌలుదారులుగా ఉండి అతని ద్వారా బ్రిటిష్‌వారికి శిస్తు చెల్లించేవారు. ఆనాటి సాగుభూమిలో 57 శాతం విస్తీర్ణంలో ఇదే పద్ధతి అమల్లో ఉండేది. ముఖ్యంగా బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో.
రైతువారీ లేదా రైత్వారీ వ్యవస్థ దాదాపుగా మొగల్ రెవెన్యూ వ్యవస్థలాగే ఉండేది. దీన్ని 1792లో మద్రాసు ప్రెసిడెన్సీలోనూ, 1817-18లో బొంబాయి ప్రెసిడెన్సీలోనూ ప్రవేశ పెట్టారు. ఈ వ్యవస్థలో రైతుకు తన భూమిపై సర్వహక్కులు ఉండి నేరుగా ప్రభుత్వానికే పన్ను చెల్లించేవాడు. ఈ రకమైన వ్యవస్థ ఆనాటి సాగుభూమిలో 38 శాతం విస్తీర్ణంలో అమలులో ఉండేది.
2. సర్ ఆర్థర్ థామస్ కాటన్ (1803-1899) : బ్రిటిష్ నీటిపారుదల ఇంజనీరు. గోదావరి, కృష్ణా, కావేరి తదితర అనేక నదుల నీటిపారుదల వ్యవస్థలకు రూపకర్త. రాజమండ్రి దగ్గర గోదావరిపై కట్టిన పాత ఆనకట్టకు ఆయన పేరే పెట్టారు.
3. సర్ థామస్ మన్రో (1761-1827) : ఈస్టిండియా కంపెనీ అధికారి. 1820 నుంచి చనిపోయేవరకు మద్రాసు గవర్నర్‌గా పనిచేశారు. రైత్వారీ రెవెన్యూ విధానాన్ని వ్యవస్థీకృతం చేశారు.
4. మొదటి సాలార్‌జంగ్ సర్ మీర్ తురాబ్ అలీ ఖాన్ (1829-1883) : హైదరాబాద్ సంస్థానానికి ప్రధానమంత్రులుగా పనిచేసిన వారిలో ప్రముఖుడు. నిజాం సైనిక శ్రేణుల్లో క్రమశిక్షణను మెరుగుపరచడం, న్యాయస్థానాలను నెలకొల్పడం, నీటిపారుదల వ్యవస్థకు మరమ్మతులు చేయడం, పాఠశాలలను ప్రారంభించడం వంటి సంస్కరణలు ప్రవేశపెట్టారు.
5. సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ (1290-1360) : ఉత్తర భారతాన్ని పాలించిన ఖిల్జీ సుల్తానుల వంశంలో రెండోవాడు. లాహోర్ నుంచి పంజాబ్ వరకు, అలహాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ దిగుబడిని బట్టి రైతుల నుంచి పన్నుల సేకరణ జరిగేలా సంస్కరణలు చేపట్టి దానికి తగినట్టుగా రెవెన్యూ యంత్రాగాన్ని పటిష్టం చేశాడు.

6. సుల్తాన్ ఫిరోజ్‌షా తుగ్లక్ (1309–1388) : మహమ్మద్ బిన్ తుగ్లక్ తర్వాత ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించిన తుగ్లక్ వంశీకుడు. నాలుగు పొడవాటి పంట కాల్వలను తవ్వించి వేలాది ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించాడు. పండిన పంటలో పదోవంతును పన్నుగా వసూలుచేసే పద్ధతిని ప్రవేశపెట్టాడు.
7. మహల్‌వారీ వ్యవస్థ : బ్రిటిష్‌వారు మన దేశంలో ప్రవేశపెట్టిన మూడు రెవెన్యూ వ్యవస్థల్లో ఇది ఒకటి. దీన్ని 1840–50 మధ్య కేవలం ఐదు శాతం సాగుభూమిలో మాత్రమే అమలు పరిచారు. గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని పన్ను విధించడం దీని ముఖ్య లక్షణం. పంజాబ్‌లో, అవధ్, ఆగ్రా సంస్థానాలలో, మరి కొద్దిచోట్ల మాత్రమే ఈ పద్ధతి అమలయింది.
8. డేవిడ్ రికార్డో (1772–1823) : బ్రిటిష్ రాజకీయార్థికవేత్త. పార్లమెంటు సభ్యుడు. 'ద ప్రిన్సిపల్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ & టాక్సేషన్' గ్రంథ రచయిత.
9. జేమ్స్ మిల్ (1773–1836) : స్కాటిష్ చరిత్రకారుడు. ఆర్థికవేత్త. రాజకీయ సిద్ధాంత కర్త. 'హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా' గ్రంథకర్త.
10. రంప పితూరీలు : అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో 1922, 1923 సంవత్సరాలలో గిరిజనులు ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం ప్రాంతంలో జరిపిన తిరుగుబాట్లకు బ్రిటిష్‌వాళ్ళు పెట్టుకున్న పేరు ఇది.
11. మహేంద్ర సింగ్ తికాయత్ (1935–2011). ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతు నాయకుడు, జాట్ కులస్తుడు. భారతీయ కిసాన్ యూనియన్‌కి అధ్యక్షుడిగా పనిచేశారు.
12. శరద్ అనంత్‌రావు జోషి (1935 – ) : మహారాష్ట్రకు చెందిన రైతునాయకుడు. షేట్కారీ సంఘటన్ అనే రైతు సంస్థ వ్యవస్థాపకుడు. రాజ్యసభ ఎంపీగా మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించారు. ప్రపంచ వ్యవసాయ వేదిక సలహా సంఘంలో సభ్యులు.
13. పి.ఎల్. 480 : 1954లో అమెరికా 'వ్యవసాయ వాణిజ్య అభివృద్ధి మరియు సహాయ చట్టం' పేరుతో ఒక చట్టాన్ని తెచ్చింది. దీన్నే పబ్లిక్ లా 480 లేదా పి.ఎల్ 480 అంటారు. ఆహార (గోధుమ) సహాయాన్ని అందజేయడంతోపాటు తద్వారా వచ్చే నిధులను ఆహార అనుబంధ పనులకు సహాయంగా ఇచ్చేవారు. నాగార్జునసాగర్ నిర్మాణానికి కూడా ఇచ్చారు.
14. వంగవీటి మోహనరంగారావు (1947–1988) : విజయవాడకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే. ముఠా కక్షలలో భాగంగా రాజకీయాల్లోకి వచ్చి కాపు నాయకుడిగా ఎదిగి ఎమ్మెల్యే అయ్యారు. తనకు రక్షణ కల్పించమని కోరుతూ నిరాహారదీక్ష చేస్తున్న సమయంలో హత్యచేయబడ్డారు. తదనంతరం జరిగిన అల్లర్లలో వందకోట్లు విలువచేసే ఆస్తులు దగ్ధమవడమే కాక 42 మంది ప్రాణాలు కోల్పోయారు.
15. దేవినేని మురళి : వంగవీటి మోహనరంగా ప్రత్యర్థి వర్గం నాయకుడైన దేవినేని నెహ్రూ సోదరుడు. విజయవాడలోని యునైటెడ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌కు నాయకుడు. 1988

మార్చి 10న హత్యచేయబడ్డారు. నెహ్రూ చాలాకాలం తెలుగుదేశం శాసనసభ్యుడిగా ఉండి ఇప్పుడు వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యేగా ఉన్నారు.

16. నారా చంద్రబాబునాయుడు (1950– ) : ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి. తెలుగుదేశం పార్టీ అధినేత.

17. శ్రీబాగ్ ఒప్పందం : ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమం జరుగుతున్నప్పుడు రాయలసీమ మద్దతును కూడగట్టేందుకు ఆంధ్ర ప్రాంతం నాయకులు వారితో కుదుర్చుకున్న ఒప్పందం. 16.11.1937 నాడు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు (ఆంధ్రపత్రిక, అమృతాంజనం యజమాని) ఇంట్లో (దాని పేరే శ్రీబాగ్) కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం ఆంధ్ర రాష్ట్ర రాజధాని, హైకోర్టు రెండింటిలో ఏదో ఒకటి రాయలసీమలో ఉండాలి. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన పదేళ్ళ తర్వాత నీటి పారుదల వసతుల విషయంలో రాయలసీమకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఒక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని కూడా వారి మధ్య అంగీకారం కుదిరింది. అయితే దీనికి ఎలాంటి చట్టబద్ధతా లేదు.


18. యలమంచిలి శివాజీ : 1972 జై ఆంధ్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొని 1973లో 'మీసా' కింద అరెస్టయి జైలులో ఉన్నారు. రైతాంగం సమస్యలపై విస్తృతంగా రాశారు. మొదట లోక్‌దళ్‌లో, తర్వాత తెలుగుదేశం పార్టీలోను ఉన్నారు. 1988–94 మధ్య రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు.

19. డా. మర్రి చెన్నారెడ్డి (1919–1996) : ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని తెలంగాణ ప్రజా సమితి పార్టీని పూర్తి మెజారిటీతో గెలిపించుకున్నా, ఆ తర్వాత పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి వివాదాస్పదుడయ్యారు. 1978–80 మధ్య, మళ్ళీ 1989–90 మధ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా కూడా ఉన్నారు.

20. నాదెండ్ల భాస్కరరావు (1935) : మొదట్లో కాంగ్రెస్ నాయకుడు. మంత్రిగా కూడా ఉన్నారు. తర్వాత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరయ్యారు. 1984లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు ప్రభుత్వాన్ని కూలదోసి అధికారంలోకి వచ్చి సరిగ్గా నెలరోజులు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు.

21. నందమూరి తారక రామారావు (1923–1996) : సినీనటుడిగా జీవితం ప్రారంభించి 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించడం ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. తెలుగుజాతి ఆత్మగౌరవం నినాదంతో ప్రజల్ని ఆకట్టుకుని 1983 ఎన్నికల్లో ఘనవిజయం సాధించారు. తర్వాత మొత్తం మూడు దఫాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు.

22. పింగళి దశరథరాం (1956–1985) : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య మనవడు. 'ఎన్‌కౌంటర్' పత్రిక ఎడిటర్. అందులో అప్పటి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను తీవ్రంగా విమర్శిస్తూ రాసేవారు. వీటిని అదుపుచేయదానికే ఎన్టీఆర్ ప్రెస్ బిల్లు తేవాలనుకున్నారని, కాని అసెంబ్లీ ఆమోదించకపోవడంతో ఆ ప్రయత్నం ఆగిపోయిందని చెపుతారు. ఆ తర్వాత కొద్ది కాలానికే 21.10.1985 నాడు విజయవాడ వీధుల్లో దశరథరాం హత్యచేయబడ్డారు.




ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 19వ మహాసభలు 1995 జనవరిలో అనంతపురంలో జరిగాయి. అక్కడ సమర్పించిన పత్రాలు 'ప్రోసీడింగ్స్ ఆఫ్ ది నైన్టీన్త్ సెషన్ అనంతపూర్ 1995' పేరుతో ఒక పుస్తకంగా వచ్చాయి. 'ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర' సెషన్‌లో అధ్యక్షోపన్యాసం కోసం బాలగోపాల్ రాసిన వ్యాసం దీనిలోనే అచ్చయింది.

తెలుగుజాతిలో ఆస్తి కోసం, అధికారం కోసం బలవంతుల మధ్య జరిగే ఘర్షణ ప్రధాన రాజకీయ ప్రక్రియ అయింది. మిగిలినవి వెనక్కి పోయాయి. ఆ ఘర్షణ సామాజిక వ్యవస్థ రూపురేఖలలో వచ్చే మార్పులను నిర్ణయిస్తూ ఉంది. మిగిలిన ఆదర్శాలు దానికి లోబడి తమ ఉనికిని వెతుక్కుంటున్నాయి. ధనవంతుల ఆస్తులు పేదలకు పంచడం అనే హామీ పోయి పేదల ఆస్తులే ధనవంతుల ఆకలికి ఆహారమవుతున్నాయి. స్వంత ఆస్తికి ప్రాధాన్యం తగ్గించే దిశగా ఆర్థిక వ్యవస్థను నడపకపోగా రానురాను స్వంత ఆస్తే ఆర్థిక వ్యవస్థకు ప్రాతిపదిక అవుతోంది. కుల వ్యతిరేకత తొలినాటి ప్రకటిత ఆదర్శాలలో ఒకటి. కాని తెలుగువారి రాజకీయ ఆర్థిక పురోగతి కులతత్వాన్ని పాత రూపాలలో కొంత పరిహరించినా కొత్త రూపాలలో చాలా పెంచింది. ఆర్థిక అభివృద్ధి ఎక్కడ ఎక్కువగా జరిగితే కులతత్వం అక్కడే ఎక్కువగా కనిపించే విచిత్ర పరిస్థితి ఏర్పడింది.

# ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర

## 'ఎ.పి. హిస్టరీ కాంగ్రెస్'లో అధ్యక్షోపన్యాసం

**ఆంధ్రప్రదేశ్** హిస్టరీ కాంగ్రెస్ 19వ వార్షిక సమావేశం 'ఆధునిక ఆంధ్ర చరిత్ర' విభాగానికి అధ్యక్షత వహించే అవకాశం నాకు ఇచ్చినందుకు సదస్సు నిర్వాహకులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నేను వృత్తిరీత్యా చరిత్రకారుడిని కాను. ఔత్సాహిక పరిశీలకుడిని మాత్రమే. అయినప్పటికీ నా అభిప్రాయాలకు కొంత విలువ ఉంటుందనే ఆశతో వాటిని ఈ సభ ముందు ఉంచుతున్నాను.

తెలుగు ప్రజలు తమకొక ప్రత్యేకమైన రాష్ట్రం కావాలని ఉద్యమించి, విజయం సాధించి నాలుగు దశాబ్దాలు కావస్తున్నాయి. తెలుగు భాష, సంస్కృతి, తెలుగువాళ్ళు అనే భావన ఎప్పటినుండో వున్నాయి. అయితే ఆధునిక కాలంలో తెలుగుజాతి ఒక ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడంతో తన అస్తిత్వానికి నిర్మాణయుతమైన ప్రాతిపదిక కల్పించుకుంది. ఈ నాలుగు దశాబ్దాలలో తెలుగు ప్రజలు తాము సాధించుకున్న రాష్ట్రంలో ఏ రకమైన సమాజాన్ని నిర్మించుకున్నారు అన్న ప్రశ్న వేసుకొని జవాబు చెప్పుకోవలసిన అవసరం ఉంది.

'తెలుగు ప్రజలు నిర్మించుకున్నారు' అంటే అందరూ కలిసికట్టుగా నిర్మించుకున్నారని కాదు. అందరి అవసరాలూ ఒకటి కాదు. అందరికుండే అవకాశాలూ ఒకటి కాదు. అయితే 'భాషా ప్రయుక్త రాష్ట్రాల' కోసం ఆనాడు నడిచిన ఉద్యమాలలో ప్రత్యేక రాష్ట్రాల సాధనను ఒక స్పష్టమైన లక్ష్యంతో ముడిపెట్టడం జరిగింది. ఆ లక్ష్యం భారతదేశంలో ఒక నూతన సమాజం స్థాపన. తెలుగు, మరాఠీ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న కమ్యూనిస్టులు ఆ నూతన సమాజాన్ని సమసమాజంగా భావించారు. కమ్యూనిస్టేతరులు సాంఘిక న్యాయంతో కూడిన ప్రజాతంత్ర సమాజాన్ని తమ ఆదర్శంగా స్వీకరించారు. దానిని ఏ విధంగా నిర్వచించినా, ఆ నూతన సమాజం నెలకొల్పాలంటే దేశంలోని

---

3-1-1995, అనంతపురం

కోట్లాది ప్రజల పురోభివృద్ధీ, విభిన్న జాతుల సమ అభివృద్ధీ జరగవలసి వుంటుంది. ప్రజలకు తిండి, బట్ట, ఇల్లు, సాగుభూమి లభించడమే కాక, ప్రజలు వైజ్ఞానికంగా, సాంకేతికంగా కూడా పురోభివృద్ధి చెందాలి. దేశంలో పెట్టుబడి వనరుల సమీకరణ జరిగినంత మాత్రాన ఇది జరిగిపోదు. విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక కృషి జరగవలసి వుంటుంది. ఇందుకోసం భాష ప్రాతిపదికన రాష్ట్రాలను పునర్విభజించి దేశంలోని విభిన్న జాతుల ప్రజలకు భారత రాజ్యాంగం పరిధిలో తమను తాము పరిపాలించుకునే అవకాశం కల్పించడం అవసరం అని ఆనాడు వాదించారు.

ఈ వాదన ఆమోదం పొంది ఒక్కొక్క భాష మాట్లాడే ప్రజలు ఒక్కో రాష్ట్రాన్ని సాధించుకున్నారు. మొట్టమొదట సాధించుకున్న వారిలో తెలుగు ప్రజలు ఒకరు. ఈ విధంగా సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రం ఆనాటి ఆదర్శాలకు ఎంత చేరువ అయింది అనేది ఆధునిక చరిత్రకు సంబంధించిన ఒక ముఖ్యమైన ప్రశ్న. దీని వెలుగులోనే మిగిలిన ప్రశ్నలకు అర్థం చేకూరుతుంది. చరిత్ర అధ్యయనం విలువలకు అతీతమయినది కాదు. ఏదో ఒక ప్రామాణికమైన విలువను మన ముందు ఉంచుకున్నప్పుడే చరిత్ర అధ్యయనం అర్థవంతం అవుతుంది. ఆ ప్రమాణం ఎక్కడో బయటినుండి దిగుమతి చేసుకున్నది కాక ఆ చరిత్రలో పుట్టినదై వుండాలి. అప్పుడే దాని వెలుగులో చేపట్టే అధ్యయనం ఫలప్రదం అవుతుంది.

ప్రతీ ఉద్యమం ఏదో ఒక ఉన్నతమైన ఆదర్శాన్ని ముందుకు తీసుకొస్తుంది. ఆ ఉద్యమం విజయవంతమయినంత మాత్రాన ఆ ఆదర్శం అమలయిపోదు. అట్లాగని ఆ ఆదర్శం ఉద్యమానికి నాయకత్వం వహించే వర్గాల ప్రయోజనాలకు ఒక అందమయిన ముసుగు అనుకోవడం కూడా పూర్తిగా సత్యం కాదు.

"సమాజంలో పైకి రాజుకొస్తున్న వర్గాలు తమ ప్రయోజనాలను సమాజం ప్రయోజనాలుగా చూపించి మొత్తం సమాజాన్ని (ముఖ్యంగా తమ కంటే కిందనున్న వర్గాలను) తమ వెంట సమీకరించుకునే ప్రయత్నం చేస్తా"యని మార్క్స్ అంటాడు. గ్రామ్‌సీ వంటి మార్క్సిస్టులు ఈ క్రియకు చారిత్రక పరిణామంలో చాలా ప్రాముఖ్యం ఇచ్చారు. అయితే దీనిని కేవలం ఒక మోసపూరితమైన ఎత్తుగడగా అర్థం చేసుకోకూడదు. అది ఎత్తుగడగానే మొదలయినా దానిని సత్యంగా స్వీకరించి ఆ ఉద్యమంలో భాగమయ్యే కింది వర్గాలు ఆ ఆదర్శం వెలుగులో తమ ఆకాంక్షలను,

ఆచరణను రూపొందించుకోవడం ద్వారా దానికి బలం చేకూరుస్తాయి. ఎత్తుగడగా మొదలయింది ఆ మేరకు సత్యంగా మారగలదు. వేరే ఏమీ కాకున్నా ఆ ఉద్యమం ఫలితంగా సమాజంలో నెలకొనే నూతన వ్యవస్థను మదింపు వేయడానికి ఒక సహజమైన ప్రమాణంగా ఆ ఆదర్శం పనిచేస్తుంది.

అంతేకాక, ప్రత్యేక ప్రయోజనాలను సార్వత్రిక ఆదర్శాల రూపంలో భావించుకోవడం మనుషుల ఆలోచనారీతి. ఒక అన్యాయానికి వ్యతిరేకంగా మొదలయ్యే ఆలోచన కేవలం ఆ అన్యాయం దగ్గర నిలిచిపోదు. సార్వజనీనమయిన 'న్యాయం' గురించి అది యోచిస్తుంది. అందువల్ల కూడా ఒక పాక్షిక ప్రయోజనం కోసం మొదలయిన ఏ ఉద్యమమయినా దానిని మించిన ఆదర్శాలను ఉనికిలోకి తీసుకొస్తుంది. ఇది ఆ ఉద్యమం పరిధిని నిజంగానే కొంత పెంచుతుంది. ఆ ఉద్యమం విజయవంతమయినా ఆ ఆదర్శాన్ని పూర్తిగా సాధించలేదు. అయినా ఒక ఆదర్శంగా అది నిలిచిపోతుంది. సమాజంలో మనుషులు విశ్వసించే విలువలలో అది భాగం అవుతుంది. భావి ఆచరణను ప్రభావితం చేస్తుంది. భావి సామాజిక వ్యవస్థకు ఒక కొలబద్దగా నిలుస్తుంది.

తెలుగుజాతిలోని ఆస్తిపరులు తమ ఆస్తులు పెంచుకొనడానికీ, తామొక ఆధునిక పెట్టుబడిదారీ వర్గంగా పరిణామం చెంది పెద్ద పెట్టుబడిదార్లను సవాలు చేయడానికి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుకున్నారనీ, 'తెలుగుజాతి పురోభివృద్ధి', 'దేశంలో సమసమాజ స్థాపన' మొదలయిన ఆదర్శాలన్నీ సామాన్య ప్రజలను ఆకట్టుకోవడానికి ఆ వర్గాలు ప్రయోగించిన నినాదాలేననీ వ్యాఖ్యానించడం – అందువల్లనే పాక్షిక సత్యం అవుతుంది. తెలుగుజాతికి చెందిన భూస్వాములు, పెట్టుబడిదారులు, ఇతర పెత్తందారీ శక్తులు రాష్ట్రంలోని వనరులను తమ ఆధీనంలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టి తమ అవసరాలు సాధించుకొనడానికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఉపయోగపడిన మాట వాస్తవమే. కానీ ఆధునిక ఆంధ్ర చరిత్ర అక్కడితో అయిపోలేదు. ప్రజారాజ్యం, సమసమాజం, సకల ప్రజల పురోభివృద్ధి మొదలయిన ఆదర్శాలు జన జీవితాన్ని ప్రభావితం చేశాయి. తెలంగాణలో జరిగిన రైతాంగ పోరాటంతో మొదలైన ఈ ఆలోచనలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగమై తెలుగు ప్రజల సంస్కృతిలో భాగమయ్యాయి. సామాజిక వ్యవస్థను బలంగా ప్రభావితం చేయగలిగాయి. దీనిని లెక్కలోకి

తీసుకోకుండా ఈ నాలుగు దశాబ్దాలలో తెలుగుజాతి తన జీవితాన్ని ఏ విధంగా తీర్చిదిద్దుకుంది అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేము.

**సామాజిక పరిశీలన**

ఒక జాతి ఒక చారిత్రక దశలో 'ఏ రకమైన జీవితాన్ని నిర్మించుకుంది' అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలంటే మూడు అంశాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. మొదటిది ఆ జాతి తన భౌతిక అవసరాల ఉత్పత్తి కోసం అభివృద్ధి చేసుకున్న ఉత్పత్తి సామర్థ్యం, వ్యవసాయంలోనూ, పరిశ్రమలోనూ అది ఉపయోగించే ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి క్రియ ఏ విధంగా మారాయి? ఉత్పత్తి నిర్వహించే శ్రామికుల సాంకేతిక సామర్థ్యం ఏ మేరకు, ఏ రూపంలో అభివృద్ధి చెందింది? అనే ప్రశ్నలు ఈ అంశంలో భాగాలవుతాయి.

అయితే మార్క్స్ ఒక సందర్భంలో అన్నట్టు ఉత్పత్తి సాధనాలు వాటంతటఅవి పనిచేయవు. వాటిని పనిలో పెట్టాలి. ఇది ఏ విధంగా జరుగుతుందనేది ఆ ఉత్పత్తి సాధనాల యాజమాన్య సంబంధాలపైన ఆధారపడి ఉంటుంది. ఇంకొక రకంగా చెప్పాలంటే ఉత్పత్తి ప్రక్రియలో మనుషులు కాకతాళీయంగా పాల్గొనరు. ఉత్పత్తి ప్రక్రియ వ్యవస్థితంగా జరుగుతుంది. అది నిర్మాణయుతమైన ప్రక్రియ. ఆ నిర్మాణంలో భాగంగానే మనుషులు ఉత్పత్తి సాధనాలను చేతబూని ఉత్పత్తి చేస్తారు.

ఒక్క ఉత్పత్తి క్రియే కాదు, మొత్తంగా మానవ సామాజిక జీవితం కాకతాళీయంగా కాక నిర్మాణయుతంగా సాగుతుంది. 'సమాజం' అనేది వ్యవస్థితమైన సంబంధాల కలయిక. ఆ వ్యవస్థలో భాగంగానే మనుషుల మధ్య సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. ఆస్తి, రాజ్యం, యాజమాన్యం, కులం, కుటుంబం మొదలైన అనేక సామాజిక వ్యవస్థల కలయిక సమాజం. దీని స్వరూప స్వభావాలలో వచ్చిన మార్పులను అర్థం చేసుకోవడం రెండవ విషయం.

అయితే మనుషులు సామాజిక జీవితంలో కాకతాళీయంగా పాల్గొనరనేది ఎంత నిజమో, అనాలోచితంగా, అనైతికంగా పాల్గొనరనేది కూడ అంతే నిజం. తమ నిత్య జీవిత ఆచరణ గురించి నైతికంగా ఆలోచించకుండా జీవించడం మనుషులకు సాధ్యం కాదు. ఇక్కడ నైతిక ఆలోచన అంటే కేవలం తప్పొప్పుల

వివేచన కాదు. విలువలతో కూడిన ఆలోచనంతా నైతిక ఆలోచనే. తమ చర్యలకు నైతికంగా వెల కట్టకుండా బతకడం మనుషులకు సాధ్యం కాదు. సామాజిక వ్యవస్థతో పాటు మంచిచెడులకు, తప్పొప్పులకు, సత్యాసత్యాలకు ప్రమాణాలు, అర్థాలు నిర్దేశించే నైతిక ప్రపంచం ఒకటి ప్రతీ సమాజంలోనూ వుంటుంది. దాని వెలుగులో తమ జీవితాన్ని, తమ పరిసరాలను మనుషులు అర్థం చేసుకుంటూ సామాజిక జీవితంలోనూ, సామాజిక మార్పులోనూ పాల్గొంటారు. ఈ నైతిక ప్రపంచం ఏ విధంగా పరిణామం చెందినదనేది మూడవ అంశం.

ఒక సమాజంలో ఏ రకమైన జీవితం నెలకొనిందీ అని అర్థం చేసుకోవాలంటే పై మూడు విషయాలనూ అర్థం చేసుకోవలసి వుంటుంది. అంటే ఉత్పత్తికి సంబంధించిన సాంకేతిక సాధనాలను, ప్రజల సాంకేతిక నైపుణ్యాన్ని, సామాజిక ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో వ్యవస్థితమైన నిర్మాణాన్ని, సామాజిక జీవిత విలువలను నిర్దేశించే నైతిక ప్రపంచాన్ని అధ్యయనం చేయవలసి ఉంటుంది. వీటిలో మొదటి దానికి రెండవదానిలోని యాజమాన్య సంబంధాలు అనే ఒక్క అంశాన్ని మాత్రమే చేరిస్తే అవి రెండూ కలిసి సామాజిక జీవితానికి పునాది అవుతాయనీ, పునాది అయిన ఆ ఉత్పత్తి వ్యవస్థను అర్థం చేసుకుంటే మిగిలిన విషయాలు దాని పర్యవసానంగా అర్థమవుతాయని మార్క్సిజం నుండి వచ్చిన ఒక అభిప్రాయం చెలామణిలో వుంది. దీర్ఘకాల చరిత్ర పరిశోధనకు ఇది వర్తిస్తుందేమో కాని (అది కూడా అనుమానమే) నడుస్తున్న చరిత్రను అధ్యయనం చేయడానికి ఇది సరిపోదు.

రాష్ట్ర అవతరణ ఉద్యమం ముందుకి తీసుకొచ్చిన ఆదర్శాల వెలుగులో తెలుగుజాతి వర్తమాన జీవితంలోని పై మూడు అంశాలనూ అధ్యయనం చేసినప్పుడే ఆధునిక ఆంధ్ర చరిత్రకు సంబంధించిన నేపథ్యం అర్థమవుతుంది. ఆ నేపథ్యంలోనే మిగిలిన ప్రశ్నలకు జవాబు దొరుకుతుంది. తెలుగు ప్రజల భౌతిక జీవితం అభివృద్ధి చెందడానికి ఈ నాలుగు దశాబ్దాలలో జరిగిన కృషి ఏమిటి? సాగునీటి వసతి, విద్యుత్తు, రోడ్లు, పరిశ్రమలు, విద్య తదితర రంగాలలో వచ్చిన మార్పులు ఎట్లాంటివి? అవి ఎవరికి ఉపయోగపడ్డాయి? ఏ మేరకు ఉపయోగపడ్డాయి? తెలుగు ప్రజలందరి ఆర్థిక జీవితానికి వుండే సాంకేతిక ప్రమాణాలను – వారి శ్రమశక్తి నిపుణతతో సహా – పెంచే ప్రయత్నమేమైనా జరిగిందా, లేక అవకాశాలు

ఉన్న మేరకే జీవిత ప్రమాణాలు పెరిగాయా? సామాజిక వ్యవస్థలో – ఆస్తి, యాజమాన్యం, రాజ్యాధికారం, కులపెత్తనం, మగపెత్తనం, ప్రాంతీయ అసమానత మొదలైన వాటిల్లో – సమసమాజ దిశగా సాగిన మార్పు ఎంత? అందులో ఎంత భాగం తెలుగుజాతి పేరు మీద అధికారాన్ని చేజిక్కించుకున్న వారి చొరవతో జరిగింది? ఏ మేరకు వారి పరిపాలనకు, పెత్తనానికి వ్యతిరేకంగా జరగవలసి వచ్చింది? ఈ నాలుగు దశాబ్దాలలో నైతిక జీవితంలో ఏ మార్పులు వచ్చాయి? అవి ప్రజాతంత్ర సంస్కృతి దిశగా వచ్చాయా? సమసమాజ స్థాపనకు, ప్రజాతంత్ర జీవితానికి కావలసిన విలువలు పెరిగాయా? పెరిగివుంటే అది తెలుగుజాతి పాలకుల చలవా లేకపోతే వారికి వ్యతిరేకంగా వచ్చిన మలితరం ఉద్యమాల కృషి ఫలితమా?

క్లుప్తంగా జవాబు చెప్పాలంటే ఏ ఆదర్శాల ప్రకటనలో అయితే తెలుగుజాతి తన అస్తిత్వానికి ఆధునిక రూపం ఇచ్చుకుందో ఆ ఆదర్శాలు దాని పర్యవసానంగా అమలులోకి రాలేదు. తెలుగుజాతికి చెందిన ఆస్తిపరులకు, బలవంతులకు అభివృద్ధి చెందే అవకాశం బాగా దొరికింది. ఆ అభివృద్ధి కూడా తొలి రెండు దశాబ్దాల తర్వాత క్రమంగా మరింత హింసాత్మక రూపం తీసుకుంటోంది. సామాజిక, ఆర్థిక వ్యవస్థలో ఆస్తుల ప్రాముఖ్యం పెరిగింది. అభివృద్ధిలో ప్రాంతీయ అసమానత పెరిగింది. సామాజిక రాజకీయ జీవితంలో కులం ప్రాముఖ్యం పెరిగింది. స్త్రీల స్వేచ్ఛ కొంత పెరిగినా వారిపై హింస కూడా చాలా పెరిగింది.

అయితే తొలినాటి ఆదర్శాలు రాజకీయ విలువలుగా సామాజిక చైతన్యంలో కొనసాగి తరువాత కాలంలో ఆంధ్ర రాష్ట్ర పాలకులకూ, తెలుగుజాతి పెత్తందార్లకూ వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాలను ప్రభావితం చేశాయి. గ్రామీణ పేదల తరఫున నక్సలైటు ఉద్యమం, వెనుకబడిన ప్రాంతాల తరఫున ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, అణగారిన కులాల తరఫున దళిత ఉద్యమం తొలినాటి ఆదర్శాలకు వారసులుగా ముందుకొచ్చి ఆంధ్ర రాష్ట్ర పాలకులకూ, తెలుగుజాతి పెత్తందార్లకూ వ్యతిరేకంగా ప్రజాతంత్ర వ్యవస్థ దిశగా తెలుగు సమాజాన్ని ముందుకు తీసుకుపోయాయి. పాలకులు మాత్రం ప్రజాతంత్ర ఆదర్శాలు మొత్తం కోల్పోయి అణచివేత వ్యవస్థను పెంచారు. సమాజంలో వికృత సంస్కృతి పెరిగి జాతి నైతిక జీవితం దిగజారింది.

అలాగని ఆధునిక ఆంధ్ర చరిత్రలో ఆర్థిక అభివృద్ధి అసలే జరగలేదని అనలేం. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో దేశంలోని యితర రాష్ట్రాలతో పోలిస్తే సగటు రాశిలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధించింది. దీనిని ఒక అర్థంలో తెలుగుజాతి ప్రగతిగా చెప్పుకున్నా, నిజానికి ఈ ఆర్థిక ప్రగతి పెట్టుబడిదారీ నమూనాలో జరగడం వల్ల దీనికి వికృత లక్షణాలు అనేకం వున్నాయి. పెట్టుబడిదారీ నమూనాలో జరిగే అభివృద్ధి ఎప్పుడూ బలవంతులకు మరింత బలపడడానికి ఎక్కువ అవకాశం కల్పిస్తుంది. బలహీనులకు బలహీనమైన అవకాశాలు యిస్తుంది. చాలామందికి అసలు అవకాశమే కల్పించదు. పెట్టుబడి లాభాలను వెతుక్కుంటూ పోతుంది తప్ప అభివృద్ధి దాని గమ్యం కాదు. అభివృద్ధి లాభాల వేటకు బై–ప్రోడక్ట్ మాత్రమే. ఇది పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనాకు ఉండే సాధారణ లక్షణం కాగా, భారతదేశం వంటి మూడవ ప్రపంచ దేశాలలో ఈ వికృత పోకడలు మరింత ఎక్కువగా కనిపిస్తాయి. అందువల్ల తెలుగుజాతి పేరిట ఆంధ్రప్రదేశ్ ఏర్పడి తెలుగువాళ్ళ భవితవ్యాన్ని భారత రాజ్యాంగ వ్యవస్థ పరిధిలో తెలుగువాళ్లే నిర్ణయించుకునే అవకాశం వచ్చినాక జరిగిన ఆర్థిక అభివృద్ధి ఈ జాతిలో ప్రాంతీయ అసమానతలను పెంచి రాష్ట్ర అవతరణ జరిగిన పదమూడు సంవత్సరాలకు తెలంగాణలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దారితీసింది. ఆ తరువాత విభిన్న ప్రాంతాల మధ్య మార్కెట్ సంబంధాలు బాగా పెరగడం వల్ల ప్రాంతీయ వేర్పాటు భావం తగ్గినా, అభివృద్ధికి చోదకశక్తి అయిన పెట్టుబడి అసలే ప్రవేశించని, లేక అతి తక్కువగా ప్రవేశించిన గ్రామాలు, తాలూకాలు చాలానే ఉండిపోయాయి. తెలుగుజాతి ప్రగతి తన జాతిలో పెద్ద భాగాన్ని విడిచిపెట్టి ముందుకు సాగింది. నక్సలైటు ఉద్యమం, ఆ ప్రజలు కూడా తెలుగు జాతిలో భాగమేనని జ్ఞాపకం చేసిన తరువాత వారినందరినీ జాతి జీవన స్రవంతిలో కలవమని పాలకులు పిలుపులిస్తున్నారు గాని వాళ్ళని అసలు బయటకు నెట్టింది ఆ స్రవంతే.

ఎగుడుదిగుళ్ళుగా సాగే ఈ ఆర్థిక అభివృద్ధి ఫలితంగా ప్రాజెక్టుల కోసం, పరిశ్రమల కోసం విభిన్న ప్రాంతాలలో ఉద్యమాలు, ఆందోళనలు సాగడం సహజం. ఇచ్చిన వాళ్ళకే యింకా యిచ్చే అభివృద్ధి నమూనా పట్ల నిరసన రకరకాల

రూపాలలో వ్యక్తమవుతుంది. ఈ రోజు దేశవ్యాప్తంగా అమలులోకి వస్తున్న ఆర్థిక సంస్కరణలు ఈ వికృత అభివృద్ధిని మరింత పెంచబోతాయి. అభివృద్ధి అనేది తొలినాడు సమసమాజంతో ముడిపడి వున్న ఆదర్శం. కాని అభివృద్ధికి ఎంచుకున్న మార్గం మాత్రం దేశ ఆర్థిక వ్యవస్థలాగే తెలుగుజాతి ఆర్థిక వ్యవస్థను కూడా ఆ ఆదర్శం నుండి చాలా దూరం తీసుకుపోయింది.

సామాజిక వ్యవస్థ మాటకొస్తే ఇక్కడ కూడా తొలినాటి ఉద్యమాల ప్రకటిత ఆకాంక్షలకు, సాధించిన ఫలితాలకు మధ్య చాలా వ్యత్యాసం వుంది. తొలినాటి తెలుగు జాతీయత హేతువాద, కులవ్యతిరేక, సామ్యవాద ఆదర్శాలతో కలిసి ఉండింది. కాని ఈ నాలుగు దశాబ్దాల ప్రగతి ఆ ఆదర్శాలకు తెలుగువారి సామాజిక జీవిత నిర్మాణంలో స్థానం లేకుండా చేసింది. ఇప్పుడు అవి మళ్ళీ నూతన ఉద్యమాల రూపంలో ముందుకు రావలసి వచ్చింది. నూతన ఆకాంక్షలతో తిరిగి వూపిరి పోసుకోవలసి వచ్చిందని అంటే ఇంకా సబబుగా వుంటుంది. ఎందుకంటే ఆదర్శాలుగా అవి ఎప్పుడూ చచ్చిపోలేదు.

తెలుగుజాతిలో ఆస్తి కోసం, అధికారం కోసం బలవంతుల మధ్య జరిగే ఘర్షణ ప్రధాన రాజకీయ ప్రక్రియ అయింది. మిగిలినవి వెనక్కి పోయాయి. ఆ ఘర్షణ సామాజిక వ్యవస్థ రూపురేఖలలో వచ్చే మార్పులను నిర్ణయిస్తూ ఉంది. మిగిలిన ఆదర్శాలు దానికి లోబడి తమ ఉనికిని వెతుక్కుంటున్నాయి. ధనవంతుల ఆస్తులు పేదలకు పంచడం అనే హామీ పోయి పేదల ఆస్తులే ధనవంతుల ఆకలికి ఆహారమవుతున్నాయి. స్వంత ఆస్తికి ప్రాధాన్యం తగ్గించే దిశగా ఆర్థిక వ్యవస్థను నడపకపోగా రానురాను స్వంత ఆస్తే ఆర్థిక వ్యవస్థకు ప్రాతిపదిక అవుతోంది. కుల వ్యతిరేకత తొలినాటి ప్రకటిత ఆదర్శాలలో ఒకటి. కాని తెలుగువారి రాజకీయ ఆర్థిక పురోగతి కులతత్వాన్ని పాత రూపాలలో కొంత పరిహరించినా కొత్త రూపాలలో చాలా పెంచింది. ఆర్థిక అభివృద్ధి ఎక్కడ ఎక్కువగా జరిగితే కులతత్వం అక్కడే ఎక్కువగా కనిపించే విచిత్ర పరిస్థితి ఏర్పడింది. ఆస్తికోసం, అధికారం కోసం జరిగే ఘర్షణల్లో కులం ఒక సాధనం కావడం ఈ స్థితికి దారి తీసింది. కులం పెరగడమే కాక ఈ క్రమంలోనే అన్ని ప్రజాతంత్ర సంస్థలు, ప్రజాతంత్ర సంస్కృతి ధ్వంసమయ్యాయి. రాజకీయాలలో ప్రజాతంత్ర విలువల విధ్వంసానికి ఎన్నికలలో జరిగే హింస ఒక నిదర్శనం. మద్యపానాన్ని ప్రభుత్వాలు తమ ఆదాయం

కోసం పనిగట్టుకుని పెంచి చివరికి మద్య వ్యతిరేక ఉద్యమం పెద్దఎత్తున పెల్లుబికగా మద్య వ్యాపారాన్ని మొత్తంగా నిషేధించవలసి వచ్చింది. తెలుగు వారందరి పేరు మీద సాగిన అభివృద్ధి, ప్రజాస్వామ్యం కొద్దిమంది అభివృద్ధికి, వారి అంతర్గత ఘర్షణలకు వేదికగా మారడంతో పీడిత ప్రజలపై హింస, అణచివేత పెరిగాయి.

తెలుగువారి నైతిక జీవితంలో కూడా యిదే రకమైన మార్పు కనిపిస్తుంది. నైతిక జీవితమంటే జీవిత విలువల గురించి సమాజం చేసే ఆలోచన. ఈ ఆలోచన అన్ని వర్గాలలో ఒకే రకంగా వుండదు. కాని సమాజంలో ప్రబలంగా ఉండి, అన్ని వర్గాల నైతిక జీవితాన్ని, అందరి నడవడికను ప్రభావితం చేసే సామాన్య సంస్కృతి ఒకటి ఉంటుంది. ఇది సమాజంలో మనుషుల నిత్య జీవిత ప్రవర్తనను శాసిస్తుంది. ఈ నైతిక ప్రపంచం పతనం సామాజిక ఆర్థిక అసమానతలకంటే నష్టకరమైనది. ఎందుకంటే ఇది భవిష్యత్ సామాజిక ఆచరణకు ప్రతిబంధక మవుతుంది. మనిషికి సాధ్యమయ్యే ఉన్నత ప్రవర్తనను తొక్కిపెట్టి నీచమైన ప్రవర్తనను ప్రోత్సహించే హీన సంస్కృతి ఈ రోజు తెలుగుజాతి నైతిక జీవితాన్ని శాసిస్తోంది.

సమసమాజ ప్రజాతంత్ర భావాలకు సామాజిక సంస్కృతిలో ఉన్న స్థానం పడిపోయింది. హేతువాద, కుల వ్యతిరేక, కమ్యూనిస్టు ఉద్యమాలు బలంగా పనిచేసిన చోటనే ఈ రోజు ఒకవైపు సంప్రదాయ బ్రాహ్మణీయ సంస్కృతి, మరొకవైపు పెట్టుబడిదారీ సరుకుల సంస్కృతి విచిత్ర సహజీవనం చేస్తున్నాయి. మూడు నామాలు పెట్టుకున్న బ్రాహ్మణ నిరక్షరకుక్షి ఎవడైనా స్వామీజీ అన్న బిరుదు తగిలించుకొని ఉపనిషత్తుల మీద ఉపన్యాసాలు ఇస్తానని సభలు పెడితే చాలు తెలుగుజాతి శిష్టవర్గం అంతా మారుతీ కార్లు ఎక్కిపోయి కాళ్ళకు మొక్కి, దక్షిణలు చదివించుకుంటారు. ఇంటికొచ్చినాక అదే శిష్టవర్గం పాశ్చాత్య టి.వి. షోలను కళావిలువలకు పరాకాష్ఠగా భావించి ఆస్వాదిస్తారు. మళ్ళీ అదే పాశ్చాత్య సంస్కృతిలోని ప్రజాతంత్ర రాజకీయ విలువలు వీళ్ళకొద్దు.

ఇది కేవలం ధనిక వర్గం సాంస్కృతిక పతనం కాదు. మన సామాజిక సంస్కృతి పతనం. ఏ సమాజంలోనయినా ఆధిపత్య వర్గాల భావాలే సమాజంలో ఆధిపత్యం వహించే భావాలని మార్క్స్ అంటాడు. దీనిని పొరబాటుగా అర్థం

చేసుకొనే ప్రమాదం ఉంది. సమాజంలో పాలకవర్గాల ఆలోచనలు, ప్రజల ఆలోచనలు వేరే ఉంటాయనీ, పాలకులు తమ ఆలోచనలను సమాజం మీద రుద్దుతారనీ అర్థం చేసుకుంటే పొరబాటు. మార్క్స్ భావం ఏమయినప్పటికీ, సమాజంలో విభిన్న వర్గాల సంస్కృతి మధ్య ఎన్ని తేడాలున్నా ఒక సామాన్య సామాజిక సంస్కృతి వుంటుంది. అందులో ఒక్కొక్క వర్గానికి ఒక స్థానం, ఒక పాత్ర ఉంటుంది. ఆ సామాజిక వ్యవస్థ నిలవడానికి అవసరం అయిన వైఖరినీ, నడవడికనూ ఈ సంస్కృతి మనుషులకు అలవరుస్తుంది. ఆ సామాజిక వ్యవస్థ కాపాడేది ఆధిపత్య వర్గాల ప్రయోజనాలను కాబట్టి ఈ సంస్కృతిని వారి సంస్కృతిగా వర్ణించడంలో తప్పు లేదు. దాని స్వభావాన్ని బట్టి దానిని బ్రాహ్మణీయ సంస్కృతి, బూర్జువా సంస్కృతి మొదలయిన పేర్లతో పిలవడంలో తప్పు లేదు. కానీ ఆ సంస్కృతి ప్రజలందరి జీవితంలోనూ, ఆలోచనలలోనూ భాగం అయిపోయింది. ఆధిపత్య సంస్కృతి కేవలం ఆధిపత్య వర్గాల సంస్కృతి కాదు. అందువల్ల ఈ ఆధిపత్య సంస్కృతి పతనరూపం తీసుకుంటే అది మొత్తంగా సమాజానికి, సమాజ భవితవ్యానికి సమస్య. ఈ సాంస్కృతిక పతనాన్ని ఈ రోజు మనం కళ్ళారా చూస్తున్నాం. ఈ పతనానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర భావాలు వివిధ ప్రజా ఉద్యమాల ద్వారా మళ్ళీ ఉనికిలోకి వచ్చి ప్రజాతంత్ర సమసమాజ స్థాపనకు అవసరమైన సంస్కృతిని నిలబెట్టే ప్రయత్నం చేయడం కూడా చూస్తున్నాం. ఆ ప్రయత్నం ఈ రోజు చాలా బలహీనంగా ఉన్న మాట సత్యమే. కానీ అది అసలే లేకుండా పోలేదు.

తెలుగుజాతి ఆధునిక కాలంలో నిర్మించుకున్న జాతి జీవితం మౌలిక స్వరూపం రూపురేఖలు ఇవి. ఆ జాతి జీవితాన్ని కూలంకషంగా అర్థం చేసుకునే కర్తవ్యంతో పాటు చరిత్రకారులపైన మరొక కర్తవ్యం కూడా ఉంది. ఈ జాతి చరిత్రలో విభిన్న దశలలో ముందుకొచ్చిన విలువలను నిలబెట్టుకొని, ఇప్పటి దాకా ఒక ఆదర్శంగా ఉన్న ప్రజాతంత్ర సమసమాజ లక్ష్యాన్ని నిజంగా సాధించుకోవాలంటే ఏ రకమైన కృషి జరగాలన్న ప్రశ్నకు కూడా చరిత్రకారులు సమాధానాన్ని అన్వేషించాలి. ఆ ఆదర్శం చరిత్రలో పుట్టినదే కాబట్టి ఈ అన్వేషణ చరిత్రకారుల కర్తవ్యాలకు బాహ్యమైన – పరాయి – విషయం కాదు.




**చరిత్ర పాఠాలపై కాషాయం నీడ**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) తన రజతోత్సవాల సందర్భంగా 1999లో ప్రచురించిన అనేక చిన్న పుస్తకాలలో ఇదొకటి. నేరుగా పుస్తక రూపంలోనే వచ్చిన వ్యాసం ఇది.

హైందవ కులవ్యవస్థ ప్రయోగించిన అణచివేతను కొంత మేరకైనా సడలించే పాత్ర ఇస్లాం నిర్వహించిందని ఈనాటి 'సెక్యులర్' పాఠ్యపుస్తకాలు సహితం అనలేక పోతున్నాయి. ఆ అభిప్రాయం ఇప్పటికీ చరిత్ర పరిశోధకులు మాత్రమే చదువుకునే పుస్తకాలకు పరిమితం అయి ఉంది. ఈ ఒక్క విషయంలోనే కాదు, హిందుత్వవాదుల దృక్పథంతో పోలిస్తే సెక్యులర్‌గానే కనిపించే ప్రస్తుత విద్యావ్యవస్థ ప్రాపంచిక అవగాహన ఏ విషయంలోనూ బ్రాహ్మణీయాన్ని బాహాటంగా విమర్శించదు, వ్యతిరేకించదు. అంటరానితనం వంటి మరీ తీవ్రమైన దురాచారాలను విమర్శించేవరకే అది పరిమితం అయింది. 'లౌకికత' పరిమితులే ఈ విధంగా ఉంటే ఇంక సంఘ్‌పరివార్ దృక్పథం పాఠ్యపుస్తకాలను లోబరచుకుంటే ఏం జరుగుతుందో ఊహించడం కష్టం కాదు.

# చరిత్ర పాఠాలపై కాషాయం నీడ

**భారతీయ** జనతాపార్టీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలలోనూ, పాఠ్యాంశాలలోనూ జోక్యం చేసుకుని వాటిని తిరగరాసే ఉద్దేశ్యం ప్రకటించడం చాలామందికి ఆందోళన కలిగించింది. ముఖ్యంగా, మన దేశ చరిత్రకు సంబంధించిన పాఠ్యాంశాలను బిజెపి తన భావాలకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నది. ఈ విషయాన్ని ఆ పార్టీగానీ, ఆ పార్టీ అభిమానులుగానీ రహస్యంగా ఉంచే ప్రయత్నం కూడా ఏమీ చేయటం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ దృక్పథానికి అనుకూలంగా పాఠ్యాంశాలను రూపొందించుకుందనీ, అది యువతను శక్తిహీనం చేసిందనీ, ఇప్పుడు తాము అధికారంలోకి వచ్చాము కాబట్టి ఆ పాఠ్యాంశాలను నిజమైన జాతీయవాదం పునాది మీద తిరగరాయబోతున్నామనీ వారు బాహాటంగానే అంటున్నారు.

స్కూలు పిల్లల పాఠ్యాంశాలనూ, అందులో భారతదేశ చరిత్రకు సంబంధించిన విశ్లేషణనూ భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఇంత సీరియస్‌గా తీసుకోవడం గమనించదగ్గ విషయం. మన దేశ చరిత్ర గురించి మనకుండే అవగాహన 'మనము' ఎవరు అనే ప్రశ్నకు ఒక జవాబు ఇస్తుంది. 'మనము' ఎవరు అనే దానితోపాటు పరాయి వాళ్ళెవరు అనే ప్రశ్నకు కూడా ఒక జవాబునిస్తుంది.

ఈ రెండు ప్రశ్నలకూ తమదైన జవాబు ఇవ్వాలని బిజెపి పాలకులు భావిస్తున్నారు. ఆ జవాబు పాఠ్యపుస్తకాల ద్వారా పిల్లల మెదళ్ళలోకి ఎక్కాలి. పాఠ్యాంశాలలో చెప్పినదానిని ప్రామాణిక 'సత్యం'గా గుర్తించడం మన విద్యా వ్యవస్థ నేర్పింది కాబట్టి ఆ విధంగా తలకెక్కిన అభిప్రాయాలు చాలా బలంగా నిలిచిపోతాయి.

ఇది బిజెపికే మొట్టమొదటిసారి వచ్చిన అభిప్రాయం కాదు. పాఠ్యాంశాల ద్వారా పిల్లల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దాలనేది పాలకులు ఎప్పుడూ చేసే ఆలోచనే.

---

డిసెంబర్ 1999

ఈ దేశాన్ని చాలాకాలం ఏలిన కాంగ్రెస్ పాలకులు భారతదేశ చరిత్రకు, జాతీయోద్యమానికి, భవిష్యత్ ఆదర్శాలకు ఒక రకమైన వ్యాఖ్యనిచ్చే విద్యావ్యవస్థను రూపొందించారు. దాని ద్వారా తాము కోరుకునే స్వభావంగల యువతరాన్ని తయారుచేయాలని ఆశించారు. కొంతవరకు సాఫల్యం చెందారు కూడా. రేపు కమ్యూనిస్టులయినా మరొకరైనా, అధికారానికొస్తే ఇదే పని చేస్తారు.

## మరి బిజెపి చేస్తే తప్పేముంది?

ఇప్పటివరకు మన విద్యావ్యవస్థ ఎటువంటి భావజాలం, లేక ప్రాపంచిక దృక్పథం ప్రభావం లేని వట్టి సత్యాలను పిల్లలకు చెప్తున్నదనీ, ఇప్పుడు మొట్ట మొదటిసారిగా పిల్లల మెదళ్ళను ఒక దృక్పథానికి అనుగుణంగా మలిచే ప్రయత్నం జరుగుతున్నదనీ ఎవరయినా అనుకుంటే తప్పే. బిజెపి మీద అదే ఫిర్యాదయితే ఆ ఫిర్యాదు అబద్ధం.

కానీ ఏ విద్యావ్యవస్థయినా ఒక రకమైన అభిప్రాయాలను విద్యార్థులకు కలిగించి, ఒక రకమైన యువతరాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తుందని గుర్తిస్తున్నామంటే అర్థం అన్ని ప్రయత్నాలూ ఒకటేనని కాదు. ఇక్కడ కనీసం మూడు విషయాలు చూడవలసి వుంటుంది.

1) ఫలానా విద్యా వ్యవస్థ నేర్పించాలని చూస్తున్న విలువలు ఎట్లాంటివి? ఆ విద్యా వ్యవస్థ ద్వారా రూపొందించాలని చూస్తున్న వ్యక్తిత్వాలు ఎట్లాంటివి? సమతనూ, సహనాన్నీ, సహకారాన్నీ పెంపొందించేవా? లేక ఆధిపత్యాన్నీ, ద్వేషాన్నీ, స్వార్థాన్నీ పెంచేవా?

2) ఒక రకమైన ప్రాపంచిక దృక్పథాన్ని పిల్లలలో కల్పించే ప్రయత్నం చేస్తూ కూడా అందుకు భిన్నమైన వాటిని నిజాయితీగా వివరించి చెప్పి హేతుబద్ధమైన వివేచన ద్వారా మంచిచెడులు నిర్ణయించాలనుకునే తత్వాన్ని ఆ విద్యావ్యవస్థ ప్రోత్సహిస్తుందా? లేక ఏకైక సత్యంగా తమ అభిప్రాయాలు నేర్పించి మిగిలిన వాటిని తొక్కేయడమో లేక వక్రీకరించడమో చేస్తుందా?

3) తాను నమ్మే విలువలు, తాను చేసే వ్యాఖ్యల పట్ల ఆ విద్యావ్యవస్థ శాస్త్రీయ వైఖరిని కలిగి ఉంటుందా? అంటే వాటిని వాస్తవాల పరీక్షకు

నిలబెట్టడానికి సిద్ధపడుతుందా? లేకపోతే తనకు అనుకూలమైన వాస్తవాలను మాత్రమే చూపించి తక్కిన వాటిని చూపడానికి నిరాకరిస్తుందా?

బిజెపి పాలకులు విద్యావ్యవస్థలో తీసుకురావాలని చూస్తున్న మార్పులు పై మూడు కోణాలలో కూడా ఇప్పుడున్న దానిని మరింత వెనక్కి తీసుకుపోతాయి.

ఈ విషయాన్ని వివరంగా చూసే ముందు బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చీ రాగానే మొట్టమొదటి కార్యక్రమంగా దీనినే ఎందుకు చేపట్టిందో కొంచెం చూద్దాం. ఏ రాజకీయ పక్షమైనా తన ఆలోచనలకు అనుకూలమైన ప్రాపంచిక దృక్పథాన్ని సమాజంలో – ముఖ్యంగా యువతలో – కల్పించే ప్రయత్నం చేస్తుందని పైన చెప్పుకున్నాము. కానీ అన్ని రాజకీయ పక్షాలూ అదే మొదటి పనిగా పెట్టుకోవు. కమ్యూనిస్టు పార్టీలు అధికారానికి వచ్చిన రాష్ట్రాలలో భూ సంస్కరణల వంటి చర్యలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చాయి. దళిత బహుజన రాజకీయ పక్షాలు అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో రిజర్వేషన్ల అమలు, దళిత బహుజన వర్గాల ప్రాతినిధ్యాన్ని వివిధ సామాజిక రాజకీయ రంగాలలో పెంచే చర్యలు మొదటి ప్రాధాన్యతగా చేపట్టాయి. మన చంద్రబాబు గ్లోబలైజేషన్ చర్యలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాడు. భారతీయ జనతాపార్టీ పాలకులు అధికారంలోకి వచ్చీ రాగానే విద్యావ్యవస్థ మీద, అందులోనూ చరిత్ర పాఠ్యపుస్తకాల రూపకల్పన మీద ఎందుకు వివాదం లేవదీస్తున్నారు?

భారతీయ జనతాపార్టీ కేవలం రాజకీయ లక్ష్యాలు గల పార్టీ కాదు. అది హైందవ సంఘ్‌పరివార్‌లో భాగం. సంఘ్‌పరివార్ ఈ దేశాన్ని తాను నమ్మే హైందవ ధర్మం, సిద్ధాంతం ప్రాతిపదికన నిర్మించదలచుకుంది. ఈ దేశంలో ప్రతి వ్యక్తీ 'నేను' అనే దానిని హైందవ స్రవంతిలో భాగంగా నిర్వచించుకోవాలి. 'హిందూత్వం' అని పిలువబడే సామాజిక సంస్కృతి అందరి ఆలోచనలనూ వ్యక్తిత్వాలనూ తీర్చిదిద్దాలి. ఇది దేనికో సాధనం కాదు. ఇదే వారి లక్ష్యం. దీనికి వాళ్ళు విద్యారంగాన్ని, సాంస్కృతిక, ప్రసార రంగాలను ముఖ్య సాధనాలుగా ఎంచుకున్నారు. సంఘ్‌పరివార్ అంటే ఖాకీ నిక్కర్లు వేసుకునే ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలేననుకోనక్కరలేదు. బిజెపికి వోట్లు వేసే వాళ్ళు మాత్రమే ననుకోనక్కర లేదు. సంఘ్‌పరివార్ నిలబెట్టదలచుకున్న ప్రాపంచిక దృక్పథం ఈ దేశంలో

శతాబ్దాలుగా ఆధిపత్యం చలాయించిన దృక్పథం. దానిని నమ్మేవాళ్ళు హైందవ పెత్తందారీ కులాలలోనూ, కొంతమేరకు బిసి కులాలలోనూ కూడా చాలామంది ఉన్నారు. అది కేవలం వారి మెదళ్ళలో ఉన్న నమ్మకం కాదు. అది వారి నిత్యజీవిత ఆచరణలో భాగం. వారి వ్యక్తిత్వంలో భాగం. రాజకీయాలలో వారంతా బిజెపి వోటర్లే కానక్కరలేదు. కాంగ్రెస్ వోటర్లు కావచ్చు, తెలుగు దేశం వోటర్లు కావచ్చు. కొద్దిమంది కమ్యూనిస్టు వోటర్లు సహితం కావచ్చు. వీరిలో చాలామంది సాంఘికంగా బుద్ధిజీవుల వర్గానికి చెందినవారు కావడంవల్ల హైందవ ప్రాపంచిక దృక్పథాన్ని ప్రచారం చేసే సాధనాలుగా నిత్యం పనిచేస్తూనే ఉంటారు. రచయితలయినా, పత్రికా విలేకరులయినా, అధ్యాపకులయినా, పాఠ్యపుస్తక రచయితలయినా, కళాకారులయినా వీరు హిందూత్వ భావ ప్రచారానికి నిత్యం తమ జీవిత రంగాలలో తోడ్పడుతూనే వుంటారు.

అంతేకాక, నిర్మాణపరంగా కూడా విద్యారంగంలో సంఘ్‌పరివార్ విశేషంగా ప్రవేశించింది. సరస్వతీ శిశు మందిరాలే కాకుండా అంతకంటే పెద్ద పిల్లల స్కూళ్ళు కూడా అనేకం నడుపుతున్నది. కేవలం పాఠాలు చెప్పినంత మాత్రాన పిల్లల ఆలోచనలను సంపూర్ణంగా మలచటం సాధ్యమా అని అడగవచ్చును. కానీ ఇవి ఇప్పటికే సమాజంలోనూ, సామాజిక జీవితంలోనూ బలంగా వున్న ఆలోచనలు అని మరిచిపోకూడదు. ఆ పిల్లలు ఇప్పటికే తమ నిత్య జీవితంలో ఈ ఆలోచనలకు అలవాటుపడి వుంటారు. వాటిని పాఠశాలలో తిరిగి నేర్చుకోవడం కొత్త విషయాన్ని నేర్చుకోవడం కాదు. అప్పటికే తమ ఆలోచనలలో భాగమైన విషయాలకు పాఠశాలలో నేర్చుకునేది ప్రామాణిక 'సత్యం' అన్న భావన ద్వారా మరింత బలం సమకూర్చుకుని పాత విషయాన్నే మరింత గట్టిగా, అధికారికంగా నేర్చుకోవడం మాత్రమే.

భారతీయ జనతాపార్టీ రాజకీయాలలో బలపడి అధికారం చేపట్టిన క్రమంలో, సంఘ్‌పరివార్ ఇప్పటిదాకా పౌరసమాజంలో చేస్తున్న పనిని రాజ్యాధికారం ద్వారా కొనసాగించే అవకాశం వారికి దక్కింది. ఏ కొంచెం అధికారం తమ చేతిలోకి వచ్చినా దానిని ఇందుకోసం వారు వినియోగిస్తూనే ఉన్నారు.

*చరిత్ర పాఠాలపై కాషాయం నీడ*

ఒక దశాబ్దం కింద భారతీయ జనతా పార్టీ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో అధికారం చేపట్టినప్పుడు పాఠ్యపుస్తకాలలోనూ, పాఠ్యాంశాలలోనూ ప్రవేశపెట్టిన మార్పులు రేపు జాతీయ స్థాయిలో వీరు చేయబోయే ప్రయోగాలకో సూచిక. పాఠ్యాంశాలలో అన్నిటి కంటే చరిత్రకు వీరు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. దానిని తిరగ రాసే ప్రయత్నం ఎక్కువ చేస్తారు.

'హైందవ జీవన విధానం చాలా గొప్పది. ముస్లింలు రాక పూర్వం అది అనన్యమైన వైభవాన్ని అనుభవించింది. ముస్లింలు వచ్చి మన దేశాన్ని లోబరచుకోవడంతో ఆ హైందవ వైభవానికి తొలిగ్రహణం పట్టింది. తరువాత బ్రిటిష్ వాళ్ళు (క్రైస్తవులు) వచ్చి కేవలం భారతదేశాన్ని లోబరచుకోవడమే కాక హైందవ జీవన విధానం అనాగరికమైనదనీ, మూఢాచారాలకు నిలయమనీ ప్రచారం చేయడం హైందవ వైభవానికి పట్టిన రెండవ గ్రహణం. స్వాతంత్ర్యం తరువాత దీని నుండి బయటపడే అవకాశం వచ్చి కూడా లౌకిక వాదం పేరిట వెయ్యేళ్ళ బానిసత్వాన్ని కొనసాగిస్తున్నాము.' ఇదీ క్లుప్తంగా, వాళ్ళు ప్రచారం చేయదలచుకున్న చారిత్రక దృక్పథం.

ఇస్లాం, క్రైస్తవం 'విదేశీ మతాలు' కాబట్టి వాటిని అనుసరించే వారు హిందువుల హక్కులకు తల ఒగ్గాలని వీరు అంటారు. కాబట్టి, హైందవం పూర్తిగా స్వదేశీయమేనని వాదించడం వీరికి అవసరం. పరాయి వాళ్ళ నుండి భారతీయతను కాపాడుకోవడం వీరి రాజకీయాధికారంలో అత్యంత ముఖ్యమైన భావన. కానీ దాదాపు చరిత్రకారులందరూ వైదిక ఆర్యులు ఈ గడ్డకు చెందినవారు కారనీ, మధ్యఆసియా నుండి వలసవచ్చారనీ అంటారు. హైందవానికి మూలంగా హిందూత్వవాదులు భావించే వేదాలలో మొదటిదయిన రుగ్వేదం ఈ నేలమీద రూపొందించినది కాదు. ఇరాన్‌లోనో, అఫ్ఘానిస్తాన్‌లోనో రూపొందింది. పంజాబు ప్రాంతానికి వచ్చిన ఆర్యులు రుగ్వేదాన్ని తమతో తీసుకొచ్చారు. వారి హైందవం కూడా (ఈ అర్థంలో) విదేశీ మతమే అయితే ముస్లింలనూ, క్రైస్తవులనూ తిట్టడం ఎట్లా? పరాయి ప్రభావాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడమే జాతీయతకు నిర్వచనం అనే అభిప్రాయాన్ని నిలబెట్టుకోవడం ఎట్లా? కాబట్టి అన్ని చారిత్రక ఆధారాలకూ విరుద్ధంగా ఆర్యులు ఇక్కడివారేననీ, ఎక్కడి నుండో రాలేదనీ

వాదించాలి. ఐదేళ్ళ క్రితం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని చరిత్ర పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టిన మార్పులలో ఇది ప్రముఖమైనది. ఆర్యులు మధ్యఆసియా నుండి వచ్చారనడానికి చరిత్రకారులు అనేక ఆధారాలు చూపించారు. భాష నుండి పురావస్తు అవశేషాల దాకా అనేక ప్రమాణాలు చూపించారు. వీటిలో దేనికీ జవాబు చెప్పకుండా, 'ఇదే నిజం' అని పిల్లల పాఠ్యపుస్తకాలలో తన అభిప్రాయాన్ని రాసి అచ్చువేసేయడం ద్వారా చరిత్ర తాను కోరుకున్నట్టు జరిగిందని సంఘపరివార్ నిరూపించాలని చూస్తున్నది.

వేదాలతోనే మన చరిత్ర, సంస్కృతి మొదలవుతాయని, సంస్కృత భాషే మన తొలి భాష అనే నమ్మకం కూడా హిందూత్వవాదుల దృక్పథానికి అవసరం. హరప్పా – మొహంజదారో నాగరికత[1] అంతకంటే పూర్వమే ఉందనీ, అది 'ఆర్య' నాగరికత కాదనీ, వారి భాషకు సంస్కృతంతో గానీ, సంస్కృతాన్ని పోలిన ఇండో యూరోపియన్ భాషతో గానీ పోలిక లేదని చరిత్రకారులు దాదాపు ఏకగ్రీవంగా నమ్ముతారు. కాని హిందూత్వవాదులు తాము తిరగ రాయదలచుకున్న చరిత్రలో హరప్పా నాగరికతను కూడా ఆర్యులకే అంటగడతారు.

రాబోయే రోజులలో ఈ విషయాన్ని గురించి చాలా వివాదం చెలరేగే అవకాశం ఉంది కాబట్టి దీనిని ఇంకొంచెం వివరంగా తెలుసుకోవడం అవసరం. 'ఆర్య' శబ్దాన్ని ఒక 'జాతి'కి అంటగట్టడం హిందూత్వవాదులకు అవసరం. ఆ జాతి 'మన' పూర్వీకులు, వారే ఇక్కడ తొలి నాగరికతను రూపొందించారు. వారి భాష సంస్కృతం, వారి సాహిత్యం వేదసాహిత్యం, వారి జీవన విధానం హైందవం – ఇవన్నీ హిందూత్వవాదులు పునర్లిఖించదలచుకున్న చరిత్రకు కేంద్ర భావాలు. ఈ సుందరమైన నాగరికత ముస్లింల రాకతో ధ్వంసమై ఇక్కడి ప్రజలు బానిసత్వం లోకి పోయారనేది తరువాతి చరిత్రకు వారిచ్చే వ్యాఖ్య.

కానీ, చరిత్రకారుల దృష్టిలో 'ఆర్య' శబ్దం ఒక జాతిని సూచించేది కాదు. అది ఒక భాషను లేక ఒక భాషాకుటుంబాన్ని సూచించే మాట. ఈ భాషలను ఇండో – యూరోపియన్ భాషలు అంటారు. సంస్కృతంతో సహా అనేక యూరోపియన్ భాషలు ఈ కుటుంబానికి చెందినవే. వీటికి మూలమైన తొలి భాష ఒకటి ఉంటుందన్న అభిప్రాయం చరిత్రకారులలో ఉంది. ఆ భాష ఛాయలు

మొట్టమొదటిసారి క్రీ.పూ.1800 ప్రాంతంలో పశ్చిమాసియాలో కనిపిస్తాయి. తరువాత ఇరాన్, అఫ్ఘానిస్తాన్‌లలో, సింధూనది ప్రాంతంలో ఆ భాష మాట్లాడే ప్రజలు కనిపిస్తారు.

అప్పటికే ఈ ప్రాంతమంతటా వేరే భాషలు మాట్లాడే ప్రజలున్నారు. వాళ్ళలో కొందరి నాగరికత ఈ 'ఆర్య' భాష మాట్లాడే నాగరికతకన్నా మెరుగయినదే. 'ఆర్య' భాష ఇరాన్ ప్రాంతంలో పర్షియన్ భాషగానూ, సింధూ గంగా నదుల ప్రాంతంలో సంస్కృతంగానూ (స్థానిక భాషల ప్రభావం వల్ల కొంత మార్పు చెంది) స్థిరపడింది. రుగ్వేదం సంస్కృతంలోని మొదటి సాహిత్యం. ఇది క్రీ.పూ. 1500–1000 సంవత్సరాల కాలానికి చెందినదనీ, దీనిని రూపకల్పన చేసినది ('రాసినది' అనలేము) ప్రస్తుత అఫ్ఘానిస్తాన్ ప్రాంతంలోననీ రొమిల్లా థాపర్[2] అంటారు. ఈ రుగ్వేద కాలపు సంస్కృతం తరువాతి కాలపు సంస్కృతం కంటే ప్రాచీన పర్షియన్‌కు సన్నిహితమైనది.

'ఆర్య' శబ్దం జాతిని కాక భాషను సూచించే మాట అనుకున్నట్లయితే ఆ భాష మాట్లాడే ప్రజలు పెద్దఎత్తున సింధూ–గంగా నదుల ప్రాంతానికి వలస వచ్చారా? వారి వలస ద్వారానే (ఆ క్రమంలో స్థానిక భాషలతో కలిసి ఒక రూపం తీసుకున్న) సంస్కృతం భాష ప్రచారమయ్యిందా? ఇటువంటి వలస జరిగిందనీ, నిజానికి రెండు విడతలుగా 'ఆర్య' భాష మాట్లాడే ప్రజలు సింధూ–గంగానదుల ప్రాంతానికి వచ్చారనీ, అంతకు ముందు ఉన్న హరప్పా నాగరికతను వారు ధ్వంసం చేశారనీ నమ్మే చరిత్రకారులున్నారు. కోశాంబి వీరిలో ఒకరు. అయితే మనుషుల భౌతిక వలస కంటే భాష, దానితో సన్నిహితంగా ముడిపడిన కర్మకాండ వ్యాప్తి చెందడమే ఎక్కువగా జరిగిందని భావించే చరిత్రకారులు కూడా వున్నారు. రొమిల్లా థాపర్ వీరిలో ఒకరు. 'ఆర్యుల' భౌతిక వలస జరిగిందని నమ్మే కోశాంబి సహితం వారుగానీ, వారి భాషగానీ 'శుద్ధం'గా ఉండిపోలేదనీ, స్థానికులతోనూ వారి భాషాసంస్కృతులతోనూ కలగలిసి చాలా మార్పుకు లోనుకావడం జరిగిందనీ అంటారు.

మొత్తానికి 'ఆర్య' భాషా సంస్కృతుల రాక (లేక రూపకల్పన) కంటే పూర్వమే ఇక్కడ భాషలున్నాయి, సంస్కృతులున్నాయి. అవే స్థానికమైనవి. మన

భాషాసంస్కృతులలోని 'ఆర్య' అంశ బయటి నుండి వచ్చింది. అది మనుషుల వలస రూపంలోనే ప్రధానంగా వచ్చిందా లేదా సాంస్కృతిక విస్తరణే ప్రధానమా అన్న విషయం అటుంచి, అది బయటి నుండి వచ్చి స్థానిక భాషా సంస్కృతులతోనూ, ప్రజలతోనూ మిళితమయింది. ఈ క్రమంలో మన హిందూత్వ వాదులు భారతీయ సంస్కృతి అని పిలుచుకునేది రూపొందింది. దేశ చిత్రపటం మీద భక్తి పెంచుకొని సరిహద్దులలో పుట్టిన సంస్కృతే 'భారతీయం' అనీ, బయట పుట్టిన దానిని ఆదరించే ముస్లింలు, క్రైస్తవులు విదేశీ మానసపుత్రులనీ అనేటట్టయితే అది హైందవానికి కూడా వర్తిస్తుంది.

హిందూత్వవాదులకు ఈ సంగతి తెలుసును కాబట్టే ఆర్యులు ఇక్కడి వారేనని వాదించడం వారికి అవసరమయింది. ఆ కోణం నుండి చరిత్ర పాఠాలను తిరగరాయడం అవసరం అయింది. పైగా 'మన' పూర్వీకులుగా వారు భావించే ఆర్యులను కేవలం భాషా సంస్కృతులను సూచించే సమాజంగా కాక ఒక 'జాతి'గా భావించుకోవడం అవసరమైంది. గొప్ప విజ్ఞానవంతులు, ద్రష్టలు అయిన ఆర్యులు 'భారతజాతి' పూర్వీకులనీ, వారే ఇక్కడి తొలి నాగరికతను నిర్మించిన వారనీ హిందూత్వవాదులు నమ్ముతారు. ముస్లింల రాకతో ఆ నాగరికత పతనమయిందంటారు.

అయితే 'ఆర్యుల' రాకకు పూర్వం – కనీసం వెయ్యి సంవత్సరాల పూర్వం – సింధూనది లోయలోనూ, పశ్చిమ ఆసియాలోని మెసపటోమియాలోనూ కూడా నాగరికతలున్నాయి. సింధు నాగరికత కేంద్రాలయిన హరప్పా, మొహంజదారోలు అప్పటికే పట్టణ నాగరికతలు. తరువాత వచ్చిన ఆర్య నాగరికత పశుపోషక సంచార నాగరికత కాబట్టి వారూ వీరు ఒకరేనని దబాయించడానికి వీలులేదు. హరప్పావాసుల లిపిని ఇప్పటిదాకా ఎవరూ చదవలేకపోయారు గానీ దానిని 'ఆర్య' భాషగా భావించి చదివే ప్రయత్నాలకంటే ద్రవిడ భాషగా భావించి చదివే ప్రయత్నాలే కొంత ఎక్కువ సంతృప్తినివ్వగలుగుతున్నాయని రొమిల్లా థాపర్ అంటారు.

మొత్తానికి 'ఆర్యులు' అనేది ఒక 'జాతి' కాదు. అది భాషా సంస్కృతులను సూచించే మాట. ఆ భాషా సంస్కృతులు కలిగిన ప్రజల భౌతిక వలసల వల్ల

కావచ్చు, లేక ఇతర రూపాలలో జరిగిన వ్యాప్తివల్ల కావచ్చు (ఇవి రెండూ జరిగాయిగానీ ఏది ప్రధానం అనేది వివాదాస్పదంగా ఉంది) – ఈ 'ఆర్య' అంశ క్రీ.పూ. 1500 ప్రాంతంలో సింధూనది ప్రాంతానికి చేరింది. సంస్కృత భాష, దానితో సన్నిహితంగా ముడిపడిన కర్మకాండ, పౌరోహిత్య ప్రాముఖ్యం, పశు పోషక జీవన విధానం దీని లక్షణాలు. అప్పటికే అనేక ఆర్యేతర భాషా సంస్కృతులు ఇక్కడ స్థిరపడి ఉన్నాయి. ఆ భాషలు సంస్కృతం లాగ ఇండో – యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినవి కావు. ఆ సంస్కృతి వైదికం కాదు. ఆ భాషలు ద్రవిడపూర్వ భాషా కుటుంబానికీ, టిబెటో–బర్మన్ భాషా కుటుంబానికీ, ఆస్ట్రోఏషియాటిక్ భాషా కుటుంబానికీ చెందినవి. ప్రాదేశికతను బట్టి మన–తన నిర్ణయించేటట్టయితే ఈ ఆర్యేతర భాషలు, ఈ అవైదిక సంస్కృతే 'మనవి'. ఆర్య భాషా సంస్కృతులు, వాటి నుండి ఆవిర్భవించిన హైందవం పరాయివి. ఈ పరాయి జనం అత్యున్నతమైన స్థానిక ఆర్యేతర నాగరికత అయిన హరప్పా నాగరికతను బలప్రయోగంతో నాశనం చేశారని కోశాంబి వంటి చరిత్రకారులు నమ్ముతుండగా, హరప్పా నాగరికత పర్యావరణ మార్పులకు తట్టుకోలేక పతనం అయిందనీ, అది ఆర్య ఆగమనం కంటే ముందే జరిగిందనీ రొమిల్లా థాపర్‌తో సహా తరువాతి చరిత్రకారులు నమ్ముతారు.

నిజానికి ప్రాదేశికతను బట్టే మన–తన అనేది నిర్ణయించనవసరం లేదు. ముస్లింలకు, క్రైస్తవులకు సమాన హక్కులు ఇవ్వడం ఇష్టంలేని హిందూత్వవాదులు తీసుకొచ్చిన వికృతమైన తర్కం ఇది. 'ఎక్కడినుండో వచ్చి ఇక్కడి ప్రజలతో మీరెంతో మేమంతే అంటారా?' అనేది మైనారిటీలకు వ్యతిరేకంగా వారు ప్రయోగించే వాదన. నిజానికి ఈనాడు ఈ దేశంలో ఉన్న ముస్లింలు, క్రైస్తవులు 'ఎక్కడి నుండో' రాలేదు. వారంతా ఇక్కడివారే. ఈ సంగతి హిందూత్వవాదులకు తెలుసు. అయితే వారు కాకపోయినా వారు నమ్మే మతం 'పరాయి ప్రాంతాలకు' చెందినదే కదా. ఆ మతం ఇక్కడి ప్రజల మతంతో సమాన ప్రతిపత్తి ఎట్లా కోరుకుంటుంది? మసీదులో ప్రార్థనలు జరిగే టైంలో మసీదు ముందు బాజా భజంత్రీలు వాయించొద్దని ఇక్కడి ప్రజల సంస్కృతి పైన ఆంక్షలెట్లా పెడతారు? ఇక్కడి ప్రజల దేవుడయిన రాముడి గుడిని పరాయివాళ్ళు కూల్చేసి, అక్కడే పరాయి

మత ప్రార్థనాస్థలాన్ని కడితే ఇక్కడి ప్రజలు దానిని లౌకికవాదం పేరిట భరించవలసిందేనా? ఇత్యాది ప్రశ్నలు హిందూత్వవాదులు చాలా ఉద్రేకంతో అడుగుతారు.

ఒక వేళ హైందవం ఈ గడ్డమీద ఆవిర్భవించిన మతమే అయినా ఇస్లాం, క్రైస్తవం సమాన హక్కులు కోరుకోవడంలో తప్పులేదు. అవి ఒకప్పుడు ఎక్కడో పుట్టి ఉండవచ్చును. కానీ ఇప్పుడు ఆ మతాలను అనుసరించే ప్రజలు కోట్ల సంఖ్యలో ఈ దేశవాసులలోనే ఉన్నారు. అలాంటప్పుడు అవి పరాయి మతాలెట్లా అవుతాయి? ఈ రోజు అవి రెండూ మన దేశానికి (కూడా) చెందిన మతాలే. ఆ ప్రజలకు సమాన హక్కులు ఎట్లా నిరాకరిస్తారు?

నిరాకరించేటట్టయితే హైందవం మూలాలు కూడా బయటి నుండి వచ్చిన ఆర్య సంస్కృతిలో ఉన్నాయి కదా. ఆ కారణంగా తాము ముస్లింలకూ, క్రైస్తవులకూ వర్తింపజేసే తర్కం హిందువులకు తెలుసును కాబట్టే చరిత్రను తిరగరాసి ఆర్యులు ఇక్కడివారేనని పాఠ్య పుస్తకాల చేత చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

హైందవం ముస్లింల రాకకు పూర్వం చాలా ఉచ్ఛ స్థితిలో ఉండేదనీ, ముస్లింలు వచ్చి హిందువులను బానిసలుగా చేసుకున్న క్రమంలోనే హైందవంలోకి నీచమయిన లక్షణాలు ప్రవేశించాయనీ కూడా వీళ్ళు అంటారు. అంతవరకు మనుషులను గుణాన్ని బట్టి వర్గీకరించిన వర్ణవ్యవస్థ ఉండిందనీ, ముస్లింరాజుల రాకవల్ల భారతీయ సంస్కృతి దెబ్బతిని కరుడుగట్టిన కులవ్యవస్థ ఏర్పడిందనీ, అప్పటి దాకా మగవాడి సహధర్మచారిణిగా గుర్తించబడిన స్త్రీ ఆ తరువాత మగవాడికి బానిస అయిందనీ కూడా అంటారు.

పది సంవత్సరాల క్రింద మధ్యప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఒక చరిత్ర పాఠ్యగ్రంథాన్ని ప్రవేశపెట్టింది. దాని పేరు 'భారత్‌కీ సాంస్కృతిక్ విరాసత్' (భారతదేశపు సాంస్కృతిక వారసత్వం). అందులో ఈ విధంగా అన్నారు. ***'గత వెయ్యి సంవత్సరాల చారిత్రక పరిస్థితుల కారణంగా తొలినాటి సాంస్కృతిక ఔదార్యాన్ని మన సమాజం కోల్పోయింది. దీనికి కారణం మన బలహీనత కాదు. సామాజిక రాజకీయ ఘటనలకిది సహజ పర్యవసానం.'*** ఇక్కడ 'వెయ్యి సంవత్సరాల చారిత్రక పరిస్థితులు' అనేది ముస్లిం రాజుల పాలనను సూచిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. **'ప్రాచీనకాలం ప్రధానంగా ఆధ్యాత్మిక యుగం. అది భారతదేశ**

***స్వర్ణయుగం. ఆ తరువాత విదేశీ దాడులు మొదలయ్యాయి. ఈ విదేశీ దాడులు మన సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని దెబ్బతీశాయి. మార్పుకు తావు ఉన్న వర్ణవ్యవస్థ స్థానంలో కరుడుగట్టిన కులవ్యవస్థ వచ్చింది. స్త్రీలు స్వేచ్ఛను కోల్పోయారు. సహధర్మచారిణిగా ఉండిన స్త్రీ దాసీ అయింది. సతీసహగమనాలు మొదలయ్యాయి... అంటరానితనం పాటించడం మొదలయింది. దాని ఫలితంగా సమాజంలో ఒక వర్గం క్రూరమైన అణచివేతకూ అసమానతకూ గురి అయింది'*** అని స్కూలు పిల్లలకోసం ఉద్దేశించిన ఈ పాఠ్యపుస్తకం అంటుంది.

హైందవ సంస్కృతి ఉన్నతమైన దశ నుండి నీచమైన దశకు పడిపోయింది అనడమే కాక, ఆ మార్పును 'ముస్లింల దాడులతో' ముడిపెట్టడం ఇంకా విచిత్రమైన విషయం. కులవ్యవస్థ గురించి చాలా క్రూరమైన, కఠినమైన నియమాలు పెట్టిన మనుస్మృతి ముస్లింరాజుల రాక కంటే చాలా పూర్వమే ప్రకటించబడింది. మనుస్మృతి క్రీ.పూ. 200 నుండి క్రీ.పూ. 500 మధ్యకాలానికి చెందినదని చరిత్రకారుల అంచనా. అప్పటికి ముస్లిం రాజులు భారతదేశానికి రావడం సంగతి అటుంచి ప్రవక్త మహమ్మదే పుట్టలేదు ! నిజానికి కుల నీతిని వివరంగా సూత్రీకరించిన స్మృతులు (ధర్మశాస్త్రాలు) అన్నీ మహమ్మదు పుట్టక ముందు (ఒకటి రెండు మినహాయింపులుంటే ఉండవచ్చును) రూపకల్పన చేసినవే. స్త్రీలను దాసీలుగా ప్రకటించినది కూడా ఈ స్మృతులే. వాటన్నింటిలోకీ మనుస్మృతి స్త్రీలపట్ల అతి క్రూరమైనది. అంటరానితనం మాటకొస్తే, క్రీస్తు పూర్వానికి (ఇంక మహమ్మదు సంగతి ఎందుకు !) చెందిన అర్థశాస్త్రం[3]లోనూ, ఆపస్తంబ ధర్మసూత్రం[4]లోనూ, ఇతర బ్రాహ్మణ సాహిత్యంలోనూ దాని ప్రస్తావన ఉంది. చండాలురను చాలా ప్రాచీన కాలం నుండి కూడా అంటరానివారిగా చూశారు. యజుర్వేదంలోనే (అంటే మహమ్మదు పుట్టుకకు ఎంత లేదన్నా వెయ్యి సంవత్సరాలు పూర్వం) ఈ ప్రస్తావన ఉంది. ఈ తప్పంతా 'ముస్లింల దాడుల'పైన పెట్టడం హాస్యాస్పదం. కోశాంబి విశ్లేషణలో అక్కడ అరేబియాలో ఇస్లాం ఆవిర్భవిస్తున్న సమయంలోనే ఇక్కడ హైందవ నాగరికతలోని పట్టణ నాగరికత అంతరించిపోయి గ్రామాలకు కుదించుకుపోయింది. అప్పటికే చాలా మూర్ఖంగా ఉన్నది అంత కంతకూ మరింత మూర్ఖంగా తయారయింది. ఘజనీ, ఘోరి మహమ్మద్[5]ల రాక కోసం కులవ్యవస్థ కాచుకోలేదు.

కాగా ఘజనీ, ఘోరి మహమ్మద్‌ల దాడులను 'భారతదేశం'పైన 'ముస్లింల' దాడులుగా భావించడం ఎంతవరకు సబబు? ఈనాటి అఫ్ఘానిస్తాన్ ప్రాంతంలోని ఒక చిన్న రాజ్యాన్ని పరిపాలిస్తున్న ఒక రాజు ఈనాటి పంజాబు రాష్ట్రంలోని మరొక చిన్న రాజ్యంపైన వెయ్యేళ్ళ క్రితం చేసిన దాడిని 'భారతదేశం మీద ముస్లింల దాడి'గా వర్ణించడంలో అర్థమేమయినా ఉందా? ఈనాటి సరిహద్దులనూ, సార్వభౌమత్వాన్నీ వెయ్యేళ్ళనాటి ఘటనలకు అన్వయించడం బొత్తిగా అచారిత్రకమైన వ్యాఖ్యానశైలి.

కానీ సంఘ్‌పరివార్ చారిత్రక దృక్కోణం అదే. ఆ దృక్కోణంలో ముస్లింలయిన రాజులు తమ రాజ్య విస్తరణలో భాగంగా ఈనాటి భారతదేశం సరిహద్దులోపల ఉన్న రాజ్యాలపైన చేసిన దాడులన్నీ భారతదేశం మీద పరమతస్తులయిన విదేశీ దుండగుల దాడులే. వారితో యుద్ధంచేసిన రాజులందరూ హిందూమతాన్నీ, భారతదేశాన్నీ పరాయి దాడి నుండి కాపాడడానికి పోరాడిన దేశభక్తులే. ఇప్పుడు చరిత్ర పుస్తకాలలో ఈ విధంగా రాయడం లేదని వారికి కోపం. అది జాతీయ భావాలనూ, దేశభక్తినీ మనలో ఎదగకుండా అడ్డం పడుతున్నదని ప్రస్తుత విద్యావ్యవస్థపైన వారి అభియోగం. చరిత్ర పాఠ్యపుస్తకాలను తిరగరాసి దేశభక్తి యుతమైన యువతను తయారుచేయాలన్నది వారి ఆకాంక్ష.

ఒకవేళ అట్లా వ్యాఖ్యానిస్తే మాత్రం తప్పేముంది? అని అడగవచ్చు. అటువంటి వ్యాఖ్యానాలవల్ల దేశభక్తి నిండిన యువకులు తయారయితే మంచిదేకదా అనొచ్చు. కానీ సంఘ్‌పరివార్ నమ్మే దేశభక్తి స్వభావాన్ని అర్థం చేసుకుంటే తప్ప ఈ సందేహం తీరదు. సంఘ్‌పరివార్ వారి సరస్వతీ శిశు మందిరాలలో ఉపయోగించే పాఠ్యపుస్తకాలలోని ఈ క్రింది వాక్యాలు చూడండి.

*'వందలాదిగా దుర్మార్గులయిన రాక్షసులు మన దేశాన్ని ఆశగా చూశారు. పెద్ద పెద్ద సైన్యాలతో దోపిడీదారులు మన దేశం మీదికి వచ్చారు. కొంతమంది తాము ప్రపంచ విజేతలమని ప్రకటించుకుని వచ్చారు గానీ తోకముడిచి పారిపోక తప్పలేదు. కొందరు భారతదేశాన్నంతా పరిపాలించాలని ప్రయత్నం చేశారుగానీ దానికోసం జీవితాంతం పోరాటం చేస్తూనే ఉండిపోయారు. వాళ్ళకు కంటి నిండా నిద్రపట్టలేదు పాపం. కొంతమంది హైందవ మతాన్ని పెకిలించి వేయాలని చూశారుగానీ వారే పెకిలించి వేయబడ్డారు. ఆ తరువాత ఒక చేతిలో కత్తి, ఒక*

***చేతిలో ఖురాన్ పట్టుకున్న దుండగులు వచ్చారు. అనేక మంది హిందువుల మెడ మీద కత్తిపెట్టి ముస్లింలుగా మార్చారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన ఈ పోరాటం ధర్మయుద్ధం రూపం తీసుకుంది. మతం కోసం అసంఖ్యాకులు బలిదానం ఇచ్చారు. మనం ఒక యుద్ధం తరువాత ఒక యుద్ధం గెలుస్తూపోయాము. మనం విదేశీ పాలకులను నిలబడనీయలేదు గానీ మన నుండి వేరయిపోయిన సోదరులను తిరిగి హిందువులుగా మార్చలేకపోయాము... ఈ వేలాది సంవత్సరాలలో లక్షలాది విదేశీయులు వచ్చారు. కానీ అందరూ అవమానకరమైన ఓటమి చవిచూశారు... కొందరిని మనం జీర్ణించుకున్నాము... మనం విడిపోయి ఉన్నప్పుడు మన వాళ్ళెవరో, పరాయి వాళ్ళెవరో నిర్ణయించుకోలేకపోయాము. అప్పుడు వారిని జీర్ణం చేసుకోలేకపోయాము. ఏవో కొన్ని ఒత్తిడులవల్ల మన నుండి వేరయిపోయిన వారిని కూడా మనం జీర్ణించుకోలేక పోయాము. వారు ఈనాడు ముస్లింలు, క్రైస్తవులు...'***

రేపు వీళ్ళు తిరగరాయబోయే చరిత్ర పాఠ్యపుస్తకాలు కూడా ఈ విధంగా ఉండబోతాయి. ఇది దేశ ప్రజలను నిజంగా ప్రేమించే దేశభక్తి గొంతేనా? ఈ వాక్యాలలో 'మనము' అంటే ఎవరు? ముస్లింలు, క్రైస్తవులు అందులో భాగం కారు. వాళ్ళనింకా 'జీర్ణం' చేసుకోవలసి ఉంది. ఈ చరిత్రలో ప్రజలంతా విదేశీ దుండగులపైన దేశభక్తియుతమైన పోరాటాలు చేస్తూనే వున్నారు; 'భారతదేశం' అనే భావన, సరిహద్దులతో సహా, ఎప్పటినుంచో ఉంది; దానిని మొత్తంగా కబళించాలని ప్రతీ విదేశీయుడు ఆశిస్తుండగా ఈ దేశాన్ని నిత్య రక్తదానంతో ప్రజలు కాపాడుకుంటున్నారు. ఇది వట్టి అబద్ధమే కాక అచారిత్రకం కూడా. ఇవ్వాళ్టి ఇండియా సరిహద్దులకు ఆవలనున్న వారు చాలామంది ఈవలనున్న రాజ్యాలను ఓడించగలిగారు. వాళ్ళనెవరూ తరిమికొట్టలేదు. వారు పెద్దరాజ్యాలే నెలకొల్పగలిగారు. అందువల్ల చెడే కాకుండా మంచి కూడా జరిగింది. భిన్న సంస్కృతుల నుండి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్న సమాజాలు ఆ మేరకు నిండుగా ఎదుగుతాయి. అందువల్ల మన దేశం చాలానే ప్రయోజనం పొందింది. 'సాంకర్యం' అనే అసహ్యమైన బ్రాహ్మణీయ భావన తలనిండా ఎక్కించుకున్న వారికి ఇది రుచించకపోవచ్చు గాక!

'వాళ్ళను ఇక్కడి ప్రజలు తరిమికొట్టారు' అనడంలో అవాస్తవికతే కాక చారిత్రక అసంబద్ధత కూడా ఉంది. ఇవ్వాళ్టి ఇండియా చిత్రపటాన్ని ఎప్పటి నుండో ప్రజలు 'మన దేశం'గా అనుకుంటున్నారనుకోవడం హాస్యాస్పదం. బ్రాహ్మణులలో ఎప్పటినుండో భరతభూమి, వేదభూమి, ఆర్యావర్తం మొదలయిన భావాలున్నాయి. వాళ్ళయినా దానికి భౌతికంగా ఈనాటి సరిహద్దులే ఇచ్చుకున్నారా అంటే అనుమానమే. ఇక ఇతర ప్రజలలో అటువంటి భావన వుండే అవకాశమే లేదు. ఎప్పటి మాటో ఎందుకు, ఈ రోజుటికి కూడా గ్రామీణ ప్రజలు 'మన దేశం' అనే మాటకు రకరకాల అర్థాలు ఇచ్చుకుంటారు. ఒక్కొక్క ప్రాంతంలో ప్రజలు తమదిగా భావించే 'దేశానికి' ఒక్కొక్క ఊహాత్మక సరిహద్దు ఉంటుంది. పెద్ద నదుల సమీపంలో నివసించే ప్రజలకు ఆ నదికి ఈవలనున్నదే తమ 'దేశం'. కొండల దగ్గర ఉండేవారికి ఆ కొండలకు ఆవలనున్నది పరాయి దేశం. ఆదివాసీ ప్రజలు తమ తెగ నివసించే ప్రాంతాన్ని తమ 'దేశం'గా భావిస్తారు. 'దేశం' అనే మాటను ఆ అర్థంలోనే ప్రయోగిస్తారు.

దీనిని గుర్తించకుండా ఉండవలసిన అవసరం సంఘ్‌పరివార్‌కు ఏముందో చూద్దాం. ఇక్కడ వారి రాజకీయ లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. భారతదేశం ప్రపంచ రాజకీయాలలో ఒక పెత్తందారీ రాజ్యంగా తయారుకావాలి. ఇప్పుడు అమెరికా ఉన్నట్టు ప్రపంచంలో ఏ పెత్తందారీ రాజ్యమూ ఉండకూడదనుకునే వారు దేశభక్తి అనే భావనను దేశానికి భౌతిక బలసంపత్తిని కల్గించే భావనగా చూడరు. నిజానికి దేశభక్తి అనే భావనలోనే ఆ స్వభావం ఉందని దాన్ని అనుమానంగా చూస్తారు. కానీ భారతదేశం ఒక అగ్రరాజ్యం కావాలని కోరుకునే వారికి 'దేశభక్తి' ఒక శక్తివంతమైన సాధనం. ఏ దేశం మీదనయితే ప్రజలు అచంచలమైన మమేకతాభావం పెంచుకోవాలని వారు ఆశిస్తున్నారో, ఆ దేశం ఈ రోజు ఒక చారిత్రక క్రమంలో ఏర్పడినదే తప్ప ఎప్పటినుండో ఒక భౌతిక వాస్తవికతగా గానీ, ఒక మానసిక భావనగా గానీ ఉన్నది కాదంటే వారికి నచ్చదు. అందుకు భిన్నంగా ఇదే 'దేశం' ఎప్పటి నుండో ఉందనీ, దానిపట్ల ప్రజలలో వీరభక్తి కూడా ఎప్పటినుండో ఉందనీ ప్రజలను నమ్మించడం వారి లక్ష్యానికి అవసరం. చరిత్రను తిరగరాయడానికి గల కారణాలలో ఇదొకటి.

హిందూత్వవాదుల సామాజిక లక్ష్యాన్నీ, రాజకీయలక్ష్యాన్నీ కలిపి చూస్తే వారి మెదళ్ళలో ఉన్న భవిష్యత్ చిత్రాన్ని చూడగలుగుతాం. అది హైందవ సామాజిక పునాది పైన నిలబడిన భారత అగ్రరాజ్యం. హైందవ సామాజిక పునాది అంటే మధ్యయుగాల నాటి కులవ్యవస్థే అనుకోనక్కరలేదు. పాతకాలపు కులవ్యవస్థ ప్రాతిపదికన ఆధునిక అగ్రరాజ్యాన్ని నిర్మించడం సాధ్యం కాదని వాళ్ళకు బాగానే తెలుసు. పైగా పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పించగల సంపద వీళ్ళకెంత మాత్రం చేదు కాదు. అందుకే వాళ్ళకు గ్లోబలైజేషన్ కావాలి, దానికి అనువయిన ఆర్థిక సాంకేతిక వ్యవస్థలు, ప్రక్రియలు కావాలి. అక్కడ విదేశీ ద్వేషమేమీ లేదు. అయితే సాంఘిక జీవితం మాత్రం హైందవ విలువల ప్రాతిపదికన ఉండాలి. ఇవి చాలా చక్కగా అతుకుతాయి కూడా. సాంకేతిక ఆధునికత, నిచ్చెనమెట్ల హైందవ సామాజిక విలువలు, అగ్రరాజ్య హోదా – ఇదీ సంఘ్ పరివార్ ఊహించుకునే ఇండియా. వీరు ఆధ్యాత్మికత గురించి ఎంతగానయినా మాట్లాడనీ గాక, వీరి లక్ష్యం మాత్రం ఇదే.

దీనిని నిర్మించడానికి కావలసింది ద్వేషం, అసహనం, బలప్రయోగం, దౌర్జన్యం. ఆ విలువలు నిండిన దేశభక్తి, జాతీయత యువతలో పెంచాలి. అందువల్ల తాము తిరగ రాయాలనుకున్న చరిత్రలో ద్వేషాన్నే చూడాలి. అసహనాన్నీ, మృగప్రాయమైన బలాన్నీ మాత్రమే చూడాలి. వీళ్ళు భారత్‌గా భావించే భూభాగానికి 'బయటి నుండి వచ్చిన వాళ్ళు కేవలం ద్వేషంతోనే వచ్చారు, అణచివేద్దామనే వచ్చారు. ఇక్కడి ప్రజలు వాళ్ళను ద్వేషంతోనే ఎదుర్కొన్నారు. బలప్రయోగంతోనే తరిమికొట్టారు. వాళ్ళు ఇక్కడి జీవితానికి ఇచ్చిందేమీ లేదు, పుచ్చుకున్నదీ లేదు. ఇక్కడి ప్రజలు వారికి ఇచ్చిందీ లేదు, వారి నుండి పుచ్చుకున్నదీ లేదు.'

ఈ అవాస్తవికమైన చిత్రాన్ని యువతకు ఇవ్వడం సంఘ్‌పరివార్ లక్ష్యానికి కావలసిన ద్వేషాన్ని కలిగించడానికి అవసరం. అంటే ఇది అబద్ధమని తెలిసీ వారు ఇస్తున్నారని కాదు. వాళ్ళ మెదళ్ళలో ఈ వికారం నిండి ఉంది. ఇస్లాం వ్యాప్తి మెడమీద కత్తిపెట్టి చేసిన మతమార్పిడుల ద్వారా జరిగిందనేది ఇటువంటి అబద్ధాలలో ఒకటి. అది వినేకొద్దీ, నమ్మేకొద్దీ హిందువులుగా పుట్టిన యువకుల మెదళ్ళలో ద్వేషం నిండుతుంది. ముస్లింల మీద ద్వేషంగా మొదలయినది ఒక

సాధారణ ద్వేషభావంగా మారగలదు, నిలిచిపోగలదు. దానిని సాధారణ ద్వేష భావంగా ఎప్పటికీ నిలబెట్టడం సంఘ్‌పరివార్ లక్ష్యాలకు అవసరం. అందుకే ముస్లింలపైన మొదలుపెట్టిన విద్వేష ప్రచారాన్ని క్రైస్తవం మీదికి తిప్పారు. మతపరమైన మైనారిటీల మీదనేకాక సామాజిక ఆర్థిక పీడనకు గురి అయిన ప్రజల ఆకాంక్షల మీద కూడా ఒక సార్వత్రిక నిరసనను హిందూత్వవాద ప్రచారం ఎప్పుడూ రాజేస్తూ ఉంటుంది.

మెడమీద కత్తిపెట్టి మతమార్పిడులు చేయాలని ప్రయత్నించిన ముస్లిం పాలకులూ, ప్రముఖులూ మన దేశంలో లేకపోలేదు. అలాగే పాలకుల మతంలోకి మారితే ఏవో ప్రయోజనాలు వస్తాయన్న ప్రలోభంవల్ల జరిగిన మత మార్పిడులు సహితం లేకపోలేదు. కానీ ఈ విషయంపై పరిశోధన చేసిన చరిత్రకారులందరూ చెప్పేదేమిటంటే బలప్రయోగం కన్నా, ప్రలోభాల కన్నా ఇస్లాం వ్యాప్తికి ఎక్కువ దోహదం చేసింది సూఫీ ప్రచారకుల బోధనలు. మంత్రతంత్రాలతో రోగాలు నయంచేస్తూ, హితబోధ చేస్తూ, పేదరికంలో బతుకుతూ దైవ భావనను ప్రజలలో ప్రచారం చేసిన ఈ 'పీర్'ల దర్గాలు దేశంలో ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాయి. ఎవరైనా లెక్కబెట్టారో లేదో తెలీదుగానీ మన దేశంలో మసీదుల కంటే దర్గాలే ఎక్కువనుకుంటాను. ఏ కట్టడంలేని 'దర్గా చెట్లు' బహుశా ఇంకా ఎక్కువేమో. ఇస్లాంను ప్రధానంగా ప్రచారం చేసిన పేద ఫకీర్ల హితబోధలకివి చిహ్నాలు. ఈ దర్గాలు, వాటిలో జరిగే పూజలు సనాతన ఇస్లాంకు నచ్చవు. వాటికి హిందువులు సహితం హాజరుకావడం బ్రాహ్మణీయ హైందవానికి అసలే నచ్చదు. అయినా అవి జరుగుతూనే ఉంటాయి. హిందువులు పెద్దసంఖ్యలో వాటికి హాజరవుతూనే ఉంటారు. ఈ దేశంలో బ్రాహ్మణ పండితులు, ముస్లిం ఇమాంలు మాత్రమే ఉంటే ఈ రెండు మతాల మధ్య ద్వేషం మాత్రమే ఉండేదేమో. పాకిస్తాన్‌లో చరిత్రను ఆ విధంగానే చెప్తున్నారు. సంఘ్‌పరివార్ రేపు తిరగరాయబోయే చరిత్రలో కూడా ఆ విధంగానే చెప్తారు. సామాన్య ప్రజలలో మతద్వేషం లేదని కాదు గానీ వారిలో ఉన్నది ద్వేషం మాత్రమే కాదు. చరిత్రలో ఈ రెండు మతాల మధ్య ద్వేషం మాత్రమే ఉండిందంటూ చరిత్రను తిరగరాసే ప్రయత్నం అబద్ధపు ప్రయత్నమే కాగలదు. కష్టాలలో సేదదీర్చే రక్షకునిగా దేవుడిని చూపించే భావనే

చరిత్రలో ఎప్పుడయినా వేగంగా ప్రచారం అయింది. అన్ని మతాలూ సామాన్య ప్రజలలో ఈ రకమైన దైవభావన ద్వారానే ఎక్కువ ప్రచారం పొందాయి. ఈ భావనలో ద్వేషానికి చోటు తక్కువ. అయినప్పటికీ సామాన్య ప్రజలలో పరమత ద్వేష భావం లేకపోలేదు. దానికి గల కారణాలను విశ్లేషించదానికిది సందర్భంకాదు గానీ ద్వేషమే ఏకైక భావన కాదని గుర్తించడం అవసరం. ఈ విషయం గుర్తించడమే సంఘ్‌పరివార్ చరిత్రకారులకు ఇష్టం లేదు.

మరీ మొరటుగా రాసిన సంఘ్‌పరివార్ ప్రచురణలే కాదు, విషయ పాండిత్యానికి లోటులేని భారతీయ విద్యాభవన్ ప్రచురించిన 'భారత ప్రజల చరిత్ర, సంస్కృతి' అనే బహుళ సంపుటాల ఉద్గ్రంథం ఇచ్చే చారిత్రక అవగాహన కూడా ఇదే. ఇస్లాం, హైందవం ఎటువంటి సహజీవనం సాధ్యం కాని ఉత్తర దక్షిణ ధృవాలనే అభిప్రాయాన్ని చదువుకున్న వారిలో ప్రచారం చేయడంలో ఆ ప్రచురణ, దాని సంపాదకుడయిన ప్రముఖ చరిత్రకారుడు ఆర్.సి. మజుందార్[6] విడిగా రాసిన రచనలు విశేషమైన పాత్ర నిర్వహించాయి. ముస్లిం రాజుల పాలన భారత చరిత్రలో చీకటియుగమన్న అభిప్రాయం కూడా ఈ ప్రచురణల ద్వారా ప్రాచుర్యం పొందింది. ఇప్పటి పాఠ్యపుస్తకాలు ఈ దృక్పథాన్ని బోధించడం లేదని సంఘ్‌పరివార్ అసంతృప్తి. దానిని సవరించాలన్నది వారి ఆరాటం. ఆ ఆరాటం ఫలితం ఏ విధంగా ఉంటుందో చూడాలంటే పాకిస్తాన్‌లో స్కూలు, కాలేజి పిల్లలకు చరిత్ర పాఠాలు ఏ విధంగా చెప్తున్నారో చూస్తే చాలునని ఒక చరిత్రకారుడు వ్యంగ్యంగా అన్నమాట అక్షర సత్యం. అక్కడ ఇదే అభిప్రాయాన్ని (రివర్స్‌లోనని వేరే చెప్పనవసరం లేదు) ఇప్పటికే అమలు చేస్తున్నారు.

కానీ నిజానికి బ్రాహ్మణ, ఇతర పెత్తందారీ కులాల సంగతేమో గానీ శ్రామిక కులాల వారికి ఇస్లాం పట్ల వ్యతిరేకత ఉండవలసిన అవసరమేమీ లేదు. లేకపోగా, ఇస్లాం వారిని బలంగా ఆకర్షించిన దాఖలాలున్నాయి. ఇస్లాం మతం మగవాళ్ళ వరకు దేవుడి ముందు సమాన ప్రతిపత్తిని కల్పిస్తుంది. కాని హైందవ నిచ్చెనమెట్ల సమాజంలో దేవుడి ముందే (అంటే ధర్మం ముందే) మనుషులు అసమానులు. నిచ్చెన కింది మెట్ల మీద ఉన్నవారిని ఇస్లాం ఆకర్షించిందనడంలో సందేహం లేదు. ఎక్కువ భాగం ఆ ప్రజలే ముస్లింలయ్యారు. హైందవ

చరిత్రకారులు ఇస్లాం ఆగమనం తదుపరి కాలాన్ని 'చీకటి యుగం' అంటే అనవచ్చును గానీ, ఈ ప్రజల జీవితాలకు మాత్రం అది వచ్చాకే కొంచెం వెలుగు వచ్చింది. మొదట ఇస్లాం, తరువాత క్రైస్తవం కులం కారణంగా కరుడుగట్టిన హైందవ సామాజిక వ్యవస్థను కొంతమేరకైనా ప్రజాస్వామీకరించడానికి తోడ్పడ్డాయి. అది చీకటి యుగం ఎట్లా అవుతుందో ఆ మాట ప్రయోగించేవారే చెప్పాలి.

హైందవ కులవ్యవస్థ ప్రయోగించిన అణచివేతను కొంతమేరకైనా సడలించే పాత్ర ఇస్లాం నిర్వహించిందని ఈనాటి 'సెక్యులర్' పాఠ్యపుస్తకాలు సహితం అనలేక పోతున్నాయి. ఆ అభిప్రాయం ఇప్పటికీ చరిత్ర పరిశోధకులు మాత్రమే చదువుకునే పుస్తకాలకు పరిమితం అయి ఉంది. ఈ ఒక్క విషయంలోనే కాదు, హిందుత్వ వాదుల దృక్పథంతో పోలిస్తే సెక్యులర్‌గానే కనిపించే ప్రస్తుత విద్యావ్యవస్థ ప్రాపంచిక అవగాహన ఏ విషయంలోనూ బ్రాహ్మణీయాన్ని బాహాటంగా విమర్శించదు, వ్యతిరేకించదు. అంటరానితనం వంటి మరీ తీవ్రమైన దురాచారాలను విమర్శించేవరకే అది పరిమితం అయింది. 'లౌకికత' పరిమితులే ఈ విధంగా ఉంటే ఇంక సంఘ్‌పరివార్ దృక్పథం పాఠ్యపుస్తకాలను లోబరచుకుంటే ఏం జరుగుతుందో ఊహించడం కష్టం కాదు.

శ్రామిక కులాలలో కూడా వ్యవసాయదారుల కంటే చేతివృత్తుల వారు ఎక్కువగా ఇస్లాం వైపు ఆకర్షితులయ్యారు. దీనికి గల కారణమేమిటో పరిశోధించిన వారెవరైనా ఉన్నారేమో తెలీదు. అయితే 'ముస్లిం యుగం' అని దేన్నయితే హిందుత్వవాద చరిత్రకారులు పిలుస్తారో ఆ కాలంలో పట్టణప్రాంత వ్యవసాయేతర ఉత్పత్తిరంగంలో వచ్చిన అభివృద్ధితో దీనికేమైనా సంబంధం ఉండవచ్చు. బట్టలు, తివాచీలు, ఇతర నేత సంబంధమైన ఉత్పత్తులు, అద్దకాలు, గృహనిర్మాణం, గృహోపకరణాల ఉత్పత్తిలో ఢిల్లీ సుల్తాన్ల కాలం నుండి గణనీయమైన అభివృద్ధి వచ్చింది. పశ్చిమాసియా నుండి, ఇరాన్ నుండి కొత్త సాంకేతిక ప్రక్రియలు, ప్రయోగాలు దిగుమతి అయ్యాయి. పాలకులు ముస్లింలు కావడం వల్ల, వారికి ఆ ప్రాంతాలతో సంబంధాలుండడం వల్ల మన ఆర్థిక జీవితానికి ఈ మేలు జరిగింది. గృహనిర్మాణకళ నుండి సంగీతం, చిత్రలేఖనం దాకా అనేక

రంగాలలో భిన్న సంప్రదాయాల కలయిక కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ద్వేషభావం వదలిపెట్టి చూడగలిగితే భిన్న సంప్రదాయాల కలయిక నాగరికతకు – కేవలం భౌతికంగానే కాదు, కళా సాంస్కృతిక రంగాలలోనూ, ఆలోచనలలోనూ – చేయగల మేలు కనిపిస్తుంది. మత, తాత్విక సంప్రదాయాలపైన కూడ ఈ ప్రభావం ఉంది. 12వ శతాబ్దం తరువాత వచ్చిన భక్తి ఉద్యమాలలో బ్రాహ్మణీయ ఆలోచనా రీతులపట్ల వ్యక్తమైన నిరసనపైనా ఇస్లాం ప్రభావం ఉంది. సిక్కుమతం కొన్ని విషయాలలో హైందవానికి సన్నిహితమైనా దానిపైన కూడా ఇస్లాం ప్రభావం బలంగా ఉంది. ఆ రకంగా మనది అనేక సంప్రదాయాలు కలిసిన ప్రాంతం కావడం మన నాగరికతను సుసంపన్నం చేసింది. ఇదంతా 'చీకటి'గా కనిపించేవారి మానసిక వికారానికి సానుభూతి చూపగల ఔదార్యం మనలో కొరవడకూడదు గానీ ఆ వికారాన్ని పాఠ్యాంశాలలో చేర్చి పిల్లల మనసులు, మెదళ్ళు పాడుచేస్తామంటే చూస్తూ ఊరుకోకూడదు.

పరిపాలనా వ్యవహారాలలో ఈనాటికీ కనిపించే కొన్ని మార్పులు ఢిల్లీ సుల్తాన్ల కాలంలోనూ, మొగలాయిల పాలనలోనూ వచ్చాయి. అది వట్టి 'చీకటి యుగం' కాదనడానికి ఇది కూడా ఒక నిదర్శనం. ఆధునిక 'సంక్షేమరాజ్యం' భావన ఉనికిలోకి వచ్చేదాకా రాజ్యానికి ప్రజలతో ప్రధానంగా రెండే సంబంధాలుండేవి. ఒకటి పన్నులు వసూలు చేయడం, రెండు శాంతిభద్రతలు నెలకొల్పడం. ఈ రెండు పనులూ, కొంత క్రమబద్ధంగా చేసిన రాజ్యం మంచిది, విచ్చలవిడిగా చేసిన రాజ్యం చెడ్డది. (అప్పుడప్పుడు చెరువులు తవ్వించిన, చెట్లు నాటించిన, రోడ్లు వేయించిన, సరాయిలు నిర్మించిన రాజ్యాలు లేకపోలేదుగానీ అవి అరుదయినవే).

పన్నుల వసూలుకూ, శాంతిభద్రతల నిర్వహణకూ ఒక క్రమబద్ధమైన యంత్రాంగము, నియమాలు ఏవీ లేకుండా ఆ అధికారాన్ని రాజు తన సామంతులకు, జాగీర్దార్లకు, నాయకులకు అప్పగించడం, వాళ్ళు విచ్చలవిడిగా దానిని వినియోగించడం ఒక నమూనా కాగా, దాన్ని మొత్తం క్రమబద్ధం చేసి కొన్ని నియమాలననుసరించి అ అధికారాన్ని నిర్వహించడం రెండవ నమూనా. దీని కోసమే ఇంగ్లండ్‌లో 'మాగ్నాకార్టా'[7] ప్రకటన జరిగింది. మన దేశంలో

అటువంటి హక్కుల ప్రకటన జరగలేదుగానీ రాజ్యమే తనకుతాను ఒక క్రమబద్ధమైన నిర్మాణాన్ని రూపొందించుకుంది. ప్రాచీన కాలంలో మౌర్యులు ఈ ప్రయత్నం కొంత చేశారు గానీ అది తరువాత అంతరించిపోయింది. తిరిగి ఢిల్లీ సుల్తానుల్లో ఒకడయిన ఫిరోజ్ తుగ్లక్ హయాంలో నిర్మాణయుతమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పడి, షేర్‌షా[8], అక్బర్‌ల కాలంలో స్థిరమైన రూపం తీసుకుంది. బ్రిటిష్ వాళ్ళు దానిని పెద్దగా మార్పులు లేకుండా కొనసాగించి స్వతంత్ర భారతానికి అందించారు. ఈ పరిపాలనా వ్యవస్థ (ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, న్యాయ యంత్రాంగాలు) ఎంతగా మన జీవితంలో భాగమయిపోయిందంటే దానికి సంబంధించి మనం తెలుగులో (తెలంగాణలోనే కాదు, ఆంధ్రలో కూడా) ఉపయోగించే మాటలన్నీ పర్షియన్ మూలం గల మాటలే. తాసీల్దారు, గుమాస్తా, శిస్తు, అమీన్, ఖర్చు, కిస్తు, తక్కావీ, ఖరీఫ్, రబీ, ఫసల్, మాఫీ ఇందుకు కొన్ని ఉదాహరణలు. చివరికి అచ్చ తెలుగు మాట అని చాలామంది అనుకునే 'రైతు' అనేది కూడా పర్షియన్ నుండి రెవెన్యూ యంత్రాంగం వ్యవహారభాష ద్వారా తెలుగులోకి దిగుమతి అయిన మాటే (వ్యవసాయదారుడికి అచ్చ తెలుగు మాట కాపు. అదిప్పుడు ఒక కులాన్ని సూచించే మాట అయింది). చెప్పవచ్చిందేమిటంటే హిందూస్తానీ సంగీతం నుండి తహశీలు ఆఫీసుదాకా, ఉర్దూభాష నుండి తివాచీ పరిశ్రమ దాకా 'చీకటి యుగం' అని పిలువబడే కాలంలో ఒక సంపన్నమైన మిశ్రమ సంస్కృతి రూపం తీసుకుంది. దానిని చూడలేక, ఒకదానితో ఒకటి కలవలేని – ఎడముఖం పెడముఖంగా మాత్రమే ఉండగల – భిన్న సంస్కృతులు పరస్పరం సంఘర్షించుకున్న చీకటి కాలంగా మాత్రమే ఆ కాలాన్ని ఆర్.సి.మజుందార్ వంటి విద్యావంతులయిన చరిత్రకారులే హిందూత్వవాద భావజాలం ప్రభావంలో భావించగలిగారంటే, ఇంక అర్ధ నిరక్షరాస్యులయిన ఖాకీ నిక్కరు మేధావుల చేతిలో పాఠ్యాంశాల భవితవ్యాన్ని పెడితే ఏం జరుగుతుందో ఊహించడానికే భయమవుతుంది.

వీర దేశభక్తిని సాధనంగా ఎంచుకున్న హిందూత్వ వాదానికి వీరుల చరిత్రలు అవసరం. చరిత్రలో వీరుల అన్వేషణ అవసరం. 'మన' వీరులను

మరచిపోయి యువతను శక్తిహీనుల్ని చేస్తున్నదని ప్రస్తుత విద్యావ్యవస్థపైన వారి అభియోగం. చరిత్ర నుండి ఆదర్శాలు ఎంచుకోవడంలో తప్పు లేదు. యువతకు సరయిన విలువలు నేర్పడానికి అది అవసరం కూడా కావచ్చు. కానీ అందుకు 'వీరులే' ఎందుకు కావాలి? ఒక భౌతిక శక్తిగా భారత దేశాన్ని తీర్చిదిద్దే లక్ష్యముంటేనే కావాలి. మనది ఆధ్యాత్మిక సంస్కృతి అని చెప్పుకునే వారే చరిత్ర దగ్గరకొచ్చే సరికి 'వీరుల' అన్వేషణ చేయడం ఎందుకు?

ఆధ్యాత్మికత సంగతేమోగానీ మానవీయ విలువలు ప్రధానమనుకుంటే బుద్ధుడినీ, అశోకుడినీ, కబీర్[9]నూ – ఒక మేరకు గాంధీని కూడా – ఆదర్శంగా తీసుకోవచ్చు. పీడనను వ్యతిరేకించే పోరాట స్ఫూర్తి ప్రధానమనుకుంటే అల్లూరి సీతారామరాజునూ, బిర్సా ముండా[10]నూ, భగత్‌సింగ్‌నూ తీసుకోవచ్చు. కానీ హిందూత్వవాదుల ఆదర్శ చారిత్రక వ్యక్తులు వీరెవ్వరూ కారు. వారికి 'వీరులు' కావాలి. అది కూడా ఒక పెడ అర్థంలో మాత్రమే. ముస్లిం రాజులపైన యుద్ధం చేసిన హిందూరాజులే ఆ 'వీరులు'. వెయ్యేళ్ళ చరిత్రను ముస్లింలపైన హిందువులు చేసిన విముక్తి పోరాటంగా వారు చిత్రీకరించదలుచుకున్నారు. కాబట్టి శివాజీ[11], రాణాప్రతాప్[12], శ్రీకృష్ణదేవరాయలు[13] వగైరాలు వీరి 'వీరులు.' వీరంతా 'భారతదేశం' అనే దేశాన్ని భావించుకొని దానిని ముస్లిం పాలకుల నుండి 'విముక్తి' చేసే లక్ష్యాన్ని కలిగి ఉన్నారని నమ్మడం కష్టం. తాము హిందువులు, ఎదుటివారు ముస్లింలు అన్న స్పృహ వీరిలో లేదని కాదు. దానిని వారి రాజ్యాధికార పోరాటంలో వాడుకోలేదని కూడా కాదు. కానీ ఈనాటి హిందూత్వవాదుల దృక్కోణాన్ని వారికి అంటగట్టి, తమ రాజ్య విస్తరణ కోసమో, రక్షణ కోసమో వారు చేసిన యుద్ధాలలో 'దేశ విముక్తి' లక్ష్యాన్ని చూడడం అచారిత్రకం. నిజానికి హిందూ రాజులూ ముస్లిం రాజులూ ఒకరితో ఒకరు చేతులు కలిపి ఇతర హిందూ రాజులపైన, ముస్లిం రాజులపైన యుద్ధాలు చేసిన సంఘటనలనేకం ఉన్నాయి.

మన–తన భావనకు హిందూ–ముస్లిం ప్రాతిపదిక ఆనాడు ఉండిన మాట వాస్తవమే. కానీ అదొక్కటే లేదు. ఈనాటికీ మన గ్రామాలలో ముస్లింలను అన్ని కులాలతో పాటు ఒక కులంగా చూస్తారు. మన–తన భావనలో కులానికి స్థానం వున్నట్టే హిందూ–ముస్లిం భావనకు కూడా ఉంది, ఉండింది. అంతకుమించి దానినే సాంఘిక వర్గీకరణకు కేంద్రం చేసి హైందవ వీరులను సృష్టించడం

చరిత్రను సహేతుకంగా అర్థం చేసుకోవడానికీ పనికిరాదు, రేపటి జీవితాన్ని సరిగ్గా తీర్చిదిద్దుకోవడానికీ పనికి రాదు. హిందూత్వవాదుల ఆధిపత్యవాద అజెండాకేమైనా పనికొస్తుందేమో! అసలు భారతదేశ చరిత్రను హిందూ యుగం (క్రీ.శ. 11వ శతాబ్దం దాకా), ముస్లిం యుగం (అప్పటి నుండి బ్రిటిష్ పాలన నెలకొనే దాకా), బ్రిటిష్ యుగం అని వర్గీకరించడమే అశాస్త్రీయమనీ, ముస్లిం రాజుల ఆగమనం అంతటి పునాది ప్రాయమైన మార్పేమీ తీసుకురాలేదనీ రొమిల్లా థాపర్ వంటి చరిత్రకారులు సవివరంగా వాదించి ఉన్నారు. ఆ వచ్చిన మార్పు కూడా పూర్తిగా చెడ్డదీ కాదు, విధ్వంసకరమైనదీ కాదు – అని పైన చూశాం.

అన్ని రకాల అధ్యయనాలలోకీ చరిత్ర అధ్యయనానికొక ప్రత్యేకమైన స్థానం ఉంది. అది కావడానికి గతాన్ని గురించి చేసే అధ్యయనమేగానీ ప్రేరణ వర్తమానం నుండి, భవిష్యత్తు నుండి వస్తుంది. వర్తమానాన్నీ, భవిష్యత్తునూ మనం ఏ రకంగా ప్రభావితం చేయదలచుకున్నామన్న దాన్ని బట్టి గతంవైపు చూసే మన దృష్టికోణం ఉంటుంది. దానికి తగిన విలువలనూ, చారిత్రక ఆధారాలనూ, ఆదర్శాలనూ చరిత్రలో మనం వెతుక్కుంటాము. ఆ కోణం నుండి చరిత్రను వ్యాఖ్యానించుకుంటాం. నిజాయితీగా వ్యవహరించదలుచుకుంటే ఏ భవిష్యత్తు ప్రయోజనాల కోసం మనం గతాన్ని అధ్యయనం చేస్తున్నామో ప్రకటించుకోవాలి.

దానితోబాటు అధ్యయన సంబంధమైన నిజాయితీ కూడా ఉండాలి. శాస్త్రీయ దృక్పథం ఉండాలి. మన దృష్టి కోణానికి (అది ఎంత గొప్పదయినా కానియ్యండి) పనికొచ్చే విషయాలనే కాక దానిని అబద్ధం చేయగల విషయాలను కూడా చూడాలి, విశ్లేషించాలి, అవసరమైతే ఆ వెలుగులో మన దృక్కోణాన్ని పునర్వ్యాఖ్యానించుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అంతే కాక మనతో విభేదించే దృక్కోణాలను వక్రీకరించడమో తొక్కిపెట్టడమో కాకుండా సంవాదం ద్వారా వాటిని ఎదుర్కోవాలి. సంఘ్‌పరివార్ తిరగ రాయదలచుకున్న చారిత్రక దృక్పథం విలువలు అమానవీయమైనవి, ప్రజాస్వామిక దృక్పథానికి అవాంఛనీయమైన భవిష్యత్ లక్ష్యం నుండి పుట్టినవి. అంతే కాక వారి అధ్యయన పద్ధతిలో శాస్త్రీయమైన నిజాయితీ శూన్యం.


దీనిపైన పోరాటమంటే హిందూత్వవాదుల సామాజిక, రాజకీయలక్ష్యాలపైన పోరాటం. ఈ దేశాన్ని తమ వికృతమైన ఆలోచనల నమూనాలో పునర్నిర్మించాలన్న

వారి ప్రయత్నం మీద పోరాటం. ఇప్పటికే ప్రజాతంత్ర ఉద్యమాల బలహీనతల వల్ల వారు తమ అజెండాను చాలా వేగంగా ముందుకు తీసుకుపోతున్నారు. దానిని అడ్డుకునే ప్రయత్నానికి సంఘటిత రూపం ఇవ్వడం అవసరం, సమగ్రమైన ఆలోచన పైన దానిని నిలబెట్టడం అవసరం.

1. హరప్పా – మొహంజదారో నాగరికత : క్రీస్తుపూర్వం 3300–1300 మధ్య విలసిల్లిన సింధునదీ నాగరికతలో హరప్పా, మొహంజదారోలే ముఖ్య పట్టణాలు కాబట్టి దాన్ని ఈ పేరుతో కూడా వ్యవహరిస్తారు. ఈ రెండూ ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నాయి. ఒకనాడది ప్రస్తుత ఆఫ్ఘనిస్తాన్‌లోని ఈశాన్య ప్రాంతం నుండి నేటి భారతదేశంలోని వాయవ్య ప్రాంతం వరకు విస్తరించి ఉండేది.
2. రొమిల్లా థాపర్ (1931– ) : చరిత్రకారిణి. ప్రాచీన భారతదేశ చరిత్రపై విస్తృతంగా పరిశోధించి అనేక పుస్తకాలు రాశారు. 'ఎ హిస్టరీ ఆఫ్ ఇండియా', 'ఎర్లీ ఇండియా : ఫ్రం ద ఆరిజన్స్ టు ఎ.డి. 1300' వాటిలో ముఖ్యమైనవి. ఢిల్లీ జెఎన్‌యులో ప్రొఫెసర్ ఎమెరిటాగా ఉన్నారు.
3. అర్థశాస్త్ర : కౌటిల్యుడు లేదా విష్ణుగుప్తుడు లేదా చాణుక్యుడు రాజ్యపాలన గురించి రాసిన గ్రంథం. క్రీస్తుపూర్వం 350–275 సంవత్సరాల మధ్య బతికిన చాణుక్యుడు మొదట తక్షశిల విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ఉండేవాడు. ఆ తర్వాత చంద్రగుప్త మౌర్యునికి గురువుగానే కాక సంరక్షకుడిగా కూడా వ్యవహరించాడు. సైనిక, ఆర్థిక, పరిపాలనా విషయాలకు సంబంధించి ఇది రాజులకు గైడ్ లాంటిదని పేరు పొందింది.
4. ఆపస్తంబ ధర్మసూత్రం : ఆపస్తంబుడు రాసిన 'కల్పసూత్రం' అనే గ్రంథంలో ధర్మసూత్రం ఒక భాగం. దీన్ని క్రీస్తుపూర్వం 450–350 మధ్య రచనగా భావిస్తున్నారు. బౌద్ధాయన, గౌతమ, వశిష్ట ధర్మసూత్రాల కంటే దీని ప్రతే మనకు మంచి స్థితిలో లభ్యమైంది.
5. ఘోరీ మహమ్మద్ (1149–1206) : ఆఫ్ఘనిస్తాన్‌లోని ఘోర్ అనే చిన్న రాజ్యానికి రాజుగా మొదలై భారతదేశంలోని అనేక రాజ్యాలను జయించాడు. పృథ్వీరాజ్ చౌహాన్‌ను ఓడించి ఢిల్లీని కూడా స్వాధీనం చేసుకున్నాడు. కుతుబుద్దీన్ ఐబక్ ఆయన వారసుడిగానే ఢిల్లీ గద్దెనెక్కాడు.
6. ఆర్.సి. మజుందార్ (1888–1980) : పూర్తి పేరు రమేశ్ చంద్ర మజుందార్. ఇక్కడ పేర్కొన్న 'భారత ప్రజల చరిత్ర, సంస్కృతి' అనే 11 సంపుటాల గ్రంథానికి సంపాదకుడిగా వ్యవహరించడమే కాక బెంగాల్ చరిత్ర మీద, తూర్పు ఆసియాలోని భారత వలస దేశాల మీద, స్వాతంత్రోద్యమం మీద అనేక పుస్తకాలు రాశారు.
7. మాగ్నాకార్టా : ఇంగ్లండ్ రాజు జాన్‌కి, కొందరు బారన్ల (Barons) కి మధ్య 1215లో కుదిరిన హక్కుల ఒప్పందం. అక్రమ నిర్బంధం నుంచి రక్షణ, మత స్వేచ్ఛ, సత్వర న్యాయం, చెల్లింపులకు పరిమితులు మొదలైన అనేక విషయాలను ఇందులో పొందు

పరిచారు. చాలా గొప్ప ఒప్పందం కాబట్టే దీనికి మాగ్నాకార్టా అనే పేరు వచ్చింది. ఈ లాటిన్ మాటకి అర్థం గ్రేట్ చార్టర్ అని. 1297లో ఇది ఇంగ్లండ్ చట్టాలలో భాగమైంది.

8. షేర్‌షా (1486–1545) : పరిపాలించింది ఐదేళ్ళే అయినా పౌర, సైనిక వ్యవస్థలలో అనేక మార్పులు తీసుకొచ్చాడు. మన రూపాయికి మూలమైన రూపియాను ప్రవేశపెట్టింది షేర్‌షా సూరినే.
9. కబీర్ (1440–1518) : హిందూ, ఇస్లాం రెండు మతాల్లోని మూఢత్వాన్ని వ్యతిరేకించిన కవి. యోగి. భక్తి ఉద్యమానికి ఆద్యుడు. సూఫీతత్వాన్ని ప్రచారం చేసినవాడు.
10. బిర్సాముండా (1875–1900) : చోటా నాగపూర్ ప్రాంతంలో ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన ముండా జాతి నాయకుడు. జమీందార్ల, వ్యాపారస్తుల జులుంకు వ్యతిరేకంగా, ఆదివాసుల భూములను ఆక్రమించుకున్న ఆదివాసీయేతరులకు వ్యతిరేకంగా పోరాడిన బిర్సాను బ్రిటిష్‌వాళ్ళు 1900 మార్చిలో అరెస్టుచేసి జైలులో పెట్టారు. పోలీసు స్టేషన్లమీద దాడులు జరిపాడని అతనిపై కేసులు పెట్టారు. మూడు నెలల తర్వాత బిర్సా కలరాతో రాంచీ జైలులో మరణించారు.
11. శివాజీ (1630–1680) : పూర్తి పేరు శివాజీ భోంస్లే. మరాఠా రాజు. చిన్న వయస్సులోనే పలు యుద్ధాలు చేసి బీజాపూర్ సుల్తాన్ నుండి అనేక కోటలను కైవసం చేసుకుని స్వతంత్ర రాజుగా ఎదిగాడు. ఔరంగజేబును కూడా ఎదిరించి నిలదొక్కుకున్నాడు.
12. రాణా ప్రతాప్ (1545–1597) : మేవార్ రాజు. రాజపుట్ వంశస్తుడు. మొగల్ చక్రవర్తి అక్బర్‌కు లొంగిపోకుండా చివరివరకు స్వతంత్ర రాజుగా బతికి రాజస్తాన్‌లో నేటికీ గొప్ప వీరుడుగా కీర్తించబడుతున్న వ్యక్తి.
13. కృష్ణదేవరాయలు (1471–1529) : విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజులలో ముఖ్యుడు. బీజాపూర్, గోల్కొండ, బహమనీ సుల్తానులను, గజపతి రాజులను ఓడించి దక్షిణ భారతదేశంలో అతి పెద్ద రాజ్యాన్ని ఏలిన చక్రవర్తిగా పేరు గడించాడు.









సయ్యద్ నశీర్ అహమ్మద్ రాసిన ఏడు పుస్తకాలు: భారత స్వాతంత్రోద్యమం–ముస్లిం మహిళలు, భారత స్వాతంత్రోద్యమం–ముస్లింలు, భారత స్వాతంత్రోద్యమం–ఆంధ్రప్రదేశ్ ముస్లింలు, మైసూర్ పులి టిప్పు సుల్తాన్, షహీద్–ఎ–ఆజం అష్ఫాఖుల్లా ఖాన్, భారత స్వాతంత్రోద్యమం–ముస్లిం ప్రజాపోరాటాలు, భారత స్వాతంత్ర్య సంగ్రామం – ముస్లిం యోధులు (ప్రథమ భాగం) పుస్తకాలపై రాసిన సమీక్షా వ్యాసం ఇది.
ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్ ప్రచురణ (1999–2005)

**సయ్యద్ నశీర్ అహమ్మద్ (1955– )** : తొలుత న్యాయవాది, తర్వాత జర్నలిస్టు. పైన పేర్కొన్న ఏడు పుస్తకాలు కాక, 'చిరస్మరణీయులు' '1867 : ముస్లింలు' 'అక్షర శిల్పులు', 'చరితార్థులు' పేరుతో మరో నాలుగు పుస్తకాలు కూడా తీసుకొచ్చారు.

*ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనీ, సిపాయిల తిరుగుబాటు అనీ వివిధ పేర్లతో పిలవబడే 1857 తిరుగుబాటు ఒక మతానికీ, ఒక మతస్థులకూ చెందినది కాదు గానీ దానిని ఒకరి తిరుగుబాటుగా చూడదలచుకుంటే అది ప్రధానంగా ముస్లింల తిరుగుబాటు. బ్రిటిష్ వాళ్లు దానిని ఆ రకంగానే అర్థం చేసుకున్నారు. ఏక సమయంలో 1857ను మహత్తర స్వాతంత్ర్య పోరాటంగా ప్రస్తుతిస్తూ, ముస్లింలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని నిందించే వారికిది మింగుడుపడక పోవచ్చుగాక. ఆ పోరాటంలో పాల్గొన్న సంస్థానాధీశులంతా తమ సింహాసనాలు, రాచరికాలు కాపాడుకోవడానికే పాల్గొన్నారని వ్యాఖ్యానించేటట్టయితే అది ముస్లింలకెంత వర్తిస్తుందో హిందువులకూ అంతే వర్తిస్తుంది. రాజ్యాధికారం కోల్పోయామన్న దుగ్ధతోనే వారు కదిలినప్పటికీ అది స్వాతంత్ర్య పోరాటమే అనుకుంటే అది ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ఎంతమేరకు వర్తిస్తుందో, అవధ్ రాణి బేగం హజ్రత్ మహల్‌కూ అంతే వర్తిస్తుంది. అయినప్పటికీ లక్ష్మీబాయి దేశభక్తికి చిహ్నంగా దేశమంతా పరిచయం కాగా (తెలుగునాట – కనీసం కోస్తాంధ్రలో – ఒక తరంలో ప్రతీ రెండవ ఇంటా ఒక ఝాన్సీ ఉండేది) బేగం హజ్రత్ మహల్ గురించి నశీర్ అహమ్మద్ వంటివారు చెప్తే తప్ప తెలియని దుస్థితి దేశానికి పట్టింది.*

# దేశ స్వాతంత్ర్య ఉద్యమం - ముస్లింలు

## సయ్యద్ నశీర్ అహమ్మద్ రచనలపై సమీక్షా వ్యాసం

***ఏ ప్రజలయినా*** తాము సహితం దేశభక్తులేనని రుజువు చేసుకునే స్థితిలో ఉండడం – లేక రుజువు చేసుకోవలసిన స్థితిలోకి నెట్టబడడం– అన్యాయమంటే అందరూ ఒప్పుకుంటారు. 'ఇన్ జనరల్' ఒప్పుకోవడం పెద్దగా కష్టం కూడా కాదు. కానీ 'ఎందుకు అన్యాయం?' అన్న ప్రశ్న వేసుకొని కొంచెం లోతుగా విశ్లేషిస్తే అందరికీ కాకున్నా కొందరికి ఇబ్బంది అనిపించే జవాబులు దొరకగలవు.

దేశభక్తి అనేది వివాదానికి అతీతమైన సద్గుణం అనీ, మంచివాళ్లందరూ ఆ అర్థంలో దేశభక్తులు అయ్యే ఉంటారనీ అనుకుంటే 'ఎందుకు అన్యాయం' అన్న ప్రశ్నకు సులభమయిన జవాబు దొరుకుతుంది. మేము సహితం మంచి వాళ్ళమేనని రుజువు చేసుకోవలసి రావడం అన్యాయమే మరి.

కానీ దేశభక్తి అనేదే సమస్యాత్మకమైన భావన. కొన్ని కోణాలలో, కొన్ని అర్థాలలో అది ప్రజాస్వామిక భావనే కాగలదు. కొన్నిటిలో మాత్రం కాదు. తాము సహితం దేశభక్తులేనని రుజువు చేసుకోవలసిన స్థితికి నెట్టబడిన వారికి జరిగే ముఖ్యమైన అన్యాయం ఈ సంగతి చెప్పలేకపోవడం, ఈ మాటలు అనలేకపోవడం. గుడిపాటి వెంకటాచలం[1] అనే హిందూ అగ్రకులానికి చెందిన రచయిత (మతాన్ని గురించి, కులాన్ని గురించి ఆయన అభిప్రాయం ఏమయినప్పటికీ) "దేశభక్తి కంటే హీనమైన పాపం" వేరే ఏదీ లేదని అనగలిగాడు. దానిని జోక్‌గా తీసుకున్న వారు జోక్‌గా తీసుకున్నారు, వ్యంగ్యంగా భావించినవారు వ్యంగ్యంగా భావించారు, సమకాలీన రాజకీయాల మీద సీరియస్ వ్యాఖ్యగా అర్థం చేసుకున్నవారు ఆ విధంగా అర్థం చేసుకున్నారు. చలం గారికి ఆ వ్యాఖ్య వల్ల ఏ కష్టమూ రాలేదు. కాని ఒక ఇండియన్ ముస్లిం, ఒక ఇండియన్ క్రిష్టియన్ అంత సులభంగా ఆ మాట అనగలరా?

అంబేద్కర్‌కే ఎంత కష్టమయింది ! కాంగ్రెస్‌వారి జాతీయోద్యమం ప్రచారం చేసిన అర్థంలో 'దేశభక్తులు' కావడమే రాజకీయ కార్యకర్తలందరి కర్తవ్యం కాదనీ,

---

మానవ హక్కుల వేదిక 7వ బులెటిన్, మే 2005

దానికంటే సాంఘిక సంస్కరణ కోసం, సాంఘిక విప్లవం కోసం పనిచేయడం గొప్ప విషయమనీ అన్నందుకు ఆయన 'బ్రిటిష్ ఏజెంట్' అన్న నింద ఎన్నేళ్లు మోయవలసి వచ్చింది ! ఆ నిందకు కాలం చెల్లిపోయిందని అనుకుంటున్న దశలో అరుణ్ శౌరి[2] మళ్లీ దానికి ప్రాణం పోయగలిగాడంటే ఈ 'దేశభక్తి' అనేది నిజంగానే అతి హేయమయిన పాపం అనిపిస్తుంది. అంబేద్కర్ గొప్పదనమేమిటంటే, దేశభక్తి అనే మాటకు భయపడి 'సాంఘిక విప్లవం కోసం పనిచేయడమే నిజమయిన దేశభక్తి' అని వాదించే ప్రయత్నం (నాకు తెలిసి) చేయలేదు. చేస్తే తప్పు కాకపోవచ్చును గానీ చేయలేదు. తాను అత్యవసరమని భావించిన రాజకీయ కార్యాచరణలో తన పాటికి తాను నిమగ్నం అయ్యాడు.

ఈ ఉపోద్ఘాతానికి అర్థం, భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను వెలికి తీయడానికి సయ్యద్ నశీర్ అహమ్మద్ చేసిన (ఇంకా చేస్తూనే ఉన్న) ప్రయత్నం వృథా అని గానీ, గాడితప్పిన ప్రయాస అని గానీ చెప్పడం కాదు. నశీర్ అహమ్మద్‌ది ప్రశంసనీయమైన కృషి అనడంలో సందేహమేమీ లేదు. ఒక నిందకు జవాబు వివిధ స్థాయిలలో చెప్పవచ్చు. నిందవేసే వారి విలువల పరిధి లోనూ జవాబు చెప్పవచ్చు, ఆ విలువలను విమర్శించడం ద్వారానూ చెప్పవచ్చు. తరచుగా రెండూ అవసరమవుతాయి. ఇప్పటివరకు మొదటి పని చేస్తూ వున్న నశీర్ అహమ్మద్ రెండవది కూడా మొదలుపెట్టగలడన్న ఆశతో ఈ నాలుగు మాటలు అనడం జరిగింది.

బ్రిటిష్ పాలన నుండి భారత్‌కు విముక్తి సాధించిపెట్టేదే దేశభక్తియుత మయిన రాజకీయాచరణ అని ఒప్పుకున్నా, ఆ రకమైన దేశభక్తి ప్రదర్శించిన వారే గొప్పవారనుకున్నా, అటువంటి గొప్పవారిలో ముస్లింల పాలు ఎంతమాత్రం తక్కువ కాదని నశీర్ అహమ్మద్ చాలా వివరంగా నిరూపించారు. అరుణ్‌శౌరీ వంటివారు రేపు ఏం మాట్లాడినా దానికి జవాబు చెప్పడానికి కావలసిన సమాచారం తెలుగు సమాజానికి అందిచ్చారు.

నిజానికి మనిషి ఆలోచనలకు ముఖ్యమైన మూలం – చుట్టూ ఉన్న పరిస్థితులనీ, వాటిలో మతం ఒకానొకటి మాత్రమేననీ, ఎప్పుడో తప్ప అదే ప్రధానం కాదనీ గుర్తించినట్టయితే బ్రిటిష్ వలస పాలనకు తొలినాడు వ్యతిరేకత

హిందువుల కంటే ముస్లింలలోనే ఎక్కువ ఉండే అవకాశం ఉందని గ్రహించడానికి నశీర్ అహమ్మద్ రచనలు చదవనక్కరలేదు - కొంచెం చరిత్ర తెలిస్తే చాలు. బ్రిటిష్ వాళ్లు భారతదేశంలో రాజ్యాధికారం నెలకొల్పే ప్రయత్నం మొదలుపెట్టేసరికి ఇక్కడ పాలకులు ఎక్కువగా మతం రీత్యా ముస్లింలు. అలాగే యుద్ధాలలో ఓడిపోయి బ్రిటిష్ వారికి అధికారం అప్పగించిందీ ఎక్కువగా ముస్లిం రాజులే. బ్రిటిష్ విజయాన్ని 'ముస్లింల' ఓటమిగా భావించడం 18,19 శతాబ్దాలలో సాధారణ విషయంగా ఉండేది. బ్రిటిష్ పాలనను తొలినాడు హిందువుల కంటె ముస్లింలే ఎక్కువ నిరసించారు. హిందూ సమాజానికి చెందిన ఆధిపత్య వర్గాలు - బ్రాహ్మణ, కాయస్థ, బనియా, రాజపుత్ర కులాలు - త్వరలోనే బ్రిటిష్ పాలనకు 'అడ్జస్ట్' అయ్యారు. పర్షియన్ మరచిపోయి ఇంగ్లీష్ నేర్చుకున్నారు. కొత్త పాలనలో తమ స్థితిగతులకు ఉచితమైన హోదా వెతుక్కున్నారు. కాని ముస్లిం పాలకవర్గాలు, మధ్యతరగతి అంత సులభంగా అడ్జస్ట్ కాలేదు. బ్రిటిష్ వ్యతిరేకతను చాలా కాలం పోగొట్టుకోలేదు. ఈ కారణంగా వారు పాశ్చాత్యీకరణలో వెనకబడి, 20వ శతాబ్దం వచ్చేసరికి అభివృద్ధిలోనూ హిందూ అగ్రకులాల కంటె వెనకబడి పోయారు. అది వేరే చరిత్ర.

అందువల్ల తొలినాటి నుండీ బ్రిటిష్ పాలనను వ్యతిరేకించిన వారిలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉండడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదు. కనీస చరిత్ర జ్ఞానం లేకుండా, తమ సంకుచితమైన నినాదాలే సత్యం అనుకునే వారిది వేరే సంగతి.

ఇక మామూలు జనం విషయానికొస్తే, బ్రిటిష్ వలసవాదం సంప్రదాయ వృత్తులపైన, వ్యవసాయ రంగంపైన వేసిన దుష్ప్రభావం మతంతో నిమిత్తం లేకుండా అందరి మీదా ఒకే విధంగా పడింది. కొందరు మౌనంగా సహించారు, కొందరు సాధారణ స్థాయిలో నిరసించారు, కొందరు తిరగబడ్డారు. అన్ని శ్రేణులలోనూ అన్ని మతాలవారూ ఉన్నారు. అయితే బ్రిటిష్ పాలన తొలుత స్థిరపడింది బెంగాల్‌లో కావడం వల్ల, జమీందారీ వ్యవస్థను తొలుత ప్రవేశపెట్టింది అక్కడే కావడం వల్ల, దానికి బలయిన బెంగాల్ రైతాంగం (ముఖ్యంగా తూర్పు బెంగాల్ రైతాంగం) ఎక్కువగా ముస్లింలు కావడం వల్ల తొలినాటి గ్రామీణ అలజడులలోనూ ముస్లింల భాగస్వామ్యమే అధికం.

## టిప్పు విశిష్టత

పాలకవర్గ తిరుగుబాటుదార్లను మొదట తీసుకుంటే, బ్రిటిష్ వాళ్లు టిప్పు సుల్తాన్[3]కు భయపడినంతగా వేరే ఎవరికీ భయపడలేదు. భయం అంటే కేవలం సైనిక భయం కాదు. టిప్పుది హేతుబద్ధమైన ఆధునిక ఆలోచనారీతి. తన చుట్టూ ఉన్న ఇతర – హిందూ, ముస్లిం – వైరి రాజుల వల్ల తన రాజ్య సౌభాగ్యానికేం నష్టం లేదు గానీ, బ్రిటిష్ వారి విషయం వేరే అని స్పష్టంగా గ్రహించిన అతికొద్ది మంది ఇండియన్ పాలకులలో టిప్పు ఒకడు. తక్కినవాళ్లు ఒకసారి కాకపోతే ఒకసారి తమ పొరుగు రాజులను ఓడించడానికి బ్రిటిష్ వారితో చేతులు కలిపారు గానీ టిప్పు ఒక్కడే ఆ పని ఎన్నడూ చేయలేదు. అందుకు భిన్నంగా, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా దక్కన్‌లోని రాజ్యాలన్నిటినీ ఏకం చేయాలని (ఫ్రెంచి వారి సాయం కూడా తీసుకోవాలని) ప్రయత్నించాడు. తన ప్రయత్నాన్ని అర్థం చేసుకోలేకపోయిన తన ఇరుగు పొరుగు రాజుల తెలివితక్కువతనానికి విసుక్కున్నాడు. కానీ చివరివరకు బ్రిటిష్ వారిని కేవలం మరొక వైరి రాజుగా చూడడానికి వీలులేదన్న తన అవగాహనను వదులుకోలేదు. చివరి మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ చనిపోయాడని తెలిసి "ఇక ఇండియా మనదే"నని బ్రిటిష్ సైనిక అధికారి ఒకరు సంతోషం పట్టలేక ప్రకటించాడనీ, టిప్పు సుల్తాన్‌ను ప్రశంసిస్తూ "ప్రపంచం నిన్నూ, నన్నూ మరచిపోయిన తరువాత చాలాకాలం వరకు కూడా టిప్పు సుల్తాన్‌ను జ్ఞాపకం  పెట్టుకుంటుంది" అని గవర్నర్ జనరల్ వెల్లెస్లీ[4] అన్నాడనీ చరిత్రకారులు చెప్తారు. నశీర్ అహమ్మద్ ప్రచురించిన పుస్తకాల పరంపరలో టిప్పు సుల్తాన్ మీద ప్రత్యేకంగా ఒక చిన్న రచన ('మైసూర్ పులి టిప్పుసుల్తాన్') ఉండడం ఉచితమే. దానిని విస్తరించి ఇంకా వివరంగా రాయగలిగితే బాగుంటుంది.

ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనీ, సిపాయిల తిరుగుబాటు అనీ వివిధ పేర్లతో పిలవబడే 1857 తిరుగుబాటు ఒక మతానికీ, ఒక మతస్తులకూ చెందినది కాదుగానీ దానిని ఒకరి తిరుగుబాటుగా చూడదలచుకుంటే అది ప్రధానంగా ముస్లింల తిరుగుబాటు. బ్రిటిష్ వాళ్లు దానిని ఆ రకంగానే అర్థం చేసుకున్నారు. ఏక సమయంలో 1857ను మహత్తర స్వాతంత్ర్య పోరాటంగా

ప్రస్తుతిస్తూ, ముస్లింలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని నిందించే వారికిది మింగుడుపడక పోవచ్చుగాక. ఆ పోరాటంలో పాల్గొన్న సంస్థానాధీశులంతా తమ సింహాసనాలు, రాచరికాలు కాపాడుకోవడానికే పాల్గొన్నారని వ్యాఖ్యానించేటట్టయితే అది ముస్లింలకెంత వర్తిస్తుందో హిందువులకూ అంతే వర్తిస్తుంది. రాజ్యాధికారం కోల్పోయామన్న దుగ్ధతోనే వారు కదిలినప్పటికీ అది స్వాతంత్ర్య పోరాటమే అనుకుంటే అది ఝాన్సీరాణి లక్ష్మీబాయికి ఎంతమేరకు వర్తిస్తుందో, అవధ్ రాణి బేగం హజ్రత్ మహల్[5]కూ అంతే వర్తిస్తుంది. అయినప్పటికీ లక్ష్మీబాయి దేశభక్తికి చిహ్నంగా దేశమంతా పరిచయం కాగా (తెలుగునాట - కనీసం కోస్తాంధ్రలో - ఒక తరంలో ప్రతీ రెండవ ఇంటా ఒక ఝాన్సీ ఉండేది), బేగం హజ్రత్ మహల్ గురించి నశీర్ అహమ్మద్ వంటివారు చెప్తే తప్ప తెలియని దుస్థితి దేశానికి పట్టింది.

1857 మే నెల 10వ తేదీన మీరట్‌లో తిరగబడ్డ సిపాయిలు ఢిల్లీకి వచ్చి తమ తిరుగుబాటుకు నాయకత్వం వహించమని ఆఖరి మొఘల్ 'చక్రవర్తి' బహదూర్‌షా జఫర్[6]ను కోరగా, తొలుత అంతగా ఆసక్తి చూపని జఫర్ తరువాత అంగీకరించాడు. నాలుగు నెలలపాటు సాగిన పోరాటానికి అతనే కేంద్రం అయ్యాడు. తానొక్కడే పోరాడలేనని గ్రహించి దేశంలోని సంస్థానాధీశులందరికీ తనతో కలిసిరమ్మని ఆహ్వానం పంపాడు. ఇది మొఘల్ పాలన పునరుజ్జీవనానికి దారితీస్తుందన్న సందేహంతో కొందరు రాజులు తటపటాయించడాన్ని గమనించి, బ్రిటిష్ వారిని నిలువరించినట్టయితే దేశంలో సమాఖ్య తరహా పాలన నెలకొల్పుదామని కూడా జఫర్ సూచించాడు. దేశంలోని సంస్థానాధీశులంతా టిప్పు సుల్తాన్ లాంటివాళ్లయివుంటే - తమలో తమకు ఎన్ని ఘర్షణలున్నా బ్రిటిష్ వారి వ్యాప్తిని నిలువరించడానికి ఒకటి కావడం అవసరం అని గుర్తించి ఉంటే - జఫర్ సూచన కొంతయినా ఫలితం ఇచ్చేదేమో. అప్పుడు బ్రిటిషిండియా చరిత్ర ఏ విధంగా ఉండేదో ! మొఘలుల పట్ల వ్యతిరేకత ఈ ఏకీకరణకు అడ్డం వచ్చిందన్న సూచనను మన 'దేశభక్తులు' ఏ విధంగా అర్థం చేసుకుంటారో, ఏ విధంగా వ్యాఖ్యానిస్తారో ! ఆ వ్యతిరేకతే లేకపోయినట్లయితే మొదటి స్వాతంత్ర్య సంగ్రామమే చివరిది అయివుండేదని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు కానీ ఆ

సంగ్రామాన్ని అధికారం కోల్పోయిన ముస్లిం పాలకుల ప్రతిచర్యగా ఒక్క బ్రిటిష్‌వారే కాదు, చాలామంది సంస్థానాధీశులు చూసారనేది వాస్తవం. అయినప్పటికీ ఈనాటి దేశభక్తి భావనలో ప్రముఖ స్థానం ఉన్న ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనే ఘట్టంలో బహదూర్ షా జఫర్‌కు గానీ, బేగం హజ్రత్ మహల్‌కు గానీ, మన హైదరాబాద్‌కు చెందిన రొహిల్లా యోధుడు తుర్రేబాజ్‌ఖాన్[7]కు గానీ, సంఘ్‌పరివార్ ఆధ్యాత్మిక గురువు వినాయకరావు దామోదర్ సావర్కర్[8] సహితం మెచ్చుకున్న కాన్పూరు పాలకుడు నానాసాహెబ్[9] మిత్రుడు అజీముల్లాఖాన్[10]కు గానీ, మద్రాసులో పుట్టి ప్రపంచమంతా తిరిగి లక్నోలో పోరాటంలో భాగమయిన మౌల్వీ అహ్మదుల్లా ఖాన్[11]కు గానీ చోటులేకపోవడం ఏ రకంగానూ న్యాయం కాదు. ఈ పోరాటకారులొక్కక్కరి జీవితాన్నీ పాత్రనూ క్లుప్తంగానే అయినా చరిత్రకెక్కించడం నశీర్ అహమ్మద్ చేసిన మంచిపని.

రాజులు, రాణులు, సంస్థానాధీశులూ చేసిన పోరాటాలు ఒకెత్తయితే, ప్రజల నుండి గెరిల్లా పద్ధతిలో జరిగిన బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు ఇంకొకెత్తు. 19వ శతాబ్దం ఆద్యంతం ఆదివాసులు మధ్యభారతంలో చేసిన తిరుగుబాట్లను దేశ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చూడడం మన దేశభక్తులింకా నేర్చుకోలేదు. అదే కోవకు చెందినవి పరిశుద్ధ ఇస్లాంను సిద్ధాంతంగా కలిగిన తిరుగుబాట్లు కూడా.

## ఇవీ స్వాతంత్ర్య పోరాటాలే

వహాబీ, ఫరాజీ, మోప్లా తిరుగుబాట్లు ఈ కోవకు చెందినవే. శుద్ధ ఇస్లాం అనే తాత్విక ధోరణి వీటిలో బలంగా ఉన్న కారణంగా వీటిని మతపరమయిన ఉద్యమాలుగా వర్గీకరించే అవకాశం ఉంది. బ్రిటిష్ పాలనా యంత్రాంగం ఆ పనే చేసింది. అయితే ఈ గెరిల్లా పోరాటాల విశేషం ఏమిటంటే ఇవి పుట్టింది ముస్లిం జమీందారులు, భూస్వాములు ఉన్న ఉత్తరప్రదేశ్ వంటి ప్రాంతాలలో కాదు. ముస్లింలు కాయకష్టం చేసుకుని బతికే రైతులు, కూలీలుగా ఉన్నచోట; హిందువులు జమీందార్లు, భూస్వాములు, సాంప్రదాయక పెత్తందార్లుగా ఉన్నచోట – అంటే తూర్పు బెంగాల్ (ఇవ్వాళ్టి బంగ్లాదేశ్), మలబార్ (కేరళ రాష్ట్రం ఉత్తర

భాగం) ప్రాంతాలలో పుట్టాయి. ఈ కారణంగా ఈ ఉద్యమాలు సారాంశంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ పోరాటాలేనని విశ్లేషించిన వారున్నారు.

నశీర్ అహమ్మద్ ఈ పోరాటాలను స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా చూసి వీటి గురించి విస్తృతంగా రాశారు. ఇది చాలా మంచి కృషి. 19వ శతాబ్దం ఆద్యంతం ఈ పోరాటాలు, వాటి పాయలు బ్రిటిష్ వారిని చాలా ఇబ్బంది పెట్టాయి. ఎక్కడ ఏ అలజడి జరిగినా దాని వెనక వహాబీ లేక ఫరాజీ ఆందోళన కారులున్నారేమో అని బ్రిటిష్ ఇండియా పాలకులు అనుమానించేవారు.

20వ శతాబ్దంలో పట్టణ ప్రాంతాల మధ్యతరగతికి చెందిన యువకులు హైందవ దృక్పథంతోనూ సెక్యులర్ దృక్పథంతోనూ బ్రిటిష్ పాలనపైన చేపట్టిన మిలిటెంట్ పోరాటాల గురించి మనకు బాగానే తెలుసును. బెంగాల్ విప్లవ కారులకు, హిందూస్తాన్ రిపబ్లికన్ ఆర్మీకి, గదర్ పార్టీకి న్యాయమైన గుర్తింపు, గౌరవం లభించాయి. కానీ 19వ శతాబ్దంలో గ్రామీణ ప్రాంతాలలో ఆదివాసులు, బక్కచిక్కిన ముస్లిం రైతులూ అంతే పట్టుదలతో చేసిన మిలిటెంట్ పోరాటాలకు ఇప్పటికీ ఆ గుర్తింపు లేదు. నిజానికి 20వ శతాబ్దపు 'టెర్రరిస్టుల' కంటె వారే ఎక్కువ కాలం, ఎక్కువ పట్టుదలతో, ఎక్కువగా ప్రజలను సమీకరించి బ్రిటిష్ ఇండియా పాలకులపైన పోరాటం చేశారు.

18వ శతాబ్దపు ద్వితీయార్థంలో బెంగాల్ ప్రాంతంలో వచ్చిన తీవ్రమైన కరువుకు ప్రజలు పిట్టల వలె చనిపోతున్నపుడు కూడా తూర్పు ఇండియా కంపెనీ పాలనా యంత్రాంగం రెవెన్యూ వసూలును నిర్దయగా కొనసాగించింది. జనాభాలో దాదాపు మూడవ వంతు కరువు వాతపడి చనిపోయినప్పటికీ, రెవెన్యూ వసూలు పదిశాతం పెరిగిందని 1770-71 సంవత్సరపు రిపోర్టులో ఒక ఇంగ్లీష్ విశ్లేషకుడే అంచనా వేశాడంటే కంపెనీ క్రూరత్వం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అప్పటికే పది సంవత్సరాలుగా పరాయి పాలనకు వ్యతిరేకంగా ప్రజలకు ఉద్బోధిస్తున్న ముస్లిం ఫకీర్లు ఈ ఘోర క్షామ కాలంలో విజృంభించారు. వీరి నాయకుడు మజ్నూషా ఫకీర్[12]. నాగాలుగా పిలువబడే హిందూ సన్యాసులు[13] కూడా వారికి తోడయ్యారు. 1771 లో ఫకీర్ల సమావేశంపైన ఇంగ్లీష్ సైనికులు కాల్పులు జరిపి 150 మందిని చంపారు.

ఆ తరువాత ఫకీర్ల గెరిల్లా పోరాటం విస్తృతమై ప్రస్తుత బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రాంతాలకేకాక బీహార్, అస్సాం, భూటాన్, నేపాల్ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. ధాన్యం గిడ్డంగుల మీద దాడిచేసి ధాన్యాన్ని కరువు పీడిత ప్రజలకు పంచేవారు, వడ్డీ వ్యాపారుల వద్దనున్న రుణ పత్రాలు తగలబెట్టేవారు, తూర్పు ఇండియా కంపెనీ ఏజెంట్లను కఠినంగా శిక్షించేవారు. ప్రజలను పీడించవద్దనీ, స్వచ్ఛందంగా ఇచ్చే చందాలు తీసుకోవాలే తప్ప బలవంతంగా డబ్బుల వసూలు చేపట్టకూడదనీ మజ్నూషా తన అనుచరులను ఆదేశించాడని బ్రిటిష్ అధికారులే చెప్పుకున్నారు. ఫకీర్లు, నాగా సన్యాసులు కలిసి పోరాటం చేయడం వల్ల ఏ హిందూ ముస్లిం ఐక్యత అసాధ్యం అని బ్రిటిష్ వారు తమకు తాము నచ్చజెప్పుకున్నారో అది సాధ్యమేనని రుజువు చేశారు కూడా. అయితే కంపెనీ అధికారులు విపరీతమైన హింస ప్రయోగించి క్రీ.శ. 1800 నాటికి ఫకీర్ల తిరుగుబాటును అణచివేశారు.

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా రాజులు, నవాబులు, వివిధ సంస్థానాధీశులు అప్పటికే తిరుగుబాట్లు చేస్తున్నారు. అందులో సూత్రబద్ధమైన వలసవాద వ్యతిరేకత పాలు ఎంత, కేవలం తమ ప్రశాసనాన్ని కాపాడుకోవాలన్న ఆరాటం ఎంత అంటే – అందరికీ వర్తించే సూత్రీకరణ చేయడం కష్టం. అయినప్పటికీ వారి ప్రతిఘటన మొత్తం స్వాతంత్ర్య పోరాటంలో భాగంగానే గుర్తించబడుతున్నది. కాగా, ప్రజల వైపు నుండి జరిగిన మొట్టమొదటి విస్తృత సమీకరణ, పోరాటం మాత్రం ఫకీర్లు నాయకత్వం వహించినదే. వీరికి హిందూ సన్యాసులూ తోడయ్యారు. దీనిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? హైందవ సమాజంలో సన్యాసులు, భారతీయ ముస్లిం సమాజంలో ఫకీర్లు సమాజం కట్టుబాట్లకు ఎడంగా ఉండి ప్రజల మీద జరిగే అణచివేతకూ అన్యాయానికీ వ్యతిరేకంగా గొంతు విప్పేవారనీ, నిరసనకు గళం ఇచ్చేవారనీ రొమిల్లా థాపర్ వంటి విశ్లేషకులు గుర్తించారు. ఈ ఫకీర్ల, సన్యాసుల తిరుగుబాటు ఆ సంప్రదాయక పాత్రనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిందనుకోవాలా? లేకపోతే మత భావాల ప్రేరణతో జీవించే ఫకీర్లు క్రైస్తవ పాలనను సహించలేక 'ఫిరంగీ'లను పారద్రోలమన్న నినాదంతో తిరగబడ్డారనుకోవాలా? లేక 'ఆధునికత'కు వ్యతిరేకంగా 'సంప్రదాయకత' చేసిన

తిరుగుబాటు అనుకోవాలా? లేక కోల్పోయిన ముస్లిం రాజవంశాల, సంస్థానాధీశుల వైభవాన్ని తిరిగి సాధించడం కోసం పోరాడారనుకోవాలా? లేకపోతే అది కరువు పీడిత రైతాంగాన్ని వలస పాలకులకూ, వారి ఏజెంట్లయిన జమీందార్లకూ వ్యతిరేకంగా సమీకరించిన వర్గపోరాటం అనుకోవాలా? లేక బెంగాల్ ప్రాంతంలో జమీందార్లు ఎక్కువగా హిందువులు, రైతులు ఎక్కువగా ముస్లింలు అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇది హిందువుల సంపదను దోచుకున్న ముస్లిం తిరుగుబాటు అనుకోవాలా?

ఈ ప్రశ్నలకు వివరంగా జవాబు చెప్పుకోవడానికి కావలసిన సమాచారం చరిత్రకారులకు అందుబాట్లో ఉందో లేదో! అది మన చేతిలో లేని పరిమితి కాగా, బ్రిటిష్ పాలనను మొత్తంగా అంతమొందించి దాని స్థానంలో ఏకీకృత స్వదేశీ రాజ్యాన్ని నెలకొల్పే ప్రయత్నాన్ని మాత్రమే స్వాతంత్ర్య పోరాటంగా అర్థం చేసుకునే వైఖరి భావజాల సంబంధమైన పరిమితి. దీనిని వదులుకొని, బ్రిటిష్ వలస పాలన ఫలితాలను నిరసించి దానిని తొలగించాలన్న సంకల్పంతో ఏ ప్రత్యామ్నాయాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేసినా, అసలు ఏ ప్రత్యామ్నాయమూ స్పష్టంగా లేకున్నా - అది స్వాతంత్ర్య పోరాటంలో భాగమేననుకుంటే ఫకీర్ల తిరుగుబాటు స్వాతంత్ర్య పోరాటాలలో భాగమే. ఒక ముఖ్యమైన భాగమే.

## వహాబీ ఉద్యమం

ఫకీర్ల తిరుగుబాటు అంతమైన తరువాత బెంగాల్ నుండే మళ్లీ మొదలయిన వహాబీ, ఫరాజీ ఉద్యమాలకు కూడా ఇది వర్తిస్తుంది. వీటిలో మత ప్రేరణ ఇంకా ఎక్కువ, ముస్లింలు పరాయి ప్రభావానికి లోనయి తమ మత ఆచారాలను మరచి ప్రవర్తిస్తున్నారన్న ఆవేదనతో, శుద్ధమైన ఇస్లామిక్ ఆచరణను తిరిగి ప్రవేశపెట్టే లక్ష్యంతో అరేబియాకు చెందిన అబ్దుల్ వహాబ్[14] మొదలుపెట్టిన కఠినమైన సంస్కరణను వహాబీ ఉద్యమం అంటారు. ఇది అరేబియాకు పరిమితమై ఉండలేదు. ముస్లిం ప్రపంచమంతటా వ్యాపించింది. ఈ ఉద్యమాన్ని ఆధునికతకు వ్యతిరేకంగా సాంప్రదాయకత చేసిన తిరుగుబాటుగా అర్థం చేసుకున్నవారున్నారు; ఇస్లాం అరేబియా నుండి బయటకు వ్యాపించిన క్రమంలో ముస్లిం సమాజంలో

అనివార్యంగా వచ్చి చేరిన భిన్నత్వాన్ని నిరసించిన మూర్ఖవాదంగా విశ్లేషించిన వారూ ఉన్నారు. ఇవి రెండూ కొంతమేరకు నిజమే కావచ్చు. వారి కఠోరమైన వ్యవహారశైలి వల్ల వహాబీలు పనిచేసిన ప్రాంతాలలో పరమతస్తులతో ఘర్షణలు రావడమే కాదు, ముస్లింలలోనే వ్యతిరేకత చాలా వచ్చింది. ఈ 'శాంతి భద్రతల' కోణం వహాబీలను అణచివేయడానికి బ్రిటిష్ వారికి బాగా తోడ్పడింది కూడా.

అయితే ముస్లిం సమాజంలో ఒక కఠినమైన అంతర్గత సంస్కరణ ఉద్యమంగా ప్రారంభమైనది – ఇండియాకొచ్చేసరికి క్రైస్తవ పాలనను తొలగించి ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పాలన్న రాజకీయ నినాదంగానూ మారింది; అత్యధికంగా బక్కచిక్కిన వ్యవసాయదారులు, చేతివృత్తులవారు అయిన ముస్లిం ప్రజల మీద ప్రభుత్వము, జమీందార్లు, వడ్డీ వ్యాపారులు అమలు చేస్తున్న అణచివేతను బలంగా వ్యతిరేకించిన మిలిటెంట్ పోరాటంగానూ మారింది. కరువు పీడిత బెంగాల్‌లో టిటూమీర్[15] (మీర్ నిస్సార్ అలీ) నాయకత్వంలో నడిచిన వహాబీ ఉద్యమానికి ఈ చివరి లక్షణం దండిగా ఉండింది. వహాబీ ఉద్యమంలోని ఈ భిన్న కోణాలలో ఈనాటి రాజకీయ సందర్భంలో ఒక్కొక్కరికీ కొన్ని కొన్ని నచ్చుతాయి, కొన్ని నచ్చవు కాబట్టి వీటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకొని ఇదే వహాబీ ఉద్యమం అసలు గుణం అని విశ్లేషించడం జరుగుతుంటుంది. విశ్లేషకులకు 'అసలు విషయం'గా కనిపించేది లౌకిక ప్రజాతంత్ర వర్గపోరాటం కావచ్చు, కరడుగట్టిన మతవాదం కావచ్చు. కానీ ఈ విశ్లేషకులు ఊహించుకునే తేడాలు, విభజన రేఖలు వహాబీ ఉద్యమంలో నిజంగా ఉన్నాయని రుజువు చేయడం కష్టం. ఒక కాలానికి, ఒక దృష్టి కోణానికి పరస్పరం అసంబద్ధంగా తోచే విషయాలు మరొక కాలానికీ, మరొక దృష్టి కోణానికీ ఆ విధంగా తోచకపోవచ్చు.

అదెట్లాగున్నా ఒకటి మాత్రం సత్యం. బ్రిటిష్ పాలకులు 19వ శతాబ్దం యావత్తు చాలా ఆందోళన చెందిన మిలిటెంట్ పోరాటం వహాబీ ఉద్యమం. పందొమ్మిదవ శతాబ్దం తొలి దశాబ్దాల నాటికే ఆచార వ్యవహారాల సంస్కరణ ఉద్యమంగానూ, సామాజిక స్థితిగతుల పట్ల నిరసన ఉద్యమంగానూ ముస్లిం సమాజంలో వహాబీ ఆలోచనారీతి బాగా వ్యాపించింది. గ్రామీణ రైతాంగం, పట్టణ ప్రాంత దిగువ మధ్యతరగతి, నిరుద్యోగ యువత దీనిపట్ల బాగా ఆకర్షితులయ్యారు.

*దేశ స్వాతంత్ర్య ఉద్యమం - ముస్లింలు*

1831లో బెంగాల్‌లోని పూర్వా అనే గ్రామం జమీందారు కృష్ణదేవరాయ్ గడ్డం పెట్టుకునే ముస్లింలపైన పన్ను విధించడంతో వహాబీల తిరుగుబాటు మిలిటెంట్ రూపం తీసుకుంది. తన మాట వినసందుకు గుంపును పోగుచేసి ముస్లింలపైన దాడిచేసి వారి మసీదును ధ్వంసం చేసిన జమీందారు చర్యకు నిరసనగా టిటూమీర్ నాయకత్వంలో మొదటి పెద్దదాడి జరిగింది. ఆ తరువాత జమీందార్లపైన, 'ఫిరంగీల'పైన దాడులు కొనసాగాయి. మతపరమైన అవమానానికి నిరసనగా మొదలైన తిరుగుబాటు మొదట్లో మత అసహనాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత జమీందార్లు, నీలిమందు ప్లాంటర్లు, తూర్పు ఇండియా కంపెనీ పాలకుల దోపిడీ దౌర్జన్యాలను ఎదుర్కొన్న మిలిటెంట్ పోరాటంగా వహాబీ ఉద్యమం బెంగాల్ అంతటా వ్యాపించింది. ఉద్యమం ముస్లింలకే పరిమితం అయినప్పటికీ, తూర్పు బెంగాల్ ప్రాంతంలో ముస్లింలు మెజారిటీగా ఉన్న రైతాంగం పైన హిందువులు మెజారిటీగా ఉన్న జమీందార్ల దోపిడీ, దౌర్జన్యాలు ఒక సామాజిక వాస్తవం కాబట్టి ఇది రైతాంగ తిరుగుబాటు స్వభావాన్ని కలిగి ఉంది. హిందువులయినా తమకు అడ్డం రాకపోతే ఏమీ చేయవద్దనీ, ముస్లింలయినా తమకు అడ్డం వస్తే క్షమించవద్దనీ టిటూమీర్ తన అనుచరులను ఆదేశించిన విషయం విశ్లేషకులు చెప్తారు. హిందూ సమాజానికి చెందిన పేద రైతాంగమూ వహాబీలకు సహకరించిన సందర్భాలున్నాయి.

పూర్వా గ్రామంలో జమీందారు అనాగరిక వైఖరికి వ్యతిరేకంగా మొదలయిన వహాబీల పోరాటం త్వరలోనే కంపెనీ సేనలతో యుద్ధంగా మారి ఒక సంవత్సరం పాటు సాగింది. చివరి ఘట్టంలో టిటూమీర్‌తో సహా 50 మంది చనిపోగా, మరొక ముఖ్యుడు గులాం మాసుం[16]ను కంపెనీ పాలకులు బహిరంగంగా ఉరితీశారు. ఇంకొక 197 మందికి కఠిన శిక్షలు వేశారు. అయినా వహాబీ తత్వం, ఉద్యమం దేశమంతటా వ్యాపించి 19వ శతాబ్దం చివరి దాకా బ్రిటిష్ పాలకులను ఇబ్బంది పెడుతూనే ఉంది. ఈ కథను నశీర్ అహమ్మద్ 'భారత స్వాతంత్ర్యోద్యమం – ముస్లిం ప్రజా పోరాటాలు' అనే ప్రచురణలో వివరంగా చెప్పారు. వహాబీలు వలస పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను ప్రశంసిస్తూనే వారి మతపరమైన అసహనం వల్ల జరిగిన నష్టాన్ని కూడా వివరించారు.

## ఫరాజీ ఉద్యమం

వహాబీ ఉద్యమం తరువాత వచ్చిన ఫరాజీ ఉద్యమం స్థూలంగా అదే స్వభావాన్ని కలిగినది. 'ఫర్జ్' అనే మాట నుండి 'ఫరాజీ' పుట్టింది. ఫర్జ్ అనేది సాధారణ సంభాషణలో 'అనుల్లంఘనీయమైన విధి' లేక 'కర్తవ్యం' అన్న అర్థాన్ని ఇస్తుంది. అది ధార్మిక కర్తవ్యం కానవసరం లేదు. కానీ ఫరాజీ ఉద్యమకారులు ప్రయోగించిన అర్థంలో అది ధార్మికమే. ముస్లింల జీవిత ఆచారాలలోకి వచ్చి చేరిన అన్య ప్రభావాలను తొలగించడం, శత్రువు పాలనలో ఉన్న దేశాన్ని విముక్తిచేసి ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పడం వారు ఎంచుకున్న కర్తవ్యాలు. ఫరాజీ ఉద్యమ వ్యవస్థాపకుడు తూర్పు బెంగాల్‌లోని ఒక చేనేత కార్మిక కుటుంబంలో పుట్టిన హాజీ షరియతుల్లా[17]. ఇతను హజ్‌కు (మక్కాకు) పోయి వహాబీ ఉద్యమాన్ని గురించి తెలుసుకొని ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత అదే నమూనా గల కర్తవ్యాన్ని తనకు తాను నిర్దేశించుకున్నాడు.

శుద్ధ ఇస్లాం ప్రబోధం కారణంగా ఫరాజీలకు ముస్లింలతోనే ఘర్షణ ఏర్పడగా, ఫిరంగీ రాజ్యాన్ని పారదోలాలన్న లక్ష్యంతో జమీందార్లకు శిస్తు చెల్లించవద్దన్న పిలుపు ఇవ్వడం వల్ల జమీందార్లతోనూ, పాలనా యంత్రాంగంతోనూ కూడా ఘర్షణ ఏర్పడింది. పాలనా యంత్రాంగం షరియతుల్లానూ, అతని అనుచరులనూ అణచివేసే కొద్దీ జమీందార్ల దోపిడీకీ, ఇండిగో ప్లాంటర్ల దోపిడీకీ గురైన రైతాంగానికి అతను విముక్తి సంకేతం అయ్యాడని సమకాలీన బ్రిటిష్ వ్యాఖ్యాతలే అన్నారు. అతని కొడుకు దూదుమియా[18] (మహమ్మద్ మోసిన్) నాయకత్వంలో ఫరాజీ ఉద్యమంలో ధార్మిక కోణం తగ్గి రాజకీయార్థిక కోణం పెరిగిన కారణంగా అది ప్రధానంగా జమీందార్లు, కంపెనీ పాలకులు, ఇండిగో ప్లాంటర్ల వ్యతిరేక పోరాటంగా సాగింది. తన ముస్లిం స్వభావాన్ని వదులుకోక పోయినా వైరుధ్యం రాకపోవడానికి కారణం తూర్పు బెంగాల్‌లో రైతాంగం, నేత కార్మికులు ఎక్కువగా ముస్లింలు కావడమేకాక, ధనిక వర్గాలకు చెందిన ముస్లింలకు ఫరాజీల ధార్మిక ప్రచారమూ, రాజకీయార్థిక ప్రణాళికా రెండూ నచ్చకపోవడం వల్ల వారు (కొన్ని మినహాయింపులతో) జమీందార్లతో, ప్లాంటర్లతో ఒకటి కావడం. పేద హిందువులు ఎంత మేరకు ఫరాజీ ఉద్యమంలో భాగం అయ్యారన్న విషయంలో

సమాచారం అంతగా లేదుగానీ బ్రిటిష్ నివేదికలలో తరచుగా పేదలంతా దూదుమియా వెంట పోయారన్న భావం వ్యక్తమయిన మాట వాస్తవం.

1847 నాటికే తూర్పు బెంగాలులో ఫరాజీల వెనక 50 వేలమంది జనం ఉన్నారని తూర్పు ఇండియా కంపెనీ నివేదికలు తెలియజేస్తాయి. వారు గ్రామాలలో సమాంతర పాలనా యంత్రాంగాన్ని నెలకొల్పారు. ఈ ఫరాజీ ఖలాఫత్ (పాలనా వ్యవస్థ) ధార్మిక వ్యవహారాలనూ, లౌకిక వ్యవహారాలనూ కూడ చూసుకునేది. అందులో ముస్లిమేతరులు ఉండడమే కాక మైనారిటీలయిన హిందువుల, క్రైస్తవుల మత విశ్వాసాలు దెబ్బతినకుండా జాగ్రత్త తీసుకున్నారని కూడా సమకాలీన బ్రిటిష్ వ్యాఖ్యాతలన్నారు.

ప్రజలను పెద్దయెత్తున సమీకరించి మిలిటెంట్‌గా దాడులు చేయడానికి వెనకాడని దూదుమియాకు వ్యతిరేకంగా డన్‌లప్[19] అనే నీలిమందు ప్లాంటర్ తూర్పు ఇండియా కంపెనీ అధికారులను, జమీందారులను సమీకరించాడు. ఇది దాడులు, ఎదురుదాడులు, క్రిమినల్ కేసులకు దారితీసిన వైనం నశీర్ అహమ్మద్ తన 'ముస్లిం ప్రజా పోరాటాలు' పుస్తకంలో చక్కగా వివరించారు. పోలీసు యంత్రాంగం ఈ ప్లాంటర్ తొత్తులుగా మారి దూదుమియాపైన తప్పుడు కేసులు పెట్టి సతాయించిన విషయాన్ని ఈ ఘర్షణపైన విచారణ జరిపిన బ్రిటిష్ అధికారులు సహితం గుర్తించారు.

1857 సంగ్రామం గురించి చాలా తెలిసిన వారికి సహితం తెలియనిది ఏమిటంటే ఆ పోరాటంలో ఫరాజీలు చురుగ్గా పాల్గొన్నారని. అప్పటికి పది సంవత్సరాల ముందే 50 వేల అనుచరగణం ఉన్నట్టు కంపెనీ పాలకులే గుర్తించిన ఫరాజీ ఉద్యమమే 1857 సంగ్రామంలోని ప్రధాన ప్రజా ఉద్యమం. తక్కిన పాయలెక్కువగా అప్పటికప్పుడు ఏర్పడిన చిన్న చిన్న బృందాలు, లేక సంస్థానాధీశుల సైనిక బృందాలు. అప్పటికే సంఘటితంగా ఉండి కంపెనీ పాలన మీదా, జమీందార్ల మీదా అనేక పోరాటాలు చేసిన ఫరాజీలు ఆ తిరుగుబాటులో పాల్గొనడం బ్రిటిష్‌వారిని  చాలా కలవరపెట్టిందనడానికి గల నిదర్శనాలు నశీర్ అహమ్మద్ అనేకం ఉటంకించారు. అందులో ప్రధానమైనది దూదుమియాను ఒక సంవత్సరన్నర కాలం నిర్బంధించి 1857 తిరుగుబాటును మొత్తంగా అణచివేసే దాకా విడిచిపెట్టకపోవడం.

1857 తిరుగుబాటు చల్లారిన తరువాత కూడా ఫరాజీల పోరాటం కొనసాగింది. దాదాపు 19వ శతాబ్దం చివరి భాగం దాకా సజీవంగానే కాక చురుకుగానూ ఉంది. అయితే వహాబీల లాగ వీరు కూడా 'పరిశుద్ధ ఇస్లాం'కు తమను తాము ప్రతినిధులుగా భావించుకోవడం వల్ల, పరిశుద్ధ ఇస్లాంను ఈ గడ్డ మీద అప్రతిహతంగా నిలబెట్టాలనుకోవడం వల్ల, ఇతర మతస్తులనే కాదు, ముస్లింలను సహితం చాలావరకు దూరం చేసుకున్నారు. తమతో ఏకీభవించని ముస్లిం ప్రజలనే కాదు, మౌల్వీలను సహితం కించపరచడం వల్ల తమ మతంలోనే ధార్మిక విషయంలో ఒంటరివారయ్యారు. ఈ బలహీనత ఫరాజీ ఉద్యమానికి నష్టదాయకమయింది.

## మోప్లా పోరాటం

వహాబీ, ఫరాజీ ఉద్యమాలతో సమాంతరంగా సాగి వాటి కంటె ఎక్కువ కాలం మనగలిగిన 'ముస్లిం' రైతాంగ పోరాటం మోప్లా పోరాటం. కేరళ రాష్ట్రం ఉత్తర భాగాన ఉన్న మలబారులో ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తారు. మోప్లా అనేది మలబారుకు చెందిన ముస్లింలను మలయాళ భాషలో పిలిచే పేరు. మలబారులోని భూ సంబంధాలలో మోప్లాలు అడుగున ఉన్న రైతులు, కూలీలు కాగా భూమి ముఖం ఎన్నడూ చూడకుండా రైతు కష్టం మీద బతికే 'జెన్మి' (భూస్వామి) హిందూ అగ్రకులాలకు చెందినవాడు. రైతులలో 70 శాతం మోప్లాలు కాగా, భూమిలో 40 శాతం జెన్మిలది. మైసూరు రాజు టిప్పు సుల్తాన్ మలబారును జయించినప్పుడు ఈ 'జెన్మి'ల హక్కుల్ని తొలగించి రైతులకే భూమిమీద హక్కు కల్పించాడు. 1799 లో నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పు ఓడిపోయి మలబారు తూర్పు ఇండియా కంపెనీ హస్తగతం అయిన తరువాత జెన్మిల అధికారాన్ని కొత్త రూపంలో తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది. కొంతకాలం స్వేచ్ఛ, హక్కులు రుచిచూసిన మోప్లా రైతాంగం జెన్మిల మీద, వారి అధికారాన్ని నిలబెట్టిన బ్రిటిష్ వారి మీద తిరుగుబాటు చేశారు. 1800 లో మొదలయిన ఈ తిరుగుబాటు 1922 దాకా సాగింది. 'భూస్వాముల మీద ప్రారంభమైన ఈ తిరుగుబాటు భూస్వాముల మద్దతుదారులు, బ్రిటిష్ పోలీసులు, న్యాయస్థానాలు, ఈస్ట్ ఇండియా కంపెనీ పాలకులు, చివరికి బ్రిటిష్ సైనికులు, అధికార్ల మీద' ఎక్కుపెట్టబడింది అని చారిత్రక పరిశోధనల ఆధారంగా నశీర్ అహమ్మద్ అంటారు.

మోప్లాలు తమ మొట్టమొదటి చర్యగానే జార్జి వాడెల్ అనే తూర్పు ఇండియా కంపెనీ అధికారిని హతమార్చారు. దానికి ప్రతీకారంగా కంపెనీ బలగాలు ముగ్గురు మోప్లా నాయకులను కాల్చి చంపారు[20]. దానితో కొంత కాలం స్తబ్దం అయిన మోప్లా తిరుగుబాటు 1821 నుండి మళ్లీ విజృంభించింది. 1921లోగా 51 పోరాటాలు జరిగాయని బ్రిటిష్ పరిశోధకులు లెక్కపెట్టారు.

ఉర్దూలో మౌల్వీ లేక ముల్లా అనే మతగురువును మోప్లాలు మాట్లాడే మలయాళంలో తంగల్ అంటారు. తంగల్‌ల నాయకత్వంలో భూస్వాములయిన జెన్మిలపైన, వారిని కాపాడుతున్న తూర్పు ఇండియా కంపెనీ పైన పోరాటం చేయడం తమ ధార్మిక విధి అని మోప్లాలు భావించారు. ఖురాన్ అటువంటి పోరాటాన్ని బోధిస్తుందని నమ్మారు. ఈ విధంగా జెన్మిలకూ, వారి సంరక్షకులకూ వ్యతిరేకంగా మోప్లా రైతాంగం చేసిన పోరాటానికి ధార్మిక స్వభావం వచ్చింది.

పోరాటంలోకి దిగిన మోప్లాలు కర్మకాండను పోలిన తంతు నిర్వహించేవారని నశీర్ అహమ్మద్ సవివరంగా చెప్తారు. శత్రువుకు సజీవంగా చిక్కకూడదన్న నిర్ణయం కారణంగా మరణమే వారి అంతిమ మజిలీ. అందుకే పోరాటంలోకి పోయేముందే ఆస్తిని భార్యాపిల్లలకు పంచేసి, భార్యకు విడాకులు ఇచ్చేవారు. ఒకరికంటె ఒకరు బలవంతులయిన శత్రువులనెంచుకొని ద్వంద్వ యుద్ధానికి సవాలుచేసి తాము చచ్చేదాకా శత్రు సంహారం చేసేవారు. 1821-1921 మధ్య జరిగిన ఈ 51 పోరాటాలలో ఒక్కదాని వివరాలైనా ఇక్కడ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది.

ఈ తిరుగుబాటు 1849 ఆగస్టు 25న మొదలయింది. అతన్ గురుక్కల్ అనే తంగల్ నాయకత్వంలో జరిగింది. రైతాంగాన్ని పీడిస్తున్న పండిక్కడ్ నంబూద్రి అనే జెన్మి కచ్చేరి మీదికి అతను 15 మందితో వెళ్లి అక్రమ వసూళ్లను ప్రశ్నించాడు. జెన్మి జారుకున్నాడు. మోప్లాలు అక్కడి నుండి ఆ జెన్మికి అధిపతి అయిన మంజేరి రాజా భవనం మీదికి పోయారు. వారి రాక గురించి తెలుసుకున్న బ్రిటిష్ సైనికులు, పోలీసులు రాజాకు అండగా మంజేరికి బయలుదేరారు. కానీ మోప్లాల దాడికి సైనికులు తట్టుకోలేక పరారయ్యారు.

ఆ తరువాత మోప్లాలు తమ మార్చ్ కొనసాగించారు. వేరే ఊర్ల నుండి వచ్చిన మోప్లాలు వారితో చేరడంతో వారి సంఖ్య పెరిగింది. దారిలో ముస్లింలే

కాక ముస్లిమేతర రైతాంగం సహితం వారికి తిండి, నీళ్లు, వసతి ఏర్పాటు చేశారు. వారిని అట్లాగే సాగనిస్తే పెద్ద తిరుగుబాటు జరగగలదని గ్రహించిన కంపెనీ సైనికులు పెద్దయెత్తున సమీకృతమై మోప్లాల పైన దాడిచేశారు. భీకరంగా సాగిన ఈ పోరులో 64 మంది మోప్లాలు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు అయిదుగురు మాత్రమే చనిపోయారు.

అయితే మోప్లాలది కేవలం తమను పీడిస్తున్న జెన్మిల మీద పోరాటమే కాదనీ, తూర్పు ఇండియా కంపెనీ పాలనను అంతం చేసే ఆలోచనా వారిలో ఉండిందనీ గుర్తించడానికి నిదర్శనం ఏమిటంటే 1857 తిరుగుబాటు ప్రారంభం అయిందని తెలియగానే వారు కనబరచిన స్పందన. ఉత్తర హిందుస్థానంలో తిరుగుబాటు మొదలయింది, ఇక మనం కూడా కదలాలి అని మలబారు ప్రాంతంలో వారు ప్రచారం మొదలుపెట్టారు. అయితే ఆదిలోనే ఈ విషయాన్ని బ్రిటిష్ పాలకులు పసిగట్టి ఈ ప్రయత్నానికి పూనుకున్న నాయకులను అరెస్టు చేసి జైలులో పడేశారు.

1920ల నాటికి మోప్లా తిరుగుబాటు కాంగ్రెస్ వారు చేపట్టిన ఖిలాఫత్ ఉద్యమంలో భాగమైన వైనం, సహాయ నిరాకరణోద్యమం ద్వారా గాంధేయ రాజకీయాలలో భాగమైన వైనం, అయితే వారు తమ పద్ధతిలో దానికి మిలిటెంట్ రూపం ఇచ్చి పెద్దయెత్తున తిరగబడి బ్రిటిష్ పాలనా యంత్రాంగాన్ని తరిమేసి 'ఖిలాఫత్' రాజ్యాన్ని ఒక ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైనం, తరువాత బ్రిటిష్ పాలకులు వారిపైన విరుచుకుపడి అతి క్రూరంగా వేల మందిని చంపి ఆ పోరాటాన్ని అణిచిన వైనం–నశీర్ అహమ్మద్ మాటలలోనే 'ముస్లిం ప్రజా పోరాటాలు' పుస్తకంలో చదివితే బాగుంటుంది.

ఇది స్వాతంత్ర్య పోరాటాలుగా గుర్తింపు పొందని ముస్లిం ప్రజల విషయం కాగా, గుర్తింపు పొందిన పోరాటాలలో సైతం ముస్లింల పాత్రను తక్కువచేసి చెప్పడం లేదా అసలే కనుమరుగు చేయడం జరిగిందని నశీర్ అహమ్మద్ అభియోగం. మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా గుర్తింపు పొందిన 1857 తిరుగుబాటులో లోతుగా పాల్గొన్నప్పటికీ లక్ష్మీబాయి, తాంతియాతోపేలతో సమానంగా గుర్తింపు పొందని ముస్లింల గురించి పైన చూశాం.

## అష్ఫాఖుల్లాను ఎందుకు తక్కువచేశారు?

హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యుడు, కాకోరి కుట్ర కేసులోని ఏకైక ముస్లిం ముద్దాయి అయిన అష్ఫాఖుల్లా ఖాన్[21] గురించి నశీర్ అహమ్మద్ రాసిన చిన్న పుస్తకం చదివిన వారెవరికైనా, అష్ఫాఖుల్లా ఖాన్ వేరే ఏ రకంగానూ భగత్‌సింగ్‌కూ, చంద్రశేఖర్ ఆజాద్‌కూ తీసిపోకున్నా కేవలం ముస్లిం అయినందుకు ఎదుర్కొన్న అనుమానాలూ, సందేహాలూ బాధించక మానవు. అప్పటికే విప్లవకారుడిగా పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్న రాంప్రసాద్ బిస్మిల్[22] తన ఊరివాడే అయినా అతనికి తనపైన నమ్మకం కలిగించి, హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో సభ్యత్వం పొందడానికి అష్ఫాఖుల్లా ఖాన్ చాలా అవమానాన్ని భరించవలసి వచ్చింది. ఆ 'విప్లవకారుడు' ముస్లింలను అనుమానించడం తన హక్కయినట్లు ప్రవర్తించగా, అతనిని మంచి చేసుకొని, అతని మనసు గెలుచుకొని, ఆ సంస్థలో తానూ సభ్యత్వం పొందడానికి అష్ఫాఖుల్లా చాలా కష్టపడవలసి వచ్చింది. గాంధీ మార్గాన్ని తిరస్కరించిన పోరాటకారులందరిలోకీ భగత్‌సింగ్ ఎక్కువ గౌరవం పొందడానికి కారణం అతను లౌకికవాది, ప్రజాతంత్రవాది, సమసమాజవాది కావడం; తన లక్ష్యాల కోసం చిరునవ్వుతో ఉరికంబం ఎక్కడం. అయితే భగత్‌సింగ్ కంటే నాలుగేళ్లు సీనియర్ అయిన అష్ఫాఖుల్లా ఖాన్ ఆలోచనలలోనూ ఆ లక్షణాలన్నీ ఉన్నాయి. అతనూ 27వ ఏట నిశ్చల చిత్తంతో ఉరికంబం ఎక్కాడు. అయినప్పటికీ 'ముస్లిం' అన్న ముద్రను జయించనిదే అతనికి విప్లవకారుల బృందంలో చోటు లభించలేదు. ముస్లిం అయినందుకే స్వాతంత్ర్య పోరాటకారుల జాబితాలో ఉచిత స్థానం లభించలేదు. 'ఈ పరిస్థితి ఆనాడు ఒక్క అష్ఫాఖాన్‌కు మాత్రమే పరిమితం కాలేదు. మాతృదేశం కోసం ప్రాణాల్ని తృణప్రాయంగా భావించిన ముస్లిం విప్లవకారులలో పలువురికి ఈ చేదు అనుభవాలు తప్పలేదు' అన్న నశీర్ అహమ్మద్ వ్యాఖ్య సగటు పాఠకులకు సిగ్గు కలిగించక మానదు.

సమీక్ష ఎక్కడో ఒకచోట ఆపాలి కాబట్టి ఇక్కడ ఆపుతాను. నశీర్ అహమ్మద్ జాతీయోద్యమ రాజకీయాలలో ముస్లింల పాత్ర గురించి, స్థానం గురించి జరిగిన పరిశోధనను లోతుగానే అధ్యయనం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు స్వయంగా కొంత విషయ సేకరణ కూడా చేశారు. చరిత్ర చీకటి కోణాలలో

ఉండిపోయిన అనేకుల గురించి సమాచారం అందించారు. ముస్లిం స్త్రీల పాత్ర గురించి, ఆంధ్రప్రదేశ్ భూభాగానికి చెందిన ముస్లింల గురించి విడిగా సమాచారం ఇచ్చారు. 2005 లో ప్రచురించిన 'భారత స్వాతంత్ర్య సమరం – ముస్లిం యోధులు (ప్రథమ భాగం)'లో ఇచ్చిన సమాచారాన్ని బట్టి, ఆయన ఇప్పుడు స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్ర గురించే కాక స్వాతంత్ర్యానంతర సమాజంలో ముస్లింల పట్ల స్థితిగతుల గురించి, స్వాతంత్ర్యానికి పూర్వమూ, అనంతరమూ కూడా ముస్లింలపట్ల హిందువులలో నెలకొని ఉన్న అపోహల గురించి రచనలు చేపడుతున్నట్టు తెలుస్తున్నది. ఇది ఆహ్వానించదగ్గ ప్రయత్నం.

దానితోబాటు దేశభక్తి, స్వాతంత్ర్య ఉద్యమం మొదలయిన మాటలనే మైనారిటీల దృక్కోణం నుండి విమర్శనాత్మకంగా పరిశీలించే ప్రయత్నం కూడా నశీర్ అహమ్మద్ ఏదో ఒకరోజు మొదలుపెడతారని ఆశిద్దాం. ఇప్పటివరకు చేసిన రచనలలో ఆయన ఈ మాటలకు 'ప్రధాన రాజకీయ స్రవంతి'లో ఉన్న అర్థాన్నే స్వీకరించారు. ఉదాహరణకు బ్రిటిష్ పాలన అంతం కావాలని కోరుకుంటూనే బ్రిటిష్ వారి నిష్క్రమణ తరువాత ముస్లింలకు వేరే భూభాగం కావాలని కోరుకున్న వారెవ్వరి ప్రస్తావనా ఈ రచనలలో లేదు. వారిది స్వాతంత్ర్య పిపాస ఎందుకు కాకుండా పోయింది? ఇండియా ఆనాడు విడిపోకుండా ఉండడం అసాధ్యమా, విడిపోవడం వల్ల నష్టమే ఎక్కువ జరిగిందా అన్న ప్రశ్నలను నేనిక్కడ చర్చించడం లేదు. అదెట్లాగున్నా, అల్లమా ఇక్బాల్[23] వంటివారూ, మహమ్మద్ అలీ జిన్నా[24] వంటివారూ దేశభక్తులు కారనీ, వారిది స్వాతంత్ర్య పిపాస కాదనీ అనగలమా?

1. గుడిపాటి వెంకటాచలం (1894–1976) : తెలుగు రచయిత. స్త్రీ స్వేచ్ఛ కోసం అనేక కథలు, నవలలు రాశారు.
2. అరుణ్ శౌరి (1941– ) : పాత్రికేయుడు. రచయిత. అనంతర కాలంలో బిజెపిలో చేరి కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. 'వర్షిపింగ్ ఫాల్స్ గాడ్స్' పేరుతో అంబేద్కర్ దేశభక్తిని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను ప్రశ్నిస్తూ శౌరి రాసిన పుస్తకం గురించే ఈ ప్రస్తావన.
3. టిప్పు సుల్తాన్ (1750–1799) : శ్రీరంగపట్నం కేంద్రంగా మైసూరు రాజ్యాన్ని పాలించిన రాజు. కవి, పండితుడు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కుతంత్రాలకు లొంగకుండా చివరిదాకా వారికి ఎదురొడ్డి పోరాడిన యోధుడు.

4. వెల్లెస్లీ (1760–1842) : పూర్తి పేరు రిచర్డ్ కోలీ వెల్లెస్లీ. ఐర్లండ్‌కు చెందిన బ్రిటిష్ రాజకీయవేత్త. బ్రిటిష్ సామ్రాజ్యం తరపున ఈస్టిండియా కంపెనీపై అజమాయిషీ చేస్తూ 1798 నుంచి 1805 వరకు బెంగాల్ గవర్నర్ జనరల్ (తర్వాతి కాలంలో ఈ పదవిని భారత గవర్నర్ జనరల్‌గా మార్చారు)గా పని చేశారు.
5. బేగం హజ్రత్ మహల్ (1820–1879) : ఫైజాబాద్‌లోని ఒక సామాన్య కుటుంబంలో ముహమ్మదీ ఖానుమ్‌గా పుట్టి అవధ్ నవాబు వాజిద్ అలీ షాను పెళ్ళాడాక 'హజ్రత్ మహల్' పేరుతో రాణి అయ్యారు. బ్రిటిష్ పాలకులు అవధ్‌ను లోబరచుకుని, నవాబును కలకత్తాకు బహిష్కరిస్తే కొడుకు తరపున పగ్గాలు చేపట్టి ఏడాదికి పైగా బ్రిటిష్ సేనలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. లక్షన్నరమంది సైనికులకు, తిరుగుబాటుదారులకు నేతృత్వం వహించారు. ఓడిపోయిన తర్వాత నేపాల్‌లో తలదాచుకుని అక్కడే పేదరికంలో మరణించారు. బ్రిటిష్‌వాళ్ళు తనకు, తన కుమారుడికి ఇవ్వజూపిన 20 లక్షల రూపాయల భరణాన్ని కూడా తిరస్కరించారు.
6. బహదూర్ షా జఫర్ (1775–1862) : పతనావస్థలో ఉన్న మొఘల్ సామ్రాజ్యానికి చివరి చక్రవర్తి. ఉర్దూ కవి. సూఫీ మతావలంబకుడు. రాజ్య వ్యవహారాల్లో పెద్దగా ఆసక్తి ఉన్నవాడు కాదు. 1857 తిరుగుబాటులో పాల్గొన్న రాజులు, సైనికాధికారుల కోరిక మీద మాత్రమే వారికి నాయకత్వం వహించడానికి అంగీకరించాడు. తిరుగుబాటును అణచివేసిన తర్వాత బ్రిటిష్‌వాళ్ళు ఆయన ఇద్దరు కొడుకులనూ, మనవడినీ చంపి, జఫర్‌నూ ఆయన భార్యనూ బంధువులనూ బర్మాకు దేశాంతరవాసానికి తరలించారు. ఆయన అక్కడే మరణించారు.
7. తుర్రేబాజ్ ఖాన్ ( –1859) : ఉత్తర భారతంలో జరుగుతున్న సిపాయి తిరుగుబాటుకు మద్దతుగా ఐదారువేల మందిని కూడగట్టి మౌల్వీ అల్లావుద్దీన్ నాయకత్వంలో 1857 జూలై 17న హైదరాబాద్ కోఠీలోని బ్రిటిష్ రెసిడెన్సీపైకి దండెత్తి వచ్చిన రొహిల్లా సైనికుడు. దాడి విఫలమైన తర్వాత అరెస్టుచేసి జైల్లో పెట్టారు. 1859 జనవరిలో జైలు నుంచి పారిపోయిన ఆరు రోజులకు పట్టుకుని కాల్చి చంపారు. 1857 తిరుగుబాటులో నిజాం పాల్గొనకపోవడంపట్ల ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను అణచివేసేందుకే తుర్రేబాజ్‌ఖాన్ శవాన్ని ఒక హెచ్చరికగా రెసిడెన్సీ వద్ద బహిరంగంగా వేలాడదీశారు. తెలంగాణ నుడికారంలో ఉన్న 'తురుంఖాన్' పదం తుర్రేబాజ్ ఖాన్ నుంచి వచ్చిందే.
8. వినాయకరావు దామోదర్ సావర్కర్ (1883–1966) : హిందూ జాతీయవాది. భారత ఉపఖండాన్ని ఆంగ్లేయ పాలన నుంచి విముక్తిచేసి అఖండ భారతంగా, 'హిందూరాష్ట్రం'గా మలచాలన్నది ఆయన లక్ష్యం. ఈ దిశగా ఎన్నో రచనలు చేశారు. మహాత్మాగాంధీ హత్యకు సహకరించారన్న ఆరోపణలు కూడా ఎదుర్కొన్నారు. ఆరెస్సెస్, హిందూత్వ శక్తులకు పూజనీయుడు.
9. నానా సాహెబ్ (1824–1857) : పూర్తి పేరు నానా గోవింద్ ధోండు పంత్. బాజీరావు పీష్వా II కు దత్తపుత్రుడు. 1857 తిరుగుబాటులో కాన్పూరు సేనలకు

నాయకత్వం వహించాడు. తిరుగుబాటు విఫలమయ్యాక బ్రిటిష్ సేనల నుంచి తప్పించుకుని పారిపోయాడు. నేపాల్‌కు పారిపోయి అక్కడ ఆశ్రయం పొందాడనేది ఒక కథనం. కాని ఎక్కడ, ఎలా చనిపోయాడో కచ్చితంగా తెలియదు.

10. అజీముల్లా ఖాన్ యూసుఫ్‌జాయ్ (1830–1859) : నానా సాహెబ్‌కు చిన్ననాటి స్నేహితుడు, పెరిగి పెద్దయ్యాక ఆయన కార్యదర్శి/సలహాదారు, తర్వాత కాలంలో దివాన్ (ప్రధానమంత్రి). ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా నానా సాహెబ్ మనసులో విప్లవ బీజాలు నాటింది అజీముల్లాయేనని చెప్తారు. 1857 ఓటమి తర్వాత పారిపోతూ, నేపాల్ సరిహద్దు ప్రాంతంలో జ్వరం బారినపడి చనిపోయాడంటారు.

11. మౌల్వీ అహ్మదుల్లాఖాన్ (1787–1858) : గ్వాలియర్‌లో సూఫీతత్వాన్ని ప్రచారం చేస్తూ 1857 సిపాయి తిరుగుబాటులో భాగమయ్యారు. బేగం హజ్రత్‌మహల్, ఫిరోజ్ షా తదితరులు చేసిన యుద్ధాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈస్టిండియా కంపెనీ ఆయన మీద రాజద్రోహం కేసుపెట్టడమే కాక సజీవంగా గాని నిర్జీవంగా గాని పట్టిచ్చిన వారికి 50 వేల రూపాయల నజరానా కూడా ప్రకటించింది. పోవెన్ రాజు జగన్నాథ్ సిన్హా సోదరుడు ఆ సొమ్ముకు ఆశపడి మౌల్వీని చంపి తల తీసికెళ్ళి షాజహాన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో అందజేశాడు.


12. మజ్నూషా ఫకీర్ ( –1788) : మదారియా సూఫీ స్రవంతికి చెందిన మజ్నూషా బెంగాల్‌లో, కాన్పూర్ ప్రాంతంలో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశాడు. 1786లో జరిపిన ఒక దాడిలో గాయపడి రెండు సంవత్సరాల తర్వాత మరణించాడు.

13. నాగా సన్యాసులు : వీరు ఉత్తర భారతదేశంలో ఉండే రామనంది అనే రామభక్త శాఖకు చెందిన సైనిక సాధువులు. వైష్ణవులైనా శైవశాఖల ఆచార పద్ధతులకు సన్నిహితంగా ఉంటారు. కుంభమేళాలో కనిపించే నాగా సాధువులు వీరిలో ఒక పాయ. మొదట్లో దారి దోపిడీలు, వసూళ్లు చేస్తూ బ్రిటిష్ పాలకులకు 'శాంతి భద్రతల' చిక్కులు కలిగించారు. కఠోర నిష్ఠ, ఆయుధ ధారణ వీరి సంప్రదాయంలో భాగం.

14. అబ్దుల్ వహాబ్ (1703–1792) : అరేబియాలోని నెజ్ద్ ప్రాంతానికి చెందినవాడు. పూర్తి పేరు మహమ్మద్ ఇబిన్ అబ్దుల్ వహాబ్. ఈయన ప్రారంభించిన వహాబీ ఉద్యమాన్ని భారతదేశానికి పరిచయం చేసింది ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీకి చెందిన సయ్యద్ అహమ్మద్ బరేల్వి.

15. టిటూమీర్ (1782–1831) : అసలు పేరు మీర్ నిస్సార్ అలీ. వస్తాదుల కుటుంబంలో పుట్టి ఒక బెంగాలీ జమీందారు దగ్గర చాలాకాలం పనిచేశాడు. 1822లో హాజ్ యాత్రకు వెళ్ళినప్పుడు వహాబీ ఉద్యమంతో పరిచయం ఏర్పడింది. తిరిగొచ్చాక మిలిటెంట్‌గా మారి జమీందారుకు, బ్రిటిష్ వాళ్ళకు వ్యతిరేకంగా పోరాడాడు. ఒక సమయంలో ఆయన దండులో 15 వేల మంది వరకు ఉన్నారు. బెంగాల్‌లోని నారికేల్ బరియా వద్ద టిటూమీర్‌కు ఒక వెదురుకోట ఉండేది. 1831లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సైనికులు దాన్ని కూల్చివేసి టిటూమీర్‌తో సహా అనేకమందిని హతమార్చారు.

16. గులాం మాసూం రసూల్ : టిటూమీర్ మేనల్లుడు. అతని దండులో రెండవ ముఖ్య నాయకుడు.
17. హాజీ షరియతుల్లా (1781-1840) : నేటి బంగ్లాదేశ్‌లోని ఫరీద్‌పూర్ జిల్లాకు చెందినవాడు. 18 ఏళ్ళ వయస్సులో మక్కా వెళ్ళి 19 ఏళ్ళు అక్కడే ఉన్నాడు. వహాబీ బోధనలకు ప్రభావితుడై స్వదేశం తిరిగివచ్చాక వహాబీ ఉద్యమంలాంటిదే ఒకటి ప్రారంభించాడు. దానికి ఆయన పెట్టిన పేరు ఫరాజీ. 1818లో మొదలైన ఈ ఉద్యమం షరియతుల్లా మరణం తర్వాత కూడా చాలాకాలం కొనసాగింది.
18. దూదుమియా (1819-1862) : ఇతని నాయకత్వంలో ఫరాజీలు తూర్పు బెంగాల్‌లో దాదాపు సమాంతర ప్రభుత్వమే నడిపారు. ప్రతి గ్రామానికి ఒక ఖలీఫాను నియమించి వివాదాలన్నీ గ్రామాల్లోనే పరిష్కరించేవారు. బ్రిటిష్ కోర్టుల్లో కేసులు వేయనిచ్చేవాళ్ళు కాదు. దూదుమియా 1862లో జైల్లో ఉండగానే మరణించాడు.
19. డన్‌లప్ : 1806లో ఇండియా వచ్చి ఫరీద్‌పూర్ జిల్లాలో 12 వేల ఎకరాలలో నీలిమందు తోటల్ని పెంచాడు.
20. మోప్లాల తొలిచర్య : ఇది జరిగింది 1802లో. భూ సమస్యమీద జమోరిన్ రాజులతో పోరాటాలు చేసి విజయాలు సాధించిన మోప్లాలు 1800 జనవరిలో తొలిసారిగా ఈస్టిండియా కంపెనీ ఆజ్ఞలను ధిక్కరించారు. ఆ తిరుగుబాటులో కంపెనీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడమే కాక జార్జి వాడెల్‌ను హత్య చేశారు. ప్రతీకారంగా బ్రిటిష్‌వాళ్ళు చంపిన ముగ్గురు మోప్లా నాయకుల పేర్లు ఉన్ని ముత్తు, అతన్ గురుక్కల్, చెంబాన్ పోకర్. 1849లో జరిగిన మరో మోప్లా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన అతన్ గురుక్కల్ ఈ అతన్ గురుక్కల్ కుటుంబీకుడే.
21. అష్ఫాఖుల్లా ఖాన్ (1900-1927) : బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర పన్నారనే అభియోగంపై ఉరితీయబడ్డ తొలి ముస్లిం. 'హస్రత్' అనే కలం పేరుతో కవిత్వం కూడా రాసేవాడు.
22. రాంప్రసాద్ బిస్మిల్ (1897-1927) : ఆర్య సమాజ ప్రభావంతో స్వాతంత్ర్య పోరాటంలోకి వచ్చినవాడు. ఉర్దూలో, హిందీలో కూడా కవిత్వం రాసేవాడు. రామ్, అగ్యత్, బిస్మిల్ ఇతని కలంపేర్లు. అయితే బిస్మిల్‌గానే ఎక్కువ ప్రసిద్ధుడు. 'సర్ఫరోష్‌కీ తమన్నా' కవిత బిస్మిల్ రాసిందేనంటారు. ఇంగ్లీషు నుంచి, బెంగాలీ నుంచి అనువాదాలు చేశాడు. అష్ఫాఖుల్లాను, బిస్మిల్‌ను ఒకే రోజున వేరు వేరు జైళ్ళలో ఉరి తీశారు.
23. అల్లమా ఇక్బాల్ (1877-1938) : 'సారే జహాఁసే అచ్ఛా' పాట రాసిన కవి. ఉర్దూలోనే కాదు. పర్షియన్ భాషలోనూ సుప్రసిద్ధ కవి. ముస్లింలీగ్ సభ్యుడు. పాకిస్తాన్ ఏర్పాటును బలపరచినవాడు. ఆయన పుట్టినరోజు పాకిస్తాన్‌లో జాతీయ సెలవు దినం.
24. మహమ్మద్ అలీ జిన్నా (1876-1948) : పాకిస్తాన్ జాతిపిత. తొలి గవర్నర్ జనరల్. రెండు దశాబ్దాలపాటు కాంగ్రెస్ నాయకుడుగా ఉన్నా 1920 తర్వాత ముస్లింలీగ్ నాయకుడిగానే గుర్తింపు పొందారు.



అన్ని రకాల అధ్యయానాలలోకీ చరిత్ర అధ్యయనానికొక ప్రత్యేకమైన స్థానం ఉంది. అది కావడానికి గతాన్ని గురించి చేసే అధ్యయనమేగానీ ప్రేరణవర్తమానం నుండి, భవిష్యత్తు నుండి వస్తుంది. వర్తమానాన్నీ, భవిష్యత్తునూ మనం ఏ రకంగా ప్రభావితం చేయదలచుకున్నామన్న దాన్నిబట్టి గతంవైపు చూసే మన దృష్టికోణం ఉంటుంది. దానికి తగిన విలువలనూ, చారిత్రక ఆధారాలనూ, ఆదర్శాలనూ చరిత్రలో మనం వెతుక్కుంటాము. ఆ కోణం నుండి చరిత్రను వ్యాఖ్యానించుకుంటాం. నిజాయితీగా వ్యవహరించదలుచుకుంటే ఏ భవిష్యత్తు ప్రయోజనాల కోసం మనం గతాన్ని అధ్యయనం చేస్తున్నామో ప్రకటించుకోవాలి.

దానితోబాటు అధ్యయన సంబంధమైన నిజాయితీ కూడా ఉండాలి. శాస్త్రీయ దృక్పథం ఉండాలి. మన దృష్టి కోణానికి (అది ఎంత గొప్పదయినా కానియ్యండి) పనికొచ్చే విషయాలనే కాక దానిని అబద్ధం చేయగల విషయాలను కూడా చూడాలి, విశ్లేషించాలి, అవసరమైతే ఆ వెలుగులో మన దృక్కోణాన్ని పునర్వ్యాఖ్యానించుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అంతేకాక మనతో విభేదించే దృక్కోణాలను వక్రీకరించడమో తొక్కిపెట్టడమో కాకుండా సంవాదం ద్వారా వాటిని ఎదుర్కోవాలి. సంఘ్‌పరివార్ తిరగ రాయదలచుకున్న చారిత్రక దృక్పథం విలువలు అమానవీయమైనవి, ప్రజాస్వామిక దృక్పథానికి అవాంఛనీయమైన భవిష్యత్ లక్ష్యం నుండి పుట్టినవి. అంతేకాక వారి అధ్యయన పద్ధతిలో శాస్త్రీయమైన నిజాయితీ శూన్యం.